అరుణతార

సంపుటి: 37 సంచిక: 5 జూన్-జూలై 2014

పేజీలు: 68 వెల: రు. 20

విరసం ఆవిర్భావ దినం సందర్భంగా జూలై 6న విజయవాడలో జరిగిన సాహిత్య సభ దృశ్యాలు

సభలో పాట పాడుతున్న ఇందు, మంజు (చైతన్య మహిళా సంఘం)


కా. అరసవిల్లి కృష్ణ


కా. పి. వరలక్ష్మి

కా. సి. కాశీం

కా. నల్లూరి రుక్మిణీ


ఖాదర్ మోహియుద్దీన్


కా. పాణి

కా. ఎన్.వేణుగోపాల్

కా. చలసాని ప్రసాద్

సభకు హాజరయిన మిత్రులు

విరసం ఆవిర్భావ దినం, అమరుల బంధుమిత్రుల సంఘం ఆవిర్భావ దినంలలో భాగంగా జూలై 18న హైదరాబాద్ అల్వాల్‌లోని అమరుల స్థూపం వద్ద, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభ దృశ్యాలు

అల్వాల్‌లోని అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న అమరుల బంధుమిత్రులు

అమరుల బంధుమిత్రుల ఆధ్వర్యంలో అల్వాల్‌లోని స్థూపం వద్ద ర్యాలీ

సభ ప్రారంభంలో అమరుల స్మృతిలో ఒక నిమిషం మౌనం పాటించి, అమరుల ఆశయాలను సాధిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అమరుల బంధుమిత్రులు


పాటలు పాడుతున్న ప్రజాకళామండలి కళాకారులు

'బాసగూడ నాటకం' డివిడిని ఆవిష్కరిస్తున్న కాకరాల, అనిత, నవత, అంజమ్మ, పద్మకుమారి, పరిమళ పంజా, వివి, వరలక్ష్మి, కామేశ్వరి, కాశీం, దేవిడ్

పాట పాడుతున్న అమరుల బంధుమిత్రుల సంఘం కళాకారులు

పరిమళ పంజా

కా. కాకరాల

కా. పద్మకుమారి

కా. సి. కాశీం

కా. పి. వరలక్ష్మి

కా. వరవరరావు

KLVA101M167

3

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

303 సంపుటి : 37 ◆ సంచిక : 3 ◆ జనవరి - ఫిబ్రవరి, 2014

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్
చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257
విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
డి.టి.పి. అండ్ లే అవుట్
డి. వైజయంతి, ఆర్. భాగ్యలక్ష్మి
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి
కవర్ ఫొటోలు
కె. బాల్‌రెడ్డి
http://www.facebook.com/arunatara.virasam
ఈ సంచిక వెల : రు. 20/-

సంపాదక లేఖ...

'వరంగల్ వీథుల్లో విప్లవ నినాదాలు! మళ్లీ పాత రోజులు వచ్చాయా! ఇది కలా, నిజమా?' ప్రవాసం పోయి తిరిగొచ్చిన కవి ఉద్విగ్న సముద్రమయ్యాడు. తెలంగాణ తొలిపొద్దున ఓరుగల్లు తన బిడ్డల్ని పచ్చిగా జ్ఞాపకం చేసుకుంటుంటే కాళోజీ కన్నీటి నది అయినాడు. నక్సల్బరీ రాస్తా మీదుగా క్రాంతికారీ జనతనసర్కార్‌కు వేసిన బాటపై ఎన్నెన్ని నెత్తుటి గురుతులు! విరసం 24వ మహాసభలు ఏళ్ళుగా నొక్కిపట్టిన ఉద్వేగాన్ని కట్టలు తెంచాయి. నిన్నటి గాయాలను తడుముతూ రేపటి తెలంగాణ కంటున్న కలని ఆవిష్కరించాయి. ఎండిన నది ఆ రెండు రోజులూ ఊట చెలిమె అయింది. ప్రజాప్రత్యామ్నాయాల్లో కాళోజీ ఆవిష్కారమైన ఆ సభల్లో రాష్ట్ర నలుమూలల నుండి విప్లవాభిమానులు సాహితీ మిత్రులు హాజరై నూతనోత్తేజం పొందారు. హనుమకొండ పురవీథుల్లో సాగిన ఊరేగింపు కాగడాల వెలుగుల్లో, విప్లవ నినాదాల్లో అమరుల ఆశయాల్ని ఎలుగెత్తింది. ఈ సందర్భంగానే ఒక చారిత్రక అవసరంగా విరసం రాబోవు మహాసభల వరకు క్రాంతికారీ జనతన సర్కారును సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రచారం చేయడం తన కేంద్ర కర్తవ్యంగా నిర్దేశించుకున్నది.

సరిగ్గా ఏ అభివృద్ధి గురించి పాలకవర్గాలు మాట్లాడుతున్నాయో ఆ సామ్రాజ్యవాద మార్కెట్ విధ్వంస అభివృద్ధి నమూనాకు ప్రత్యామ్నాయంగా నిర్మాణమవుతున్న ప్రజల అభివృద్ధి నమూనాను క్రాంతికారీ జనతనసర్కార్లు నేడు ఆవిష్కరిస్తున్నాయి. ప్రజల చేతికి నిజమైన అధికారం విప్లవం ద్వారానే సాకారమవుతుందన్న వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి. ఆ వెలుగులో రెండు రాష్ట్రాల్లో తెలుగు ప్రజలు నిజమైన అభివృద్ధి, స్వావలంబనల కోసం పోరాటం చేయాల్సి ఉంది. తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలు పెంచుతూ పబ్బం గడుపుకుంటున్న పాలక వర్గాల కుట్రలను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవాల్సిన సందర్భంలో ప్రత్యామ్నాయ రాజకీయాలే ఆలంబన అవుతాయి. తెలంగాణను ఇచ్చిన పార్టీలు, తెచ్చిన పార్టీలు తెలంగాణ బిల్లులోని ప్రజావ్యతిరేక అంశాలపై సమాధానం చెప్పకుండానే ఓట్ల పందేరంలో పోటీలు పడుతున్నాయి. ఈ సందులోనే ఫాసిస్టు మోడీ అభివృద్ధి రంగేసుకుని ముందుకొస్తున్నాడు. లౌకిక ప్రజాస్వామిక శక్తులు మేల్కొనకపోతే ఏం జరుగుతుందో మొన్నటి గుజరాత్, నిన్నటి ముజఫర్‌నగర్‌లు ఎల్లవేళలా హెచ్చరిస్తూ ఉంటాయి.

గొర్రెల్ని తినేవాడు పోతే బర్రెల్ని తినేవాడొస్తాడు. ఎన్నికల ఎండమావులు ప్రజల్ని అంతకంతకూ పీల్చిపిప్పి చేస్తాయి. ప్రజల మౌలిక హక్కులన్నింటిని రద్దు చేసి తమ దోపిడిని యథేచ్ఛగా కొనసాగించడానికి ఐదేళ్ళకొకసారి అనుమతి పొందే తంతులో భాగమే ఎన్నికలు. ఎప్పటికైనా ఎన్నికల భ్రమలు పటాపంచలైపోయి పోరాటాల ద్వారానే ప్రజల సమస్యలు తీరుతాయి. ఈ దేశంలో మొట్టమొదటిసారిగా బూటకపు ప్రజాస్వామ్యపు గుట్టు విప్పి ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయాల వెలుగుదారి చూపింది నక్సల్బరీ. ఆ నక్సల్బరీ రాజకీయాల తొలితరం నాయకుడు కా.రవూఫ్ తన నిండు జీవితాన్ని విప్లవానికి అంకితం చేసి తన ఆదర్శవంతమైన విప్లవాచరణను, కమ్యూనిస్టు విలువల నమూనాను మనకిచ్చి ఫిబ్రవరి 9న తన 89వ ఏట అమరుడయ్యాడు. "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది" అన్న కాళోజీ మాటలకు మనిషి రూపం కా. రవూఫ్. ఆయనకు విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. ఆయన కన్న కలలను నిజం చేయడమే ఆయనకు మనమివ్వగలిగే నిజమైన నివాళి.

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను www.virasam.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

సంపాదకీయం (5-5)
కవిత్వం కనే కలలపై నిఘా!!? - కాశీం

సంస్మరణలు (6-10)
విప్లవ స్వాప్నికుడు ఎస్ ఎ రవూఫ్‌తో .... - వరవరరావు
కామ్రేడ్ రవూఫ్ స్మృతి - సి.ఓ.సి. భారత కమ్యూనిస్టు పార్టీ (ఎం.ఎల్) నక్సల్బరీ

పాటలు/కవిత్వం (11-33)
స్వార్థ మతం - వరవరరావు
విప్లవ పిపాసి గంటి ప్రసాదం - సంధ్య
ఆజాద్ స్మృతిలో - శ్యామ్‌జీ
అమ్మతనం తెలంగాణ - డా. వి.వీరాచారి
మర్రి రవికి జోహార్ - రాంరెడ్డి
ఆదివాసిలోయమ్మా - దామరపల్లి నర్సింహారెడ్డి
నాకిదంతా కవిత్వమే - ఉదయమిత్ర
ష్ ష్ ష్...... - వడ్డెబోయిన శ్రీనివాస్
నా కరువుసీమ ఓ కన్నీటికోన - సాదుం శ్రీకాంత్
మోస్ట్ డేంజర్ థ్రెట్ - ఉజ్వల్
అలయ్ - బలయ్ - మేడక యుగంధరరావు
ఎవరి చాయ్ అమ్మేవాడివి నువ్వు? - బ్రజ్ రంజన్ మణి
ఆ పర్వన గీతిక - ఎస్. వెంకటేశ్వర్లు
ఏదో పోయేకాల మొచ్చింది - నాగేశ్వర్
పునాది - శాఖమూరి రవి
విప్లవ విజయ ద్వారానికి కవాతు - భూసారం శివన్న
పలకరిస్తామా? - రివేరా
గడ్డిపోచ - వంగాల సంపత్‌రెడ్డి
కేడా మావయి కూకూ... - అన్నవరం దేవేందర్
ఆహ్వానం - టి.రామ్మోహన రావు
నీ ఆశయాన్ని సాధిస్తాం! - లాంఛర్
పోరాడుతా - తుంపాల శ్రీరామమూర్తి
చితికిన ముక్కలు - ఎస్.చిదంబర రెడ్డి
ఎరుపెక్కిస్తున్న ఉదయం - గిన్నెరాజు
నిన్ను వెతుక్కుంటూ - బిటూ
నాన్న ఆశయం - జమీన్
అతనొక 'సామాన్య' ఉపాధ్యాయుడు! - సహచరి
తెలంగాణ వేగుచుక్క - టేక్మాల్ విజయలక్ష్మణ్
విప్లవాల పురిటి గడ్డ - బాలసాని రాజయ్య
వ్యాపారమే స్వభావం - ఆచంట ప్రసాద్
అమ్మ చిరునామా - ఎస్.ఎస్.ఆర్.
ఆయుధాలను ఆభరణాలుగా అలంకరించుకోండి - ఎస్. వెంకటయ్య
చిగురిస్తున్న ఆశలు - వేణుగోపాల్
యుద్ధం అనివార్యమే - కె.బాబ్జి
వాళ్ళే నిజమైన దేశభక్తులు - శివ
అమరత్వం - కొగిల చంద్రమౌళి
గాయం మానక ముందే మరో గాయం - పి.మేఘరాజు
ఉత్తమ మనిషి - బిల్ల మహేందర్
శత వసంతాల మన కాళోజి - అల్లూరి హరినాథ శర్మ
ప్రశ్నల కొడవళ్ళు ప్రజా చైతన్యానికి ఆనవాళ్ళు - బసవడు
తస్లీమా బాను కవితలు రెండు - చిన్నాన్న; మీరున్నారు
విప్లవ ప్రతిజ్ఞ - జనజ్వాల
ఆదివాసి పోరు - కె. ప్రజ్ఞ
వాళ్లకు కాలం మూడింది - వల్లెల్ల రాజయ్య
మొండి బతుకులు - మహమూద్

నాటకం (34-41)
బాసగూడ - ఉదయమిత్ర

కథలు (42-47)
ఓటు - బమ్మిడి జగదీశ్వరరావు
లాఠీ బుడియా - బెల్లపు అనూరాధ
వేయి కరముల, ఇనుప తొడుగుల మట్టికాళ్ళ మహా రాక్షసి - పల్లేటి అప్పారావు

నివేదిక (48-52)
యుద్ధంలో పదునెక్కుతున్న కలం - పి. వరలక్ష్మి

విరసం 24వ మహాసభల నివేదిక (52-63)
క్రాంతికారీ జనతన సర్కార్... - విరసం

వ్యాసం (64-68)
విప్లవ సాహిత్యంలో వస్తురూప వైవిధ్యం - సి. కాశీం

సందేశం (69-70)
మోడిత్వ ప్రమాదాన్ని ప్రత్యమ్నాయ ప్రజా..... - విప్లవ రచయితల సంఘం

కరపత్రాలు (71-73)
ప్రజల గురువుకు ఆకుల భూమయ్య - విప్లవ రచయితల సంఘం
మళ్లీ సలుపుతున్న గుజరాత్ గాయం - లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక

పత్రికా ప్రకటనలు (68, 74)
ఇది పూర్తి విజయం కాదు!
దేశద్రోహి లగడపాటిని దేశభక్తులతో పోల్చవద్దు - విప్లవ రచయితల సంఘం

అరుణతార చదవండి! చదివించండి! చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 15/-; సంవత్సర చందా: రు. 160/-; జీవితచందా : రు. 1500/-

సంపాదకీయం

కవిత్వం కనే కలలపై నిఘా!!?

- కాశీం

"అలలపై నిఘా
అలలు కనే కలలపైన నిఘా
అలలపై అనురాగం చూపించే
చిరుగాలి సితారా సంగీతంపై నిఘా"

-శివసాగర్ (మే 1971)

పోలీసులు విరసం సభ్యులపై నిఘా పెట్టి వేధిస్తున్న సందర్భంలో శివసాగర్ విశాఖ సముద్ర తీరాన నిలబడి ఈ కవితను గానం చేసినట్లు చెప్పారు. ఇది అద్భుతమైన ప్రతీకాత్మక కవిత. దృశ్యం మారితే, జనవరి 11-12, 2014 వరంగల్ పట్టణంలో విరసం 24వ మహాసభలు జరిగాయి. ఈ నేపథ్యంలో విరసం సభ్యుల మీద భౌతిక నిఘా లేదు కానీ, మానసిక నిఘా కొనసాగింది. కవులు గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పిల్లనగ్రోవి తుఫాన్ సృష్టిస్తుంటే నిఘా, విప్లవంలో పూసిన కాంత పున్నం వెన్నెల స్వప్నాలపై నిఘా, మట్టి కడుపులో కళ్లు పెట్టి రెప్పలతో దేవిన ఒంగ్రుమట్టి జాడలపై నిఘా, ఆకాశమంత ఎత్తు వెలిగిన సాహిత్య కాగడాలపై నీటి బుడగల నిఘా. కవి కనే కలలపై, కవిత్వంపై, కవిత్వం కనే మునిమాపు కలలపై నిఘా. సమస్త మానవ కాసారంపై నిఘా.

ఎందుకు ఈ ఓరుగల్లులో ఇంత నిఘా?

అవును మరి 'ఎచట గడ్డి పరకలు శిరము ఎత్తి నిలబడునో, అచట నడయాడిన పాదాలపై అన్వేషణ' కనీసం నాలుగు శతాబ్దాల చరిత్రలోకి తొంగిచూస్తే ఢిల్లీ సర్కార్‌ను గడగడలాడించిన ప్రతాపరుద్రుడు పాదం మోపిననేల. అదే ప్రతాపరుద్రుడిని మూడు చెరువుల నీళ్లు తాపి సవాల్ విసరిన సమ్మక్క, సారక్క ఎత్తిన కత్తి, నెత్తుటి తిలకం దిద్దుకున్న నేల. కళ్లముందరి చరిత్రలో "మాతో పాటు ఈ దేశంలో విప్లవం రావాలని నిజాయితీగా భావిస్తున్న వెన్నెముకా, ముందు చూపుగల యువకులనందరినీ అందుకే తిరగబడుదాం రమ్మంటూ పదునుపెట్టిన కత్తి అంచు మీద రక్తాక్షరాలతో పిలుపునిచ్చిన" తిరగబడు కవులను కన్ననేల. యూనివర్సిటీ మెస్ వర్కర్ విప్లవాన్ని తాగిన చరిత్ర. మండే మాదిగ డప్పులా విప్లవాన్ని చొక్కాలా ధరించినవాడ.

అందుకే వాడికి ఒకటే భయం, అక్షరాలు ప్రజలను నడిపించే విప్లవాలు అవుతాయేమోనని. కాళ్ల కింది మట్టి కళ్లలో పడుతుందేమోనని. మళ్లీ ప్రజను సాయుధం చేస్తున్న రివల్యూషనరి కవి అవుతాడేమోనని. ఈ ఆశతోనే సభలు ఊహించని రీతిలో విజయవంతం అయ్యాయి. తెలంగాణలో విప్లవ ప్రజానీకంపై గొప్ప ప్రభావాన్ని వేసాయి. కాలం విధించిన షరతులను దాటుకుంటూ కత్తుల వంతెనపై నడిచొచ్చిన విరసం సాహిత్య, సాంస్కృతి రంగాలలో విప్లవోద్యమాన్ని ఎత్తి పట్టటానికి ప్రతిజ్ఞ తీసుకున్నది. విప్లవోద్యమానికైనా, విప్లవ సాహిత్యానికైనా సంపదత్వ చరిత్ర కలిగిన తెలంగాణలో చిన్నపాటి రాజకీయ మార్పు జరగబోతుంది. జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్రం ఉనికిలోకి వస్తుంది. తెలంగాణ పాలకవర్గాలు ఎమర్జ్ అవుతాయి.

అయితే, ఈ కనీస మార్పయినా రావటానికి తెలంగాణ సమాజం అరవై ఏళ్లుగా పురిటి నొప్పులు పడింది. చిందిన నెత్తురు, కారిన కన్నీళ్లు, పేలిన బాష్పవాయువు గోళాలు, విరిగిన చేతులు, పగిలిన తలలు, జైళ్లు నోళ్లు తెరిచిన సందర్భాలు, చీకటి ఆకాశం కింద బోరున విలపించిన జ్ఞాపకాలు ఎన్నో మరెన్నో... పెట్టుబడితో ప్రవేశించిన కోస్తా బూర్జువా వర్గం తన ప్రయోజనాలను కాపాడుకోవటానికి, తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను కాలరాయటానికి ఎంతకైనా తెగించగలదని చట్టసభల బయట, లోపల మళ్లీ రుజువైంది. అయినా ఒక బలమైన ప్రజా ఉద్యమం ముందు తలవంచక తప్ప లేదు. ఎపుడైనా చరిత్రలో అంతిమ విజయం ప్రజలదే.

మరి తెలంగాణ వస్తే... ఆట, పాట, మాటపై నిఘా ఉండకూడదు కదా!? ఇదేమైన విప్లవ కోర్కెనా? కాదే, రాజ్యాంగం కల్పించిన వాక్, సభా స్వాతంత్ర్యాలు అమలుకావాలి. ప్రజల కనీస అవసరాలు తీరాలి. అంటే ప్రజాస్వామ్య తెలంగాణ రూపొందాలి. రైతాంగ సాయుధ పోరాటంతో ప్రపంచానికే తలమానికమైన తెలంగాణ, పాట లాంటి అద్భుత సాహిత్య ప్రక్రియను విశ్వ వ్యాపితం చేసిన నేల, రేపటి తెలంగాణలో కూడా ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఆదర్శవంతమైన వ్యక్తీకరణలు వ్యక్తం కావాలి.

కావాలంటే, పాలకుల మీద నమ్మకంతో కాదు సుమా! పోరాడే ప్రజల మీద నమ్మకం. ఎప్పటికైన ఇక్కడి ప్రజలు ఆదర్శనమూనానే నెలకొల్పుతారనే బలమైన విశ్వాసం. అంతేకాదు ఆంధ్ర, రాయలసీమలో దోపిడికి గురయ్యే ప్రజలతో సఖ్యత పెంచుకొని ఉమ్మడి ప్రజా పోరాటానికి సిద్ధం కావాలి. పేద ప్రజల ఐక్యత వర్ధిల్లాలి. కవిత్వం కనే కలలపై నిఘా లేని సమాజం కోసం కలగందాం.

సంస్మరణ

విప్లవ స్వాప్నికుడు ఎస్ఎ రవూఫ్‌తో జైలు సాహచర్యం - జ్ఞాపకాలు

- వరవరరావు

రామ్‌నగర్ కుట్రకేసులో 86-89లో సికిందరాబాదు జైల్లో టాడా కింద ఒంటరి నిర్బంధంలో ఉన్నపుడు ఆ ఆవరణలో 1988లో అరుదుగా లభించిన రాజకీయ సాహచర్యం గురించి "సహచరులు"లో రాసాను. అటువంటి ఇద్దరిలో "ఒకాయన రాజకీయానుభవంతో తలపండిన వృద్ధుడు. మరొకతడు స్వచ్ఛమైన రాజకీయావేశంతో ఉదయిస్తున్న నవయువకుడు. ముగ్గురం మూడుతరాలకు చెందిన వాళ్లం. ఆ ఇద్దరూ నా పక్క బ్యారక్స్‌లో ఉండేవాళ్లు. వాళ్లు ఉన్నన్ని రోజులు నాకు జైల్లో రాత్రులే ఒంటరివి కాని అసలు దినమెట్లా గడిచేదో తెలిసేదికాదు" అని.

ఆ తలపండిన వృద్ధుడే కామ్రేడ్ ఎస్ఎ. రవూఫ్. అప్పటికాయన అరవైలో పడుతున్నాడు గానీ అప్పటికే నవయవ్వనం నుంచీ కమ్యూనిస్టుపార్టీ రాజకీయాల్లో, పోరాటాల్లో, నక్సల్బరీ కాలం నుంచి విప్లవ అజ్ఞాతజీవితంలో, అప్పటికి పదేళ్లకు మించిన సుదీర్ఘ జైలుజీవితంలో ఆయన నెత్తి తెల్లగా పండిపోయింది. నా జైలు జీవితంలో ఎస్ఎ.రవూఫ్ వంటి పసిబాలుణ్ని, విప్లవ స్వాప్నికుణ్ని నేనెవర్నినైనా చూసానా? ఇరవై నాలుగుగంటలు కలిసి ఉండే జైల్లో లేదా అజ్ఞాత విప్లవోద్యమ జీవితంలోనే ఒక మనిషి విప్లవాచరణ, నిజాయితీ దగ్గరగా అర్థమవుతాయి. ఎంత దగ్గరయితే అంత ప్రేమాభిమానాలు, గౌరవం, స్నేహభావం, కామ్రేడ్రీ పెంపొందుతాయి రవూఫ్ పట్ల. అందుకేనేమో రవూఫ్‌గ్రూప్‌గా చెప్పబడిన వ్యక్తులతో నాకు 1977-79 మధ్యకాలంలో ఎన్ని చేదు అనుభవాలు ఉన్నా అదెన్నడూ మా చర్చల్లోకే రాలేదు. ఆయనతో జైల్లో కలిసున్న ఏడాదికాలంలో ఆ చేదు జ్ఞాపకాలు మనసులో కూడ మసలలేదు. అదే రోజుల్లో ఆదిలాబాదు జైలు మారడానికన్నా ముందు నల్లా ఆదిరెడ్డి, ఆయనతోపాటు అరెస్టయిన సహచరులు కూడ పక్క ఆవరణలో మరో సెల్‌లో ఉన్నారు. ఒక్కసారి రవూఫ్, ఆదిరెడ్డి కలుసుకున్నారు కూడ. 77లో చీలిపోయిన తర్వాత మళ్లీ ఐక్యతా సంభాషణం, ఆ ఇద్దరికీ అధికారికంగా చేసే హక్కు అప్పటికి లేకపోయినప్పటికీ సుహృద్భావ పూర్వకంగా చర్చించుకున్నారు కూడ. ఆ సంభాషణ ప్రాతిపదికగానే జైలునుంచి విడుదల కాగానే 1990లో ఆయన, ఆయన పార్టీ కార్యదర్శి తాళ్లూరి సత్యనారాయణ (పంతులు)తో కలిసి నా దగ్గరికి వచ్చాడు. సత్యనారాయణేమో ఏ షరతులు లేకుండా, గతాన్ని తవ్వుకోవడం లేకుండా వెంటనే కలిసిపోవాలని ప్రతిపాదించడమే కాదు, నాయకత్వంతో వెంటనే కలయిక ఏర్పాటు చేయాలన్నాడు. రవూఫ్ సరిగ్గా ఆయన్నశైలిలోనే రెండు ప్రతిపాదనలు చేసాడు. "నేను మొదట స్వవిమర్శ చేసుకోవాలి. కామ్రేడ్ కెఎస్ సాయుధ దళచర్యలు విరమించాలనే ఉద్దేశంతో చేసిన ప్రకటనను సాయుధ విరమణ విద్రోహంగా అర్థంచేసుకొని బయటికి వచ్చి పార్టీ పెట్టినందుకు. ఆ ప్రకటన చేసినతీరుపట్ల, భాష పట్ల అభ్యంతరమున్నా, ఆ ప్రకటనలోని స్పిరిట్, సారం అవి కావని ఏడాది తిరగకుండానే రుజువయినందువల్ల, ఆ కాస్త కాలమైనా వేచి ఉండి పార్టీలోనే అంతర్గత చర్చ, పోరాటం చేయకుండా పార్టీని చీల్చినందుకు, లేదా కొందరు యువకులను తీసుకొని బయటికివచ్చి పార్టీ పెట్టినందుకు నేను స్వవిమర్శ చేసుకోవాలి. అట్లే కెఎస్ మాత్రమే కాదు, ఆయన నాయకత్వంలోని పార్టీ 1977 నుంచే, అంటే డెంగ్‌ను చైనా కమ్యూనిస్టుపార్టీలో మావో మరణానంతరం మళ్లీ నాయకత్వ స్థానానికి తెచ్చిన దగ్గరి నుంచే చైనాకమ్యూనిస్టుపార్టీ రివిజనిస్టుపార్టీ అయి పెట్టుబడిదారీ పంథాకు మళ్లిందని నేను చేసిన సూత్రీకరణ, ప్రతిపాదనను అంగీకరించి, ఆమోదించడానికి కెఎస్, ఐవిలు 81లో చైనాకు వెళ్లి నాయకత్వాన్ని కలవడం దాకా తాత్సారం చేయడం తప్పని స్వీయవిమర్శ చేసుకోవాలి.

అప్పటినుంచీ ఐక్యతాప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. 1980లో పీపుల్స్‌వార్ ఏర్పడినప్పటి నుంచీ రవూఫ్ ఎప్పుడూ ఆ పార్టీతో శత్రువైరుధ్యంతో వ్యవహరించలేదు. అయితే 79 అక్టోబర్ 19న వరంగల్ సికెఎం - దేశాయిపేట - పైడిపల్లి రోడ్డుపై వరంగల్ పీడితప్రజల ప్రియతమ నాయకుడు జన్నుచిన్నాలును హత్యచేసిన కాటాయి కూటాయి లుంపెన్ మాఫియా ముఠాకు వైఎస్ మూర్తి రవూఫ్‌గ్రూప్ నాయకుడుగా క్లెయిమ్‌చేస్తూ సారథ్యం వహించడం ఒక చేదు నిజం. సరిగ్గా ఏడాదికి అదేరోజు ఖాజీపేటలో ఆర్ఎస్‌యు వరంగల్‌జిల్లా మహాసభలు జరుగుతుండగా, ఆర్ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగమూర్తి వేదికపై మాట్లాడుతుండగా వైఎస్‌మూర్తిని జనగామ ప్రాంతంలో బస్‌లో ప్రయాణం చేస్తుండగా పీపుల్స్‌వార్ యాక్షన్‌టీం వధించిందని వార్త వచ్చింది. 81లో కేరళ పీపుల్స్ కల్చరల్ ఫోరమ్ మహాసభలకు వెళ్లినపుడు అప్పుడు సిపిఐఎంఎల్ సెంట్రల్ రీ ఆర్గనైజింగ్ కమిటీ (రెడ్‌ఫ్లాగ్) అఖిలభారత కార్యదర్శి వేణు నాకు కలిసి "రెండు చర్యలూ తప్పే" అని ఒక విచిత్రమైన సూత్రీకరణ చేసాడు. "తనకు ఒక రాజకీయ విశ్వాసం ఉన్నదని ఒక వ్యక్తి కానీ, బృందం కానీ ప్రకటించుకున్నపుడు వాళ్లపై భౌతికదాడులు చేయకూడదు. మేం కేరళలో ఎన్నికల బహిష్కరణ ప్రదర్శనలు చేసినపుడు మాపై ఆర్ఎస్ఎస్ వాళ్లు భౌతికదాడులు చేసినా మేం తిరిగి దాడి చేయలేదు. కనుక చిన్నాలు హత్య, వైఎస్ హత్య - రెండూ తప్పే" అన్నాడు.

ఆ తర్వాత కొంతకాలానికి ఆయన రాసిన "సమ్ ఫిలసాఫికల్ ప్రాబ్లమ్స్ ఆఫ్ మార్క్సిజం - లెనినిజం" అనే పుస్తకం రెండోసారి 82లో అరెస్టయి జైల్లో ఉన్నపుడు కెఎస్ చదివి "ఈ వేణు ఐడియలిస్టు వలె ఉన్నాడు. ఎక్కడ తేలుతాడో మరి" అన్నాడు.

ఈ ప్రస్తావన అంతా ఎందుకంటే ఈ వేణు నాయకత్వంలో ఏర్పడిన సిపిఐఎంఎల్ సిఆర్‌సి నుంచి త్వరలోనే వేణుయే బయటికి

వెళ్లిపోయి, కెఎస్ రామచంద్రన్ నాయకత్వం చారుమజుందార్ నుంచి కానుసన్యాల్ వరకు చేసిన ప్రయాణంలో రవూఫ్ పీపుల్స్‌వార్‌కు ఎడంగానే ఉండాల్సి వచ్చింది. సిపిఐఎంఎల్ నక్సల్బరీ పార్టీ మాత్రం సిపిఐ మావోయిస్టుతో కలిసిచేసిన కార్యక్రమాలు కలిసిపోయేంత సుహృద్భావంతో, దృఢమైన సంఘీభావంతో తీసుకున్నది. 2005 నుంచే తీవ్రమైన అనారోగ్యానికి గురయి ఇంచుమించు ఏడాదిగా మనుషుల్ని పోల్చుకోలేని, విషయాలను స్వీకరించలేని మానసికస్థితికి లోనైన రవూఫ్‌కు స్వప్నసాకారం తెలిసే అవకాశం కలగకపోవడమే ఒక వెలితిగా మిగిలిపోతుంది.

చివరిసారి 1987లో అరెస్టు చేసినపుడు పోలీసు ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారి పోలీసు అధికారులను పీపుల్స్‌వార్ చంపడం గురించి మీ అభిప్రాయం ఏమిటి అని అడిగాడట. పోలీసు అధికారి అనికాదు ఎవరైనా ప్రజల శత్రువు అయితే వర్గశత్రువే – నాకు ఇవ్వాళ నిర్మాణం లేదు గనుకగానీ ఆ స్థానంలో నేనున్నా అటువంటి నిర్ణయం తీసుకునేవాణ్నే. నేనా పార్టీలో లేనుగనుక నన్ను నిర్బంధించిన సందర్భంలో ఆ ప్రశ్న దురుద్దేశపూర్వకంగా వేస్తున్నారుగానీ, మీరిపుడు సైన్యం లేని సేనాధిపతిని ప్రశ్నిస్తున్నట్లుగా వుంది" అని అన్నాడట. "ఏ కార్యకలాపాలు లేని సమయంలో సుదీర్ఘకాలం ఇట్లా జైల్లో ఉండాల్సిరావడమే నిష్క్రియాపరత్వంగానూ, బాధగానూ ఉన్నది. విప్లవోద్యమానికి పటిష్ఠమైన రహస్యనిర్మాణం, బయట ప్రజా ఉద్యమాలు ఉన్నపుడు కొద్దికాలం జైల్లో ఉన్నా అక్కడ కూడా విప్లవశిబిరంలో ఉన్నట్లుగానే ఉంటుంది. ఎందుకంటే చరిత్ర నిర్మాణానికి సంబంధించిన ఒక సంభాషణయినా కొనసాగించడానికి వీలవుతుంది" అనేవాడు.

నక్సల్బరీపంథాలో శ్రీకాకుళంలో విప్లవ విస్ఫోటనం తర్వాత మైదానప్రాంతంలో శ్రీకాకుళ ఉద్యమాన్ని నిర్మించినవాళ్లు తెలంగాణలో కొండపల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి, కొల్లిపర నరసింహారావు, చక్కిళ్ల ఐలయ్య ఐతే రాయలసీమలో ఎస్ఎ రవూఫ్, సికె నారాయణరెడ్డి, మహదేవన్‌లే. వీరిలో సికె 1972 తర్వాత, అంటే సౌరేన్‌బోసు చైనాకు వెళ్లివచ్చిన తర్వాత కొల్లావెంకయ్యగారితో కలిసి విభేదిస్తే, మహదేవన్ ఎమర్జెన్సీలోనే అమరుడైతే – చివరిదాకా నక్సల్బరీ, శ్రీకాకుళ పంథాను – అంటే చారుమజుందార్ నాయకత్వాన్ని సమర్థించినవాడు రవూఫ్. పార్వతీపురం కుట్రకేసులో సుదీర్ఘకాలం జైల్లో ఈ పంథాను ఎత్తిపట్టినవాళ్లు ఎస్ఎ రవూఫ్, కెజి సత్యమూర్తి, గోరుమాధవరావులే. "సాయుధ పోరాట ఎర్రజెండా చిరకాలం వర్ధిల్లుగాక!" అని వీళ్లు కోర్టులో యిచ్చిన ప్రకటన సృజన ఆ రోజుల్లో సంపాదకీయం స్థానంలో ప్రచురించిన అంశం కూడ సికిందరాబాదు కుట్రకేసులో ఒక "రాజద్రోహ" నేరమైంది. రవూఫ్ భావోద్వేగం, విప్లవాభినివేశం, ధర్మాగ్రహం, నిజాయితీ కూడిన ఆవేశం ఆయననెప్పుడూ తిరుగుబాటు మీద తిరుగుబాటుకు పురికొల్పాయనుకుంటాను. అందుకే ఆయనవెంట నలగొండ, వరంగల్, అనంతపురం మొదలైన జిల్లాల్లో మెరికలవంటి, ప్రాణత్యాగాలకు వెనుకాడని యువకులు 1977లో ఆయన కెఎస్ నుంచి విభేదించినపుడు వెళ్లారు. విప్లవోద్యమంలో మరింత తీవ్రమైన పంథావైపు ఎప్పుడూ రెండురకాల మనుషులు మొగ్గుచూపుతారు. మొదటిరకం రవూఫ్ వంటి విప్లవ స్వాప్నికులైన నిజాయితీపరులు. జ్వలించే భావతీవ్రత, అన్యాయంపట్ల, అణచివేత, పీడన, వర్గదోపిడీల పట్ల నిగ్రహించుకోలేని ఆగ్రహం. సమాజంలోని పీడిత ప్రజలకు కూడ వీరిపట్ల సహజంగానే ఒక ఆశ, అభిమానం ఏర్పడతాయి. ఈ స్పందన గ్రహించగల అవకాశవాద, అరాచక, దుందుడుకు వాదులు కూడ అందులోకి చొరబడతారు. దేశంలో ఎంతో బలమైన విప్లవపార్టీ నిర్మాణం గల ఒకటి రెండు పార్టీల్లోకే అటువంటివాళ్ల చొరబాటు ఏదో ఒకమేర తప్పనపుడు, ఏర్పడిన దగ్గర్నించీ బలహీనమైన నిర్మాణంగానే కొనసాగిన రవూఫ్ నాయకత్వంలోని పార్టీలోకి ఆ మూడుజిల్లాల్లోనూ, ఇతరచోట్లా అటువంటి వ్యక్తులు కొందరు రావడం ఆశ్చర్యంకాదు. కాని 77-79 మధ్యకాలంలో నలగొండ, వరంగల్ జిల్లాల్లో జరిగిన "ఎన్‌కౌంటర్"లలో కెఎస్ వ్యాస్ వంటి దుర్మార్గుడైన, తెలివైన శత్రువు ఎంచుకొనిమరీ రవూఫ్‌గ్రూప్‌నే నిర్మూలించడం మనం విస్మరించకూడదు. దేశమంతా, ఇంచుమించు రాష్ట్రంలోను కేంద్రంలో ఏర్పడిన జనతాప్రభుత్వ పాలనలోని సాపేక్ష శాంతికాలంలో కెఎస్‌వ్యాస్ ఎస్పీగా ఉన్న ఒక్క నలగొండజిల్లాలోనే రవూఫ్‌గ్రూప్‌కే చెందిన 17మందిని పట్టుకొని ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చిచంపారు. వారిలో సూర్యాపేట ఇరానీహోటల్లో చాయ్‌తాగుతున్న 17 ఏళ్ల ఇంటర్‌విద్యార్థి నయిపాల్‌రెడ్డి ఉన్నాడు, మంచినీళ్ల బావిదగ్గర దొరికిన యువకులున్నారు. ఖమ్మంలో అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచి, సూర్యాపేటకు తీసుకవచ్చి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచి, కాంపౌండ్ దాటగానే బయట కాల్చివేసిన రవీందర్‌రెడ్డి, పర్సయ్యలున్నారు. వరంగల్‌లో గొర్రెకుంట మామిడితోటలో "ఎన్‌కౌంటర్" చేసిన మొగిలి, పాపారావులున్నారు. రవీందర్‌రెడ్డి, పర్సయ్యలు సికిందరాబాదు కుట్రకేసులో కూడ ముద్దాయిలు. "ఎన్‌కౌంటర్ల" చరిత్రలోనే అది అత్యంత దుర్మార్గమైన ఘటన. ఆంధ్రాపోలీసుల బలాదూర్‌తనానికి (ఇంగ్లిష్‌లో అడాసిటీ అంటారు) అది ఒక నిదర్శనం. బహుశా ఈ దుర్మార్గ రాజ్య బీభత్స చరిత్రలో రవూఫ్ గ్రూప్‌కు సంబంధించినంతవరకు ఏటూరునాగారం అడవుల్లో భూపాల్‌రెడ్డి ఎన్‌కౌంటర్ (1984) ఒకటి. హనుమకొండలో ద్రోహి సమాచారంలో ఒక ఇంట్లో అరెస్టుచేసి ఏటూరునాగారం అడవుల్లో కాల్చివేసి పోలీసులే శవాన్ని సగం దహనం చేసి వదిలేసారు. ఎపిసిఎల్‌సి నిజనిర్ధారణ చేసి జిల్లా ప్రభుత్వయంత్రాంగంపై ఒత్తిడితెచ్చి మెజిస్టీరియల్ విచారణకు డిమాండుచేస్తే కలెక్టర్ ఆర్‌పిసింగ్, సబ్‌కలెక్టర్ నాగార్జునను పంపించి ప్రభుత్వానికి పంపిన నివేదిక సంచలనానికి దారితీసింది. అప్పటి వరంగల్ ఎస్పీ అరవిందరావు కలెక్టర్, సబ్‌కలెక్టర్లపై పంపిన రహస్య నివేదిక వల్ల అధికారులను ఇద్దరినీ బదిలీచేసారు. ఆర్‌పిసింగ్ ఆ తర్వాత ఎప్పుడూ ప్రభుత్వంలో కీలకమైన పదవులు పొందలేకపోయాడు. అదీ ఆంధ్రప్రదేశ్ పోలీసుబలం. అదీ ఆ పోలీసులకు రవూఫ్‌పై ఉన్న కన్నెర్ర.

ఆంధ్రప్రదేశ్ నుంచి చారుమజుందార్‌ను కలిసిన కొద్దిమంది విప్లవోద్యమ నాయకుల్లో రవూఫ్ ఒకడు. చైనాకు వెళ్లి పార్టీ నాయకత్వంతో కలిసివచ్చినవాళ్లు సౌరేన్‌బోస్ నాయకత్వంలో చెప్తున్నమాటల్లో నిజమెంత? అని ఆయన చారుమజుందార్‌ను అడిగాడట. అనారోగ్యంతో ఉన్న ఆయన "ఆ జేబులో ఆ కాగితం ఉంది చూడు" అన్నాడట. "ఆయనేమీ దాచుకునేవాడు కాదు. అంత

సంస్మరణ

కామ్రేడ్ రవూఫ్ స్మృతి

- సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నక్సల్బరీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నక్సల్బరీకి కార్యదర్శిగా 2006లో రిటైర్ అయ్యేవరకు పనిచేసిన కామ్రేడ్ షేక్ అబ్దుల్ రవూఫ్ (విశ్వం), ఫిబ్రవరి 9న తన ఎనభై తొమ్మిదో ఏట కన్నుమూశారు. అప్పటికి ఆయన వృద్ధాప్య సంబంధమైన జబ్బులతో బాధపడుతూ ఉన్నాడు. 11వ తేదీ సాయంకాలం ఆయన దేహాన్ని సమాధి చేసే వరకు తన సొంత ఊరు కుటాగుళ్ళలో (కదిరి తాలూకా, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్) ప్రజల సందర్శనార్థం రెండు రోజులు ఉంచారు. తమ ప్రియమైన కామ్రేడ్‌ను కడసారి చూసుకోడానికి ఎంతో దూర ప్రాంతాల నుండి వేలాది మంది తరలి వచ్చారు.

సార్(ఐజుష్టు)గా ఎంతో మందికి సుపరిచితుడైన కామ్రేడ్ రవూఫ్ జీవితం మొత్తం ప్రజల కోసం, విప్లవం కోసం అంకితమై ఎంతో స్ఫూర్తిదాయకమైన జ్ఞాపకాలను మనకు మిగిలించింది. విద్యార్థిగా ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడైన ఆ రోజులు వలసపాలన వ్యతిరేక పోరాటం ఉవ్వెత్తున ఎగసిన కాలం నాటివి. మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న కాలం. అప్పుడు కమ్యునిస్టు పార్టీ సభ్యుడై అటు తర్వాత కామ్రేడ్ రవూఫ్ జీవితాంతం కమ్యూనిస్టుగానే నిలబడ్డాడు. తర్వాత సిపిఐ ఎన్నికల మార్గం పట్టడం పట్ల అసంతృప్తికి లోనైనా పార్టీ క్రమశిక్షణను అనుసరించి ఆయన స్థానిక ఎన్నికల్లో పాల్గొనవలసి వచ్చింది. అయిష్టంగానే ఆయన కదిరి పట్టణానికి మొట్టమొదటి కమ్యూనిస్టు మునిసిపల్ చైర్మెన్ అయ్యాడు. ఆయన విప్లవ స్వభావం ఆ పదవికీ అంటుకున్నట్టయింది. హంగు ఆర్భాటాల ఆఫీసుల్లో ప్రజల నుండి విడివడి ఉండడానికి ఆయన అంగీకరించలేదు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక నిర్ణయాలను అమలు పరిచే యంత్రాంగాలైన స్థానిక సంస్థలలో తనను ఒక పనిముట్టుగా వాడుకునే అన్ని ప్రయత్నాలను దృఢంగా నిలబడి అడ్డుకున్నాడు.

సిపిఐలో అంతర్గత పోరాటం సిపిఐ (మార్క్సిస్టు) పార్టీ ఆవిర్భావానికి దారి తీయగా ఆయన వెంటనే అందులో చేరిపోయాడు. అయితే అది పాత రివిజనిజానికి మారు రూపమే తప్ప మరొకటి కాదన్న విషయం ఆయన తొందరగానే గ్రహించాడు. అప్పడే నక్సల్బరీ మేఘం ఇండియా ఆకాశంలో భీకరంగా ఉరిమింది. కొత్త రాజకీయ సమీకరణలో వెంటనే భాగమయ్యాడు రవూఫ్. ఆయన స్పష్టమైన రాజకీయ వైఖరి తీసుకున్నా ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్బరీ సాయుధ పోరాట సమర్థకుడిగా కనిపించిన ప్రఖ్యాత నాయకుడు రాయలసీమ ప్రాంతానికే చెందిన నాగిరెడ్డి మధ్యస్త వైఖరి వల్ల గందరగోళం నెలకొన్నది. రాయలసీమలో ఇది గడ్డు సమస్యే అయింది. నాగిరెడ్డి వంటి ప్రముఖ నాయకుడి ప్రాంతమే రవూఫ్ కార్యాచరణకు కేంద్రమయింది. రవూఫ్ దృఢమైన విప్లవ దీక్షే నాగిరెడ్డి మితవాద రాజకీయాలతో తలపడుతున్న వారిని అనతికాలంలోనే ఏకం

నిజాయితీపరుడు" అనడానికి చారుమజుందార్ గురించి రవూఫ్ నాకు చెప్పిన మాట ఇది. రవూఫ్ కలకత్తాలో అరెస్టయి కొన్నాళ్లు అక్కడ జైల్లో ఉన్నాడు. రైల్వే ప్లాట్‌ఫారాలమీద, టికెటులేకుండా ప్రయాణం చేసి రైళ్లలో అరెస్టయ్యేవాళ్లు, ఆశ్రయం లేక ఫుట్‌పాత్‌ల మీద అరెస్టయ్యేవాళ్లు, తిండికి లేక రొట్టె దొంగిలించినవాళ్లు - అరెస్టయి ఈ జైలుకు వచ్చి "ఇంత పెద్ద ఇల్లు, తిండి దొరుకుతున్నపుడు ఈ పనులు చేయడమే న్యాయం కదా" అనేవాళ్లట తనతో.

ఈ దేశంలో కష్టం చేసే ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ, చదువు, ఆరోగ్యం, భావప్రకటనాస్వేచ్ఛ, సంఘం పెట్టుకునే హక్కు విశ్వాసాలు కలిగిఉండే వెసులుబాటు ఉండే సమాజాన్ని కోరుకున్న రవూఫ్ మాత్రం తనకంటూ ఇల్లు, సంసారం లేని జీవితాన్ని ఎంచుకున్నాడు. బెంగాలీ రాజకీయ సంప్రదాయానికి సహజమైన అవివాహిత రాజకీయ జీవితాన్ని ఎంచుకున్నాడు. వకీలువృత్తి చేపట్టి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయినప్పటికీ సిపిఐ, సిపిఎం నాయకత్వాలను వదులుకున్నట్లే నక్సల్బరీ పిలుపుతో వృత్తిని కూడ వదులుకొని విప్లవాన్నే వృత్తిగా చేపట్టాడు. జైల్లో చూసానుగదా - ఆయనకేం కావాలి. బయట ప్రజలు తిండిపెడతారు. కట్టుకోవడానికి బట్టలిస్తారు. ఆశ్రయమిస్తారు. జైల్లో అధికారులు ప్రజలిచ్చే పన్నులనుంచే కొంత తిని, కొంత మనకు తిండి పెడతారు. జీవికకు అంతకన్నా ఏం కావాలి. జ్ఞానదాహానికి పత్రికలు, పుస్తకాలు ఎవరో ఒకళ్లు తెచ్చి ఇస్తూనే ఉంటారు. ఇంతేనా? రవూఫ్‌కు ఏ లగ్జరీ (విలాసం) లేదా? దొరికితే సిగిరెట్టు. లేకుంటే బీడీ. ఈ ఒక్క మినహాయింపుతో ఆయన అతి సాధారణంగా తనదంటూ ఏ వ్యక్తిగత ఆస్తిలేని నిరాడంబర జీవితం గడిపాడు. ఆయన ప్రజలమనిషి. ఆయనచుట్టూ ఎప్పుడూ నేను నవయువకులనే చూసాను. ఆయన వయసు ఉన్న సీనియర్ అడ్వొకేటు పద్మనాభరెడ్డి ఆయనకు స్వదస్తూరితో కేసులగురించి జైలుకు ఉత్తరాలు రాస్తుండేవాడు. అప్పటికి నాకు తెలిసి పరస్పరం గౌరవం ఉన్న సమవయస్కులు వాళ్లు. జైలు ఊడ్వడానికి వచ్చేవాళ్లతో, పేపర్ తెచ్చేవాళ్లతో, అన్నం, టీ తెచ్చేవాళ్లతో, సాధారణఖైదీలతో ఆయన ఎంతో ప్రేమగా, సహజంగా కలిసిపోయేవాడు.

కామ్రేడ్ రవూఫ్‌కు, కామ్రేడ్ శ్యాంకు ఇద్దరికీ నావలెనే స్వర్గంలో విశ్వాసం లేదుగానీ ఇద్దరూ భౌతికంగా మట్టిలో కలిసిపోయి భూసారంలో విత్తనానికి ప్రాణమిచ్చే స్వభావంతో తప్పకుండా విప్లవస్వప్నం సాకారమవడం ఒకరోజు చూసి తీరుతారు.

చేయగలిగింది. అప్పటికే కామ్రేడ్ చారు మజుందార్ గైడెన్స్‌లో శ్రీకాకుళంలో సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్న కామ్రేడ్స్‌తో ఆయన సంబంధం పెట్టుకుని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)లో చేరాడు. పార్టీ ఆదేశాలను అనుసరించి తన న్యాయవాద వృత్తిని వదలి వృత్తి విప్లవకారుడయ్యాడు. ఆయన జీవితంలో ఆఖరి దశ దాకా, అంటే చివరి కొద్ది సంవత్సరాలు ఆరోగ్యం క్షీణించి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఆయన్ని బలవంతంగా ఉంచాల్సి వచ్చేదాకా అట్లాగే కొనసాగాడు.

1970లో జరిగిన సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర మహాసభలో రవూఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఎ.పి ప్రతినిధుల బృందంలో ఆయన సభ్యుడిగా ఎన్నికైనా టెక్నికల్ ఇబ్బందుల వల్ల 1970 పార్టీ కాంగ్రెస్‌లో ఆయన పాల్గొనలేకపోయాడు. అప్పటి నుండి 1973లో అరెస్టయ్యేదాకా ఆయన రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. జైల్లో రెండు ముఖ్య పరిణామాలు రవూఫ్ రాజకీయ జీవితంలో కొత్త అంకానికి తెర తీసాయి. కొండపల్లి సీతారామయ్య (కె.ఎస్) ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సాయుధ పోరాట విరమణకు పిలుపిచ్చింది. ఎమర్జెన్సీ తదనంతర కాలం ఇచ్చిన కొత్త అవకాశాలను ఉపయోగించుకొని పునర్నిర్మాణం చేసుకొని సాయుధ పోరాటాన్ని తిరిగి ఆరంభించాలని చెబుతూ అది ఆ ప్రకటన చేసింది. ఎమర్జెన్సీ ఉపసంహరించుకోబడిన వెసులుబాటు వాతావరణంలో అవకాశం ఉన్నా కూడా రవూఫ్‌ను సంప్రదించకుండానే ఇది జరిగింది. జైల్లో ఉండి కెఎస్‌ను కాంటాక్టు కావడానికి అన్ని ప్రయత్నాలు చేసి ఆ ప్రతిపాదనకు తన అభ్యంతరాల్ని తెలిపినా వాటిని పరిగణనలోకి తీసుకోలేదని రవూఫ్ ఈ విషయాలు రాస్తూ పేర్కొన్నారు. అదే కాలంలో చైనాలోని టెంగ్-హువా రివిజనిస్టు ముఠా పెట్టుబడిదారులతో కుమ్మక్కై కుట్రలు పన్నుతోంది. దీనిపై పెరుగుతున్న వ్యతిరేకతను అవకాశంగా తీసుకొని అల్బేనియా పార్టీ మావోయిజం (మావో సే టుంగ్ ఆలోచనా విధానంగా పేరుపడింది) పై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నది. అంతర్జాతీయ మార్క్సిస్టు లెనినిస్టు ఉద్యమం వీటితో తలపడుతోంది. అయితే ఎం.ఎల్ శిబిరంలో కొన్ని పార్టీలు, సంస్థల మినహా చాలా మటుకు ఇటువంటి మార్క్సిస్టు వ్యతిరేక సంస్థలతో ఏదో ఒక దానితో రాజీ ధోరణిలో ఉన్నాయి. మావో మరణానంతరం టెంగ్-హువా ముఠా చేజిక్కించుకున్న చైనా కమ్యూనిస్టు పార్టీని ఏ.పి రాష్ట్ర కమిటీ సమర్థించింది. మావోసేటుంగ్‌దిగా ఆపాదించబడ్డ మూడు ప్రపంచాల సిద్ధాంతాన్ని కూడా అది సమర్థించింది. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని తిరుగుబాటు చేయాలని రవూఫ్ నిర్ణయించుకున్నాడు. పార్టీతో తెగదెంపులు చేసుకొని సిపిఐ (ఎం.ఎల్) ఏ.పి రీఆర్గనైజేషన్ కమిటీని ప్రారంభించాడు. ఇది సరైనదా కాదా అనే చర్చ భారత మావోయిస్టు ఉద్యమంలో చర్చనీయాంశంగానే ఉంది. అయినా సాయుధ పోరాట పంథా పట్ల ఆయన స్థిర నిశ్చయం, అంతర్జాతీయ పరిణామాలను వెనువెంటనే పట్టుకోగల సైద్ధాంతిక చురుకుదనం వంటి విషయాల్లో రవూఫ్ గొప్పదనాన్ని ఎవరూ తక్కువ చేయలేరు. చారుమంజుందార్ నెలకొల్పిన వారసత్వ స్ఫూర్తి ఇదే. ఆయన తీసుకున్న నిర్ణయం వెనక ఉన్న కొన్ని అంశాలు, అటు తర్వాత ఆయన ఆచరణ క్రమం వివాదాస్పదమైనా సరే. తప్పొప్పులను చరిత్ర నిర్ధారిస్తుంది.

రవూఫ్ నాయకత్వంలో ఏర్పడిన ఏ.పి.ఆర్.ఒ.సి. వెనువెంటనే తన వంటి వైఖరే కలిగి ఉన్న కేరళ రాష్ట్ర కమిటీతో జత కలిసింది. ఇది 1979లో సిపిఐ (ఎం.ఎల్) రీఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు దిశగా పురోగమించింది. (1981లో జరిగిన మొదటి అఖిల భారత మహాసభలో అది సిపిఐ (ఎం.ఎల్) సెంట్రల్ రీ ఆర్గనైజేషన్ కమిటీగా పేరు మార్చుకుంది.) ఈ పార్టీ 1980లో జరిగిన మొదటి ఇంటర్నేషనల్‌లో, ఆ తర్వాత రెవెల్యూషనరీ ఇంటర్నేషనలిస్ట్ మూవ్‌మెంట్ (రిమ్) ఆవిర్భావానికి దారి తీసిన 1884 మహాసభలో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం (ఆ తర్వాత మావోయిజంగా పేరుగాంచింది) పక్షాన సైద్ధాంతిక పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించింది. ఈ మొత్తంలో పార్టీ అగ్ర నాయకత్వంలో ఒకడిగా రవూఫ్ ప్రముఖ పాత్ర పోషించాడు. ఆయన దృఢమైన అంతర్జాతీయవాది.

ఈ కాలంలో రవూఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది కామ్రేడ్ల ప్రాణాలు తీసిన క్రూర రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కుంటూనే సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి పురోగమింపజేశాడు. 1983లో ఆయనే అరెస్టయి మూడేళ్ళు, ఆ తర్వాత నాలుగేళ్ళు జైల్లో ఉన్నాడు. (రవూఫ్ తన అయిదు దశాబ్దాలు మించిన విప్లవ జీవితంలో 12 సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు) అదే సమయంలో సి.ఆర్.సి. నాయకత్వంలో పెంపొందుతున్న మితవాద ధోరణులపై పోరాటం చేశాడు. జైలులో ఉండగానే 1985లో సి.ఆర్.సి నుండి చీలిపోయిన వర్గానికి నాయకత్వం వహించాడు. సి.ఆర్.సి అప్పటికే తనను తాను రద్దు చేసుకునే దిశగా పతనమవుతోంది. 1989లో సి.పి.ఐ (ఎం.ఎల్) రెడ్ ఫ్లాగ్ 1970 నాటి పార్టీ కార్యక్రమాన్ని ఆమోదిస్తున్నట్టు ప్రకటించడంతో ఆ సంస్థతో విలీనమయ్యాడు. అయితే ఆ పార్టీ దారి తప్పుతుండటంతో అందులో తిరుగుబాటు చేసి చివరికి ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుండి తనతో వచ్చిన కామ్రేడ్స్‌తో సి.పి.ఐ (ఎం.ఎల్) నక్సల్బరీని ఏర్పాటు చేశాడు. 1999లో సి.పి.ఐ (ఎం.ఎల్) మావోయిస్టు యూనిటీ సెంటర్, సి.పి.ఐ (ఎం.ఎల్) నక్సల్బరీతో విలీనమైంది. 2006 దాకా రవూఫ్ ఆ పార్టీ కార్యదర్శిగా పనిచేశాడు.

రవూఫ్ చారుమజుందార్‌కు స్థిరమైన అనుచరుడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పట్ల దృఢమైన వైఖరి, చారుమజుందార్ మార్గానికి నిబద్ధత ఆయనకు సైద్ధాంతిక శక్తినిస్తే, పీడకుల పట్ల జ్వలించే విద్వేషం మరింత బలం చేకూర్చింది. సైద్ధాంతిక దృక్పథంలో ఎంత స్థిరంగా ఉంటాడో ఆచరణలో ఎదురయ్యే లోటుపాట్లనూ ఆయన గుర్తెరిగే వాడు. ఆయన తన రిపోర్టులో నిర్మొహమాటంగా "ప్రాంతాల వారిగా రాజ్యాధికారం చేజిక్కించుకునే వ్యూహాన్ని సరైన ఆచరణలో పెట్టడంలో విఫలమయ్యాం... వర్గశత్రు నిర్మూలనను రాజ్యాధికారానికి ముడిపెట్టకపోవడంతో అది కేవలం మిలిటెంట్ ఆర్థికవాదమై మొత్తం

కార్యాచరణ సంచార గెరిల్లా చర్యలకే పరిమితమయిపోయింది...” అని సమీక్షించుకున్నాడు. పార్టీ సెట్‌బ్యాక్ అవ్వడంలో తన పాత్రనూ ఆయన కాదనలేదు. “ఉద్యమాన్ని విస్తరించడంలో సైద్ధాంతికంగా, నిర్మాణపరంగా కేడర్‌ను సంసిద్ధులను చేయకుండా తక్షణ చర్యలకు దిగినట్లు” ఆత్మవిమర్శ చేసుకున్నాడు. వివిధ కారణాల చేత, కొన్ని ఆయన చేయి దాటిపోవడం వల్ల కూడా ఈ అవగాహన సరైన సమయంలో లోతైన దిద్దుబాటు చర్యలకు దారి తీయలేకపోయింది.

నాయకత్వం తప్పుడు లైన్ తీసుకుంటోందని ఆయనకు కనపడినప్పుడల్లా తిరుగుబాటు చేయడం ఆయన ఎన్నో సార్లు చేసినా అది ముఠాలు కట్టే సంకుచిత మనస్తత్వం వల్ల కానే కాదు. నిజానికి రవూఫ్ అఖిల భారత విప్లవ పార్టీ ఏర్పడాలని వివిధ పార్టీల మధ్య ఐక్యత కోసం ఎంతగానో కృషి చేశారు. అంతే కాదు, ఆయనకు అభిప్రాయభేధాలున్నా, ఇతర మావోయిస్టు పార్టీల అనుభవాలను నిశితంగా గమనించి వాటి నుండి నేర్చుకోడానికి ఆసక్తి కనపరిచేవాడు. సి.పి.ఐ (ఎం.ఎల్) రెడ్‌ఫ్లాగ్ నాయకత్వానికి రాసిన ఒక లేఖలో “వివిధ ఎం.ఎల్ సంస్థలు నడుపుతున్న విప్లవోద్యమం గురించి, ముఖ్యంగా సాయుధ పోరాటంలో ఉన్న పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్, పార్టీ యూనిటీల ఉద్యమాల గురించి సి.ఆర్.సి ఎన్నడూ చర్చించలేదు. దురదృష్టవశాత్తూ సి.ఆర్.సి పీపుల్స్ వార్ పట్ల చలా నెగెటివ్ ధోరణిలో ఉంటున్నది... ఆ పార్టీ రాజ్య నిర్బంధానికి ప్రధాన లక్ష్యంగా మారింది. దాని ఆచరణకు సంబంధించిన పాజిటివ్, నెగెటివ్ అంశాల నుండి మనం నేర్చుకోవాల్సిన అవసరం లేదా?” అని రాశాడు. ఇటు వంటి ఒక విశాల దృక్పథం, అభిప్రాయభేధాలున్న వారి నుండి కూడా నేర్చుకునే సిసలైన మావోయిస్టు వైఖరి కొత్త తరాల కమ్యూనిస్టులకు గొప్ప ఉదాహరణగా నిలిచిపోతుంది.

అతని కమ్యూనిస్టు లక్షణాలు- ప్రజలతో మమేకమైపోవడం, అతి సాధారణ జీవన శైలి, కష్టాలను ఎదుర్కొనే సంసిద్ధత, పార్టీ పట్ల విశ్వాసం ఆయనకు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం కల్పించాయి. రవూఫ్ సునాయాసంగా వయసు తేడాను అధిగమించి యువకులతో సావాసం చేయడం, విప్లవానికి వారిని ఆకర్షితులను చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వృద్ధాప్యపు ఛాయలు ఆయన ఒంటి మీదే తప్ప ఆయన చూపుల్లో పెద్దరికపు ఆధిక్యతా భావనలు ఉండేవి కావు. సీనియారిటీ వల్ల ఏర్పడే దూరం ఆయన విషయంలో యువకులు ఎన్నడూ ఫీలయ్యేవాళ్ళు కాదు. యువకామ్రేడ్లు ఆయనను అభిమానంగా “తాత” అని పిలవడమొక్కటే వయసు తేడాను గుర్తుతెచ్చేది.

ఇప్పుడిక కామ్రేడ్ రవూఫ్ భౌతికంగా మన మధ్య లేడు. కొన్ని సంవత్సరాల క్రితం నుండే “డిమెన్షియా” వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించి ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన మెదడు అత్యంత సన్నిహిత కామ్రేడ్స్‌ను కూడా గుర్తించడం మానేసింది. ఆయన వారితో సరిగా మాట్లాడలేని స్థితి వచ్చింది. వ్యాధి తొలి దశలో ఆయన దానితో పోరాడే క్రమంలో తెగిపోయే సంభాషణల నడుమ రాజకీయ పదబంధాలు మెరిసేవి. తరవాత అది కూడా ఆగిపోయింది. ఆ కమ్యూనిస్టు యోధుని అటువంటి స్థితిలో చూడటం దుర్భరంగా ఉండేది. ఆ తీక్షణమైన చూపులు, అంతే సూటిగా ఉండే ఆ మాటలు ఖాళీ అయిపోయిన, కాంతి విహీనమైపోయిన ఆ స్థితిలో గుర్తుతెచ్చుకుంటే బాధాకరంగా ఉండేది. నిరంతర శక్తి ప్రవాహంతో ప్రజల పట్ల, తోటి కామ్రేడ్స్ పట్ల ఎంతో ఆపేక్ష కలిగిన కామ్రేడ్‌కు ఇప్పటి ఈ మనిషికి పోలిక వెతకడం కష్టమనిపించేది.

ఆ కమ్యూనిస్టు విప్లవయోధుని గౌరవార్థం ఎర్రజెండా అవనతం చేస్తున్నాం.

ఏ విప్లవ ఆశయాల కోసం ఆయన జీవించాడో ఆ ఆశయాల సాధన కోసం,

భారత దేశ మావోయిస్టులంతా ఒకే పార్టీగా ఏకమయ్యే ఆయన చిరకాల కలను సాకారం చేయడం కోసం మేము మరింతగా అంకితమవుతాం.

(అనువాదం : లలిత)



వెల : రు. 125/-

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని - 2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

ప్రతులకు :

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387

దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040-27640574

స్వార్థ మతం

-వరవరరావు

శ్వాస కాదు అది ఆహారము కాదు
నీరు కాదు అది గూడు కాదు
బట్ట కాదు అది ఆరోగ్యము కాదు
అజ్ఞానమే మత విశ్వాసమయ్యింది "శ్వాస"

అంధ విశ్వాసమే కొందరికి స్వార్థమై
హింస విధ్వంసమే కొందరికి పదవియై
నాల్గు పడగల పాము వేయి నాల్కలు చాచె
ఆక్టోపస్ రాజ్యమై శాంతినే కబలించె "శ్వాస"

సామ్రాజ్యవాదపు భావజాలంలోన
మతవర్గ తత్వమొక ఉన్మాదగాలము
ద్వేషాలు రగిలించి యుద్ధాలు ప్రకటించే
పాలకులు పబ్బాలు గడుపుకునే కాలమిది "శ్వాస"

మార్కెట్ల విస్తరణ ఆర్యమత భావన
హిట్లర్ల సృష్టించి యుద్ధాలు తెచ్చింది
స్వస్తిక్ లు కొలిచేటి సంఘపరివారము
నాజీల వారసులు నరహంతకులు సుమా "శ్వాస"

ప్రపంచీకరణతో పారవశ్యముచెంది
హిందూత్వ శక్తులే బాబ్రీని కూల్చాయి
బొంబాయి సూరతు గుజరాత్ కందమాల్
భైంస మాలెగాం మనుషుల్ని చంపాయి "శ్వాస"

మోడిత్వ సురాజ్య అభివృద్ధి మార్గంలో
ముజఫర్ నగర్ లోన ముస్లింల చంపారు
కంపెనీ చాయమ్మి ప్రభుభక్తి ప్రకటించి
దేశాన్ని అమ్మగా పోటీకి దిగినారు "శ్వాస"

దేవుడు పురుషుడే మతము పురుషార్థమే
లైంగిక దాడులకు గర్భాలు చీల్చుటకు
పరమతం పైనున్న పగదీర్చుకోనీకి ...
మహిళలు పిల్లలే మగవారి లక్ష్యము "శ్వాస"

మనుధర్మ బోధనలు మగవారికోసమే
సదువు లేదు స్త్రీకి స్వాతంత్ర్యము లేదు
పురుషునిది పుణ్యమట స్త్రీ జన్మ పాపమట
ఇంటి భారము తప్ప అధికారమే లేదు "శ్వాస"

మనుషులుగ పుట్టాము మనుషులుగ పెరగాలి
స్త్రీ పురుష రూపాలు ఒక మనిషి సారమే
శ్రమ జీవి సమభావ పోరాట శక్తితో....
మతోన్మాదపు వర్గమూలాలు కూల్చాలి "శ్వాస"

విప్లవ పిపాసి గంటి ప్రసాదం

- సంధ్య

గలగలా సాగేటి గంటి ప్రసాదన్న
పాటలో పల్లవైనాడు ఉత్తేజ చరణమై పాడుతున్నాడు
పోరు బొబ్బిలి గడ్డ పేద వాకిలి బిడ్డ
మనువు కుల తంత్రాన్ని దునుమాడెరా అన్న
కులముపేర మనిషి కలిమి లేదని చెప్పి
కలహించుకొనుటకే కులము కుట్రన్నాడు
కష్టజీవులనంతరా ఒకటయ్యి
కలిసిపోరాడమనెరా ॥గల గల॥

విశ్రాంతి ఎరుగలే విప్లవ పిపాసి
యుద్ధంలో మాయన్న ప్రజల పక్షమే చూడు
అలుపన్నదే లేదు అడుగు ముందుకె ఎప్పుడు
మడిమ తిప్పనే లేదురా సమరాన
మావో బాటలో నడిచెరా
మానవీయత నిలపెరా ॥గల గల॥

కార్మికా సంఘంలో ఐక్యతే మాయన్న
కర్షకా నుదిటిపై చెమట చుక్కర అన్న
కళాసి కన్నుల్లో కాంతి కిరణం అన్న
శ్రమ శక్తే గెలుపంటురా అందరికి
మార్క్సు మార్గమే చూపెరా ॥గల గల॥

గ్రీన్‌హంటంటెనే గిరిజనులపై వేట
ఖనిజ సంపద కొరకె కార్పరేటు కుట్ర
ఆదివాసులే దేశ అసలు రక్షకులందు
దేశాన్ని తెగనమ్మెటి దళారుల
దారికడ్డం నిలిచెరా ॥గల గల॥

అమరవీరుల బంధుమిత్రుల సంఘంకు
నిలిచెరా మాయన్న కొండంత అండగా
కడుపుకోత తల్లి కన్నీళ్ళు తుడ్చిరా
త్యాగమెంతా గొప్పదో ప్రజలకై
తను అమరుడై చాటెరా ॥గల గల॥

కత్తివేటుతో అన్న కంఠాన్ని నరికినా
గన్నుపాటుతో అన్న గుండెల్ని చీల్చినా
శ్వాస విడిచే దాక ధ్యాస విప్లవమయ్యి
విప్లవ పూదోటలో విరబూసె
ఎర్ర మందారపువ్వై ॥గల గల॥

రాజ్యహత్యతోని రక్తాలు చిందించి
గాయపడిన గొంతు గమ్యాన్ని సూచిస్తు

తూట్లు పడిన గుండె తూర్పు ఎరుపెక్కించు
ప్రజారాజ్యమొచ్చేదాకా మాకెపుడు
చావు లేదని చాటెరా
జనతన సర్కారుదే ఎప్పుడైనా
జయము జమయన్నాదురా
జలజలరాలిన రక్తం జంగ్ చెయ్యాలంది

ఆజాద్ స్మృతిలో

- శ్యామ్‌జీ

ప్రజల మనిషి ఏడయ్యో ప్రాణం లాంటి అజాదన్న
ప్రజల పోరు బాటయ్యో అగ్గిపిడుగు అజాదన్న

1. తెంగాణ వీరగాథలు-వరంగల్ విప్లవాలు
చిట్యాల చిరుదివ్వెలు-వెలిశాల వేగుచుక్కలు
కూలోళ్ళా తిండిజూసి-పేదోళ్ళ బ్రతుకు జూసి
అవినీతి నిర్మూలించే-అన్నలను కల్సినాడు
సోమనసోపతి జేసి సంఘనాయకుడైనాడయ్యో

2. తల్లిదండ్రుల ముద్దుపేరు-గాదర్ల సారయ్య
ప్రజలు పిలిచే పేరు-పోరునేత భాస్కర్న
ఓనమాలు నేర్చనీకి-వయోజన పంతులయి
అ అంటే అడవి అన్నడు-ఆ అంటే ఆయుధమన్నడు
అమ్మలోని మొదటి అక్షరం-నాన్నలోని చివరి అక్షరం
అన్న అనే పిలుపులోనే అమ్మా నాన్న ఉన్నారయ్యో

3. పాలేర్ల సంఘంబెట్టి-వెట్టి పనులు బంద్‌బెట్టె
రైతు కూలీ సంఘంబెట్టి-కూలిరేట్లు పంచబట్టె
ఆడోళ్ళ సంఘం బెట్టి-సారాయి బంద్ బెట్టె
పట్వారి పటేల్‌గాడు-భూస్వామ్య దొరగాడు
తునికాకు కళ్ళేదారు-సారాయి మవులాగాడు
ప్రజాకోర్టులు పెట్టి-పంచాయితి చెయ్యబట్టె
రాడికల్లా సంఘంబెట్టి రగాల్ జెండా ఎత్తినాడయ్యో

4. బార్యనేమో బాగుజేస్తే-బార్యేమో బ్రతుకాదాయె
ఎన్నికల్లో పోటిచేస్తె-ఎన్నికల్లో ఓడిపోయె
ఎన్నికల మర్మమెరిగి-ఎన్నికల బహిస్కరించె
పసిపిల్లల బాసినాడు-జనం బాట పట్టినాడు
ప్రజారాజ్యం కోసం-ప్రజాయుద్ధమందు
చిట్యాల దళంలోన దళకమాండరైనాడయ్యో

5. పోలీస్ క్యాంపులేసి-ప్రజలనూ హింసచేస్తె
ఇండ్లన్నీ కూలగొట్టి-ఎంట్రీన్ బాయిలబోస్తె
పంటసెండ్లు మెపబట్టె-దాన్యాన్ని తగులబెట్టె
ఆడోళ్ళా పసివాళ్ళ-ముసలోల్లా పడ్సువాళ్ళ
పట్టపగలు కాల్చినారు-మానభంగం చేసినారు
రాజ్యహింస తట్టుకోక-తమ్ముళ్లేమో తల్లడిల్లె
నా చిన్ని తమ్ముళ్లారా-శంకరన్నా వారసులారా
శంకరన్న బాటలోన పోరు చెయ్య రండయ్యో

6. పల్లెలన్ని తిరిగినాడు-పదుసోళ్ళ ఏరినాడు
దళముల ఏర్పాటు-ప్లాటూన్లు ఏర్పాటు
దెబ్బగొట్ట మాటుగాసి-మందుపాతరను పేల్చె
శత్రువును చుట్టుముట్టి-బందుక్ లోడ్ జెసె
రెక్కి నిర్వయించినాడు-రైపోల్ ఎత్తినాడు
కోవర్ట్ పిస్టోల్ తీసి-కాల్చి చంపెలోపె
గడ్డం చేసుకోంగ-అద్దములా చూసినాడు
కోవర్ట్ గాళ్ళనైతె-17 మందిని చంపె
గెరిల్లా జోన్‌లోన-గెరిల్లా యోదుడాయె
గెరిల్లా యుద్ధంలోనే-గెరిల్లా బెస్‌లందు
పేద ప్రజల ముక్తికొరకు తుపాకి పట్టినాడయ్యో

7. ఉత్తర తెలంగాణమంత-మెఘంలా మెరిసినాది
ఊర్లాన్ని ఉరిమినాయి-పల్లెలన్ని పెలినాయి
పాటెండ్లు దొరగాళ్ళు-పట్టణాలకు పరుగుబెట్టె
అన్నలేమో అడవులకాయె-ఆదివాసుల అండదొరికె
ఆయుధాలు చేతబట్టె-అడవి తల్లి ఒడిలో చేరె
అబూడ్‌మడ్‌లో ప్రయోగాలు-జనతన సర్కారులు
అన్నల పార్టీకి రక్షణ కవచం ఆదివాసులేనయ్యో

8. పెట్టుబడిదారులేమో-పేట్రేగిపోతుండ్రు
సామ్రాజ్యవాదులేమో-సైనికాయుద్ధమండ్రు
పాసిస్ట్ పాలకులు-పోలీస్ పోర్సొండ్రు
పచ్చాని అడవులల్లో-గ్రీన్ హంట్ యుద్ధమైంది
ప్రజల రక్షణ కోసం-ప్రజా గెరిల్లా సైన్యముంది
మహేంద్ర కర్మగాడు-మట్టికరిచినాడు సూడు
సమానత్వం కోసం-సమరంలో సాగుదాము
భరతమాత విముక్తికి.. మావోయిస్టులేనయ్యో

అమ్మతనం తెలంగాణ

- డా. వి.వీరాచారి

ఇది వీర తెలంగాణ విప్లవాల మాగాణ
ప్రేమకు నజరానా త్యాగాల ఖజానా ॥ఇది॥

గోదావరి హొయలతో కృష్ణమ్మ పరుగులతో
తుంగభద్ర నడకలతో సింగరేణి సిరులతో
సింగిడైన తెలంగాణ శివసత్తుల తెలంగాణ
గిరిపుత్రుల తెలంగాణ పోరుగడ్డ తెలంగాణ ॥ఇది॥

తెలుగు భాష సంస్కృతుల జీవధార తెలంగాణ
మాతృస్వామ్య భావజాల మణిపూస తెలంగాణ

దేశీకవిత పరిమళాలు ప్రభవించిన తెలంగాణ
బతుకమ్మ కొలువులకు నెలవైన తెలంగాణ ॥ఇది॥

మహోజ్వల సామ్రాజ్యపు రూప శిల్పులు
బౌద్ధ జైన మతాల పరిపోషకులు
చాతుర్వర్ణ వ్యవస్థను ధిక్కరించిన ప్రజాహితులు
శాతవాహన కాకతీయుల కన్నతల్లి తెలంగాణ
కల్పవల్లి తెలంగాణ వనదేవత తెలంగాణ

నాయకురాలు నాగమ్మ రాణి రుద్రమ్మ
అడవి కాసిన అగ్నిపూలు సమ్మక్క సారక్క
చాకలి అయిలమ్మ ఆరుట్ల కమలమ్మ మల్లు స్వరాజ్యాలు
పౌరుషానికి ప్రతీకలై ఉద్యమానికి బాటలై
స్త్రీల శక్తియుక్తుల సత్తా చాటిన తెలంగాణ

నల్లగొండ పాలమూరు ఓరుగల్లు జగిత్యాల
సిరిసిల్ల ఇంద్రవెల్లి ఇనతేజం విప్లవాల మూట గట్టి
సమత కోసం మమత కోసం మానవత్వ మనిషి కోసం
అడవి బాటను పట్టిన వేగుచుక్కల కన్నతల్లి తెలంగాణ ॥ఇది॥

కళలకు కాణాచిరా ప్రజల పాటల ఊటరా
మట్టి మనుషుల ప్రేమరా ఉద్యమాల ప్రయోగశాలరా
మానధనుల కోటరా తంగేడుపూల వనంరా
మోదుగుపూల జనంరా నా తెలంగాణ ఘనం రా ॥ఇది॥

మరి రవికి జోహార్

- రాంరెడ్డి

ఓరుగల్లు పోరువనంలో ఉద్యమ ఖిల్లాలో
పురుడు పోసుకున్న పేదతల్లి ముద్దుబిడ్డా
మట్టితల్లి పురిటినొప్పుల పంట
సాయుధుడైన సూర్యుడు సుదాకరన్న
పుట్టిన నేల పోరలకు
పోరు పాఠాలు నేర్పి
ఆదివాసీ బిడ్డలకు ఉద్యమ ఓనమాలు
దిద్దించి పోరుబాట పట్టించిన రవన్నా
దండకారణ్యంలో దళం నడిపిన
పోరుకు ఊపిరిబోసిన సైనికుడ
దళారీ పాలకుల సామ్రాజ్యవాదుల
దోపిడి దౌర్జన్యాలను ఎండగడుతూ
ములుగు ఏటూరునాగారంల నుండి
ఖమ్మం కరీంనగర్ వరకు పోరుబాటలేసి
భూస్వామ్య పెట్టుబడిదారుల గుండెల్లో
కొదమసింహమై గర్జించినోడా
ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న
నీ పోరాట పటిమ అజరామరం
ప్రజల పక్షన నిలిచినందుకే
ప్రజా గెరిల్లావైనవ్
మట్టి రవన్న పేరు వింటెనే
గడగడలాడిన రాజ్యం
రవన్న కల నిజమైతే మేం బతుకలేమని
నీపై కక్షగట్టి తుదముట్టించాలని కలగన్నది
నీవు అడుగుబెట్టిన నేలంతా ఉద్యమాల ఖిల్లైనందుకు
రాజ్యం కంటిపై కునుకు కరువై పలవరించింది
వలపన్ని నీపై శత్రుమూకలు విరుచుకపడ్డయి
ఉద్యమంలో అడుగుపట్టిన నుండి
అమరుడయ్యేంత వరకు
అలుపెరుగని పోరుజేసిన
అసలు సిసలైన నిఖార్సైన మావోయిస్టువై
జనం దిక్కు నిల్సిన ప్రజల బిడ్డవై
ప్రజల బాధలు పోవాలంటే
పోరాటమే ఏకైక మార్గమన్నవ్
మార్క్స్ ఎంగెల్స్ మావో లెనిన్
సిద్ధాంతాలను ఒంటపట్టించుకోని
అలుపెరుగని ఉద్యమం కొనసాగించి
ప్రజారాజ్యాన్ని కలగన్నవ్
సోషలిజం స్థాపనే ధ్యేయంగా
సమసమాజ నిర్మిణమే లక్ష్యంగా
ఎత్తిన పిడికిలి దించకుంటా
జబ్బకు తుపాకి వీపున బ్యాగుతో
దండకారణ్యంలో దండు నడిపినవ్
భారత విప్లవోద్యమాన్ని కలగన్నోడు
కమ్యూనిస్టు రవన్న మావోయిస్టు సుధాకరన్న
సహచరి పుష్పనెంటేసుకొని
దళ నాయకుడివై అడవంతా సంచరిస్తూ
గోండు గుండెల్లో గూడు కట్టుకొని
ఉత్తర తెలంగాణ ఉద్యమానికి
ఊపిరై నిల్సి దండు నడిపినవ్
రాజ్యం ఎత్తులను చిత్తు చేస్తూ
ఎంతటి నిర్బంధంలో సహితం
ప్రజల మద్దతు తో శతృవు కన్నుగప్పి
తప్పించుకున్నవ్ ప్రజల మద్దతులో
ప్రజల గుండెల్లో గూడు గట్టుకున్నవ్
ప్రజా గెరిల్లా సైన్యాన్ని నడిపించినవ్
ప్రజల మద్దతుకు మురిసిపోయి
మరింత చురుకైన గెరిల్లాగా ముందునిల్సినవ్
కె.కె.డబ్ల్యు ఉద్యమ నిర్మాణంలో
అవాంతరాలెన్ని ఉన్నా అలుపెరగక కదిలినవ్
సజీవంగా ఉద్యమాన్ని నిలిపినవ్
అందుకే రాజ్యం నీపై కత్తిగట్టింది
నిను కతం చేయ పూనుకుంది
దోపిడి ఉన్నంత వరకు ఉద్యమం ఉంటుంది
ఉద్యమం ఉన్నంత వరకు నీవు సజీవంగా ఉంటవ్
నీ నెత్తుటి బాకీ తీర్చుకొని ఈ దళారీ పాలకులను

సామ్రాజ్యవాద పెట్టుబడిదారులను అంతమొందిస్తాం
నీవు కన్న సాయుధ పోరాటాన్ని
తుదివరకు నడుపుతాం
భారతదేశ విప్లవం విజయవంతమయ్యేవరకు
నీ ఆశయాలను మరువబోము
తుది విజయం ప్రజలదే

ఆదివాసులోయమ్మా!

- దామరపల్లి నర్సింహారెడ్డి

ఆదివాసుల పోరులోనా - నెలరాలి నారమ్మా
అడవి పోరులోనా - అమరులైనారో ॥2॥
వీరులోయమ్మా శూరులోయమ్మా
బాసగూడ ధీరులోయమ్మా

అడవి హక్కుల కోసం - పోరుబాటలు పట్టినవాళ్ళు
అడవి మాదని - ముందుండి నడిచిన వాళ్ళు
హక్కులు లేని ఆదివాసులు - బతుకులంత చీకటిమయం
ఆదివాసుల ఆకలి ముందు - దోపిడిదారులు కులిపోవును॥ఆది॥

పచ్చని అడవిపై విదేశీయుల కన్ను పడెను
ఖనిజం కోసం, భూమి కోసం యుద్ధమే అన్నారు
అడవుల నుంచి ఆదివాసులను తరిమివేసే జీవోలు వచ్చే
గ్రీన్‌హంట్ పేరుతో అడవి బిడ్డలపై ఆధర్మ యుద్ధం ॥ఆది॥

బాసగూడ పచ్చని అడవిలోనా
దొంగ ఎదురు కాల్పులోనా కన్నుమూసి - పసిపాపలు
దోపిడి రాజ్యంపై తిరగబడిన వీరయోధులు
గుండకు గుండెనిచ్చి - రక్తం ముగ్గుళ్ళు పోసినవాళ్ళు ॥ఆది॥

ఆదివాసుల పోరాటం - ఆత్మగౌరవ పోరాటం
నిత్య నిర్బంధాలు - అణచివేతలు సాగవింక
ఆదివాసుల పోరు ముందు - సామ్రాజ్యవాదులెంత
చీమలదండై కదులుతాం - దోపిడాదురలను తరిమివేస్తాం॥ఆది॥

(ఎర్రజెండా గుండెల్లో ఒరిగిన వాళ్ళురా అనే బాణీలో...)

నాకిదంతా కవిత్వమే

- ఉదయమిత్ర

ఊపిరితిత్తుల జేరిన కఫంలాంటి
పొగమంచును జీల్చుకువచ్చి
సభాప్రాంగణాన
కిరణాలు తొలిముగ్గు వేయడమొక కవిత్వం

మనుష్యులు గుంపులుగా జేరి
మిరియాల చాయల్ని గొంతుల బోసుకుంటూ
వరంగల్ వీథుల్లో
పోటెత్తిన జన సందోహాల్ని
నెమరేయడం, చెమర్చడం ఓ కవిత్వం

"అన్నా! ఎన్నాళ్ళకే" అంటూ
జైలు పీడిన మనుష్యులు
ఆత్మీయుల జేరినట్లు
కౌగిలింతల స్పర్శల్లో
విప్పిరిన వెచ్చదనమొక కవిత్వం

హడావిడిగానైనా, అందంగా పేర్చిన
పుస్తకాల్లోంచి మనుష్యులు లేచివొచ్చి
కరచాలనం చేయడమొక కవిత్వం
పీడకల మీద ఎలుగెత్తిన గొంతుల
ఉరికొయ్యల పాటల్ని పరిచయం చేయడమొక కవిత్వం

నాకంతా కవిత్వమే...
గాలీ, ధూళీ, ఎండా, వానా, అంతా కవిత్వమే
పిల్లలు మెట్ల మీద ఆడడమొక కవిత్వం
పక్షులు చెట్లమీద ఎగరడమొక కవిత్వం
కాకులు వాలిన కరెంటు తీగలు
లయ బద్ధంగా ఊగడమొక కవిత్వం

ఎగిరిన ఎర్ర జెండాను వెచ్చని ఎండ
తెలంగాణ తల్లిలా కౌగిలించడ మొక కవిత్వం
అమరుల తల్లిదండ్రుల కంటతడి ఓ కవిత్వం
శుష్కించిన దేహంలోంచి
మొలకెత్తిన పిడికిలి ఓ కవిత్వం...

నాకంతా కవిత్వమే
పండుగకు పుట్టిల్లు జేరినట్లు
మబ్బులు తొలిగిన చంద్రుడు
మౌనంగ దీవించినట్లు
నాకంతా కవిత్వమే

ఉపన్యాసాల జడివానలో
తడవడమొక కవిత్వం...
లయబద్ధంగా వేసే అడుగులొక కవిత్వం
పాటకోసం ఎదురు చూడడమొక కవిత్వం
పాటల ఊటలు తోడి
శ్రోతల సుశ్రూతలూగించడమొక కవిత్వం

"బాసగూడ" నెత్తుటి గాథను
మైదానానికి పరిచయం చేయడమొక కవిత్వం
ఎక్కడో గుండె గూడు కదిలి

కన్నీళ్ళయి జాలువారడమొక కవిత్వం
ఉద్వేగ ప్రకంపనాలు కాంతిమండలాలై
సభను ఉద్దీపింపజేయడమొక కవిత్వం

నాకంతా కవిత్వమే
వైతరణిని దాటినట్లు
ఇంద్ర ధనుస్సు విరిసినట్లు
నాకంతా కవిత్వమే

కాగడాల ఊరేగింపు ఓ కవిత్వం
ఎదురుజూసిన వీధులు
మళ్ళీ మొలకెత్తడమొక కవిత్వం
పెచ్చరిల్లిన నినాదమొక కవిత్వం
ఆట - పాట - మాట
నిషేధించిన నేలలో
పెదవి దాటిన కల
గాల్లో విస్ఫోటనం చెందడమొక కవిత్వం
గగన వీధులూగిపోయి
శాల్యూట్ చేయడమొక కవిత్వం.

శరీరాల కుంచెల్తో
రోడ్ల మీద అద్భుత చిత్రాలు వేస్తూ
కాలాన్ని తమ వెంట తిప్పిన
కోలాట బాలలు, ఆదిలాబాద్ పోరలొక కవిత్వం
నేల మీద నక్షత్రాల జూసి
నింగి నక్షత్రాలు అబ్బుర పడడమొక కవిత్వం

కదిలే కాలమంతా కవిత్వమే
కనలేకాలమంతా కవిత్వమే
ఎదిగే కాలమంతా కవిత్వమే
ఎరుపెక్కే కాలమంతా కవిత్వమే

ఓరుగల్లు పోరుగల్లుగ
మళ్ళీ మారడమొక కవిత్వం
నాకంతా కవిత్వమే
మైనా తెచ్చిన మతలబంతా కవిత్వమే

బహిరంగ సభలో
ఉబికివొచ్చిన దుఃఖమొక కవిత్వం
చేసిన ధిక్కిరమంతా ఓ కవిత్వం
నెమరేసిన అనుభవాల సారమొక కవిత్వం
నిశ్శబ్ద హృదయ ప్రాంగణం మీద
వేసిన ఆదివాసీ అడుగులొక కవిత్వం
చేస్తున్న యుద్ధమొక కవిత్వం
మైదానానికి
అడవి నిర్దేశించిన
అనన్య సామాన్య కర్తవ్యమొక కవిత్వం

అలిసిన శరీరాలు
నిద్రలోకి జారుకోవడమొక కవిత్వం
నిద్రలో
నూతన మానవుణ్ణి కలగనడం ఓ గొప్ప కవిత్వం

ష్ ష్ ష్ ష్......

- వడ్డెబోయిన శ్రీనివాస్

అంటరాని నినాదంతో
అంబేద్కర్ కరచాలనం చేశాడు

నదితో
నడువలేనందుకు
కాళోజీ
కన్నీటినదైయ్యాడు

చిచ్చరపిడుగులతో
అమరుల స్థూపం
చిందులు వేసింది

ఆర్ట్సు కాలేజి బహిరంగ వేదిక నెక్కిన తెలంగాణ
జనతన సర్కారును
పొద్దుంది

అన్నల కార్ఖాన
ఆర్ఈసీ దుఃఖంగా
గిరాయిపల్లి వీరుల
బండియాదన్నల తలపోస్తుంది

కత్తుల కోలాటాన్ని కౌగిలించుకున్న
కాకతీయ యూనివర్సిటీ
అయిలయ్య రాయమల్లు
అమర స్మృతిలో పడింది

వ్వావ్ వ్వా -
బూడిద దులుపుకున్న నిప్పు
ధూంకాల్ ర్యాలీ తీసింది
భయం తలదించింది

లేగదూడల పల్లె గొంతుక
రేలపాటల హరికేనై లేచింది
సునామీ మింగిన మనిషి
సునాయాసంగా తనదారి గుర్తించాడు

గొంగడి భుజానేస్కొని
గొడ్డలి చిప్పందుకున్న
కాలిబాటా - కాగడా -
నీకు కృతజ్ఞతలు

సుప్తావస్థను ఛేదించావ్

చీకటి కురుస్తున్నప్పుడే
తలలపై
సూర్యుల ఊరేగింపు
అడుగడుక్కీ
అమరుల జననం
వీధి వీధికి జ్ఞాపకాల జ్వాలలు

నీళ్ళు కన్పించకపోయేసరికే
నది ఎండిందన్నారు
కొంచెం
ఇసుకతోడితే తెల్సింది
అది చెలిమే-

కొంచెం వానకే
ఎన్జీవోస్ కాలనీ రోడ్డుతా
ఎలుగు ఏరులైపారింది

దొంగలు
ఖాళీ చేసిన గాదెలు
అక్షరాల్తో
మళ్ళీ నిండాయి
ష్ ష్ ష్ ష్...
గంభీరంగా
దండకారణ్యం
కాసేపు
నగరంలో నడిచి వెళ్ళింది

భూమి పుట్టిన కాడ్నుంచి
బుక్కెడు బువ్వ కోసమే
భూగోళంతో కలగలిసి
అవిశ్రాంతంగా
పరిభ్రమిస్తున్న
మొలకెత్తే బాసగూడల్ని
కల్లోలం చేసి
బలి తీసుకున్నోడి మీదికి

పగలూ రాత్రీ
పండు వెన్నెల పచ్చదనాన్ని
పహారా కాస్తున్న
వసంత కోయిలల్ని
తరుముతున్న లూటీ సర్కార్ల మీదికి
ఇప్పుడు గడ్డిపోచలు సైతం
ఎక్కుపెట్టిన ఆయుధాలై
నిక్కపొడుచుకు లేస్తున్నాయి

వాడు
చిదంబరమో
మన్మోహనో
ఒబామానో
ఎవడైతేనేం
వెన్నులో
వణుకు పుట్టదా మరి!!

మోస్ట్ డేంజర్ థ్రెట్

- ఉజ్వల్

మాట
చూపు
నడక
నీడ
అన్నీ
యుద్ధరూపాన్ని
సంతరించుకున్నాయిక్కడ
అవును
నిశ్చల గగనమూ
నిశ్శబ్ద పవనమూ
నిర్మల హరితమూ
ఇప్పుడక్కడ
ప్రతీదీ
స్రవిస్తున్న మహా గాయమే!

నా కరువుసీమ ఓ కన్నీటికోన

- సొదుం శ్రీకాంత్

కడుపు కొట్టేనోళ్లొస్తే
కాపురం పెట్టాల్సి వచ్చె
బజారుకీర్సినోళ్లొస్తే
షికారు పోవాల్సి వచ్చె

నీళ్ళిచ్చినానని సెప్పి
క్రిష్ణా-పెన్నార్‌ను క్రిష్ణార్పణం జేసి
కన్నీళ్ళ ముంచినోని పైనే
పన్నీళ్ళు సల్లాల్సి వచ్చె

రాజధానిచ్చానని రచ్చకీర్సి
తీరా అక్కర తీర్నాక
పోరా బోడినాకొడకంటా
ఎగతాళి సేసినోన్నే
ఎనకేసుకొవ్వాల్సి వచ్చె

గట్టెక్కిచ్చానని మునగ సెట్టెక్కిచ్చి
కట్టిర్సి పాయ్‌లో పెట్నెట్టు
నడ్డిర్సి నట్టేట ముంచినోళ్లొస్తే
సుట్టరికం సెయ్యాల్సి వచ్చె

ఇక మన సంబడం సూచ్చే

ఫ్యాక్షనిజం నారుపోసి
పౌరుషాన్ని నూరిపోసి
పారాణి కూడా ఆరకుండా
తాళి తెంచిన పాళెగాల్లనే
తలకెత్తుకోవాల్సి వచ్చె

నేటి కూనీకోర్ల దురాగతాలకి
నిన్నటి వేమన్న సమున్నత తేటతెలుగు వెలుగులు
మొన్నటి అన్నమయ్య ఆరాధనాదాలు
ధ్వంసమై, భావ దారిద్ర్యంతో
నా సీమ సాంస్కృతిక దుర్భిక్షాన్ని
సంకనేసుకోవాల్సి వచ్చె

యురేనియంతో
ఊర్లకు ఊర్లనే ఉరేసి
ఉసురుతీసినోల్లనే
ఊరేగించాల్సి వచ్చె

జనగణమన.... కూడా రాని
"జఫా" గాల్లందర్నీ
జననాయకుల్ని సేసి
జై కొట్టాల్సి వచ్చె

గద్దెనెక్కడానికి
సమైక్య సుద్దులు సెప్పి
మద్దెల దరువేసినోన్నే
మన ముద్దుబిడ్డని
మురిసిపోవాల్సి వచ్చె

కేవలం సినుకు రాలకే
నా సీమ సితికి ఈ గతికి సేరలె
అమ్మపాలు తాగి రొమ్ముదన్నే
ఈ ఉన్మాదపు నాయాల్ల దుర్మార్గాలే
నా కరువు సీమని "కన్నీటికోన"ను సేస్సినై

అలయ్ - బలయ్

- మేడక యుగంధరరావు

వెతుకుతున్న నేత్రమేదో
'హంటర్ రోడ్' లో మాయమైనట్టుగుంది

నిన్న గాక మొన్న
'గాబ్రియెల్ స్కూల్' మీదుగా వీచిన గాలేదో
ఇపుడే కొత్తగా తాకి
జివ్వున లాగి వదిలినట్టుంది

చెదిరిన బుజ్జాయి పెదాల చిర్నవ్వు
విరిగిన తుమ్మెద విపంచికల మధ్య
తెరిపివ్వని కర్ఫ్యూలో
కాసింత చోటు దక్కి
గాఢంగా శ్వాస తీసినట్టుగుంది

స్థూపం మీది కాగడా బిగువుకు
మళ్ళొక్కసారి వాన కురిసి
నారుమడి ఏపుగా పెరిగినట్టుగుంది

వెనక్కి వెళ్ళాలన్నా వెళ్ళలేనితనం
సంవత్సరాలు తప్పిపోయేంతగా
చూపు మరల్చలేనితనం
దిశమార్చుకున్న ఏటి పాయ
పొటమరించే నదిలా తిరిగొస్తుందనే భరోసా

ఎక్కడిది? ఈ ఆకురాళ్ళ నునుపుదనం
ఏ కుండలోనివి?
ఈ పున్నీళ్ళ చల్లదనం

వీథులతో పాదాల కోలాటం
బద్దలయ్యే నిశ్శబ్దంలో
ఆలీవ్ గ్రీన్ నాలో - నాలోనే
ఏరై నిండుగా ప్రవహిస్తున్నట్టుగుంది

ఎన్నో ఏళ్ళ తర్వాత
ఎర్రెర్రని పిప్పరమెంటు బిళ్ళ
మళ్ళీ నా భుజం తట్టి
అలయ్ బలయ్ చెప్పినట్టుగుంది

ముక్కలు ముక్కలుగా ధ్వంసమయ్యే నన్ను నేను
అడ్డుకునే క్రమమేదో
ఇపుడే మొదలయినట్టుగుంది

విరగ గాచిన మట్టిపూలు
చెమట నేచిన పాటను
మా ఊరి జరీ మగ్గాలపై అల్లికేయించాలి
పోగొట్టుకున్న చోటే నన్ను నేను
గబ గబ వెతుకులాడాలి.

ఎవరి చాయ్ అమ్మేవాడివి నువ్వు?

- బ్రజ్ రంజన్ మణి

చాయ్ అమ్మేవాడినని ఎందుకు చెప్పుకుంటావు
మాటమాటకూ నాటకం ఎందుకు ఆడుతావు
చాయ్ అమ్మేవాళ్ళను ఎందుకు అవమానిస్తావు
ఉన్నదేదో ఉన్నట్టు చెప్పు ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?

బొటనవేలికి నెత్తురంటించుకుని వీరయోధుడివవుతావా
కార్పొరేట్ మాఫియాల దగ్గర కానుకలు సంపాదిస్తావా
అంబానీ-అదానీ ల దళారీతనమే అభివృద్ధి అంటావా
అరే బద్మాష్ చెప్పు ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?

అణువణువునా హిందూ మతోన్మాద కపటత్వం
వర్ణాశ్రమ ధర్మంతో కులంతో ఉప్పొంగే గుండెలు
పూలే పెరియార్ అంబేద్కర్ల పేరు చెపితే పరుగు
ఓ ఒబిసి శిఖండి, ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?

మసీదులూ చర్చిలూ కూల్చి దేశభక్తుడివవుతావు
నెత్తురుటేర్లు పారించి గడ్డం నిగారిస్తావు
మతం పేరిట అమాయకుల ఊచకోత కోస్తావు
ఓ దయ్యపు హింసోన్మాదీ
ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?
ధర్మపత్నిని తన్ని తగలేసి బ్రహ్మచారినంటావు
స్నేహితుడి కూతురిని వేధించడానికి వెనుకాడవు
నల్లటోపి, ఖాకీ చెడ్డీ నీ సిగ్గు కాపాడతాయనుకుంటావు
సిగ్గులేని వాడా, ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?

నీ దుర్మార్గాలకు నీ కెప్పటికీ పశ్చాత్తాపం లేదు
మనిషి కావడానికి ప్రయత్నమే లేదు
నిష్కారణంగా చాయ్ వాలాలను అవమానిస్తావు
దగాకోరూ చెప్పు, ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?

చాయ్ అమ్మేవాడినని ఎందుకు చెప్పుకుంటావు
మాటమాటకూ నాటకం ఎందుకు ఆడుతావు
చాయ్ అమ్మేవాళ్ళను ఎందుకు అవమానిస్తావు
ఉన్నదేదో ఉన్నట్టు చెప్పు, ఎవరి చాయ్ అమ్ముతావు నువ్వు?
(ఈ కవిత http://www.countercurrents.org మీద 29 డిసెంబర్, 2013న అచ్చయింది)

ఆహ్వాన గీతిక

- ఎన్. వెంకటేశ్వర్లు

నెత్తురోడిన పచ్చనాకు
నగర నినాదమయింది
లక్షల అక్షరాలు
ఒక్క గొంతుకై కదిలాయి
జలపాతం దూకినట్టు దరువు
ఫినిక్స్ పడి లేచినట్టు అడుగులు

రేలపాట చలిమంటై కాచినట్టు జ్ఞాపకాలు
ఈ రోజెందుకో ఆకాశం ఎరుపు
అమరుల త్యాగ సంతకంగా ఉంది
పొద్దుబోకనే గోరుకొయ్య
నెలపొడుపును నెట్టుకొని వస్తుంది

కన్ను మిన్నూ కలగలిసిన రేపటి ఉదయావిష్కరణ
ఒట్టి చేతులతో ఈ నేల మీద
రండి
శాంతి కోసం యుద్ధం చేద్దాం!
నిద్రలోనో నిర్లిప్తతలోనో నిర్వేతుకంగానో కాదు
అడవులు కలబడేది పర్వతంగా నిలబడేది

నంజుకు తినే నవ నాగరికతలతో నువ్వూ నేనూ
నగరాల నాలుకలపై పెచ్చులూడుతున్న పల్లెలు
వసంతాలు వీస్తున్న వన జాతరకు పోదాం! రండిక!
జనతన ప్రవాహ కరస్పర్శ కోసం కదులుదాం!

కలల కాన్వాసుపై రాలిపోయే నేస్తమా! రా!!
యుద్ధం అంటే చిగురించడం! యుద్ధం అంటే రేపటి వాగ్దానం!
అక్షరంగానో ఆయుధంగానో ఆలోచనగానో ఆవేశంగానో
అందుకో! అడవిమల్లె ఆహ్వానగీతిక!

ఏదో పోయేకాల మొచ్చింది

- నాగేశ్వర్

ఏదో పోయేకాలమొచ్చింది
పల్లెలిడిచి దొరలు పట్నం పరుగెత్తినట్లుగానే
ఎవరో పోయే కాలమే వచ్చింది

మళ్ళీ మా ఓరుగల్లు వాకిళ్ళనిండా
సంకురాతిరి రంగవల్లులు
ఎర్రగా పిడికిళ్ళెత్తినట్లుగానే ఉంది

బట్టుపల్లి పైడిపల్లి తరాలపల్లి
నగర శివారు పల్లెలన్నీ
ఏదో రహస్యంగా మాట్లాడుకుంటున్నట్లుగానే ఉంది

కాలేజి గదుల్లో
యూనివర్సిటి క్యాంపసుల్లో
దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకారి
ఎవరో తిరుగుతున్నట్లుగానే ఉంది

అంబేద్కర్ భవన్ నుండి
ఆర్ట్స్ కాలేజి ఆడిటోరియం దాక
నడిసొచ్చిన దివిటీలన్నీ
గిరాయిపల్లి జాడలు వెతుకుతున్నట్లుగానే ఉంది

కాకతీయుల కోట మీద
సుత్తీ కొడవలి ఎత్తిపట్టినట్లుగానే ఉంది
ఎక్కడికక్కడ రైతుకూలీ సభలు

కొడవళ్ళకు పదును పెటుతున్నట్లుగానే ఉంది

మొగిలిచర్ల
మళ్ళీ పురుడు పోసుకుంటున్నట్లుగానే ఉంది
జనం కంట్లో
ప్రజల సర్కార్ ఆవిష్కరించుకుంటున్నట్లుగానే ఉంది

ఏదో పోయే కాలమొచ్చింది
ఎవరో పోయే కాలమే వచ్చింది
ప్రజల్ని పట్టి పీడిస్తోన్న పెట్టుబడి జలగ
చావుకోసం
తావు వెతుకులాటలో పడ్డట్టుగానే ఉంది

పునాది

- శాఖమూరి రవి

అతడు విరసం సభలకు రాలేకపోవచ్చు
రెండు రోజుల సమయం వెచ్చించలేకపోవచ్చు
రెక్కాడితేకానీ, డొక్కాడనివాడు
ఇదిగో నా రెక్కల కష్టం రెండొందల విరాళమని
మొక్క కంకి గింజల్లో తూటాల కలగన్నాడు
కాడే, ఖచ్చితంగా వాడు వాడే...

అతడు విరసం జెండా ఎత్తిపట్టి
మాతోపాటు రాస్తామీద ర్యాలీగా నడవకపోవచ్చు
ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదమవ్వకపోవచ్చు
నిర్జీవమైన కొన్ని కట్టెలు మరికొన్ని బట్టలు అతని చేతిలో పెట్టాం
పొద్దస్తమానం వాటితో ఏం మాట్లాడిండో ఏమో
వాటి అణువణువునా
ఏ అమరుల జ్ఞాపకాల జీవధారను పొదివి పట్టిండో ఏమో
ఆ సంధ్యా సమయాన
కాగడాగా వెలిగిన క్షణం అమరుల తొవ్వజూపిండు
వాడే, ఖచ్చితంగా వాడు వాడే

అతడు సభావేదిక మీద ఆసీనుడు కాకపోవచ్చు
ఆ రెండు రోజుల సభల సారాంశాన్ని విప్పచెప్పకపోవచ్చు
వంటల్లో మాడి మసిగుడ్డయి
ఎంగిలిస్తార్లు ఏరేసే చేతులయ్యి
జలజల కారే చెమట ధారయ్యి
సలసల కాగే నీళ్ళలో
వడగాసిన బియ్యాన్ని తుకతుక ఉడికించి
ఆకలి పేగుల నిండా అన్నం మెతుకయ్యిండు
నిజం, వాడు వాడే
ఖచ్చితంగా ప్రజాయుద్ధ పునాది వాడే!

విప్లవ విజయ ద్వారానికి కవాతు

- భూసారం శివన్న

నేను పులులను, సింహాలనూ ప్రేమిస్తాను
ప్రేమించడమే కాదు ఆరాధిస్తాను కూడా

చారల గాడిదలన్నా, మచ్చల జింకలన్నా
నాకు భలే చిన్న చూపు
చిన్న చూపే కాదు, ఏవగింపు కూడా

భజన చేయడమన్నా స్తోత్ర పొగడ్తలన్నా
నాకు కడు మక్కువ
మక్కువే కాదు, విందు భోజనమంత పసందు

ఎదురు చెప్పే
నిలబడి ప్రశ్నించే లక్షణం
అబ్బ! సహించలేను, నేను భరించలేను

సింహాలు, పులులూ పాలించే క్రమం
మేకలు మే,మే అంటూ చొంగలు కార్చే క్రమం
భయపడుతూ బెక బెక లాడే క్రమం
చీమలు పుట్టలు కోల్పోయే క్రమం నాయనా
విధి లిఖితం! నియమ నిబద్ధం! అవునా

మెత్తటి కుందేళ్ళ నేల పుట్టించెను పరమాత్మ?
పంజా విసురుటకా?
రక్తం జుర్రుకొనుటకా?
రాజ్యమేలుటకా?
బీభత్సం సృష్టించుటకా?
కాదు కదా!
పరులకు పసందైన పలహార మౌటకే కదా!
అది సృష్టి నియమమే కదా!

ఆకాశం వర్షిస్తుంది
భూమి పండిస్తుంది...ఔనా...మరి...
భూమి వర్షిస్తుందా?
ఆకాశం పండిస్తుందా?
లేదు కదా!
అలా జరగదు కదా!
ఏం? ఎందుకని?
ఎందుకనా-
అది భగవంతుని నియమం కదా?
జగన్నాటకం కదా?
కాదనుటకు ఎవ్వరం? మనమెవ్వరం?

అందుకే-

తలవంచుకు నడవాలి
తలదించుకు బతకాలి
బతుకుతూ ఎదగాలి
ఎదుగుతూ చావాలి

ప్రశ్నించుటకా...భగవానుడు
మనల నీ లోకమునకు పంపినది?
కాదు కదా-
మనుగడ సాగించుటకు
ఉన్నది ఉన్నట్లు కొనసాగించుటకు
అందుకే కదా!
అంతర్యామి..
మనల నీ లోకమునకు రప్పించినది
కాదనలేని దైవాజ్ఞ కదా ఇది!

అందుకే
చేయవలె కవాతు
తల వంచుకు - తల దించుకు
లెఫ్ట్ - రైట్ - లెఫ్ట్
అదీ వరస నడువ్
నడుస్తూ పో...కవాతు చేస్తూ పో...

తడబడకు...తల ఎత్తకు...
అది ఏమిటి? ఇది ఎందుకు? అనబోకు
పొరపాటున ప్రశ్నించకు
ఉన్నది ఉన్నట్లే లేనిది లేనట్లే
ఉన్నది పోవాలని
లేనిది కావాలని...రావాలని...
గొంతెత్తకు...ఘోషించకు..
పిడికలెత్తి నినదించకు-
గాడితప్పి నరకానికి చేరుకోకు-
నిప్పుల గుండంలో మాడి మసైపోకు- అందుకే-

లెఫ్ట్ - రైట్ - లెఫ్ట్
తల వంచుకు తల దించుకు
నడు నడు నడుస్తూ పో...కవాతు చేస్తూ పో...
స్వర్గ ద్వారానికి చేరుకో
నిప్పుల నరకాన్ని తప్పించుకో
ఆహా! అదా నీ సంగతి
ఒహోం ఒహోం అని
మొయ్యాలా నీ పల్లకి
కండ్లకు గంతలు
మెదడుకు మురికి
చీకటి దోపిడి బతుకు
ఇదేగా నువ్ ప్రవచించే
స్వర్గ ద్వారపు కవాతు
ఇదిగో ఇప్పుడు చూడు
విసిరి పారేస్తున్నాను
తుత్తినియలు చేస్తున్నాను నీ పల్లకి
నీ కళ్ళకు గురి చూసి
తూటా గుళ్ళను
కురిపించే నా కవాతు
విచ్చుకుంటున్న నూతన సూర్యోదయంలోనికి
క్రాంతికారీ జనతన సర్కార్ ఆవరణంలోనికి
లెఫ్ట్-రైట్-లెఫ్ట్
లెఫ్ట్-రైట్-లెఫ్ట్
గుండెనిండా విప్లవ ఆశయాన్ని నింపుకు
తలదించని నా కవాతు
ఆయుధమొదలని నా కవాతు
విప్లవ విజయ ద్వారానికే నా కవాతు-

పలకరిస్తామా?

- రివేరా

ఏం కావాలి?
అతడు అడుగుతున్నాడు
టప్పున మూసుకున్న
కిటికీ రెక్క సందుల్లోంచి
చూసిన నగరం
తటిల్లతలా రెక్కలు విప్పుకొని
ఎదుట నిలిచింది
ఇంకెం అడగను?

ఎవరు కావాలి?
ఆమె అడుగుతున్నది
గాయం చుట్టూ పేరుకున్న
ఊరూపేరూ లేని జ్ఞాపకాలను
తడుముకుంటున్న నగరం
ఎడద దాటని ప్రేమలేఖలోని
అక్షరాల్లా అల్లుకుపోతున్నది
ఇంకెవరు కావాలి?

ఈ రస్తా..!
ఆ డ్రైవర్ ఎటో వేలు చూపిస్తున్నాడు
సరిహద్దుల్లో నిలబెట్టి
ప్రాణవాయువుని బంధించిన క్షణాలు
గుర్తొచ్చినప్పుడల్లా
అదురుపాటుతో, గగుర్పాటుతో
మేల్కొనే నగరం
క్రీనీడల కన్నుదాటి
ఊరేగింపులో కలిసింది
ఇకనీ దారి ఎటుపోతేనేమీ?

ఇక్కడే పట్టుకొని..!
గుట్టలు చెబుతున్నాయి

లోతులకు పోయిన కళ్లలో
కదలాడుతున్న పొడి మబ్బులా
నగరం మాటని కూడదీసుకుంటున్నది
ఇంకెప్పుడు పలకరిస్తామో?

గడ్డిపోచ

- వంగాల సంపత్‌రెడ్డి

ఆకులురాలాయి
కొమ్మలు విరిగాయి
చెట్లు మోడువారాయి
ఇంకేముంది?
అబద్ధాలు! ఎన్ని అబద్ధాలు!!

ఓరుగల్లు వీథుల్లో కాగడాల జాతరా?
పీడిత దుఃఖ ప్రజల కవాతా?
కోయిల వసంతగానమా?
అంతాగతం!
ఎన్ని అబద్ధాలు! ఎన్ని అబద్ధాలు!!

ఓరుగల్లు వీథుల్లో
మళ్ళీ
నక్సల్బరీ వసంతమేఘ గర్జనా?
నవ్వొస్తుంది
అబద్ధానికైనా హద్దుంటుంది

అబద్ధాల పునాదిమీద నిలబడ్డవాడా!
భూమ్మీద నిలబడి మాట్లాడితేకదా! నీకు తెల్సేది-
పిచ్చివాడ!
పోరాటాలకు మరణమా?!
వెనుకడుగు వేయడమంటే లొంగిపోవడమా?!

నక్సల్బరీ
విత్తన గర్భాన్ని చీల్చుకొని
పైకి లేచిన యుద్ధం!
మదగజాన్ని బంధించే గడ్డిపోచ!!

కేడా మావయి కూకూ...

- అన్నవరం దేవేందర్

దట్టమైన అరణ్యం
పాపెట తీసినట్టు సవ్వడిగా సడక్
కండ్లకు ఇంపైన వనంల కెల్లి
రువ్వడి రువ్వడిగా యానం

గడీల మెడలు ఇరికి
కలెబడి నిలబడిన గడ్డమీంచి
మొదలైంది ప్రయాణం

ప్రవాహ గోదావరి దాటంగనే
అడవితో ఆత్మీయ అలయ్ బలయ్
దారికిరువైపులా చెట్లకు నెత్తుటి పూలు
అమరత్వపు జ్ఞాపకాల నయనాలు

ఎన్ని చెట్ల కొమ్మలు రెమ్మలు
ఎన్నెన్ని నెత్తుటి మరకలు అంటిచ్చుకున్నవో!
ఏ నేల కడుపుల
ఎన్నెన్ని మందు పాతరలు దాపెట్టుకున్నదో

ఏ తల్లి కన్నబిడ్డలో వాళ్లు
ఎన్నెన్ని గుడిసెలల్ల దీపం అయినంద్రో

ఆ త్యాగాల సంగతి వేటగాళ్ళ సంగతి
ఈ నెర్రెంగలకు మద్ది మానులకూ ఎరికే
నెత్తురు కలెగల్సిన బర్రెలకూ ఎరికే

పల్లె పల్లెనా ఎండ పొడకు
మెరిసిపోతున్న స్థూపాల సూర్యులు
మొగులు మీదికి ఎదిగిన ఆ శిలల్లోంచి
నినాదాల గుసగుసలు

కరీంనగర్ ఆదిలాబాద్ పొడుగుతా
పచ్చటి అడవి ఎచ్చటి పరిమళం

కెరిమెరి కొండలు దాటితే
జొడెన్‌ఘాట్ పొద్దు పొడుపు
కొమురం భీం యుద్ధం చేసిన జాగ
విముక్తి గీతం పాడిన తుడుం
ఆ పన్నెండు పల్లెల నుంచి
పరివ్యాప్తం అవుతున్న పాటల ఊటలు

కేడా మావయి కూకూ
బీడు మావయి కూకూ
గొండు రాజ్యం కూకూ
సచ్చుల దేశం కూకూ
మైసి వాకట్ కూకూ

అడవి నరికె భూమిని పొందిస్తే
పంట పండే యాల్లకు జంగ్లాతోని రుబాబు
తాపతాపకూ ఇదే యాతన
గొండ్లు కొలాములు పరధానులు ఒక్కటై
దళం కట్టి మర్లపడ్డ నేల తిరగబడ్డ గొడ్డండ్లు
మన ఊళ్లో మన రాజ్యం మన జెండా
జంగ్లాతోడెవ్వడు... నైజామోడెవ్వడు!

బాబేఝరి కల్లెగాం అంకుసాపూర్
పాటగూడ క్యాల్‌బడి టైకన్‌మోవాడ్
గూడాలన్నీ ఆయుధాలు నూరి నప్పుడు

నల్లమద్ది తెల్లమద్ది టేకుమానులన్నీ
కొండ గోగుల తావులో కల్సిపోయిన నేస్తాలు
తుడుం మోత గుట్ట గుట్టకూ ధనిస్తుంది

అగో! ఆ జొన్న చేను పక్క పొన్న
సాహు నడిచిన కాళ్ళ అచ్చులు

పోరాటం తరతరాల వారసత్వం
పోరాటం గుస్సాడి దండరి నృత్యం
పోరాటం పోరకల సాళ్లు నేర్పిన
గురి తప్పని బాణం

కూకూ... కూకూ... తూటు కొమ్ము స్వరం
డిందర... డిందర... ఢిం... తుడుందెబ్బమోత
జల్ జంగల్ జమీన్ లడాయి
రగల్ జెండా రగులుతూనే ఉన్నది

వెయ్యి ఊడల మర్రి
రాంజీగొండు ఉరికంబం నుంచి
జోడెఘాటు పటారు మీద
భీము దాదా అమరత్వం దనుక

ఇంద్రవెల్లికెల్లి ఇంద్రావతి మీదుగ
ఎగబడే పోరాటం
తీగలు తీగలుగా ఎగబాకుతున్నది

లొద్దుల్లో దండుకట్టిన గొర్రెంకలు
బోరుమీద కొట్లాడుతున్న గుడ్డేలుగులు
ఆదివాసుల ప్రాకృతిక జీవనవైవిధ్యం

అడవి సందర్శనే ఎద నిండిన ఆనందం
అరణ్య ప్రయాణం సృజనాత్మక సమయం

('సాహితీ సోపతి' బృందం ఒకరోజు కరీంనగర్ నుంచి
జోడేఘాట్, ఇంద్రవెల్లి తిరిగొచ్చిన సందర్భం)

ఆహ్వానం

- టి.రామ్మోహన రావు

వాడు తినే పంచభక్ష్య పరామన్నాలు చూసి
నీ కడుపు మండకుండేందుకే
వాడు నీకు చవక బియ్యమో ఉచిత బియ్యమో
భిక్షలా ఇస్తానంటాడు
వాడు నివశించే ఆకాశహర్మ్యాలను చూసి
నీ గుండె రగలకుండేందుకే
వాడు నీకు పందుల గుడిసెల్లాంటి గృహాలను
ఉచితంగా నిర్మించి ఇస్తానంటాడు
వాడు దోచుకుంటున్న లక్షల కోట్లు చూసి
కన్నెర్ర జేసి నువ్వు గద్దించకుండా
నీకు రుణమాఫీలు, రాయితీలు ప్రకటిస్తానంటాడు
వాడు పొందుతున్న ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని చూసి
గుండెలే బాదుకుని నువ్వు ప్రశ్నించకుండా
ఆరోగ్యశ్రీ మాటున
కార్పొరేట్ వైద్యానికి కాపు కాస్తాడు
విద్యను వ్యాపారం చేస్తున్న
కార్పొరేట్ విద్యారంగాన్ని బతికించడానికే
నీకు ఫీజు రీఎంబర్స్‌మెంట్లు ప్రకటిస్తాడు
తన వారసత్వ రాజకీయాలను
నువ్వు నిలదీసి అడగకుండా
రాజకీయ రిజర్వేషన్ల పేరుతో
నీకు రెండు ఎంగిలిమెతుకులు విదిలిస్తాడు
అడుగడుగునా వాడి దోపిడీకి
నువ్వు అడ్డు తగలకుండా
పథకాల ప్రలోభాలతో నిన్ను జోకొడతాడు
ఇంకా ఎన్నాళ్ళని? ఎన్నేళ్ళని?
ఎన్ని తరాలని? ఎన్ని యుగాలని?
దాతలా ఫోజు పెడుతూ వాడు.....
యాచకునిలా దీనంగా చేయి చాచి నీవు......
ఇంకానా? ఇకపై చెల్లదంటూ
శ్రమ శక్తిని ధారపోసి నువ్వు సృష్టించిన ఈ సంపదలో
నీ న్యాయమైన వాటా కోసం
సామాజిక మార్పు అజెండాగా
సర్వసమతా సమోద్ధరణ లక్ష్యంగా
దీక్షా కంకణధారివై
సుదృఢ సంకల్పంతో
సాహసివై సాయుధుడవై
చేయి చేయి కలిపి పోరాడేందుకు
యోధుడవై కదలి రా!

నీ ఆశయాన్ని సాధిస్తాం!

- లాంఛర్

మార్క్సిజాన్నే ఆలంబనగా చేసుకుని
ఈ వ్యవస్థనే సవాలు చేస్తూ
మహోద్యమాలకు అజ్యం పోసిన
మహా వృక్షమా.....గంటి ప్రసాదమా!
దుర్మార్గమైన నయా దళారీ గాళ్ళ
కార్పొరేట్ కోరలు చాచిన ఈ దోపిడిదార్ల రాజ్యం
నిరాయుధుడైన నిన్ను ఎస్ఐబి పోలీసు మూకలతో

నడిరోడ్డు మీద హత్య గావించి
మురిసిపోతున్నారు కదూ పాలకులు
కడలిని బంధిచామని కల కంటున్నారు కదూ
నిప్పుల కుంపటి మీద సాగుతున్న క్రూర మార్కుల పాలన
మానవ జాతి మనుగడని అగమ్య గోచరం చేసి
రేపటి మీద ఆశలేని బతుకులీడుస్తున్న
వైనాన్ని మర్చిపోతారనుకుంటున్న కదూ
నిరంకుశ బూర్జువాలు!
భూపటలం మీద ప్రకృతి వనరులను
కొల్లగొట్టిన సామ్రాజ్యవాదులు
నదీజలాలను వ్యర్థాలతో కలుషితం చేసి
ఇంధన ఖనిజ వనరుల కోసం
భూగోళాన్ని తొడేసి, పర్యావరణ ఉత్పాతాలతో
ఆకాశాన్ని తూట్లు పొడిచి భూతాపం వాస్తవాలు
మాసిపోతాయని చప్పట్లు కొడుతున్నారు కదూ
సామ్రాజ్యవాదులు
నీవు అందించిన చైతన్యంతో శ్రమజీవుల స్వేచ్ఛ కోసం
ఆదివాసుల హక్కుల కోసం పోరాడమని ఉత్తేజపరిచినప్పుడు
ఎంతో ఉదాత్తమైనదిగానూ, జీవిత ప్రేరకంగానూ
అద్భుతమైన సహజీవనం గానూ
తొణికిసలాడిన కార్మిక, కర్షక
మానవీయ సమాజ నెలకొల్పు
ఆగిపోంతుందని రంకెలేస్తున్నారు కదూ
తలారీ వ్యవస్థ తాబేదార్లు!

ప్రజలారా
అదిగదిగో అటుచూడండి
వారికి గోరీ కట్టే రోజులు రానే వస్తున్నాయి
ఖండ ఖండాంతరాలు కార్మికలోకం కళ్ళు తెరుస్తోంది
నగరాలు విద్యార్థి యువజన లోకం
కలం పట్టి గళం విప్పింది
కర్షక లోకం బరిసె పట్టింది
ఎన్నో గాయాలతో బరువెక్కిన హృదయాన్ని
అదిమి పట్టుకుని ఒక చేత తుపాకీ పట్టుకుని
మరో చేత ఎర్రచేత పట్టుకుని
ప్రజా గెరిల్లా సైన్యాలు బరిగీసి శత్రువుతో
యుద్ధానికి సై అంటున్నాయి
అందరి కలయిక ఐక్యతే
మహా శక్తి అంటావా
ప్రపంచమంతా ఐక్యం చేస్తుంది
విప్లవకర మేధావి వర్గం
వీరుడా గంటి ప్రసాదమా
మేమంతా ఇక అదునుకై వేచి ఉంటాము
భౌతికంగా నిన్ను కోల్పోయినా
నీ ఆశయాన్ని గెలిపిస్తాము
నీ లక్ష్యాన్ని నిజం చేస్తూ
అంతిమంగా సోషలిజాన్ని
కమ్యూనిజాన్ని తప్పక సాధిస్తాము
అప్పటిదాకా అలసటలేని
ప్రజాయుద్ధంగా మునుముందుకు సాగుతాం!

పోరాడుతా

- తుంపాల శ్రీరామమూర్తి

ఆకలి ఆవేదనల్లో నేను
నిత్య బానిసగా ఎదిగాను
పట్టెడు మెతుకులు కరువైనా
పెత్తందార్ల ఖజానాలు నింపుతూ
ఎల్లప్పుడూ శ్రమిస్తూ ఉన్నాను
నేను సృష్టించిన దాన్ని
నేనే అనుభవించాలని ఆరాటపడితే
ఈ దోపిడి వర్గం నన్ను
జైల్లో పెట్టి గొంతు నులుముతుంటే
నా శ్రమ నిష్ప్రయోజనం
నా బతుకు బండబారింది
సెంటు భూమి పట్టా అరతావు కాగితం
కాని భూమి చూపించలేదు
ఇన్నాళ్ళు చచ్చినట్టు బతికాను
ఇప్పుడు బతకడం కోసం
దోపిడికి తలవంచే బదులు
కొన ఊపిరి ఉన్నంత దాకా
దోపిడి లేని సమాజం కొరకు
బందూకు అందుకొని పోరాడుతా
పోరుబాట పట్టమని
నా వర్గ ప్రజలను చైతన్యపరుస్తా

చితికిన ముక్కలు

- ఎస్.చిదంబర రెడ్డి

కరువు చితిమీద కట్టెలు చాలక
సగం కాలిన అనాథ శవం నా రాయలసీమ
ఇక్కడ రైతుగా జన్మించడమంటే
న్యాయశాస్త్రాన్ని వెక్కిరించే తీవ్రనేరం చేసి
శిక్షను ధారసత్వంగా
తదనంతర తరానికీ బదిలీ చేయడం
ఇక్కడ వ్యవసాయం చేయడమంటే
కలల కనుపాపల్ని నిరాశల రెప్పల్తో కప్పేసి
వెర్రితనాన్ని పిచ్చిగా తలకెత్తుకొని
పీర్ల గుండంలో అలావ్ అడుగేసే
ఆదికాలం మూకలై
మరణాన్ని వెతుక్కొంటూ అంచులదాకా వెళ్ళడం
గుడ్లన్నీ గుట్టుగా పాములు మింగేస్తే
అమాయకంగా ఆశగా ఖాళీ గంపలో

పొదుగతున్న కోడిపెట్టలవ్వడం
చిదిమేసిన దీపాలై చీకట్లో మగ్గుతూ
విటుల కసికాట్లు పడిన స్తనాలై
చీమూ నెత్తురూ కారుస్తూ
ఫ్యాక్షన్ బాంబులు కొరికేసిన వేళ్లై
గడ్డకట్టని రక్తాన్ని ఏడ్వడం
గతమంతా తిరగేసినా
ఆకలికి అక్కరకు రాని రతనాల మాటలేకాని
ధాన్యరాశుల ఊసులు ప్రబంధంలోనూ వినిపించవు
కష్ట జీవుల బతుకు చిత్రం ఏ
పద్యపాదంలోనూ కనిపించదు
వంశవృక్షాల పడగలు వటవృక్షాల ఊడలు
విజ్ఞాన ప్రమిదలార్పే కాషాయం కబుర్లడొల్లలు
ఇప్పుడిక్కడ మట్టి ప్రేమికుల్లేరు ఉన్నదంతా
విధిగా ఓట్ల భుజాల్తో నాయకుల్ని మోసే బోయీలే!
ఇప్పుడెక్కడా పల్లెల మూలాలూ పచ్చదనాలగుపించవు
ఉన్నవన్నీ మాటేసిన పార్టీలు నరికేసిన
మొక్కల గంధపు చెక్కలై
ఎక్కడికైనా వెళ్ళడానికి సిద్ధపడే చితికిన ముక్కలు

ఎరుపెక్కిస్తున్న ఉదయం

- గిన్నెరాజు

తొలిపొద్దు సంధ్యలలో
తొణికిసలాడుతూ
బక్కసిక్కిన డొక్కల
సెమట సుక్కల సేద్యంతో
సిరులు పండించినా
మూడుపూటల పస్తులుండే
వెట్టిబతుకుల పల్లెలన్నీ
రగులుకున్న మంటలోలె
దొరగడీల చుట్టుముట్టగ
మా జాగలో మాపాలనంటూ
కొమురంభీం కళ్ళలోంచి
అగ్గి కురిసి

కేస్లాపూర్ నాగోబాపై
రగల్ జెండానెత్తి
జగిత్యాల జైత్రయాత్ర జంగ్ సైరన్‌తో
సిరిసిల్లా రైతు పాదాల ముద్దాడుతూ
పోరుబాటనే బతుకు బాటగా చూపి
బందగీ, అయిలమ్మ, దొడ్డి కోమురన్నల
త్యాగాల ధారల్లో తడిసి మొలకెత్తిన
ప్రజాయుద్ధ శిబిరంలో నెత్తురోడుతూ
గుండెగుండెను గెరిల్లా కొండలుగా మలిచి
దోపిడి పీడనల విముక్తి కోసం
అలుపెరుగని పోరు ప్రవాహమై
నాడు
నెహ్రూ నేర చరిత్రలోంచి
అవతరించిన ఆంధ్ర పుట్టగొడుగులకు
నిలువ నీడినిచ్చి
నిలువెల్లా దగా పడుతూ
కళ్ళెదుటే రాలుతున్న పోరుమల్లెల
చూసి
తల్లడిల్లిన నా తెలంగాణ
నేడు
తెగదెంపుల సంగ్రామంలో
తెగింపే ఒక ఆయుధమవ్వగ
ఆధిపత్య భావాలకు గోతులు తీస్తూ
పెట్టుబడికి పుట్టిన కుట్రలకు
కన్నెర్ర జేస్తూ
సత్యవాణీల అసత్య రాగాల నడుమ
నిలబడి
బతుకచ్చినోడె ఇంకా తన బతుకులో
కుంపటవుతానంటే
నిప్పులు కక్కుతూ వలసవాది పాలనకు
చరమ గీతాలాపన చేస్తుంది
అరవై ఏండ్ల కల సాకారమవుతుండగా
అడ్డుతగిలే కుట్రాజకీయాల్లోంచి
ప్రజాస్వామిక ఆకాంక్షలకు
ప్రాణం పోస్తూ
ప్రజా తెలంగాణగా వికసిస్తుంది
భూమి, భుక్తి, విముక్తి కోసం
చల్లారని విప్లవాగ్నులను
మహా జ్వాలలుగా మలుస్తూ
తిరిగొచ్చిన వసంతకాల
మేఘమై గర్జిస్తుంది
దగాపడ్డ బతుకుల్లో
నూతనోత్తేజమై
పల్లెపల్లెను ఎరుపెక్కిస్తూ
ఉదయిస్తుంది
పచ్చని బతుకులను
వాగ్దానం చేస్తుంది
పచ్చని బతుకులను
వాగ్దానం చేస్తుంది

నిన్ను వెతుక్కుంటూ

- బిటూ

నీ స్వచ్ఛతని అద్దుకున్న కాయితాన్నీ
నీ లోచనల పదునును నూరుకున్న కలాన్నీ
నీ రక్తపు వేడిని ప్రసరించే సిరానీ
నీ స్నేహ పరిమళాల్ని వెదజల్లే అక్షర సుమాల్నీ
పోగేసుకోలేని ఓ అశక్త ప్రయత్నం

నీవు కలిశావు
అప్పుడు నేనో దుఃఖపు నిండుకుండని
నీ మేధోరూపం కల్గించిన దూరపు అనుభూతిని
నీ సున్నితత్వంతో
ఒక్కో రోజుకూ, ఒక్కో గంటకూ
ఒక్కో నిమిషానికీ, ఒక్కో క్షణానికీ
వేగవేగంగా తగ్గించేసుకుంటూ
నేను కప్పుకున్న ఒక్కో కాఠిన్యపు పొరనూ నిర్లక్ష్యం చేసేస్తూ
పసిపాపలాంటి బెరుకులేనితనంతో
నాలో తిష్టవేసుకున్న నిన్ను
పొమ్మనడం పిచ్చితనం
ఉంచేసుకోవడం ఒక ఉత్సాహపు కెరటం
గొప్ప స్నేహాన్ని సాధించుకోవడం
ఇంత గర్వాన్నిస్తుందేం?!
జ్ఞానాన్ని పంచుకోవడం
ఇన్ని కవాటాల్ని తెరిచేస్తుందే?!
ఆప్యాయపు లేఖలు
నిన్నో దూదిపింజను చేసేస్తయేం?
నీవు లేవు
ఇప్పుడు నేనో తొణికిన మేఘాన్ని
'అపరిచిత' లాంటి అంతూ దరీలేని స్కూలుపిల్ల దుఃఖాన్ని
నాకిక వేరే మార్గం లేదు
ఒక్కో స్నేహపు అంతరంగాన్నీ విప్పుకుంటూ
నీదాకా
నీలోకి ప్రయాణం చేయాల్సిందే
నాకిక వేరే ఓదార్పు లేదు
చీమలా ఒక్కో జ్ఞాపకపు గింజను పోగేసుకుంటూ
మోహనూ నేను మా 'బుదుగు'కి 'ఒక తల్లులం' కావాల్సిందే
తెలుసా కామ్రేడ్?
నీ స్నేహాన్ని అంటించుకున్న వాళ్ళెవరూ
ఇంకా వాస్తవం వాక్సిన్‌ను వేసుకోనేలేదు
తల్లి చేతిలో మొదట దెబ్బ తిన్న పిల్లవాడి
ఆశ్చర్యపు గాయం ఇంకా వాళ్ళ కళ్ళల్లో
మాటలూ, మౌనమూ, మాటలూ
'ఎంతటి వైవిధ్యం గల సామర్థ్యాలు?'
'మరి వాటి వెనక అతని కష్టమో'
'మళ్ళీ ఏమీ కనబడనివ్వని నమ్రతా ఎంతనీ'
'సూటియైన విమర్శలు'
'ప్రజాస్వామ్యపు అంతఃసారమే'
'వాటి వెనుక గల ప్రజల ప్రయోజనాలు
అర్థమయ్యే ఉంటాయి'
మాటలూ, మౌనమూ, మాటలూ....
ఓ గాఢానుభూతిని పట్టుకునే పోటీలో
కామ్రేడ్!
నీ నవ్వునీ
నవ్వుతూనే అలా భుజమ్మీద చెయ్యేసి
నీతోపాటు తీసుకునోయిన మమ్మల్నీ
అమరులకై నీ కన్నీటినీ
మా కన్నీటిని తుడిచేయాలనుకున్న నీ పట్టింపునీ
పిజిపి కవాతుకై
ముందుగానే నీవు చేయించిన సాధననీ
'కమ్యూనికేషన్'ని మన కామ్రేడ్స్‌కు
కమ్యూనికేట్ చేయాలనే నీ తపననీ
ఇంకా ఎన్నిటినీ, ఎన్నిటినో
ఒక్క మాటలో
తరగని గనిలో నీలో మూర్తీభవించిన
కార్మికవర్గ కామ్రేడ్‌షిప్‌ని
ఒక్కొక్కరుగా
అందరం ఒకరిగా
తోడి తోడి అపురూపంగా గోరుముద్దల్లా అందించుకుంటుంటే
ఒక పరిపూర్ణ సత్యాన్ని చేరుకుంటున్న అనుభూతి!
ఔను కామ్రేడ్!
నీ గురించి అన్వేషించడమంటే
మానవుల వెలుతురు కోణాల్ని కొన్నిటిని ఆవిష్కరించుకోడమే
అంతటా నిలువెత్తు ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకోడమే
లక్ష్యాన్ని చేరుకోవాలంటే
ఒకోసారి ప్రయాణమూ లక్ష్యమౌతుందేమో?
నీలోని విలువల్ని వెదజల్లడానికై
నీ లోలోపలకి నా ప్రయాణమూ నిరంతరంగా....
(ఎప్పట్లాగే నవీన్‌కి ఆప్యాయంగా)

నాన్న ఆశయం

- జమీన్

నాన్నెపుడు వస్తాడు?
ఎన్ని సార్లు అడిగినా
ఆ చిన్నారి మదిలో తరగని ప్రశ్న అది
ఇదిగో వచ్చేస్తాడు
నువ్వల్లరి చేయకుండా ఉన్నావంటే
ఈ ఒక్క ముద్ద తిన్నావంటే
బుద్ధిగా బడికెళ్ళి చదువుకున్నావంటే...
అమ్మ మదిలో నిత్యమూ చిగురించే ఆశ జవాబయ్యేది
వస్తాడు
నాన్న వస్తాడు
ముద్దుగా పలకరిస్తాడు
ప్రేమగా తల నిమురుతాడు
ఆర్తిగా అక్కున చేర్చుకుంటాడు
ఆ చిన్నారి ఎదురుచూపులు దిగంతాలను తాకేవి
నాన్న వచ్చాడు ఎర్రని స్థూపమై
పలుకరించాడు పోరుపాటై
తలనిమిరాడు తూర్పు పవనమై
అక్కున చేర్చుకున్నాడు అశేష జనవాహినై
నాన్న వేలుపట్టుకుని ఊరంతా తిరగాలి
మా నాన్న అంటూ నేస్తాలందరికీ గర్వంగా చూపాలి

ఆ చిన్నరి ముచ్చట తీరనిదేం కాలేదు
నాన్న ఎత్తిన జెండా పట్టుకొని ఊరంతాతిరిగింది
మా నాన్న అంటూ ఆ జెండానే చూపింది
ఆ ముచ్చట ముచ్చటగానే ముగిసిపోలేదు
ఆ ముచ్చట కర్తవ్యమై ఎదిగింది
ఇప్పుడామె నాన్న ఎత్తిన తుపాకీతో సాయుధమైంది
నాన్న నమ్మిన సిద్ధాంతంతో ప్రపంచాన్ని చూస్తోంది
నాన్న మిగిల్చిన ఆశయాన్ని కొనసాగిస్తోంది

అతనొక 'సామాన్య' ఉపాధ్యాయుడు!

- సహచరి

అతను అందరి లాంటివాడు కాదు
అందరిలా ఆలోచించేవాడు కాదు
అందరినీ ఆలోచింపచేసేవాడు
జీవితమంటే భార్యాపిల్లలు
ఉద్యోగమంటే ఇంక్రిమెంట్లు
ప్రమోషన్లు టిఏ డిఏలు కాదని
చదువులంటే ముఖాలకు ర్యాంకులు
కొలువులంటే డాలర్ డ్రీమ్స్ కాదని
చదివిన జ్ఞానాన్ని సమాజానికివ్వడం
సమాజ విజ్ఞానాన్ని నలుగురికి పంచడం
నేర్చుకున్నవాడు నేర్పినోడు!
అతనెప్పుడు అందరు 'నాయకుల్లా'
ఎదిగినోడు కాదు
కాలే కడుపుల ఆర్తనాదాల్ని
పిడికిళ్ళలో బిగించిన చైతన్యంతో
పరిష్కారాల్ని వెజల్లినోడు
ఉపాధ్యాయ సంఘనేతల్లా
కార్లల్లో కార్యాలయాల చుట్టూ తిరిగినోడు కాదు
అధికారుల అక్రమాల్ని
ధర్నా శిబిరాల్లో ఎండగట్టినోడు
పాలకుల దుర్మార్గాల్ని
ప్రజావ్యతిరేక నిర్ణయాల్ని
ఆందోళనల్లో ఎలుగెత్తినోడు
తమ కడుపు నిండితే
చాలనుకునే వేతన శర్మ కాదు
జీతాలు పెండం కంటే
ధరలు దించమన్న
జనం గొంతుక అతడు
అతనొక 'సామాన్య' ఉపాధ్యాయుడు
కానీ అసమాన్య ప్రతిభా పాటవాలున్నోడు
బోధించడమంటే బాధించడం కాదని
విద్యార్థుల మస్తిష్కాల్ని రగిలించమన్నోడు
తెలుగు మాష్టార్లు భూమిని చుట్ట
చుట్టే కట్టు కథల్ని
సోషల్ టీచర్లకూ అర్థం కాని అర్థ శాస్త్రాన్ని
సైన్స్ టీచర్లకు బోధపడని డార్విన్ పరిణామాన్ని
విడమర్చి చెప్పన 'సామాన్య' ఉపాధ్యాయుడు
తరగతి గది అంటే సమాజమని
సమాజమే తన తరగతి గదిలా మార్చుకున్నోడు
చుట్టూ సమాజాన్ని తరగతి గదిలోకి
తరగతి భవిష్యత్తరాల్ని సమాజంలోకి
నడిపించినోడు అతను!
సైన్స్ నా మతం అన్న సివి రామన్‌లా
మత మూఢ విశ్వాసాల్ని విధ్వంసం చేసేది
శాస్త్రం అని విశ్వసించి ఆచరించినోడు
పేదరికానికి దోపిడికి మధ్య
పెట్టుబడి మిగులు శ్రమ దోపిడిని
విడమర్చి చెప్పిన రాజకీయార్థిక విశ్లేషకుడు
ఆయనొక సామాన్య ఉపాధ్యాయుడు
సామాజిక మార్పుకు చరిత్రను విశ్లేషించడం కాదు
చరిత్రను మార్చే కర్తవ్యాన్ని ప్రజాస్వామిక
తెలంగాణలో విస్తరించినవాడు
ఆయనెప్పుడు ఉత్తమ ఉపాధ్యాయ
అవార్డుల కోసమో ఎమ్మెల్సీ పదవుల కోసం
వెంపర్లాడిన వాడు కాదు సకల జనుల
ఆకాంక్షల్ని 'జనంగొంతుకై' నినదించినవాడు
ప్రజాస్వామిక తెలంగాణకై ప్రాణమిచ్చినోడు
అతనొక సామాన్య ఉపాధ్యాయుడు

తెలంగాణ వేగుచుక్క

- టేకుమాల్ విజయలక్ష్మన్

ఆదర్శ కమ్యూనిస్టు భూమన్నా
త్యాగధనుడవైతివా మా అన్న
పల్లె పల్లె తిరిగి ప్రజలను గలిసి
రణములో నీవు నిలిసినవన్న
విప్లవాల యుగం మనదే అన్నావు
విప్లమెన్నిటికి చావదన్నావు
నీ మరణం వృథాకాదు భూమన్న
నీ పోరు ఏనాటికి విడవబోమన్న
మనసు దెబ్బదింటె ఓడిపోతామని
జీవితాపుకప ఒక ఆటగ ఆడేస్తె
నీ మరణవార్త విన్న ఆ పల్లెతల్లి
కొడుకింక లేడాని కంట తడివెట్టింది
నీవు ఆడిపాడిన నేల ఎరుపెక్కుతున్నాది
నీ ఆశయాల జ్యోతి వెలుగుతఉన్నాది
ఉద్యమాలు ఊపిరివైనిలిసి
ప్రజాపోరులోన పోరుబాటలువేసి
ఎత్తిన జెండాను తుదవరకు దించక
దోపిడి పాలకుల తరిమికొట్టాలని
నీ కలల జ్యోతిని రక్షించుకుంటామూ
నీ వారసులం మేము బతికేవున్నామూ

విప్లవాల పురిటి గడ్డ

- బాలసాని రాజయ్య

ఇది విప్లవాల పురిటి గడ్డ
చైతన్య విత్తనాల కర్మాగారపు అడ్డ
శ్రీకాకుళంలో రగిలిన విప్లవం
వరంగల్ ఆర్.ఇ.సి.లో ఎగిసింది
కలాలను గళాలను గన్నులుగా గర్జించి
కారడవికి దారులు వేసింది
జల్ జంగల్ జమీన్ నినదమే
వసంత గర్జనకు పునాది
ఎత్తిన పిడికిలి దించనని
సమరానికి సై కొట్టిన నేల
నల్ల రేగడిలో రాలిన నెత్తురు చుక్కలు
ఎర్ర చెలకల్లో మొలచిన ఎర్రజెండాలు
రేపు ఎగిరే ఎర్ర జెండ రెపరెపల
కొసమే ఈ విప్లవ కవాతులు...

(విరసం 24వ మహాసభల సందర్భంగా...)

వ్యాపారమే స్వభావం

- ఆచంట ప్రసాద్

ఓట్ల వ్యాపారం దొంగ నోట్ల వ్యాపారం
సీట్ల వ్యాపారం అక్రమ కోట్ల వ్యాపారం
స్వాతంత్ర భారత విలక్షణ వ్యాపారం
స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య కలక్షన్ వ్యాపారం
పార్టీల అభ్యర్థుల కలెక్షన్ వ్యాపారం
కార్పరేట్ సంస్థల కలెక్షన్ వ్యాపారం
క్యాబినెట్ మంత్రుల సెలక్షన్ వ్యాపారం
లంచగొండి భారత ఎలక్షన్ వ్యాపారం

అమ్మ చిరునామా

- ఎస్.ఎస్.ఆర్.

బిక్కుచిక్కిన పిట్టల
రక్తమాంసాల విందులతో
తెగబలిసిన గద్దలతో
చావు బతుకుల పోరులో
అమ్మ ఒడి నుంచి
జారిపడి మతిచెడి
అలమటించి అంగలార్చి
దిగులు చెంది
దిక్కులన్నీ చెదదిరిగి
బెంగపడ్డ పిల్లపక్షిని
అమరుల త్యాగమే
అమ్మ గొంతుకై
'బిడ్డా!నేను లేని దెక్కడ?
నా కదలికలు కానరాని
ఎక్కడో నీ చూపులెందుకు
రాజ్యహింసల ధూళిలో
చెదిరిన నా అడుగుల జూసి
కలవరింతలెందుకు
పలవరింతలెందుకు
దండకారణ్యంలో
రాబందుల గుంపుకు
నిద్రలేకుండా చేస్తున్నా కదా!
కాకరాపల్లిలో చోర
విద్యుత్ శిఖామణులకు
కరెంట్ షాకులిస్తున్నా గదా!
ఛత్తీస్‌ఘడ్‌లో చావుకే
చావు భయం చూపించి
గ్రీన్‌హంట్ ఆకుపచ్చ వేటకే
నిద్రలేకుండా చేస్తున్నా గదా!
మధ్య భారతంలో క్రాంతికారీ
జనతన సర్కారునై
దోపిడీ సర్కారుతో
గావుకేకలేయిస్తున్నాగాదా!
బిడ్డా! నేను లేనిదెక్కడ
నేను ఎక్కడలేను
ఎవరిలో లేను
నేను నీలో లేనా!
బిడ్డా! భూమి కోసం భుక్తి కోసం
శ్రామిక వర్గ విముక్తి కోసం
నూతన ప్రజాస్వామిక
విప్లవం కోసం
నడిచే ప్రజాయుద్ధమే
నా అడుగుజాడలనుకో
ఆ అడుగుజాడల్లో
నీ అడుగులు కలిపితే
ఆక్రందన పెల్లుబికే
నీ చిరుగొంతుకే
రణభేరీ నాదమైతే
బిడ్డా! నేను నీలో ఉంటగానా!
ఆవేదన వెల్లువెత్తే
నీ సజల నేత్రాలే
విప్లవ దీపాలైతే
బిడ్డా! నేను నీలో ఉంటగానా!
కన్నీటి చెలమలే ఆవిరయి
నీ చిన్ని ఎద పోరు
సెగలెగచిమ్మితే

బిడ్డా! నేను నీలో ఉంటగానా!
బిడ్డా! నేను లేనిదెక్కడ?
కోట్లాది శ్రమజీవుల
ఆశ ఆలంబన
అడుగుజాడలే నువ్వయితే
బిడ్డా నేను నీలో లేనా?
అసలు నీవే నేను గానా!

ఆయుధాలను ఆభరణాలుగా అలంకరించుకోండి

- ఎన్. వెంకటయ్య

చలికి కుంచించుకుపోయిన
ఇరుకైన గల్లీ కాదు ఢిల్లీ!
దట్టమైన జనారణ్య కప్పుకున్న
దేశ రాజధాని నగరం నడిబొడ్డు!!
రాత్రి వయస్సు తొమ్మిది గంటలు
ఫ్లడ్ లైట్ల తెల్లని నురుగుల కాంతిలో
జలకాలు ఆడుతున్న ఢిల్లీ మహానగరం అది
ఢిల్లీ 10 జనపథ్ మహారాణి
అలహాబాద్ విజయేందిర
రక్తబిందువులు రాజ్యమేలుతున్న
ఢిల్లీ! సామ్రాజ్య అంతఃపురమది
దుశ్శాసపుడు వస్త్రాపహరణం చేసిన
"ఇంద్రప్రస్థం" నరకానికి నకలు అది
కామాంధుల కళ్ళు బైర్లు కమ్మిన కాళరాత్రది
కర్ఫ్యూ మసి నల్లగా విరగబూసిన
కర్కసపు కీచకరాత్రది
నిరాయుధంగ నిర్భయపై
మృగతృష్ణ రాక్షస క్రీడకు
రక్తపు ముద్దయిన రోజు
అరవై ఏండ్ల ప్రజాస్వామ్యం బురఖాను
ఎక్కడికక్కడ ఊడబెరికి
ఢిల్లీ వీధుల్లో నగ్నంగా ఊరేగింపు చేసిన రోజు
ఢిల్లీ సింహాసనం భయంతో వణికి
అధికారం చేజారిపోతుందనే భయంతో
ప్రజాకోపాగ్నిని చల్లార్చటానికి
యు.పి.ఏ మహానేత కంట
ట్యాంకర్ల కొద్ది కన్నీళ్ళను నిర్భయపై
ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలు
చల్లినరోజు
కామాంధుల కాల్చి పారేసి చేతులు దులుపుకోవడం కాదు
న్యాయస్థానాల ద్వారా ఉరిశిక్షలు అమలు
జేయడం అంతకన్నాకాదు
ఈ విష సంస్కృతిని పెంచిపోషించే
పాలకుల అధికారం కాల్చి కూల్చి వేయకుండ
అసహాయంగ చేతులు జోడించి మొక్కడం కాదు
స్త్రీ మూర్తులారా
ఆయుధాలను
ఆభరణాలుగా అలంకరించుకొని
మానవ మృగాలు మచ్చుకైనా కానరాని
సమసమాజ ఆవిర్భావానికి
సాయుధులుగా సమాయత్తంకండి!!

చిగురిస్తున్న ఆశలు

- వేణుగోపాల్

ఎన్నడో వచ్చిన వాన
ఇప్పుడు పట్టిన మబ్బులను చూస్తుంటే
నేల తల్లి దప్పి తీర్చడానికి
మళ్ళీ వస్తుందని ఆశ
చీకటయి పోయిందనుకున్న
సమయాన వెన్నెలొస్తుందని
అస్తమించాడనుకున్న సూర్యుడు
తూర్పు దిక్కున ఎర్రని
కిరణాలతో వేకువ తెస్తాడని ఆశ
ఆగిపోయినవనుకుంటున్న ఉద్యమాలు
అనంత దూరాలు వెళ్ళాయని
ఓరుగల్లు నుంచి వెళ్ళిన నావ
ఉత్తర తెలంగాణ మీదుగా
దండకారణ్యం వెళ్ళి
అన్యాయమవుతున్న అణగారిన
ఆదివాసి బతుకులకు
భరోసా ఇచ్చిందని సంతోషం
విప్లవానికి విరామం ఉంటుంది కాని
విరమించడం ఉండదని
గమ్యం తెల్వని మనిషికి పోరాట
గమ్యాన్ని చూపించి
అమరుల నెత్తుటి తల్లడిల్లిన
తల్లి ఓరుగల్లు విరసం సభలలో
తనువంతా పులకించింది
వెళ్ళిపోయిందనుకున్న శ్రీకాకుళం నక్సల్బరీ
వసంత మేఘం నింగి నేలను ఏకం
చేసుకుంటూ ఎర్ర కాంతులతో
వచ్చి విప్లవం విజయం
సాధిస్తుందని ఆశనిచ్చింది!

యుద్ధం అనివార్యమే

- కె.బాబ్జి

జార్ఖండ్, దండకారణ్యం నామవాచకాలు కాదు
గ్రీన్‌హంట్‌కు నిలువెత్తు యుద్ధ శిబిరాలు

గ్రీన్‌హంట్ చట్టబద్ధమైన చోట
భూమి శ్వాశించడం సాహసమే
నమ్మకాల వారసత్వాన్ని పూయించడం నేరమే
ప్రశ్నించడం అంటే చావును కౌగిలించుకోవడమే
దేశ సంపదను, పచ్చని పొలాలను డాలరు నోట్లుగా మడిచి
కార్పొరేట్ సంస్థల కోటు జేబులు నింపే
దోపిడీ పాలక వర్గాలపై ధిక్కార స్వరాన్ని వినిపించి
మావోయిస్టు పద్ధతుల్లో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను
కొనసాగించడమే వాళ్ళు చేసిన సాహసం

దేశ ప్రయోజనాలంటే బహుళజాతి సంస్థల ప్రయోజనాలు కాదని
ప్రజా సంక్షేమం అంటే సామ్రాజ్యవాద మార్కెట్ సంక్షేమం కాదని
నక్సల్బరీ వారసత్వాన్ని కొనసాగించడమే వారు చేసిన నేరం
జాతి అభివృద్ధి పేరుతో
ఖనిజ పరిశ్రమలు, స్టీలుప్లాంట్, పవర్ ప్రాజెక్టులతో
పచ్చని అడవి సెలయేరులలో వెచ్చని రక్తాన్ని పారించడం

అడవి పుత్రులపై చట్టబద్ధంగా సాగుతున్న
హింసను ప్రశ్నించడమే నేరం

ప్రశ్నించే ప్రజలందరూ నేరస్తులే
అబూజ్‌మాడ్, జార్ఖండ్ దండకారణ్యాలన్నీ యుద్ధ క్షేత్రాలే
దేశ అంతర్గత భద్రత పేరుతో పారామిలిటరీని దింపించి చాలక
గ్రీన్‌హంట్, మినరల్‌హంట్, సల్వాజుడుం ఎక్కుపెట్టే తూటాలు
ఈ దేశ సంస్కృతి మూలాలపై,
జాతి నిర్మూలన వైపే గురిచూస్తున్నాయి

పాలక సామ్రాజ్యవాదులకు యుద్ధమే అభివృద్ధి అయితే
అమరత్వం అంచులపై నిలబడి,
చావును గెలిచేసిన గుత్తికోయల వీరులకు
యుద్ధాన్ని కొనసాగించడం అనివార్యమే.

వాళ్ళే నిజమైన దేశభక్తులు

- శివ

నెత్తిమీద గాంధీటోపి పెట్టుకున్నోళ్ళు
ఒంటిపై కాషాయపు వస్త్రాలు కప్పుకున్నోళ్ళు
సామ్రాజ్యవాదపు నయా ఏజెంట్లు
గుజరాత్ నరహంతకుడు మతోన్మాది మోడీ
కాంగ్రెస్ రాజకీయాల వారసుడు రాహుల్‌గాంధీలు
సామ్రాజ్యవాదపు రేపటి ఎజెండా అమలు చేసే కార్యకర్తలు
అభివృద్ధి, సంక్షేమం 65 ఏళ్ళ నుంచి ఎన్నికల వాగ్దానాలే

67 ఏళ్ళ స్వాతంత్ర్యంలో 70 కోట్ల మంది
దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారే
ప్రజాస్వామ్యం ఇక్కడొక పరిహాసపు స్వామ్యమే
వరల్డ్‌లోనే లెంథియెస్ట్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్
పేదోడికి ఇంకా అందని దూరంలోనే ఉంది
న్యాయమూర్తి ప్రతిమకు కళ్ళకు గంతలు కట్టిన దేశంలో
అన్యాయానిక గురైన వారికి న్యాయం జరిగేనా
భారతదేశ సార్వభౌమాధికారాన్ని అగ్రరాజ్యం అమెరికా
చేతిలోపెట్టిన ఈ పాలకులే దేశద్రోహులు
లక్షలాది సైనిక బలగాలను ఎదురొడ్డి పోరాడుతున్న
భారతదేశ సహజ సంపదను కంటికి రెప్పలా
కాపాడుతున్న ఆదివాసిలే నిజమైన భరతమాత బిడ్డలు
ప్రత్యామ్నాయ రాజకీయ విశ్వాసాలతో మార్క్సిస్ట్ దృక్పథ
పునాదిపై నూతన ప్రపంచాన్ని ప్రజారాజ్యాన్ని
నిర్మిస్తున్న నూతన మానవులే నిజమైన దేశభక్తులు

అమరత్వం

- కొగిల చంద్రమౌళి

అవి నెత్తుటి మరకలు కావు
అమరుల త్యాగాలకి ఎర్రటి జ్ఞాపకాలు
అవి నెత్తుటి మరకలు కావు
పీడిత రక్షణకై గీసిన ఎర్ర
లక్ష్మణ రేఖలు
అవి నెత్తుటి మరకలు కావు
నూతన మానవీయ సమాజానికై
విముక్తి మార్గపు చిహ్నాలు
అవి నెత్తుటి మరకలు కావు
కమ్యూనిజం దిశగా పరిచిన
ఎర్ర తివాచీలు
అవి నెత్తుటి మరకలు కావు
జనతన సర్కారు స్థాపనలో
అమరులు రాల్చిన నిప్పు కణికలు
సమసమాజ స్థాపనకై వారు వేసిన బాటలు
ఆశయాల బావుటాలై వెలుగొందుతున్నారు

గాయం మానక ముందే మరో గాయం

- పి.మేఘరాజు

కడుపు నింపే కాలం కాదు కాని
కడుపు పగిలే కాలం రాబట్టె
కుండలో గంజి నిండుతదనుకున్న గాని

కుండ పగులుతుంది అనుకోలే
పద్యాల నీళ్ళు నింపరని తెలుసు కాని
పచ్చినెత్తురు తాగేవారని తెలియకపాయె
ఊహించిందే జరిగింది
మరో భోపాల్ గ్యాస్ లీకయ్యింది
రసాయన వాయువులు వెదజల్లనుంది
అమాయకుల ప్రాణాలు గాలిలో కలియనున్నవి
రాజ్యం రక్తటేరుల రహదారులు వేస్తుంది
సామ్రాజ్యవాదానికి ఎర్ర తివాచీలు
పరిచే రోజులు మళ్ళీ వచ్చే
సొహ్రాబుద్దీన్ లా బూటకపు ఎన్‌కౌంటర్లు
జరగక మానేనా!
యునాని చికిత్స కోసం వెళ్ళిన
కౌఫర్‌బీలను కరావు చేసే
రోజులు మళ్ళీ రాబోతున్నాయా?
నరమేధంతో నడక నేర్చి
పీనుగల మీద నడిచిన పాదాలు
దేశం మొత్తం విస్తరించాలా?
గుజరాత్ మారణకాండ మరుస్తామా?
గోద్రా గాయాలు ఎలా మర్చిపోతాము
ముజఫర్ నగర్ అల్లర్లు ఎలా మాసిపోతాయి
గుండెల మీద పడ్డ గాయం ఎలా మానుతుంది
రంగులు పూసుకుంటున్న రాజ్యంపై
కండ్లుతెరిచే వాన పడాలి
రంగు వెలవాలి
అసలు రంగు బయట పడాలి
కార్పొరేట్ విష కౌగిట్లోంచి
ఒదిలిన బాణం
ఓ కంట చూడాలి
ఓ పారిట్ మాట్లాడాలి
ఊ కొంటే కలాలకు
గళాలకు సంకెళ్ళు

ఉత్తమ మనిషి

- బిల్ల మహేందర్

ఉదయాన్నే నాలుగు చక్రాల బండిని నెట్టుకుంటూ
మెడలో వేలాడుతున్న 'విసిల్' ను నోటకరుచుకుని
వీధిలోకి ప్రవేశిస్తడు పోచయ్య

ప్రతీ ఇంటిముందు 'విసిల్' వేస్తూ
చెత్తబండి వచ్చిందంటూ ఇంట్లోవాళ్ళకు సందేశాన్ని చేరవేస్తాడు
ఇంటి చెత్తడబ్బా వచ్చే వరకు
ఎంతసేపైనా ఆ ఇంటి ముందు ఎదురు చూపులు తప్పవతనికి
చిరిచిర మెట్లు దిగుతూనే ముక్కు మూసుకుంటూ
ఆమడ దూరంలో నిలబడ్డ ఒక దొరసాని
కళ్ళను అటుఇటు తిప్పుతూ చెత్తను తీసుకెళ్ళమన్నట్లు
సైగలు చేస్తది

నడుముకు లుంగీ మాత్రమే చుట్టుకుని
బొర్రంతా అగుపడేటట్లుండే ఒక దొర
కోపంతో చెత్తడబ్బాను పట్టుకొచ్చి
ఏయ్? ఎన్నిసార్లు విసిల్ వేస్తావ్
వచ్చేదాకా ఆగవ్? అంటూ
చెత్తను బండిలోకి గబాలున కుమ్మరించి వెళ్తాడు

బారెడు పొద్దెక్కే దాకా పడుకునే ఒక సోమరి
ఈ 'చెత్తకొడుకు' కు ఏం పనీపాటా లేదా
పొద్దున్నే కాకిలా అరిచి గోల చేస్తుండని లోలోన తిట్టుకుంటూ
నిండా చెద్దరిని కప్పుకొని అటూఇటూ బొర్రుతుంటాడు

పాపం పోచయ్య! ఏమి చేస్తాడు మరీ?
అతడికిలాంటివేమి కొత్తకాదు
ప్రతీరోజు ఏదో ఒక ఇంటిముందు
ఇలాంటి 'చెత్తవాళ్ళను' ఎందరినో చూస్తుంటాడు
అందుకే అవేమి పట్టించుకోకుండా
మనుషులలోని మంచి చెడులను వేరు చేసినట్టు
చెత్తలోని తడిచెత్త పొడిచెత్తను వేరు చేస్తూ
ముందుకు పయనం కొనసాగిస్తూనే ఉంటాడు

చెత్తనే కాదు
చెత్తనే వేసే చేతుల్ని
పరుచుకున్న
జీవనరంగాలను
మంచి చెడులను
గ్రహిస్తూ సాగుతాడు, మనుషుల ముఖాల్ని
ఇలా ఉదయాన్నే తన ప్రయాణంలో
ప్రతీ ఇంటి ముందు ఎందరి జీవితాలను చదువుతాడో పోచయ్య

శత వసంతాల మన కాళోజి

- అల్లూరి హరినాథ శర్మ

తెలంగాణ యాసకు తొలిపలుకు పల్కిన
శత వసంతాల మన కాళోజీ
తెలంగాణ మాండలికానికి మెరుగులు దిద్దిన
శత వసంతాల మన కాళోజీ
తెలంగాణ విముక్తికి తొలి పోరాట కవితేజం
శత వసంతాల మన కాళోజీ

తెలంగాణా తల్లికి తొలి ప్రజా కవితాహారం
శత వసంతాల మన కాళోజీ
కవితా కడలిలో ఎగసిపడిన క్రాంతి కెరటం
శత వసంతాల మన కాళోజీ
ఓరుగంటి పోరు కవితలకు పురుడుపోసిన కవితాగళం
శత వసంతాల మన కాళోజీ
ఓరుగంటి చరిత్ర పుటల్లో ప్రజాకవిగా పరిఢవిల్లిన
శత వసంతాల మన కాళోజీ
అలసిన పోరుబిడ్డలను కలంతో కదిలించిన
శత వసంతాల మన కాళోజీ
అడవిలోని అగ్నిపూలకు పోరుభాషలో పలుకులు నేర్పిన
శత వసంతాల మన కాళోజీ
జాతస్య మరణం అన్నది ప్రకృతి నైజం
మరణించినా శత వసంతాల శోభతో
మన మధ్య నున్నాడన్నది పచ్చి నిజం
అమరుడై అరుణతారగా అంబరాన
నిలచినప్పటికి మన కాళోజీ
శతవసంతాల శోభతో కవుల సభలో
కొలువు తీరాడు మన కాళోజీ

ప్రశ్నల కొడవళ్ళు ప్రజా చైతన్యానికి ఆనవాళ్ళు

-బసవడు

నేను ప్రశ్నను
నేను కొడవలిని
నేను ప్రశ్న కొడవలిని
వెన్నెలవంకని
రాజహంసని
నేను అన్నదాత రైతుని
బురదలో నాటిన వరి మొక్కని
నేను ఉపాధ్యాయుణ్ణి
బుద్ధి చెప్పేవాణ్ణి
మెదడును ఆలోచనల వైపు మారల్చేవాడిని
నేను (అ)జ్ఞానిని కావచ్చు
నేను అంటరాని వానిని గావచ్చు
జ్ఞానాన్ని చీల్చి నిగ్గుతెల్చేవాడిని
అంధకారాన్ని చీల్చే కాగడాని
నేను నిరక్షరాస్యుణ్ణి గావచ్చు
వింత చదువరిని
గ్రామాల చదువగలను
మనిషిని చదువగలను
అసలు వాస్తవాన్ని రాబట్టగలను
ఏ పనినైనా చేయగల నిరుద్యోగిని
బ్రాహ్మణీయ భావాజాలాన్ని ఇట్టే పసిగట్టేవాణ్ణి
విప్లవకారుని భావాన్ని వెలవట్టగలవాణ్ణి
నడుస్తున్న చరిత్రను విశ్లేషించగలవాణ్ణి
భారతమాత అమ్మతనాన్ని చవి చూచేవాణ్ణి
తెలుగుతల్లి తేట తెలుగు వెలుగులు తెలిసిన వాణ్ణి
కన్నతల్లి అమాయకత్వాన్ని ప్రశ్నించిన వాణ్ణి
జన్మభూమి రుణాన్ని తీర్చుకో దలచిన వాణ్ణి
నేను ప్రశ్నల కొడవళ్ళ నెత్తిన వాణ్ణి
ఆలోచనామృతాన్ని రుచి మరిగినవాణ్ణి
బుద్ధుని బుద్ధి జ్ఞానాన్ని ఆకళింపు చేసుకొన్నవాణ్ణి
శంకరుని మాయా అద్వైతాన్ని వడపోసినవాణ్ణి
జ్ఞానజ్ఞానాల మధ్య ఘర్షణ జరిగింది
'అ' జ్ఞానమే గెలిచి రాజ్యమేలసాగింది
కులతల శిలలే గెలిచి రాజ్యానికి వత్తాసు పలికాయి
బ్రాహ్మణత్వ పితృస్వామ్య భావాలే గెలిచాయి
మాతృస్వామ్య ప్రజాస్వామ్య సామ్యవాద సౌందర్య
సౌభాగ్య భావాలే ఓడినాయి
నేను విప్లవకారుని చూపుని
ప్రజాపంథా స్ఫూర్తిని
జనశక్తి శక్తిని, సత్తాని
ప్రజాయుద్ధ దీర్ఘదర్శిని

తస్లీమా బాను కవితలు రెండు

చిన్నాన్న

ఈ మాటలు నా నోటివే
కాని దాని అంతరార్థం మీరు నేర్పిందే
అడుగులు వేసేది నా పాదాలే
కాని పయనం మాత్రం మీరు నేర్పిందే
కండరాలతో నిండిన హృదయం నాదే
దానికి స్పందన మాత్రం మీదే
ఈ అయిదు వేళ్ళ చేయి నాదే
కాని అది రాసే రాత మాత్రం మీదే
ఆహారంతో పెంచుకున్న ఈ దేహబలం నాదే
కాని దీన్ని నడుపుతున్న ఆత్మబలం మీదే
స్పర్శకు స్పందించే సున్నితత్వపు చర్మం నాదే
కాని కష్టసుఖాలను సమంగా స్పృశించాలన్న తత్వపు
మర్మం మాత్రం మీరు నేర్పిందే
బీదవాడి సంతోషంలోనే మన సంతోషం
ఉందన్న సూత్రాన్ని నేర్పింది మీరే
ఇలా ఎన్ని చెప్పినా తక్కువే
ఏమిచ్చినా తక్కువే

మీరున్నారు

అరుణోదయపు ఎరుపు చెబుతుంది
మీరున్నారని, మాకేం కాదని
పార్టీ పతాకంలోని ఎరుపు చెబుతుంది
మీరున్నారని, మాకేం కాదని
సూర్యాస్తమయపు కాంతి చెబుతుంది
మీరున్నారని, మాకేం కాదని
చంద్రుని చల్లని వెన్నెల చెబుతుంది మీరున్నారని
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిలో మీరున్నారని
నేను వేడుకుంటున్నా మీరు కలలుగన్న సమాజ స్థాపనలో
మాతోడుగా నిలవాలని, ధైర్యాన్ని ఇవ్వాలని
(తస్లీమా బాను కా. రవూఫ్ అన్న కూతురు)

విప్లవ ప్రతిజ్ఞ

- జనజ్వాల

ఎన్ని మరణాలు! గాలి స్తంబించిపోలేదు
ఎప్పుడు సత్యంలో నిత్యం రుజువు పరుస్తుంది
రాత్రి మరణం జయించి
తూర్పు గాలి మీద ఎర్రెర్రటి సూర్య ముఖం-

ఆకుల మధ్య పువ్వులు పూసినట్లు
త్యాగాల నడకల మధ్య చరిత యవ్వనమౌతున్నట్లు
సీతాకోకలు విల్లంబులను అందుకొని కొత్తగా ఎగురుతున్నట్లు
జీవితం ఆదర్శానికి స్వప్నబలం మరణం కూడా కావచ్చు
మరణం మీద ఆన అదేకాదా! చరిత చలనం-

నగరం నడిబొడ్డు కూడలిలో
మరణం పెట్టి శత్రువు కంట్లో భయాన్ని చూపించి
నిష్క్రమించిండు
కామ్రేడ్ భూమయ్య సార్

భూమి సామ్రాజ్యవాద గుప్పిట్లో
యంత్రంగా పెట్టుబడి తంత్రంగా
రంగుల రూపం పులుముకుంటున్న కొత్త దోపిడి
జర్రిపోతు పొద్దు మీద
మాట నడక నిప్పులో కడిగి యుద్ధంలో ఉండడమే
మరణం మీద ఆన
భూమయ్య సార్ మరణం
మీద విప్లవ ప్రతిజ్ఞ

ఆదివాసి పోరు

- కె. ప్రజ్ఞ

మానవ శరీరాన్ని ఆహారం కోసం ,
ఆక్రమించుకున్న బాక్టీరియా వైరస్‌లా
పెట్టుబడిదారులు ఖనిజాల కోసం
అడవులను మింగుతున్నారు

మకరందం కోసం వెతుక్కునే కీటకాలను
నెపెంతిస్ పుష్పం పీల్చిపిప్పి చేసినట్టు
మిత్రీ దళాలు కూడుకై పోరాడే ఆదివాసీలను
తీవ్రవాదులని నక్సలైట్లనీ చంపేస్తున్నరు

పుష్పించిన పువ్వుల్లోని పుప్పొడిని
తేనెటీగలు పీల్చేసినట్టు
సిఆర్‌పిఎఫ్ జవాన్లు, ఆదివాసీ మహిళలపైన
సామూహిక హత్యాచారాలకు పాల్పడుతున్నారు

టైగర్ జోన్, గ్రీన్‌హంట్ పేరిట
డైనోసార్లలా విరుచుకుపడి
ఈ దేశమూలవాసులైన ఆదివాసీలను
అడవుల నుండి తరిమేస్తున్నారు

అందుకే
నాగలిబట్టే చేతులు
గుత్పలు బట్టినయి
తునికాకులు కోసే చేతులు
తుపాకులెత్తినయి
బలపం బట్టే చేతులు
బరిసెలెత్తినయి
పెన్నులు బట్టే చేతులు
గన్నులు బట్టినయి
జనతన సర్కారుకై
పోరుజేస్తమన్నయి
(నోట్: వరంగల్ విరసం సభలు చూసి ఆ స్ఫూర్తితో రాసిన కవిత ఇది. కె. ప్రజ్ఞ, ఇంటర్ రెండవ సంవత్సరం, మంచిర్యాల)

వాళ్ళకు కాలమ్మూడింది

- నల్లెల్ల రాజయ్య

శాసించే నేతల కాళ్ళుమొక్కి
ప్రశ్నించే గొంతుల్ని నులిమేస్తున్న
మోకాలు బుర్రలకు కాలమ్మూడింది

ఆకలైతే అన్నం బెట్టి
అవసరాలన్నీ అనునిత్యం తీర్చే
తీరొక్క ప్రజల్ని హింసిస్తున్న
నరహంతకులకు కాలమ్మొడింది

అవినీతి అక్రమాల్ని
గొంతెత్తి నినదించిన
ప్రజాస్వామిక వాదుల
గుండెల్లో గుండ్లుదించుతున్న
రక్షక మూకలకు కాలమ్మొడింది

దండకారణ్యంలో
కారుణ్యం కరువైతాందనీ
జనారణ్యంలో తిరిగి
నిరంతరం నినదిస్తున్న
ప్రసాదాల ప్రాణాల్దీస్తున్న
కర్కశాధములకు కాలమ్మొడింది

అమాయకులను పీడిస్తూ
దొరికినంత దోచుకుంటూ
ఎదురు తిరిగితే ఎరుక
లేకుంట జేస్తున్న దోపిడీదార్లకూ
వారి కాపలా కుక్కలకు కాలమ్మొడింది

మొండి బతుకులు

- మహమూద్

సులువుగా మరిచిపోలేని జ్ఞాపకాలు కొన్ని
సులువుగా మాన్పలేని గాయాలు కొన్ని
అవి దేహాలను కాదు
ఎక్కడో మూలాల్లో దాక్కొని కనిపించడానికి నిరాకరించే
సూక్ష్మమైన స్పందనలను కదలిస్తాయి
గుంభనంగా, ప్రశాంతంగా ఉండే నెత్తుటి నదులను
సుడులు తిరిగేలా చేస్తాయి.
లోపలి మనిషిని బయటి ఆందోళనల్లోకి బయటి ఆందోళనలను
మనిషిలోపలికి
ఇంకేటట్టు చేస్తాయి.
మనమెప్పుడూ వాటిని చూసి ఉండం
వాటి రసాయనిక బంధాలను పరీక్షించి ఉండవు
(అసలవి పరీక్షలకు లొంగవు)
అసలవి మనుషులవా?
మనుషులకు పోలిన వ్యవస్థలవా?
వ్యవస్థలను పోలిన సమాజాలవా?
అర్థం చేసుకోవడం కష్టం
ఒక్కో జ్ఞాపకం ఒక్కో సమాజం
ఒక్కో సమాజం ఒక్కో గాయం
ఒక్క కరచాలనంతో
అరచేతిలో దాక్కొన్న ఎన్నో అనుభవాల
లోతులను తడిమినట్టౌతుంది
వేల వేల గుండెల సామూహిక లయలను విన్నట్టౌతుంది
వాటితో సంభాషిస్తున్నపుడు
ఎక్కడో ఛిద్రమౌతున్న జీవనవాస్తవాల చప్పుడు
మన ఎదుట సాక్షాత్కారమౌతుంది
సుఖంగా లేని కాలంతో సంఘర్షిస్తున్న
ఆ చక్షువుల మెరుపులో రేపటి బతుకుచిత్రం ఆవిష్కారమౌతుంది
దేనికీ చలించనితనం వెనుక ఉన్న అనేకానేక సంచలనాల తీవ్రత
ఆ మూఖాల్లోనూ, ఆ ముడతల్లోనూ కనబడుతుంటుంది

జనం పడ్డ కష్టాలను మోసుకుతిరుగుతూ
వాటి దేశదిమ్మరితనం దిగ్భ్రమను కలిగిస్తుంది
కొండలెక్కి దిగుతాయో, ఎడారి తూపాలను ఎదుర్కొంటాయో
తెలియదు
చాలాసార్లు మట్టికొట్టుకుపోయి వాటిని
మనేమే దుమ్ముదులపాల్సి వస్తుంది
పరిణామంతో లీనమై ఉంటాయి కదా నీడలై ఉంటాయి కదా
ఒక్కోక్కపుడు వాటికయ్యే గాయాలనసలు అవి గుర్తించలేవు
రుధిరప్రవాహపు చల్లదనంలో సెదతీరుతాయో లేదా రుధిరనిది
అనంతప్రవాహమో
అందులోని బోళాతనం ఒక్కోసారి విసుగు తెప్పిస్తే ఒక్కోసారి
సవాలక్ష సవాళ్లకు బెదరని
ధైర్యసాహసాలను అందిస్తుంది
సుడులు తిరుగుతున్న మా కన్నీళ్ళే మందై వారితో మేం
పంచుకునే మాటలే కట్టై
ఆ గాయాల చుట్టూ అల్లుకుంటాయి
వాటి నుండి కృతజ్ఞతలే కూడా అందవు
నిద్రాహారాలు కరువౌతున్నపుడు కూడా చలించని
ఎక్కడనుండి వస్తుంది?
ఆ నిబ్బరమైన నిలకడ ఏ ఉదయ-సంధ్యలో పుడుతుంది?
బహుశా మనం కూడా ఆ అడుగుజాడల్లో మన అడుగులు
జోడిస్తేగానీ అర్థం కాకపోవచ్చు
అంత మొండివవి
ఇప్పటకీ కొన్ని గురుతులు
ఇప్పటికీ కొన్ని గతాలు
ఇప్పటి ఆలోచనలకు లోచనాలై తోవ చూపే మిణుగురులు
మన చుట్టూ మలయమారుత రాగాలై పరిభ్రమిస్తుంటాయి
వాటి శక్తి అపారం
వాటి నిబద్ధత దేనికి అందని కొలమానం
నిలువెత్తు త్యాగచరితలు నిండైన జీవితాలు
వెంటాడుతూనే ఉంటాయి ఆ జ్ఞాపకాలు
వెంటాడుతూనే ఉంటాయి ఆ గాయాలు

(కా. రవూఫ్ స్మృతిలో...)

నాటకం

(హనుమకొండలో జరిగిన విరసం 24వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా జనవరి 11 న విరసం సాంస్కృతిక బృందం తొలిసారి ప్రదర్శించింది. - సం.)

బాసగూడ

- ఉదయమిత్ర

చరిత్ర చెక్కిలి మీ కన్నీటి చారిక
రెక్కలు గట్టుకు ఎగురుతున్న గీతాల్ని
క్రూరంగా, అమానుషంగా
ముక్కలు ముక్కలు జేయవచ్చునేమోగాని
గీతం... చరణాలుగ అతుక్కోటాన్ని
ఎవ్వరాపగలరు....?

- ఫ్రెడరిక్ డగ్లస్ (ఆఫ్రికన్ కవి)

పాత్రలు

1. చిదంబరం - హోం మినిష్టర్
2. పంకజ్‌కుమార్‌సింగ్ - సి.ఆర్.పి.ఎఫ్ ఐ.జి (ఆపరేషన్)
3. ఆర్.డి.ఒ- బీజాపూర్
4. క్లర్క్- ఆర్.డి.ఓ ఆఫీస్

ఆదివాసీలు

5. ఇర్పా రమేష్
6. ఇర్పా దినేష్
7. మడ్కం సురేష్
8. కోర్సనందు
9. ఇర్పా నారాయణ
10. మడ్కం సుగ్గి (స్త్రీ)
11. మడ్కం మంగ్లి (స్త్రీ)
12. మడ్కం కమల (స్త్రీ)

జర్నలిస్టులు

13. మొదటి జర్నలిస్టు
14. రెండవ జర్నలిస్టు
15. మూడవ జర్నలిస్టు

ప్రజాసంఘాల సభ్యులు

16. సి.ఎల్.సి
17. ఒ.పి.డి.ఆర్
18. విరసం

1వ అంకం

(విత్తనాల పండుగపై చర్చ -దాడి)

బాసగూడ.... చరిత్ర చెక్కిలి మీద కన్నీటి చారిక...నిరాయుధ ప్రజల మీద సాయుధమూకల వేట...ప్రజలపై ప్రభుత్వం జరిపే యుద్ధంలో ఇదో దారుణ ఘటన. మరో జలియన్ వాలాబాగ్. నిజానికి ఇది వేరుగా చూడాల్సిన ఘటన కాదు. దండకారణ్యంలో ఆదివాసుల చేతుల్లో పుష్పిస్తున్న జనతన సర్కార్ మీద ప్రభుత్వ దాడిలో భాగంగానే దీన్ని గుర్తించాలి.

మనమిప్పుడు భూమితో మాట్లాడుదాం...నిరాయుధులైన ప్రజలమీద తుపాకీ గుళ్ళు కురిపించినప్పుడు రక్తంలో తడిసి విలవిల్లాడిన భూమి ఏమన్నదో విందాం....మనం ఇప్పుడు బాసగూడతో మాట్లాడుదాం...

ఆ రోజు రాత్రి ఏం జరిగిందో తెల్సుకుందాం...

నేపథ్యం

గూటికి జేరిన పక్షుల్లాగ
ఇండ్లజేరినారు
అలిసిన బతుకుల
ఆదివాసులు సేదతీరినారు (2)
మబ్బులుపట్టిన ఆకాశమ్ము
మౌనంగ దీవించగా (2)
మిణుగురు పురుగులు
మిలమిల మెరువగ
కీటకాలు బొరియలదూరగ (2)
రెక్కల చాటున పక్షి పిల్లలు
కమ్మని కలలేకంటూ ఉండగ (2)
బయలు దేరినారు
వాల్లు బయలుదేరినారు (2)
"ఇత్తనాల పండగ" మాట్లాడనీకె
సమిష్టిగ బరువుదించుకోనీకె
మైదానం జేరారు
వాళ్ళు సభనే పెట్టారు (2)

(ఆదివాసులు చర్చలయినా, సభలయినా పాటతోనే మొదలుపెడ్తారు. పాటకు వాళ్ళ జీవితానికి విడదీయరాని సంబంధం ఉంది)

రేలారేలారే - వానల్లువచ్చేనే
రేలారేలారే - భూతల్లి మురిసేనే (2)
రేలారేలారే - ఇత్తనమెయ్యాలే
రేలారేలారే - పండుగజెయ్యాలే (2)
భూతల్లి మురువంగ, ఎన్నెల్లు దేవంగ
పనులు వంచనీకె సభ జరుపుకుందాము (2)
రేలారేలారే - పండుగ వచ్చిందే
రేలారేలారే - పూజలు జెయ్యాలే (2)

ప్రశాంత వాతావరణం

గుండ్రంగ కూచొని ఉంటారు. చేతిలో పుల్లలతో భూమ్మీద గీసుకుంటూ మాట్లాడుతుంటారు

మడ్కం సురేష్ : టైమ్ ఎనిమిదయినట్లుందిరా...

ఇర్పా రమేష్ : మనకేమో గీ రాత్రిపూటనే సభకు టైమ్ దొర్కుతది. పొద్దున్నే మల్ల ఎవరి పనులకు ఆల్లం పోవాలేగదా!

ఇర్పా దినేష్ : కొత్తగూడెపోల్లు, సర్కగూడెమోల్లు, రాజంపేటోల్లు అందరు వచ్చినట్టేనా? ఆ...మొత్త ఎంతమంది అయితున్నరు?

మడ్కం సురేష్ : (లెక్కబెట్టి) ఓ అరవై మంది దాంక ఉన్నం. ఇగగానీయిస్రి.

ఇర్పా రమేష్ : ఇత్తనాల పండుగ టైమ్ దాటిపాయె గీ తేదీలు జూసే పూజారేమొ కాలం జేసె...ఏం జేద్దమిప్పుడు? నువ్వు జెప్పు దినేష్.

ఇర్పా దినేష్ : ఏం చేద్దాం..ఇయ్యాల ఏదో తేదీ ఖరారు జెయ్యాలె.. లేకపోతే దినం దాటెటట్లున్నది.

మడ్కం మంగ్లి : అవ్‌మల్ల..వానలు పడ్డయి...భూమి పదునుకొచ్చింది. మన దగ్గరేమో అందరికి ఎడ్లులేకపాయే...

మడ్కం సుగ్లి : అరే...అదేందన్నా...ఎడ్లు లేకపోతే ఏంది...మన ఎడ్లు లేవా ఏంది? అందరంగల్సి ఎడ్లులేనోల్ల పొలాలు దున్నుదం.

మడ్కం కమల : అదిసరే...అదును టైముల ఎడ్లు సరిపోక పోతే ఏం జేద్దాం మరి.

మడ్కం సురేష్ : ఏం జేసేదీ? యాదన్న ట్రాక్టరు కిరాయికి దీసుకొచ్చి దున్నుదం.

ఇర్పా నారాయణ : ఏదన్నగాని, ఎవని భూమి గూడ పడావు వడవొద్దు. గది ముందల జూస్కోవాలె.

ఇర్పా రమేష్ : అవ్..అవ్.. ఏదన్నాగాని... ఎవని భూమి పడావు పడొద్దు.

మడ్కం కమల : అదిసరే.. గీసారి మాత్రం జర చేపలు ఎక్కువ పెంచాలె... పోయిన సారి పెంచిన చేపలు అంతకంతకె సరిపాయె.

మడ్కం మంగ్లి : ఔనౌను... ఈసారి చేపలు ఎక్కువనే పెంచాలె... చిన్న చిన్న కుంటలు ఎక్కుల తొవ్వుకుంటే ఎక్కువెక్కుల చేపలు పెంచుకోవొచ్చు మనం.

మడ్కం సురేష్ : ఔనో... సంగతి మర్చిన..గా కాంట్రాక్టరు గాడు తునికాకు కూలి రెండు సంత్సరాల నుండి బకాయి పెట్టి... అడుగంగ అడుగంగ గిప్పుడిచ్చిండు పదివేలు... గది అందరం పంచుకోవాలె.

మడ్కం కమల : ఈసారి భూమిలేనోల్లు ఎవరన్నా ఉంటే కొంత భూమిని ఆల్లకియ్యాలె.

కోర్స నందు : ఔనే అన్నా..నేనింకోటి చెప్పాలె..గా సల్వాజుడుంల మన పోరలు దారి తప్పి కల్సిను గదా.వాల్లు తమ తప్పు దెల్సుకున్నరు. సంఘం గూడ రమ్మంటున్నది. వాల్లు వాపసొస్త మంటున్నరు. ఆల్లకు కూడా భూమి పంచాలె. ఎంతోకొంత.

మడ్కం సురేష్ : అదెట్ల గుదుర్తది? జుడుం వాల్లకి భూమి ఎట్లిస్తం?

ఇర్పా నారాయణ : ఆల్లు మన గూడేల్ని గాల్చిను. మనల్ని సంపిను. ఆడోల్లను ఆగం జేసిను. ఆల్ల కెట్లిస్తం భూమి అస్సలియ్యం.

ఇర్పా రమేష్ : అరె జర్ర కోపం తగ్గని నిదానం జెయ్యి. తెల్సి జేసినా, తెల్వకజేసినా... ఆల్లుమనోల్లేగదా... ఆల్లుమనకడ్పున పుట్టిన బిడ్డలే గదా... మనం గాకపోతే మల్లెవరు చేరదీస్తరు జెప్పు.

మడ్కం సురేష్ : ఏమో...గీల్లను మనందాంట్ల గల్పుకొనెదే నాకు నచ్చుతలేదు.

ఇర్పా దినేష్ : నిజాయితీగ వాపసొచ్చినోల్లను కడ్పుల దాచుకోవాలె గదా!

ఇర్పా రమేష్ : ఆల్లకింత బతుకుదెరువు సూపెడితే ఆల్లు మనతోటే ఉంటరు. ఆల్లెక్కడవోతరు? ఊగి ఊగి ఉయ్యాల ఆడికేవస్తదాలేదా?

కోర్సనందు : ఔనౌను...

ఇర్పా నారాయణ : అది సరే... చుట్టు పక్కలంత సీఆర్పే లేనాయే... జర జల్ది జల్ది గానీయుస్రి...ఇంటికివోదం.

ఇర్పా రమేష్ : గదేందేనారన్నా...గట్టంటవ్. మనం "ఇత్తనాల పండుగ" గురించి మాట్లాడనీకే వొచ్చినం. ఏ మన్న యుద్ధం జేయవొస్తిమా? ఉత్తచేతుల్తోటి గూకొని మాట్లాడుతున్నాం. ఆల్లు మన దగ్గరకెందుకొస్తరు?

ఇర్పా నారాయణ : నిజమే...మబ్బువట్టింది...ఆనవద్దదేమొర... (కాల్పులు మొదలవుతాయి)

సురేష్ : అరేయ్ సిఆర్‌పి వోల్లు వచ్చినట్టున్నరా. పడుకొండి, పడుకోండి.

రమేష్ : పడుకోండి, పడుకోండి.

వాన పళ్ళేదు గాని, అక్కడ ఉరుము లేని పిడుగుల్లాగ వందల కొద్ది సి.ఆర్.పి.ఎఫ్ దళాలు కోబ్రా దళాలు నిరాయుధులైన ఆదివాసీల మీద విరుచుకుపడ్డారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా జరిపిన కాల్పుల్లో... పడమటి దిశ నుండి వచ్చిన బుల్లెట్లకు ముగ్గురు ఆదివాసీలు అక్కడికక్కడే ఒరిగిపోయారు.

భయంతో కేకలు పెడ్తూ, ఆదివాసీలు తమ గూడేలకు పరుగులు దీసారు.

రక్తసిక్త వాతావరణం...
ఏడ్పులు, కేకలు, పెడబొబ్బలు
బాసగూడ యుద్ధకాండగ మారింది.
విచ్చలవిడిగ నేపథ్యంలో...
జరిపిన కాల్పుల
నేల కొరిగినారు.
అయ్యో.. నేలకొరిగినారు (2)
బుల్లెటు గాయాల
తల్లడిల్లుతుంటే
మల్ల గాల్చినారు
అయ్యో... మల్ల గాల్చినారు (2)
రక్తమోడుతుంటే
పాపిష్టి కొడ్కులు
ఈడ్చుకుపోయారు... (2)
వాళ్ళు గొడ్డళ్ళ నరికారు
అయ్యో... మెడలను గోసారు (2)
పందుగంటూ వొచ్చి
పానమిడ్చినారు
అల్లు పానమిడ్చినారు (2)

తాము జేసిన దుర్మార్గపు ఆనవాళ్ళు లోకానికి తెలువగూడదని హత్యాకాండ జరిగిన ప్రాంతంలో రక్తంతో తడ్సిన మట్టిని ఆ మరుసటి రోజే పోలీసులు ఎత్తుకెళ్ళారు. మరో వైపు పాలకులు రక్తంలో తడిసిన వర్తమానాన్ని యథావిధిగ తుడిచిపెట్టే ప్రయత్నం జేసారు. వాళ్ళేమన్నారో విందాం...

2వ అంకం
(చిదంబరం ఉపన్యాసం)

జర్నలిస్టు : (మైక్ చేత్తో పట్టుకొని) సార్ బాసగూడలో జరిగిన సంఘటన మీద మీ అభిప్రాయం చెప్తరా?

చిదంబరం : ఎస్.ఎస్... మా ప్రభుత్వం మావోయిజాన్ని దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా భావిస్తోంది. మేం వాళ్ళ పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తున్నాం. మా భద్రతా దళాలు ఈ విషయంలో చెప్పుకోదగిన విజయాలు సాధించాయి.

ఇక బాసగూడ సంఘటన కొస్తే జూన్ 28 నాడు భద్రతాదళాలు బాసగూడను చుట్టుముట్టాయి.అక్కడ మావోయిస్టులు సమావేశం జరుపుకుంటున్నారని పక్కా సమాచారం ఉంది. అక్కడ మావోయిస్టులకు మా భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగినాయి. అందులో 20 మంది కరుడుగట్టిన మావోయిస్టులు అక్కడిక్కడే చనిపోగా మా సిబ్బందిలో ఆరుమంది గాయపడ్డారు. మృతుల్లో టాప్ ర్యాంక్ మావోయిస్టులున్నారని మేము విశ్వసిస్తున్నాం. దట్టమైన అడవుల్లో ఇంకా కూంబింగ్ కొనసాగుతోంది. ఆ వివరాలు తర్వాత వెల్లడిస్తాం. థాంక్యూ.

3 వ అంకం
సి.ఆర్.పి.ఎఫ్. ఐ.జి తో జర్నలిస్టుల ఇంటర్వ్యూ

ఇంటర్వ్యూ : సి.ఆర్.పి.ఎఫ్ (ఆపరేషన్) పంకజ్‌కుమార్ సింగ్‌తో జర్నలిస్టులు

(ఐ.జి ఆఫీసు గోడ మీద గాంధీ పటం ఇతర దేశ నాయకుల పటాలు ఉంటాయి)

(ఆయన విలాసంగా రూళ్ళకర్ర ఊపుతూ జవాబులిస్తుంటాడు)

మొదటి జర్నలిస్టు : సార్...శవాలకు పోస్ట్‌మార్టమ్ జరిపిన్రా?

ఐ.జి : అవును! పోస్టుమార్టమ్ అయిపోయింది గదా...

జర్నలిస్టు : ఎక్కడ జరిపిండ్రు సార్....

ఐ.జి : పోలీస్ స్టేషన్లనే పోస్టుమార్టమ్ జరిపినం

రెండో జర్నలిస్టు : గదేంది సార్.. పోస్టుమార్టమ్ పోలీస్‌స్టేషన్ల జేసుడేంది? ఎక్కడైనా... హాస్పిటల్‌ల జేస్తరు గదా..

ఐ.జి : అరేభై...మీ జర్నలిస్టులకేంది... మస్తు చెబుతరు... రాస్కోండి... నేను చెప్పినట్టు రాస్కోండి. అక్కడ రక్షణ లేదుగాబట్టి ఇక్కడ జేసినం... రాస్కోండి... రాస్కోండి.

మొ.జ : సార్.. ఇది నిజమైన ఎన్‌కౌంటర్ గాదనీ... నిరాయుధులైన ప్రజల మీద ఏకపక్షంగా కాల్పులు జరిగాయని జనం అంటున్నారు.

ఐ.జి : వాళ్లకేందయ్యా... నరంలేని నాలుక మస్తుగ మాట్లాడుతరు.. నేనొక బాధ్యత గల ఆఫీసర్ని చెబుతున్నా. అది పర్‌ఫెక్ట్ ఎన్‌కౌంటర్.

రెం.జ : దీనికేమన్నా ఆధారాలున్నాయా సార్?

ఐ.జి : ఆధారాలేంది? మా జవాన్లు ఆరుమంది గాయపడ్డరు గదా.. తెల్వదా?

మొ.జ : వాళ్ళెక్కడున్నరు సార్... వివరాలేమయినా చెబుతారా?

ఐ.జి : సారీ...సెక్యూరిటీ కారణాల వల్ల కుదరదు.

మొ.జ : సార్... చనిపోయిన వాళ్ళల్ల పిల్లలున్నారని వాదనలు విన్పస్తున్నాయి.

ఐ.జి : ఉండి ఉండొచ్చు. చీకట్ల ఎట్ల దెలుస్తది. అయినా చిన్న పిల్లల్ని చంపడం మా ఉద్దేశం కాదు. అది మావోయిస్టులు జేస్తరు. ఆ సమయంల మావోయిస్టులు పిల్లలనడ్డం బెట్టుకొని, పారిపోనీకే జూసిన్రు... క్రాస్ ఫైరింగ్‌ల పిల్లలు చనిపోయిన్రేమొ. పిల్లల చావుకు కూడా మావోయిస్టులే కారణంగాని మేం అసలేగాదు... అయినా వుయ్ ఆర్ సారీ ఫర్ దట్.

రెం.జ : సార్.. అసలు అక్కడ మావోయిస్టులే లేరనీ, ఉన్నదల్లా మామూలు ఆదివాసీలేననీ, వాళ్ల దగ్గర కనీసం గూడ ఆయుధాలు లేవంటున్నరు గదా...

మూ.జ : వాల్లు మావోయిస్టులేననడాన్కి మీ దగ్గర..

ఏమయినా... ఆధారాలున్నాయా.

ఐ.జి : ఫస్ట్ పాయింట్, వాళ్ళలో చాలా మట్టుకు మావోయిస్టులే... కాకా సమ్మయ్య, కాకాదినేష్, సర్కే రామన్న వీళ్ళంతా కరడుగట్టిన మావోయిస్టులే..వీళ్ళ మీద చత్తీస్‌ఘడ్ స్టేషన్లలో బోలెడన్ని కేసులున్నాయి.

మొ.జ : అయితే అది ఆదివాసీల "ఇత్తనాల పండుగ" సభ గాదంటారా?

ఐ.జి : ఖచ్చితంగా... అది మావోయిస్టుల శిక్షణా శిబిరం అని మా దగ్గర ఆధారాలున్నాయి. దీన్తోబాటు అక్కడ మాకు విప్లవ సాహిత్యం, ఎల్.సి.డి. లు పాలితిన్ టెంట్‌లు, సోలార్‌సెల్‌లు, ఇంకా అత్యాధునిక గన్‌లు కూడా దొరికాయి. రాసుకోండి.. రాసుకోండి.. ఇంతకంటే మీకేం ఆధారాలు గావాల్నో చెప్పండి.

రెం.జ : సార్ మీరు జేస్తున్నదంతా కంపెనీల కోసమేనని ప్రజలు అంటున్నారు.

మూ.జ : అడవిలో ఉన్న ఖనిజాల్ని కంపెనీలకు అప్పజెప్పనీకె... ఆదివాసీల్ని అడవిలకెల్లి ఎల్లగొట్టనీకె సైన్యాన్ని దించుతున్నరంటున్నరు గదా!

ఐ.జి : కాదు. కంపెనీలకు మాకు ఏ సంబంధమూ లేదు. అది గవర్నమెంట్ చూసుకుంటది. మేం కేవలం మావోయిస్టుల్ని ఏరివేసి దేశంలో శాంతిభద్రతలు రక్షించడానికి మాత్రమే ఇక్కడికి వచ్చాము.దయచేసి రాజకీయ చర్చలొద్దు.

మొ.జ : సర్...శవాలను అసలు పోస్ట్‌మార్టంకు జేసినట్టు గూడ కన్పించలేదు.

ఐ.జి : (కొంచెం దగ్గి) మీరసలు సరిగా చూళ్ళేదు. ఆ చూడండి.. నాకు అవతల అర్జంటు మీటింగుంది. తర్వాత కలుద్దాం. ఉంటా.

4వ అంకం

(ప్రజాసంఘ బాధ్యురాలితో ఆదివాసీ స్త్రీలు)

(అదొక గుడిసె...అరుగు మీద కొన్ని దీపాలుంటాయి. కొంచెం లోపలికి పోతే అక్కడ అర్ధచంద్రాకారంలో దీపాలు వెల్గుతుంటాయి. వాటి వెనుక స్త్రీలు కూచొని ఏడుపులాంటి పాటను ఎత్తుకుంటారు. వాళ్ళ ముందర చనిపోయిన వాళ్ళ ఫోటోలు పెట్టబడి ఉంటాయి. ఒక ప్రజా సంఘ బాధ్యురాలు అందులోకి ప్రవేశిస్తుంది)

బాధ్యురాలు : గుమ్మంల దీపాలు పెట్టుకున్నరు ఎందుకమ్మా?

మడ్కం మంగ్లి : పండుగ జేసుకుందామనుకుంటే, దినాలు జేసుకుంటున్నమమ్మా.

మడ్కం కమల : ఇత్తనాలపండుగ జేసుకుందమని బాసగూడకు ఎక్కడెక్కడోల్లంత వచ్చిన్రమ్మా. ఇప్పుడు పండుగకు ఎవ్వరు లేరమ్మా.

మడ్కం సుగ్లి : మా మొగొల్లు వొయిన్రు... మా బిడ్డలు వొయిన్రు. మా తండ్రులు వొయిన్రు.. మా ఆశలేవోయినయమ్మా... మాకు దిక్కే లేకుండా పోయింది.

బాధ్యురాలు : ఏమయ్యింది?

మడ్కం కమల : ఇత్తనాల పండుగ గురించి మాట్లాడుకొనీకె అందరం సభ పెట్టుకున్నం. అంతట్లనే సిఆర్పీ వాల్లొచ్చి, మా వొల్లను పిట్టల్ని గాల్చినట్టు గాల్చిన్రమ్మా.

బాధ్యురాలు : అయ్యో! ఎంతపనయ్యింది. బయట ఒక పిల్లగాడు ఏడుస్తుండె. రెండు ఏల్లు తెగినట్లున్నయి. యాడాది ఉంటదా? ఏమయ్యింది.

మడ్కం మంగ్లి : అమ్మా గా పోరని బతుకు ఘోరం. తండ్రి కాల్పులల్ల చనిపోయిండు. తల్లిని ఆగం జేసి చంపిన్రు.

మడ్కం కమల : పుట్టిన యాడాదికే తల్లినీ తండ్రినీ పొట్టనవెట్టుకున్నరమ్మా పాపిష్టి కొడ్కులు.

మడ్కం సుగ్లి : మమ్ములను బత్కనీయకుండా తగిలిన్రమ్మా. తరిమి తరిమి కొట్టిన్రమ్మా. అడవిల ఉండనిస్తలేరు. సిఆర్పీలు, జుడుమోల్లు గల్సి మా భూములు గుంజుకున్నరు. మా ఇండ్లు కాలవెట్టిన్రు. భయపడి అడవులల్ల దాక్కునెటోల్లం. కొందరమయితే క్యాంపులల్లనే అవస్థలు పడ్డం.

బాధ్యురాలు : మరి... క్యాంపులిడ్సి పెట్టి ఎందుకొచ్చిన్రు మీరు?

మడ్కం కమల : ఆడ ఏమున్నదమ్మా. ఈడంటే మా చెట్లున్నయి. మా మ్యాకలున్నయి, మా బర్లున్నయి, మా ఇండ్లున్నయి, ఆడేముంది. మన్ను మశానం.

మడ్కం మంగ్లి : జర్రనయిమయిందని ఈడ్కి వొస్తె, ఏకంగా మావొల్ల పానాలు దీసిండ్రు.

మడ్కం సుగ్లి : గిట్లయితదనుకుంటే, ఈడికి రాకుంటిమి.

బాధ్యురాలు : రాండి... అక్కడంతా మనొల్లు వొచ్చిన్రు. బాసగూడలో ఏం జరిగిందో.. అల్లతో చెప్పుదురు గాని. మీకు జర్గిన అన్యాయం బయటోల్లకు గూడ దెల్వాలె గదా!

అందరు : పదుండ్రి... పోదాం...

5వ అంకం

ప్రజా సంఘాలతో ఆదివాసీల భేటీ

సభ్యుడు : మీరు దేని కోసం మీటింగు పెట్టుకున్నారు.

ఇర్పా రమేష్ : భూములు ఉన్నోల్లు, లేనోల్లు ఉంటరు గదా. అందుకని మీటింగ్ పెట్టుకున్నాం.

సభ్యుడు : భూములు కొందరికి ఎందుకు లేవు?

ఇర్పా దినేష్ : అయ్యా, గీ సల్వాజుడుం దాడి జేసి నప్పుడు కొందరు ఇక్కడ ఉండలేక ఎల్లిపోయిన్రు. ఇప్పటికీ కొందరు అక్కడే ఉంటున్రు. ఈ నడుమ చాలా మంది తిరిగి వొచ్చిన్రు...

మడ్కం సురేష్ : అల్లకు భూములు పంచాలె గదా...అందుకని అందరికీ భూముల చూయించనీకె మీటింగ్‌లు పెట్టుకున్నాం సారు.

సభ్యుడు : ఈ ఘటన ఎన్ని గంటలప్పుడు జరిగింది?

ఇర్పా రమేష్ : సీకటి పడ్డంక మేం కూడుకున్నం. ఒక్క గంట సేపు మేం మాట్లాడుకున్న మేమె. భూముల గురించి అయినాంక,

పశువుల గురించి మాట్లాడుకున్నం...ఎందుకంటే కొందరికి పశువుల్లేవు. వానలు పడ్తున్నయి గాబట్టి దున్నటం మొదలు పెట్టాలె గదా.

ఇర్పా దినేష్ : గంతేసారు. నాల్గు దిక్కుల నుండి పటపట తూటాలచ్చినయి. మొదలు పడమటి దిక్కు నుండి దూసుకొచ్చినయి. ఇట్ల కూచొని మాట్లాడ్తున్న ముగ్గురు అట్లనే ఒరిగిపోయిన్రు. గా దెబ్బకు అందరం చెదిరిపోయినం.

మడ్కం సురేష్ : అసలు ఎక్కడ్నుంచి కాల్పులు జర్గుతున్నయో అర్థం గాలె. అంతా గందరగోళం. ఎక్కడోల్లం అక్కడ లేసి పరుగులు దీసినం.

ఇర్పా రమేష్ : ఈసారి అన్ని దిక్కుల నుండి కాల్పులు మొదలయినయి. అరుపులూ, కేకలూ... ఏడ్పులూ...పెడబొబ్బలూ.. పారిపోతున్నోల్ల మీద గూడ తూటాలు పడ్డాయి.

సభ్యుడు : ఆ తర్వాత?

ఇర్పా దినేష్ : అట్ల కాల్చుకుంట, నాల్గు దిక్కుల నుండి వందల మందితో దేగల్లలాగ కమ్ముకొచ్చిండ్రు...దగ్గిర కొచ్చినంక కొనా ఊపిరతో తండ్లాడ్తుంటే మల్ల గాల్చిన్రు...చచ్చిన్రో...లేదో జూసి మల్ల గాల్చిన్రు.. చచ్చిందాక గాల్చిన్రు...

మడ్కం సురేష్ : మేమేమొ అరవై మందిమి...ఆల్లేమో వందల కొద్దీ ఉన్నారు. ఆల్ల చేతులల్ల పెద్ద పెద్ద తుపాకులున్నాయి.

ఇర్పా రమేష్ : కాల్పులకు పదిహేను మంది ఇక్కడే ఇగో ఇక్కడే పడిపోయిన్రు.. ఇక్కడ ఒకాయన అక్కడ ఒక పోరడు. అక్కడా, అక్కడా ఇంకా పానం పోకుండా తండ్లాడుతన్నోల్ల దగ్గరికొచ్చి కాల్చిన్రు... కొందర్ని పొడిచి సంపిన్రు. పారిపోతున్నోల్లను పట్టుకొని కాల్చిన్రు... అద్దగంటల మొత్తం ఈ జాగనంతా పోలీసోల్లు ఆక్రమించేసుకున్రు.

సభ్యుడు : చనిపోయిన వాల్లల్ల పిల్లలున్నారా?

మడ్కం మంగ్లి : ఔన్సార్... అర్గురు పిల్లలున్నారు... వాల్లల్ల బడికిపోయి సదువుకునే టోల్లున్నారు.

మడ్కం సుగ్లి : ఈ దాడిల పన్నెండేల్ల పోరి "కాక సరస్వతి" చచ్చిపోయింది. సూడ ముచ్చటైన పిల్ల సారు. అదుంటే ఏడిండ్ల గలగల... పెదోల్లు మాట్లాడగూసుంటే తాను.. పాపం అక్కడికొచ్చింది.

మడ్కం కమల : ఒక్కసారిగా కాల్పులు మొదలపెట్టంగనే భయంతోటి ఉరికింది. తూటా దెబ్బ తగిలి పోరి అక్కడిదక్కన్నే పానమిడ్చింది సారు.

సభ్యుడు : ఇంకా మిగిలినోళ్ళు?

మడ్కం సుగ్లి : "కాకా రాహుల్..మడకం విలాస్"లు పిల్లలేసారు. ఈల్లు బాసగూడల పదో తరగతి చదువుకుంట, హాస్టల్ల ఉంటున్నారు.

మడ్కం మంగ్లి : ఆదున్న బతికెటోల్లేమొ. ఎండకాలం సెలవులల్ల ఇంటికొచ్చిండ్రు... పానం బోగొట్టుకున్నరు.

మడ్కం కమల : మడ్కం ముత్తయ్య కొడ్కు "దిలీప్' కూడా పదహారేళ్ళోడే. ఎనిమిదవ తరగతి దాంక సదివి విడిపెట్టిండు. ఇప్పుడు ఇంటి దగ్గర్నే ఉండుకుంట తండ్రికి వ్యవసాయంల సాయం చేస్తుండు.

మడ్కం సుగ్లి : ఇగబోతే సార్కినగూడకు చెందినోల్లు ఇద్దరున్నరు. ఒకడు "అప్కమేటు" రెండోడు "ఇర్పారమేష్". రెండో పోరడు కాల్పులల్ల గాయపడితే పోలీసోల్లు స్టేషన్కి తీసుకపోయిండ్రు. అక్కడ్నుంచి బీజాపూర్ దవాఖాన్ల జేర్పిస్తే, ఆడు అక్కన్నే చనిపోయిండు సారు.

సభ్యుడు : ఇంకా ఎవరెవరున్నారు?

మడ్కం కమల : సార్... చనిపోయినోల్లల్ల అన్నదమ్ములున్నరు, తండ్రికొడుకులున్నరు.

మడ్కం మంగ్లి : ఒక సెక్యూరిటీ గార్డు కూడా ఉన్నడు. ఆయన ఇత్తనాల పండుగ కోసం హైద్రాబాద్ నుండి ఈడికొచ్చి పానం బోగొట్టుకున్నడు. ఇంకొకాయన ప్రొక్లెయిన్ నడిపిస్తడు.

మడ్కం సుగ్లి : జనం పారిపోతుంటె ఎంటవడి కాల్చిన్రు. అచ్చం జంతువుల్ని వేటాడినట్లే జేసిన్రు సార్.

మడ్కం కమల : బొంద తవ్వనీకె మనుష్యులు దొరకలేదు. ఒక బొంద అయినంక ఇంకో బొంద తవ్విన్రు.

మడ్కం సురేష్ : మడ్కం పుల్లయ్య గాయపడితే కనీసం దవఖానకు తీసుకపోలే.

ఇర్పా రమేష్ : కొందరు పోరలు గాయపడితే బద్నాం అయితమని బీజాపూర్ దవఖానకు, జగ్దల్పూర్ దవాఖానకు తీసుకపోయి ఆడనే ఇడ్సిపెట్టిండ్రు.

సభ్యుడు : మరి... పోలీసులు గూడ గాయపడ్డరని అంటున్నరు గదా?

మడ్కం మంగ్లి : అది నిజమే సార్. సభలో ఉన్నోల్లను చుట్టుముట్టి నాల్గు దిక్కుల గాల్చడం తోటి ఆల్ల తూటాలు ఆల్లకే తగిలినయి. అంతే గాని మా చేతులల్ల ఒక్క బాణం గాని, కర్ర గాని లేదు.

మడ్కం కమల : వాల్లనువాల్లే కాల్చుకొని... నింద మా మీద మోపుతున్నారు సార్.

మడ్కం సుగ్లి : ఇకగిది సరిపోదని... బందిపోట్ల లాగ ఇండ్ల మీద పడి దాచుకున్నదంతా దోచుకపోయిండ్రు. కోళ్ళను, మేకలను కూడా ఎత్తుకపోయిండ్రు సార్.

మడ్కం కమల : మూడు ఊర్లల్ల ఒక్క ఆడమనిషిని కూడా వదల్లేదు సార్. అందర్ని ఆగం జేసిండ్రు.

మడ్కం మంగ్లి : సిఆర్పీలొస్తె ఆగం జేయకుండా పోరు. తల్లి ముందర పిల్లల్ని, పిల్లల ముందర తల్లుల్ని, భర్తల ముందర భార్యల్ని ఆగం జేస్తరు. సెప్పుకొనికె రాదు.

సభ్యురాలు : గదేంది ఇంతమంది ఉండగా ఎట్లజేస్తరు. మీరంతా అడ్డం తగలరా? ఎట్లా?

మడ్కం కమల : అమ్మా మెడమీద, చాతిమీద తుపాకి పెట్టి బెదిరిస్తరు. చెట్లచాటుకు తీసుకపోయి ఆగం జేస్తరు.

మద్కం సుగ్లి : ఏం జేస్తం పిల్లల కోసం బతకాల గదా! పానం కన్నా మానం ఎక్కువ గాదుగదా!

సభ్యురాలు : అయ్యో! ఇంత ఘోరమా?

మద్కం కమల : చెప్పుకుంటె గుట్టలు కరుగుతయ్. ఆడోల్లను పసురాలకన్న హీనంగ జూస్తరు. పిల్లలు, పెద్దలు ఏడ్చినా, మొత్తుకున్నా ఇడ్చిపెట్టరు.

మద్కం మంగ్లి : అసలు ఆడొల్లున్నదే ఆగం జేయనికె అన్నట్టు చేస్తరు. ముసలొల్లను, పచ్చి బాలింతలను కూడా వదిలి పెట్టరు.

మద్కం సుగ్లి : ఆల్లు మనుసులు కారమ్మా పసురాలు అంతకంటే హీనం... మా బతుకులు మొత్తం నాశనం అయిపాయే.

(మంగ్లి, సుగ్లి, కమల)
దీపాల ఎల్గుల పాటల్లుదామంటె
దీపాలారీయాయె, పాటేమో రాదాయె (2)
ఇది మేఘాలు ముసిరిన రాత్రి
కటిక చీకట్లు కమ్మిన రాత్రి (2)
కాలనాగులు బుసకొట్టిన రాత్రి
ఇది బతుకంత వెంటాడె రాత్రి (2)

6వ అంకం

(ఆదివాసీలు అందరూ ఒకచోట గుమిగూడుతారు)

కమల : రామ్ రామ్ దాదా.. రామ్ రామ్

అందరు : రామ్ రామ్.. రామ్ రామ్

దినేష్ : ఏం మంగ్లి గట్టున్నవు.. జరమొచ్చిందా.. ఏం?

మంగ్లి : జరంగిరం ఏం లేదన్నా.. యాపని జేసినా పానం కుదుర్తలేదన్న. అన్నం తిన బుద్దయితలేదు.. నిద్రవస్తలేదు. మ ఆటిమాటికీ గాపోరలే యాదికొస్తున్నరు.

సుగ్లి : అక్కా. గా బీజాపూర్ దవాఖాన్ల మద్కం మున్నా, మద్కం పుల్లయ్యల్ని పోలీసులు ఇడ్సిపెట్టిపోయిన్రుగదా... ఆడగా పోరగాల్లను జూసెటోల్లులేక.. దిక్కులేని సావుసచ్చిన్రక్కా.

రమేష్ : గంతేగాదు.. గాజగ్దల్పూర్ దవాఖాన్ల సోమ్లు, ధర్మయ్యకు మస్తురక్తం బోయిందట.. తూటాలు కడ్పుల ఉండంగనే కాలం జేసిన్రంట..

సురేష్ : ఇంకోసంగతి జెప్పాలె.. మొన్న ఇద్దరు రైతులు పొద్దున్నే పొలంకాడికి వోతుంటే.. పట్కపోయి కాల్చిసంపిన్రంట. ఆ తరువాత శవాల్ని తీసుకపోయి స్టేషన్ల పడేసిండ్రట.

రమేష్ : మరి మనోల్లు ఏమీ అన్లేదా?

సురేష్ : ఊకుంటరా.. వందల మంది మనోల్లు వొయ్యి స్టేషన్ చుట్టుముట్టి ఎవ్వర్ని కదలనియ్యలేదు. రోడ్డు మొత్తం బంద్ పెటిన్రు.. మస్తులొల్లి వెట్టినంక శవాల్ని ఇచ్చిన్రట.

రమేష్ : ఆఖరికి శవాల్ని తెచ్చుకోనీకె కూడా యుద్ధం చేయాల్సి వస్తున్నది.

సురేష్ : గీడ బతుకూచావు రెండు యుద్ధమే అయితున్నవి.

సుగ్లి : గిట్ల ఎంతకాలమే.. అన్నా..

దినేష్ : అదేందిబిడ్డ అట్లంటవ్. గిది మనకు కొత్తనా ఏం? భూమి పుట్టినకాడ్నించి మనబత్కు యుద్ధమేనాయే.. పులుల్తోటి గొట్లాడ్తిమి.. కొండచిలువలతోటి గొట్లాడితిమి.. తెల్లోనితోటి గొట్లాడితిని. నల్లోనితోటి గొట్లాడ్తిమి.. వానలు జూస్తిమి.. ఎండలు జూస్తిమి.. తుఫాన్లు జూస్తిమి.. గిప్పుడుగిది జూస్తున్నం.. గుండెధైర్నం జేసుకోవాలె.. బత్కునిలవెట్టుకోవాలె.

సురేష్ : అవ్.. గీఅడివిల బత్కునిల వెట్టుకోవాలంటే.. యుద్ధం జేసుడేగదా!

కమల : అడివిడిస్తే నీరిడ్సిన చాపలమే అయితము..

మంగ్లి : అవ్మల్ల.. అడివినిడిసేది లేదు.. ఆగమయ్యేది లేదు..

సుగ్లి : అందరం కలిసుండాలె.. ఊర్లు ఇడువొద్దు.. పన్లు జేసుకోవాలె. జంగ్ జేయాలె.

అందరూ : పన్లుజేసుకోవాలె.. జంగ్ జేయాలె
అడివినిడిసేది లేదు.. ఆగమయ్యేదిలేదు..

7వ అంకం

(ప్రభుత్వం సహాయాన్ని తిరస్కరించడం)

ఏమంటున్నది? ఏమంటున్నది?
గట్టుమీద ఆవు ఏమంటున్నది
తన తియ్యని పాలు అన్నీ
ఆదివాసీకే చెందాలన్నది (2)
ఏమంటున్నవి? ఏమంటున్నవి?
చెరువుల కలువలు ఏమంటున్నవి?
నీళ్ళను తోడీ చేపల చంపే
కల్లె సర్కార్ పోవాలన్నది (2) ॥ఏమంటున్నది॥

మొలకల భూమీ ఏమంటున్నది?
సమిష్టి సాగుల సంపదలు పండంగ
జనతన సర్కార్కు జేజేలన్నది (2)
ఏమంటున్నది? ఏమంటున్నది
రేలాపాట ఏమంటున్నది?
అడవి గుండెల స్వాగతమన్నది
ఆదివాసులకు అండగున్నది (2) ॥ఏమంటున్నది॥

దండకారణ్యమేమంటున్నది?
ధ్వంసమైన చోటనే నిలిచి
శాంతి కోసమే యుద్ధమన్నది (2)

ఆర్.డి.ఒ - క్లర్కు

క్లర్కు : (ఊరివైపు చేయి దాపు పెట్టి చూస్తూ) సార్. ఎవ్వరొస్తలేరు సార్. మూడు రోజులాయే ఒక్కనా కొడుకు వస్తలేడు. ఈ ఆదివాసీ కొడుకులకు ఇంత గర్ర ఎందో అర్థమై సస్తలేదు.

ఆర్.డి.ఓ : రాకపోని మనకెందుకు? వస్తే ఇత్తం లేకపోతే లేదు. వాపసు తీసుకపోయి ఆడవడేతం.

క్లర్కు : సార్... ఊల్లకు పోయి... బియ్యం గిట్ల తీస్కపోమ్మని చెప్పాలనిపిస్తుంది కాని భయమేస్తున్నది.

ఆర్.డి.ఓ : ఎందుకు ఆ భయం ?

క్లర్కు : అసలే తమ వాల్లు చనిపోయిన్రన్న కోపంల ఉన్నారు. కొట్టినా కొడ్తరు సార్.

ఆర్.డి.ఓ: మరెందుకు చెత్త ఆలోచన. సప్పుడు గాకుండా ఊకోరాదు.

క్లర్కు : సరే సార్.

* * *

(ప్రజా సంఘాల వాళ్ళు ఒక చోట నిలబడి పరిశీలిస్తుంటారు)

మొ.సభ్యుడు : అక్కడ ఏదో చింతచెట్ల కింద షామియానా లేసినట్లున్నరు.

రె.సభ్యుడు : ఔనౌను. ఏవో లారీలు,వ్యాగన్లు నిలబడ్డయి. ఏవో తెచ్చినట్టున్నరు. అక్కడెవరో ఆఫీసరు కూసున్నట్టున్నడు. పోదాం పాండి సంగతి కనుక్కుందాం. (అందరూ అక్కడి చేరుకుంటరు)

సభ్యురాలు : సార్ మేమంతా ప్రజా సంఘాల వాళ్ళం. మీరు?

ఆర్.డి.ఒ. : ఓ మీరంతా ప్రజాసంఘాల వాళ్ళా, వెల్‌కమ్. నేను బీజాపూర్ ఆర్.డి.ఓ కురవంశి నండి.

మొ.సభ్యుడు : సర్ ఏవో తెచ్చినట్టున్నరు.

ఆర్.డి.ఓ : యస్...యస్...ఆదివాసీల సహాయం కోసం పప్పులు, బియ్యాలు,దుప్పట్లు తెచ్చినం మూడు రోజులయ్యింది. తీసుకుకపోనీకె ఎవ్వరు వస్తలేరు. జర మీరన్న చెప్పుండ్రి సార్ ప్లీజ్.

రె.సభ్యుడు : మేమెట్ల జెప్తం సార్. అది వాల్లు డిసైడ్ చేసుకుంటారు.

సభ్యురాలు : సార్ గిది నిజమైన ఎన్‌కౌంటరేనని మీరు భావిస్తున్నారా?

ఆర్.డి.ఒ : ఇంకా ఇన్వెస్టిగేషన్ పూర్తికాలేదండి.

సభ్యురాలు : సార్..చంపబడ్డవాల్లంతా నక్సలైట్లేనా?

ఆర్.డి.ఒ : అందులో కొందరున్నారని వాల్లంటున్నారు.

సభ్యురాలు : వాళ్ళు అంటే?

ఆర్.డి.ఒ : అదేనండి! బీజాపూర్ ఎస్.పి., సి.ఆర్.పి.ఎఫ్. ఐ.జి గారు.

మొ.సభ్యుడు : ఓహో! పోలీసులు, కేంద్ర బలగాలు కలిసే కుట్ర జేసారన్నమాట.

ఆర్.డి.ఒ : అదంతా మాకు తెల్వద్.

రె.సభ్యుడు : (వ్యంగంగ) మరి తమరెందుకొచ్చినట్టో?

ఆర్.డి.ఒ : జస్ట్ ఫర్ రిహెబిలిటేషన్. దట్సాల్.

సభ్యురాలు : సార్...ఓ వైపు వాళ్ళను నక్సలైట్లు అంటున్నరు. మరోవైపు సహాయ కార్యక్రమాలందిస్తామంటున్నారు.

రె.సభ్యుడు : అంటే నక్సలైట్లకు కూడా సహాయక కార్యక్రమాలు అందుతున్నాయనుకోవచ్చా?

ఆర్.డి.ఒ : నో కామెంట్స్

(పరిగెత్తుకుంటూ వచ్చి)

క్లర్కు : సార్.. సార్... ఆదివాసీలంతా దండుకుదండు వస్తున్నరు సార్ అల్లు బియ్యం కోసం కాక దాడి కోసం వస్తున్నట్లు ఉన్నరు సార్.

ఆర్.డి.ఓ : రాని మనకేం కాదు. అరచి, అరచి వాల్లే పోతరు. మనం గమ్మునుండాలే.

(మెల్లగా నినాదాలు మొదలై, జోరందుకుంటాయి..)

ఆదివాసిల ఐక్యత.. వర్థిల్లాలి

కంపెనీల పెత్తనాలు... నశించాలి

పోలీసులు జులుం.. నశించాలి

(వాళ్ళు రావడంతోనే మాటల యుద్ధం మొదలైంది. గూడు కట్టుకొన్న వేదనంతా జ్వాలలుగా ఎగజిమ్మింది.)

మడ్కం మంగ్లి: అయ్యా..మావోల్లను మావోయిస్టులని సంపిండ్రు గదా! ఇగో గీ పిల్లలు గీసిన్న పోరలు గూడ మావోయిస్టులే. సంపుర్రయ్యా. సంపుర్రీ.

మడ్కం కమల : అందర్ని సంపుర్రి. సంపి ఆ తరువాత తీరిక మీద పప్పులు బియ్యాలు పంచుర్రి.

మడ్కం సుగ్లి : సిగ్గు లేదా! మా బిడ్డల్ని మీరు పొట్టన పెట్టుకుంటే... మీరిచ్చే బియ్యాన్ని మేం దినాల్నా?

మడ్కం మంగ్లి : ఆదివాసీలకు సీము, నెత్తురు లేదనుకున్నరా? మీరిచ్చే రక్తపు కూడుకు ఆశ పడ్తరనుకున్నరా? సిగ్గులేదూ...

మడ్కం కమల : (రేషన్ కార్డులు జూపిస్తూ) ఇగో...గివి మా రేషన్‌కార్డులు. గివి మా పిల్లల సర్టిఫికేట్లు. మాక్కూడ మా పిల్లల్ని డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లను చేయాలని ఉంది.

మడ్కం సుగ్లి : మమ్ముల సదువుకోమంటరు. సదువుకునే పిల్లల్ని కాల్చి సంపుతరు. ఇదేం లెక్క? ఇదేం సర్కార్?

ఇర్పా నారాయణ : ఇంకేం జేస్తరు మీరు? మా చెరువుల గంజుకుంటిరి. మా గూడేలు తగులబెడ్తిరి. మా బదుల నాశనం జేస్తిరి. మా బత్కులు నాశనం జేస్తిరి.

ఇర్పా రమేష్ : నాశనం జేసేటోడు ఎక్కడైనా ఆదుకుంటడా? పులి జింకమీద జాలి పడ్తదా?

మడ్కం మంగ్లి : కంపెనీల కోసం అడవికి అగ్గి పెడ్తున్నరు. మాకు ఎరుకలేదా, మమ్ముల ఎల్లగొట్టి అడవి మొత్తం గా దిక్కుమాలిన కంపెనీలకు అంటగట్టాలని జూస్తున్నరు.

మడ్కం కమల : సొగసీయం గుర్తువెట్టుకొంట్రి,సొగసీయం.

కోర్స నందు : మీ సాయం మాకు ఒక్క పుల్లగూడ వొద్దు... మీరెంత నాశనం జేసిన మేం బాగజేసుకుంటం. అడవి జోలికొస్తే తిరగవడ్తం.

క్లర్కు : గదేందమ్మా... మీరు మా మీద ఎగవడ్తున్రు. గిది మన రాష్ట్ర సర్కారు పంపింది. మీకు సాయముంటుందని దెచ్చినం. గంత కోపమైతే ఎట్లా?

మడ్కం మంగ్లి : హు... రాష్ట్ర సర్కారు పంపింది. గీ రాష్ట్ర వోడు సర్కారు గా ఢిల్లోడు అంతా ఒక్కటే..

మడ్కం కమల : అంతా తోడు దొంగలు.మమ్ముల దోచనీకెనే గదా వచ్చింది.

మడ్కం సుగ్లి : ముందు మీ పోలీసోల్లు ఇక్కడ్నుంచి కదలాలే. ఎల్లిపోవాలే.

మడ్కం మంగ్లి : ఔను. ఈడ నుండి ఎల్లిపోవాలె. మీరంతా దోచనీకె వచ్చిన్రు. ఎల్లిపోండి, ఎల్లిపోండి మా బతుకులు మేం జూసుకుంటం.

మడ్కం సుగ్లి : మా జోలికొస్తే ఊకునేది లేదు. అడివిని ఇడ్సిపెట్టం. అడివిని కాపాడుకుంటం.

మడ్కం కమల : మీ కంపెనీ వోడు మీరు అడివినిడ్సి ఎల్లుండ్రి లేకపోతె తరిమి కొడ్తం.

కోర్స నందు : పొలం పనులు జూసుకొనే మా తమ్ముడు బిచ్చాను పొట్టను పెట్టుకొని,మాకు బిట్టలియ్యనీకె వచ్చినార్రా. వొద్దు, మాకొద్దు.

మడ్కం సురేష్ : చలేజా యహాసె... నహీతో జలాదేంగె తెరె గాడీ మోటర్‌కో చీర్‌దాలుంగా బద్మాష్ క్షైంకీ, చలేజా తేరీ... ఝూటా సర్కార్ కహీక...

అందరు : చలేజా చలేజా. ఝూటా సర్కార్ ముర్దాబాద్

అందరూ కోపంగా తమ తమ గూడాలకు వెళ్ళిపోతారు

నిప్పులు జిమ్మెను - నింగికెగిసెనూ
ఆకుఆకునా - అగ్గిరగిలెనూ (2)
చిందిన రక్తం - దొసిలిబట్టీ
ఒరిగిన బిడ్డల - యాదిలనిల్చీ (2)
రేపటి పంటకు - ఇత్తునౌతానని
పిడికలెత్తినది - ఉరిమిజూసినది (2)
బాసగూడ జూడో - నాయన
బాసచేసినాదో - నాయన (2)
అడవిలో పుట్టిన - అలజడిజూసి
ప్రపంచమంతా - ఉలిక్కిపడ్డది (2)
పుడమితల్లికి - పురుటినొప్పులూ
కొత్తమనిషికీ - జన్మనిచ్చెనూ (2)

జనతన సర్కారుకో- నాయన
జేజేలన్నది రో - నాయన (2)

నేపథ్యంలో
కంపెనీ పెత్తనాలు- నశించాలి (2)
పోలీసు జులుం - నశించాలి (2)
ఆదివాసీల మీద దాడులు - ఆపేయాలి (2)
జల్-జంగల్-జమీన్ - హమారా హై (2)
యహ్ కిసీకా జులుం - నహీ చల్తా హై (2)
ఆదివాసీ పోరాటాలు - వర్ధిల్లాలి (2)
జనతన సర్కార్ - జిందాబాద్ (2)

*(ఈ నాటకం రిహార్సల్స్‌లో పాల్గొని, దర్శకత్వం వహించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం థియేటర్ డిపార్ట్‌మెంట్ పరిశోధక విద్యార్థులు **పి. నాగరాజు, జంపన్నలకు**, పిజి విద్యార్థి **అభినయ్ శుక్లాకు** విరసం సాంస్కృతిక బృందం కృతజ్ఞతలు తెలియజేస్తోంది. అలాగే మాకు వెన్నుదన్నుగా నిలిచి అవసరమైన సూచనలు చేసిన **కాకరాలకు** విరసం సాంస్కృతిక బృందం కృతజ్ఞతలు తెలియజేస్తోంది.)*

Statement about ownership and other particulars of periodical **ARUNATARA** as required to be published in the first issue of every year after the last day of February.

Form IV (See Rule 8)

1. Place of Publication	:	Vijayawada
2. Periodicity of its Publication	:	Monthly
3. Printer's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram Vijayawada-520 002.
4. Publisher's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram Vijayawada-520 002.
5. Editor's Name	:	Chalasani Prasad
Whether citizen of India	:	Indian
Address	:	33-13-3, Seetarampuram Vijayawada-520 002.
6. Name and addresses of Individuals who own the newspaper	:	Chalasani Prasad

I, Chalasani Prasad, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(Chalasani Prasad)
Date : 1st March, 2014 Signature of the Publisher

కథ

ఓటు

- బమ్మిడి జగదీశ్వరరావు

"ఓటు...ఒక హక్కు! ఓటు....ఒక బాధ్యత! ఓటు.... ప్రజాస్వామ్యం ప్రజలకు ఇచ్చిన వరం! పాశుపతాస్త్రం! ఓటు... ఒక అవసరం! ఓటు... ఒక అవకాశం! ఓటు... ఒక శక్తి! ఓటు... ఒక యుక్తి" అని పెద్దలూ మేధావులూ, నాయకులూ పదేపదే అదే పనిగా పిలుపునిచ్చారు.

'నేను ఊహ తెలిసినప్పటి నుండి ఓటేస్తూనే ఉన్నాను' గొప్పగా చెప్పాడు ఓటరు.

'ఓటుకు వెయ్యకండి శిలువ...ఉంది దానికి ఎంతో విలువ!' స్వచ్ఛంద సేవా సంస్థలు ఇప్పటికి అదే తమ అజెండాగా చేసుకున్నాయి.

'ఓటు విలువ మా కెందుకు తెలీదు? అప్పుడు అయిదూ పదీ ఇచ్చేవారు. ఆ తర్వాత వంద వెయ్యి...ఇప్పుడేమో నాలుగైదు వేలుకు పెరిగింది. ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే అంత డబ్బు!' ఓటరు ఇవన్నీ చెప్పొచ్చునో లేదో అన్నట్టు ఆగిపోయాడు.

'ఓటు విలువని డబ్బుతో కొలవలేం...వెలకట్టలేం' సినిమా తారలూ క్రికెట్టు వీరులూ సందేశమిచ్చారు.

'నిజమే డబ్బుంటే అందరూ అన్ని పార్టీలూ పంచుతున్నాయి. డబ్బుతో పాటు గిఫ్ట్‌లు కూడా ఇస్తున్నారు.ఒకప్పుడు చెప్పులు, గొడుగులూ, చీరలూ ఇస్తే- ఇప్పుడేమో మిక్సీలూ, గ్రైండర్లూ టీవీలూ, ఫ్రిజ్‌లూ, లేప్‌టాపులూ గిఫ్టుగా ఇచ్చే వీటిని ఏం లెక్క కడతాం?' ఓటరు చెప్పినా అతని గొంతు జన ప్రవాహంలో వినిపించలేదు.

'మద్యానికి అమ్ముడు పోవద్దు. అమ్మడం కొనడం అసలే వద్దు! ప్రసిద్ధ వ్యాపారస్తులూ, ప్రముఖ రచయితలూ చెప్పిందే చెప్పారు. 'మద్యం మేం కొనడం లేదు, అమ్మడం లేదు. మంచినీళ్ళకూ దిక్కులేదు, పోసిన మద్యమైనా తాగొద్దా? గొంతెండి చచ్చిపో మంటారా?' ఓటరు కూసింత సిగ్గు పడ్డాడు.

'ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. ఓటు వేయకపోవడం నేరం, ఘోరం...' గొంతు చించుకున్నాయి పేపర్లు, టీవీలు.

'అందుకేగా ఒకటికి నాలుగు ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతున్నాను...' విశ్వాసంతోనే కాదు, దేశభక్తితోనూ చెప్పాడు ఓటరు.

'ఈ దేశం దశ దిశ మార్చేది ఓటు ఒక్కటే, ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా ఓటెయ్యాలి...' ఎక్కడికక్కడ నయా కళాకారులు, నవ్య గీతం పాడి ఆడారు.

'అవునండి... దశ దిశ మారిపోయి ఊరికి దరిద్రం చుట్టుకుంది. ఊరు రెండుగా చీలిపోయింది... కుటుంబాలు వేరు కుంపట్లు అయ్యాయి...' చెమర్చిన కళ్లతో చెప్పాడు ఓటరు.

'ఓటు ఓ శాంతి సాధనం... ఓ విముక్తి గీతం...' దేశభక్తులు, డెమోక్రాట్లు ప్రజాస్వామ్యాన్ని చూసి పండగ చేసుకుని మరీ పులకరించిపోయారు.

'శాంతీ లేదు... భద్రతా లేదు, ఊళ్లు తగలబడిపోతున్నాయి... జనం కొట్టుకు ఛస్తున్నారు, శవాలు లేస్తున్నాయి...' ఓటరు తను కన్నది... ఉన్నది ఉన్నటు చెప్పాడు.

'ఓటు ఎవరికి పడితే వారికి వెయ్యొద్దు' అంది ట్విట్టరు.

'ఎవరకి పడితే ఆళ్ళకెందుకేస్తాం, మా కులపోడికి వేస్తాం గాని!' ఓటరు పిచ్చి ప్రశ్న అన్నట్టుగా చూసాడు.

'ఓటు వేసే ముందు అన్నీ ఆలోచించి వెయ్యాలి' అంది ఫేసుబుక్కు.

'ఔను కదా? మా ప్రాంతం వాడూ, మా మతం వాడయితే మంచిదే కదా?! మీరూ అలాగే కదా నియోజక వర్గాలు కేటాయించింది?! ఏ సామాజిక వర్గమెక్కువో వాళ్ళకే గదూ మీరు సీటిచ్చింది' ఓటరు అనుభవమ్మీద చెప్పాడు.

ఓటరుని అందరూ అన్ని విధాలా ప్రోత్సహించి ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతుంటే మన పాత్ర ఉండొద్దూ అని ఆలోచించిన కార్పొరేట్ కంపెనీలు 'మీరు ఓటేస్తే, మా కంపెనీ వస్తువులపై డిస్కౌంట్ ఇస్తాం. హొటళ్ళలో, ఫిట్‌నెస్ సెంటర్లలో మీరు వేసినట్టు 'మచ్చ' పడ్డ వేలు చూపిస్తే చాలు...స్పెషల్ డిస్కౌంట్లు ఇస్తాం...' అని పెద్ద ఎత్తున ప్రకటించేసాయి.

'ఓటు వేస్తే చాలు... నీ జీవితమే కాదు, ప్రపంచం మొత్తం మారిపోతుంది' అని కాలేజీ కుర్రాళ్ళూ - ఇంకా 'ఓటు వెయ్యని వాళ్ళకు పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయి' అని ఆధ్యాత్మిక పీఠాధిపతులూ ఇలా ఎవరికి వారే పిలుపునిచ్చారు.'నీ చూపుడు వేలుని ఓటింగ్ మిషను ట్రిగ్గర్ మీద పెట్టు...ఊఁ' అని మాజీ అన్నలు సయితం ఓటర్ని ఉగ్రూతలూగించారు, ఉత్సాహపరిచారు. 'ఓటు వెయ్యకపోతే ఏడుస్తూ కూర్చొవాలి' రావ్ గాయని రాగం తీసింది.అందరూ కలిసి ఓటర్ని ముందుకు తోసారు.

మలమల మాడ్చే మండుటెండని మిల మిలలాడే మల్లె దండాగా ఓటరు కదిలాడు. క్యూ కట్టాడు. 'ఓటు వేస్తే..నీ జీవితం బాగు పడుతుంది' మాటలేవో చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.పద్నాలుగు పదిహేను దఫాలుగా ఓటు వేస్తూనే ఉన్నాడు. మచ్చ పడుతూనే ఉన్నాడు. 'ఇంత మంది చెప్పిన మాట ఇకనైనా నిజం కాకుండా పోతుందా? అని ఆశపడ్డాడు.అరవైయ్యారేళ్ళుగా అదే పనిగా ప్రతిసారీ వేసాడు ఓటు!

ఓటరుకు వయసుడిగిపోయిందేమో నిప్పులు చెరిగే ఎండకు కుప్పకూలిపోయాడు. కాదు కాదు, సూర్యుడు చూసి చూసి చూడలేక ఆగ్రహించాడు..మండింది మరి.

పోలింగు బూతులున్న చాలా చోట్ల పదుల సంఖ్యలో ప్రాణాలు విడిచారు. అయినా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారు. మన ఓటరుకి

లాఠీ బుడియా

- బెల్లపు అనూరాధ

"ఏయ్ మేడం! ఇధర్ ఆవ్!"

ఆ గొంతు కంచులా ఖంగున మోగింది. ఆ కంఠంలో పలికిన అథార్టీ, మైకు అక్కర్లేనంత బిగ్గరగా పలికిన ఆ స్వరం విన్నాక – ఆ కంఠం కలిగిన మనిషిని చూసి బిత్తర పోయాను. ఆ స్వరానికీ, ఆ మనిషికీ ఏం సంబంధం లేదు. "ఒక్క నిమిషం ఇలా రా!" నన్ను చూస్తూ చేతిలో లాఠీని తాటిస్తూ పిలిచింది కనక ఇక సందేహం కూడా ఏమీలేదు. నన్ను పిలిచింది ఆమే! వయసుభారంతో వంగిపోయిన నడుము. చిన్నగా కత్తిరించిన జుట్టు కి మాత్రం ఇంకా పూర్తి వృద్ధాప్యం రాలేదు. సగం మాత్రమే నెరిసింది. మోకాళ్ళదాకా కట్టుకొన్న చీర, పీక్కుపోయిన చెంపలు, లోతుకుపోయిన కళ్ళూ. పక్కనే పాత గుడ్డలతో సగం కుట్టిన సంచి.

ఓహ్! బహుశా సూదిలో దారం ఎక్కించడానికి కావచ్చు. దీనికైతే ఇంకెవరినైనా పిలుచుకోవాల్సిందే. ఈ మధ్య నేను ఒక రోజు సూదిలో దారం ఎక్కించలేక పోయాను. రీడింగ్ గ్లాసెస్ తీసుకోవాలి. ఒక్క క్షణంలో నా లోపల కలిగిన ఇన్ని ఆలోచనల్ని చెల్లా చెదురు చేస్తూ, "ఈ రోజు ఏం తేదీ?" అన్నదామె.

"ఇరవైమూడు" అన్నాను. ఆమె సాలోచనగా చూసి "చబ్బీస్ జనవరి ఇంకా ఎన్ని రోజులుంది?" అని అడిగింది. రెండు నెలలు అన్నాను. "రెండు నెలలా? ఆమె భారంగా నిట్టూర్చింది. "ఈరోజు పేపరు వచ్చిందా!"

"ఆ వచ్చింది." "నా గురించి ఏమన్నా రాసారా?" ఆరా తీసింది. నాకు కొంచెం నవ్వూ దానితో పాటు జాలి కలిగాయి. ఆమె గురించి పేపర్లో ఏం వచ్చే అవకాశం ఉంది? ఏం రాలేదు అన్నాను.

"ఈ దొంగ పిల్లలు నన్ను ఆట పట్టిస్తున్నారు, చూడు! రానీ కాళ్ళు విరగ్గొడతాను. అయినా నువ్వు పేపరు జాగ్రత్తగా చూడు. చబ్బీస్ జనవరికి నేను విడుదలయిత, పేపర్ల ఇస్తరు. నీకు అంగ్రేజి కూడా వస్తదంట కదా? అంగ్రేజి పేపర్ల కూడా జూడాలే!" అన్నది. అప్పటికి నా బుర్ర వెలిగింది. చబ్బీస్ జనవరి అంటే "రిపబ్లిక్ డే" సందర్భంగా సాధారణంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల జేస్తుంటారు కనక ఆ విషయం అడుగుతుందని అర్థం అయ్యింది.

"అద్సరే కానీ చాచీ (పిన్ని) నేను నీ బిడ్డలాంటి దాన్ని. నేను కూడా నీలాంటి ఖైదీ నే. నన్ను మేడమ్ అంటున్నవెందుకు? బేటీ అను." ఆమె బోసి నోటి తో గలా గలా నవ్వింది.

"మాయమ్మే! దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు. నువ్వు జల్ది ఇంటికి పోతావు. మీ ఆయన నిన్ను ముద్దులాడతాడు!" అంటూ నాబుగ్గలు పుణికింది. అప్పటికే ఆమెని అల్లరి పట్టించిన ఆడపిల్లలు గుమికూడి .....పకపక నవ్వారు. నాకు భలే సిగ్గనిపించింది.

"ముసల్ది చూడు! రంగీలా! అన్నీ అట్లాంటి దీవెనలే ఇస్తుంటది." అంది నవ్వుతూ రేష్మి. ముసలామె మెల్లగా ఏదో పాటందుకొని పక్కనున్న సగం కుట్టిన సంచి తీసి చక్కగా సూదిలో దారం సునాయాసంగా ఎక్కించి కుట్టుపని మొదలుపెట్టడం చూసి నోరెళ్ళబెట్టాను.

అలా మొదలయ్యింది ఆమెతో నా పరిచయం. ఆమెను పేరుపెట్టి ఎవ్వరూ పిలవరు. అందరూ లాఠీ బుడియా అనే అంటారు. మాట్లాడేటప్పుడు మాత్రం నాలాంటి కొందరు చాచీ అంటారు. ఆమె మాత్రం నన్ను "మేడమ్ బేటీ" అని పిలవడం మొదలు పెట్టింది.

ఇంకా ప్రాణం పోలేదు. రెప్ప ఆర్పకుండా చూస్తూనే ఉన్నాడు.

ఫోటోలు క్లిక్ మన్నాయి! కెమేరాలు 'లైవ్' ఇచ్చాయి!

'నీళ్ళు...నీళ్ళు...' అరిచారు. పరిగెత్తారు.

'మంచినీళ్ళు మా ఊళ్ళో దొరకవు...' కాళ్ళీడ్చుకొని వచ్చి గొంతు పెగుల్చుకొని చెప్పాడు చేతుల్లేని ఓటరు.

'అయిదు వేల అయిదొందల గ్రామాలకు మంచినీటి సౌకర్యమే లేదు మన రాష్ట్రంలో' టీవీల్లో తెల్ల చొక్కాల చర్చ ఇంకా సాగుతూనే ఉంది.

'నీళ్ళు...నీళ్ళు' అరుస్తూనే ఉన్నారు!

'ఈ కోక్ నాది...దాహం వేస్తే నేనేం చేసేది? నేను డ్యూటీ చెయ్యాలా వద్దా?' పోలింగ్ సిబ్బంది ఒకరిదే కాదు, అందరిదీ అదే మాట.

'ముందా ఓటర్ని నీడకు తీసుకు వెళ్ళండి...' అరిచారెవరో. నలుగురూ కలిసి ఓటర్ని ఓటు వేయక ముందే గెలిపించినట్టు – ఊరేగింపులా మోసుకుపోయారు.

'మాకు ఉండడానికే సెల్టరు లేదు, మా డ్యూటీ మమ్మల్ని చేసుకోనివ్వరా?' పోలింగు సిబ్బంది అందరిదీ అదే మాట.

ఓటర్ని ఎండలోకి తెచ్చి దించారు...

'డాక్టర్ని పిలవండి..'

'కనీసం హాస్పెటల్ ఎక్కడుందో చెపుతారా?'

'మా ఊళ్ళో హాస్పెటలూ లేదు, డాక్టర్లూ లేరు...' రోగులేవున్నారన్నట్టుగా వినిపించిందో గొంతు.

'టౌనుకు తీసుకువెళ్ళాలంటే...?'

'మా ఊరుకు రోడ్లు లేవు...' ఇందాకటిదే గొంతు.

'పండ్లరసం...పౌష్టికాహారం తీసుకుంటే ఇలా జరిగేది కాదు'

'మాకు భూముల్లేవు. పనుల్లేవు. పంటల్లేవ్' మళ్ళీ అదే గొంతు.

'మరేమున్నాయి మీకు?' విసుగుతీరా ధ్వనించింది స్వరం.

'ఎలక్షన్లు' అందరిదీ ఒకే గొంతు.

'ఏం చేస్తున్నారు' స్వరం తీవ్రమైంది.

'ఓట్లేస్తున్నాం!!' సామూహిక స్వరం.

ఓటరు మాత్రం గొంతు కలపలేదు.

ఎంత చెప్పినా మేడమ్ పదాన్ని వదిలిపెట్టదు.

ఆమె ప్రతిరోజూ ఉదయం లాకప్ తెరిచాక సంచిలో ఏవేవో సామాన్లు పెట్టుకొని కుట్టుపని బట్టలు తీస్కుని కర్ర (లాఠీ) పోటెసుకొంటూపోయి మహిళా బ్యారక్ లో ఒకటో నంబర్ వార్డు పక్కనే వున్న పిల్లల స్కూల్ వరండా మీదకి చేరేది. ఇక సాయంత్రం వరకు అక్కడే కూర్చుంటుంది. స్కూల్ వెనుకనే వున్న వేప చెట్టుకింద పాత ఖైదీలెవరో పరిచిన బండల మీద కూర్చుని స్నానపానాదులు ముగించుకొని అక్కడే ఉతికిన బట్టలు ఆరబెట్టుకుంటుంది.

ప్రతి రోజూ నేను స్కూల్ వైపు పోయినప్పుడు ఆమె నన్ను తారీకు, చబ్బీస్ జనవరి రావడానికి ఎన్ని రోజులు పడుతుంది? అనే విషయం అడుగుతూనే ఉండేది. అది రానూ వచ్చింది. పోనూ పోయింది. ఆమె చాలా నిరాశ పడింది. మళ్ళీ పంద్రాగస్టు కోసం ఎదురుచూపులు.

\- - -

ఆదివారం జైల్లో చాలా ప్రత్యేకమైన రోజు. ఆరోజున మహిళా మూలాకాతీ జరుగుతుంది. మహిళా ఖైదీలు తమ కుటుంబ సభ్యులను కలిసే కార్యక్రమం. మధ్యాహ్నం రెండు తరవాత ఒక అరగంట సేపు అందర్నీ జైలు కార్యాలయం ముందున్న వరండా లో కలుసుకోనిస్తారు. ఇక్కడ దాదాపు 85% మంది మహిళలకు ఎవరో ఒక కుటుంబ సభ్యులు వున్న వాళ్ళే. కాబట్టి ఆ కార్యక్రమం అంతా ఏదో ఒక జాతరకు పోతున్నట్టే ఉంటుంది. జైల్లో మంట నిషిద్ధం. కాబట్టి వంట కూడా నిషిద్ధమే. ఆ ఒక్కరోజు అన్ని నియమాలను ఉల్లంఘించి మహిళలు ఏదో ఒకటి తమ వాళ్ళకోసం చేస్తుంటారు. మహిళలలో ఉండే సృజనాత్మకత బయటపడేదంతా ఇక్కడే.

ఉదయం నాస్తా కోసం ఇచ్చే నాన బెట్టిన శనగలను రోజూ ఎండబెట్టి ఉంచుతారు. శనివారం రాత్రి వాటిని మళ్ళీ నానబోసి ఉదయాన్నే గచ్చు కడిగి రాయితో నూరుతారు. దానిలోనే జైల్లో ఎవరోవొకరు నాటిన పచ్చిమిరపకాయలు తెంపి, వారం,వారం ఇచ్చే కొంచెం ఆవనూనెని దాచిపెట్టి ఆ ఇంతలోనే పకోడీలు చేసే ప్రయత్నం చేస్తుంటారు. అన్నం తినడానికిచ్చే జర్మన్ సిల్వర్ పళ్ళెలే మూకుళ్ళు. మూడు రాళ్ళ పొయ్యి కింద కాదేదీ మంట పెట్టడానికనర్హం అన్నట్టు కాగితాలు, ఎండుటాకులు, పళ్ళుదోమ్ పుల్లలు, ఖాళీ సెలైన్ బాటిల్స్ ఇలా ఏవి దొరికితే అవి పొయ్యికిందకి చేరుకొంటాయి.

అలా పకోడీలు చేసిన వాళ్ళెవరైనా లాఠీ బుడియాకి కూడాఓ రెండు ఇస్తుంటారు. లేదా తానే ఎవరినైనా అడుగుతుంటుంది. అవి జాగ్రత్తగా ఆకులో చుట్టి, చీర చెంగు అంచున మూట కడుతుంది. ఇక పదిసార్లు కేకలేసి టైమ్ అడుగుతా ఉంటుంది. జోరు జోరుగా పాటలు పాడుతుంది. అందరికన్నా ముందెళ్ళి గేటు దగ్గర కూర్చుంటుంది.

మూలాకాతీ కోసం గేటు గంట మోగించగానే పేర్లు పిలిచే కార్యక్రమం మెుదలుపెట్టక ముందే బయటకు తోసుకొని వెళ్ళిపోతుంది. మెల్లగా కర్ర పోటేసుకొంటూ మెయిన్ గేట్ వైపు నడక మొదలు పెడుతుంది. పూర్తిగా నడుం వంగిపోయిందేమో మెల్లగా నడుస్తుంది. దాదాపు 85 మంది పేర్లు, వాళ్ళు కలవాల్సిన వాళ్ళపేర్లు పిలిచేసరికి ఆమె గేటు దగ్గరికి చేరుకొంటుంది. ముసలాయన, ఆమె కొడుకు ఆ టైంకు చేరుకొంటారు. కొడుకు అయిదు నిమిషాలు మాట్లాడి క్యాంటీన్ నుండి కొనుక్కొచ్చిన రెండు జిలేబీలో,మిఠాయిలో ఆమె చేతిలో పెట్టి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ముసలావిడా, ముసలాయన కూర్చుని బోసినవ్వులతో ముచ్చట్లు పెట్టుకొనేవారు. వాళ్ళ అన్యోన్య దాపంత్యం ఖైదీలతో పాటు, జైలు సిబ్బందికీ ముచ్చటే. కొన్నాళ్ళకి తాను అంత దూరం వెళ్ళలేనని పైగా ఆ గుంపులో ఒకరిమాట ఒకరికి వినపడక తామిద్దరూ మాట్లాడుకోలేకపోతున్నామని చెప్పి లాఠీ బుడియా సరిగ్గా మధ్య దారిలో ఉన్న చెట్టుకింద కట్టిన గట్టు మీదనే కూర్చుని మాట్లాడుతానని మొండికేసింది. హెడ్ వార్డర్ కోప్పడుతాడని సిపాయి నసిగితే నాలుగు చీవాట్లు పెట్టింది.

"ఇంటికి పంపెయ్యరాదు? మంచిగా ఇంట్లనే ముచ్చట్లు పెడతా!" అన్నది.

"ఆ.....ఇగ నిన్ను ఇంటికి పంపే "పవరు" నాకే ఉన్నది మల్ల" వెటకారమాడాడు సిపాయి.

"పవరు లేదు కదా! మల్ల నోరు మూసుకొని ఉండరాదు? "పవరున్నోన్ని" పంపియ్యి. ఆని తోనే కొట్లాడుతా." అన్నది. ఆమె కొట్లాడాల్సి వస్తే ఎవ్వరికీ జంకేది కాదు. ఎదుట ఉన్న వాళ్లెవరైనా సరే జైలర్ గాని, సూపరింటెండెంట్ కానీ, తనిఖీలకి వచ్చే జడ్జిలను గాని తనని ఇంటికి పంపాలని డిమాండ్ చేసేది. అయితే వాళ్ళంతా అది తమ పరిధిలో లేదనే వాళ్ళు. ఎవరినడిగినా ఆమె "బర్కరార్" అయ్యిందనే వాళ్ళు. అంటే ఏమిటో సరిగ్గా ఎవ్వరికీ తెలియదు. భాషా సమస్య వల్ల నాకు అర్థం కాలేదు. చివరికి, చదువుకొన్న సునీతని అడిగాను. ఆమెకూ, ఆమె భర్తకూ, కొడుకు కు కింది కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష వేసింది. హైకోర్టుకు అప్పీల్ చేస్తే అక్కడ కూడా శిక్ష "ఖరారు" అయ్యింది. అదే బర్కరార్ అవ్వడం అంటేనని చెప్పింది. అంటే ఆమెనిప్పుడు కేవలం సుప్రీం కోర్టు మాత్రమే విడుదల చెయ్యగలదు.

ఒకరోజు లాఠీ బుడియా నన్ను కూర్చోబెట్టి తననెలాగైనా విడుదల చెయ్యించమని వేడుకొన్నది. "మేడమ్ బేటీ! నువ్వు చాలా మందికి సాయం చేశావు. నువ్వొక మాట చెప్తే అయిపోతది. ముసల్దాన్ని నా మీద దయుంచు." అన్నది. నాకు ఆమె అమాయకత్వం చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. నేను రాజకీయ ఖైదీనే కానీ వకీలునైనా కాను. కనీసం చట్టం తెలిసిన మనిషినైనా కాక పోతిని. ఒకవేళ తెలిసినా చేయగలిగిందేమీ ఉంది? అర్జీలు రాయడం తప్ప. ఆమె నాతో ఇలా చెప్తుంటే అక్కడే కూర్చున్న రింకూ "ముసలాయనా ఇక్కడే ఉన్నాడు. నీ కొడుకూ ఇక్కడే ఉన్నాడు. ఇంటికి పోయి ఏంచేస్తావ్? "అంది.

"నాకు ఇంకా బిడ్డల్లేరా? మనుమలు, మనుమరాండ్రు లేరా? ఆళ్ళందర్నీ కళ్ళారా జూసుకోవాలే. ఆళ్ళ మధ్యనే కడతేరిపోవాలే బేటీ! నేనీ జైళ్ల సావ! నన్నిడిసిపెట్టమని జెప్పు." అంటూ కుమిలి, కుమిలి ఏడ్చింది. ఆమెను ఏమని ఓదార్చాలి?

"కోడల్ని సంపినప్పుడు తెల్వదానే ముసల్దానా?" రింకూ వదల్లేదు. ముసలామె చివ్వున తలెత్తింది. "నేను సంపిన్నా కోడల్ని? పై నున్నోడు సూస్తలేడా?" ఆకాశం కేసి వేలు పెట్టి చూపెడుతూ అంది. "అసలు ఫైసలా అక్కడ అయితది. నేను సంపింటే నా తల తెగి పడుద్ది. నాకీ శిచ్చ ఏసీ నోడిని ఆ పైనోడే చూసుకొంటడు....." ఆ పైన ఏడుపు గొంతుతో ఆమె అంటున్న మాటలు ఆమె కంఠం రుద్ధమవ్వడం వల్ల కొంత, ఆ ఝార్కండ్ హిందీ సరిగ్గా అర్థం అవ్వక కొంతా నాకు తెలియలేదు. నాకు అర్థమయ్యిందంతా ఆమె చాలా కాలమే శిక్ష అనుభవించింది. ఇప్పుడీ వృద్ధాప్యంలో ఆమె పడుతున్న

కష్టం మాత్రం వర్ణనాతీతం.

నా కళ్ళ ముందే ఆమె మరో మూడు "చబ్బీస్ జనవరి"లు, మూడు "పంద్రాగస్టు"లు చూసింది. ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతూ ఇంటికెళ్ళి అందరిమధ్యా ప్రాణాలు విడవడంకోసమే, ప్రాణాలు నిలబెట్టుకోడానికి ఆ ముసలామె పడుతున్న కష్టం ఎంత దయనీయం? ఇంత వరకే అయితే అదొక తీరు. కానీ తొందరలోనే ముసలామె ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు తెలిసాయి నాకు. ఒకటి ఆమెకి టీబీ ఉంది. దానికన్న పెద్ద కష్టం ఆమె గర్భసంచి జారిపోయి శరీరం బయటికి వచ్చేసింది. అదొక నరకం ఆమెకి. చంటిపిల్లలకి న్యాప్కిన్ లు కట్టినట్టు బట్ట కట్టుకోవాల్సి వచ్చేది. దానినుండి వచ్చే కష్టాలు చెప్పుకోలేనివి. అప్పుడప్పుడు జైలుకి వచ్చే మహిళా డాక్టర్కి చెపితే చూసింది. కానీ ఆపరేషన్ని తట్టుకోగలిగే వయసు కాదావెది. డాక్టర్ చెయ్యగలిగేది ఏమీ లేదని తేల్చేసింది. అయితే నన్ను షాక్ చేసిన సమాచారం ఒకటి తర్వాత కాలంలో నాకు తెలిసింది. ఆ గర్భసంచి బయటికి వచ్చిన వైనం గురించిన సమాచారం అది. ఆమెకి ఆఖరి బిడ్డ కలిగిన కొద్దికాలం తర్వాత ఏదో రోజువారీ గొడవలలో భాగంగా ఆమె భర్త ఆమె పొత్తికడుపు మీద తంతే ఆ గర్భ సంచి అలా కిందికి జారిందట. ప్రాణమ్మీదికొచ్చినా ఆమె ఆపరేషన్ చెయ్యించుకోలేదు. చేయించుకోకపోడానికి డబ్బులు లేవన్నది కాదు. అవి ఎలాగూ లేవు. ఆమె ఆపరేషన్ చెయ్యించుకోనని మొండికేసిందట. అది భర్త మీద ఆమె చేసిన తిరుగుబాటు. అతను చేసిన తప్పుకి ఇంకెప్పుడూ ఆమె దగ్గరకు రాకుండా ఆమె "అతనికి" వేసిన ఒక భయంకర శిక్ష. వింటుంటే వొళ్ళు జలదరించింది నాకు.

ఆమెని ఎలా అర్థం చేసుకోవాలి నేను? మూర్ఖత్వానికి పరాకాష్ట అనుకోవాలా? ఒక అసహాయ మహిళ కుటుంబహింస కి వ్యతిరేకంగా చేసిన ఒక తిరుగుబాటు అనుకోవాలా? ఇంత జరిగాక ఆమె భర్త తో అంత అన్యోన్యంగా ఎలా ఉండగలుగుతోంది? బహుశా ఆయన మారాడేమో? పశ్చాత్తాప పడ్డాడేమో? ఇన్ని బాధలతో ఆమె అలా ఎలా నవ్వగలుగుతోంది? ఎలా హాస్యోక్తులాడుతోంది? అర్థం చేసుకోవడానికి నా జీవితానుభవం ఏమాత్రం సరిపోలేదు. కానీ నాకు తెలియకుండానే ఆమె పట్ల ఒక అపేక్ష కలిగింది.

ఏ ప్రభుత్వ అధికారి వచ్చినా ఆమె విడుదల కోసం ఒక అర్జీ ఇచ్చే వాళ్ళం. ఆమె కష్టాలు వివరంగా చెప్పేవాళ్ళం. ఆమెకి న్యాయ సహాయం అందించమని అర్థించేవాళ్లం. జైళ్ళ ఐ.జి.కీ, గవర్నర్ కూ అర్జీలు పెట్టేవాళ్ళం. ప్రతి కాగితం ఆమెలో కొత్త ఆశలు నింపేది. ప్రతి అధికారీ, ప్రతి జడ్జీ సానుభూతితో పరిశీలిస్తామనీ వెంటనే నోట్ చేసుకొని, సిఫారసు చేస్తామనే వాళ్ళు. కానీ ఏమీజరిగేది కాదు.

\- - -

నేను వచ్చాక నాలుగో చబ్బీస్ జనవరి అయ్యాక జరిగిందది. ఎప్పటిలా ములాకాతీకి పోయింది. ముసలాయన రాలేదు. ఆరోగ్యం బాగోలేక జైలు ఆసుపత్రిలో ఉంచారని తెలిసింది. ఇక ఆమె దిగులికి అంతం లేదు. కొంచెం బాగయ్యాక ఆయన రాగలిగినప్పుడు ములాకాతీకీ తీసుకుపోతామని సిబ్బంది నచ్చ చెప్పినా వినేది కాదు. ప్రతి ఆదివారం ఆ గట్టు మీద ఒంటరిగా కూర్చుని ముసలాయన కోసం అరగంట ఎదురుచూసి వచ్చేది. ఈలోపు ఆమె కొడుకు శిక్ష పూర్తయ్యి విడుదలయ్యి వెళ్ళిపోయ్యాడు. ముసలాళ్ళిద్దరూ మిగిలిపోయారు. వీళ్ళిద్దరూ కింది జైల్లో ఉండగా బెయిల్ పై విడుదలయ్యాక కొంత కాలం బయట వున్నారు. హైకోర్టు లో ఒక పదేళ్ళ తర్వాత శిక్ష ఖరారు అయ్యాక ఈవృద్ధాప్యం లో మళ్ళీ జైలుకి వచ్చారు. కొడుకు ఎన్నడూ బెయిల్ మీద బయటికి పోలేదు కనక అతని శిక్ష ముందు పూర్తయ్యింది. నన్ను మర్చిపోక కొడుకా అని అతను వెళ్ళేటప్పుడు పొగిలి పొగిలి ఏడ్చింది.

ఎప్పుడు ముసలాయన గురించిన వార్త వింటామో అని గుబులు గుబులుగా ఉండేది. చివరికి ముసలాయన పరిస్థితి విషమించిందని బయట ఆసుపత్రికి తీసుకుపోయారని తెలిసింది. నాలుగో రోజు వచ్చిందా ఖబురు. ఆమెకి ఏమీ చెప్పకుండానే వీల్ చెయిర్ తీసుకొచ్చి ఆఫీసులో పిలుస్తున్నారు పదా అని రమ్మనగానే అందరికీ అర్థం అయ్యింది. బహుశా ఆమెకి కూడా. కుటుంబ సభ్యులను పిలిపించి శవాన్ని అప్పగించారు.

ఆమె తల్లడిల్లిపోయింది. ప్రతి రోజూ ఆకాశం కేసి చూస్తూ "అమ్మా నన్ను బయటికి తీయమ్మ? ఇంటికి పొయ్యేదాకా ప్రాణాలు నిలుపమ్మా...."అని ఏడ్చేది. 80యేళ్ళు పైబడ్డ ఆ ముసలామె కన్నతల్లిని తలుచుకొని అలా రోదిస్తుంటే మాలో ఎవ్వరికీ ముద్ద దిగేది కాదు.

\- - -

ఆమెని ఓదార్చటానికి నా దగ్గర ఏమీ మాటలు లేకపోయినా రోజూ ఆమె దగ్గర కాసేపు కూర్చోనే దాన్ని. తిండి తినమని కొప్పడేదాన్ని.

ముసలాయన చనిపోయిన వారానికి ఆయనికి పదో రోజు ఖర్మకాండ చెయ్యాలనీ, దానికి కావల్సిన సామాను, తనకి చీర, ఇత్తడి గాజులతో సహా ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆమె పట్టుపట్టిందంటే ఇంక దానికి తిరుగులేదు. ఆమె పేరున నాతో అర్జీ కూడా రాయించింది. తొమ్మిదో రోజున ఆమె కొడుకు ఆ వస్తువులన్నీ తెచ్చాడు. అయినా సరే జైలర్ తనకి ఇవ్వాల్సిందే అని పట్టుపట్టి సాధించుకొని మరీ ఖర్మకాండ జరిపింది.

స్నానం చేసి తెల్లచీర కట్టుకొని ఇత్తడి గాజులు వేసుకొన్నది. కొద్దిగా అన్నం తిని నడుం వాల్చింది. సాయంత్రం పూట ఒకసారి ఆమెని పలకరిద్దమని స్కూలు వైపు నడిచాను. ఆకాశం వైపు చేతులూపుతూ ముసలామె తనలో తానే మాట్లాడుకొంటూ కనపడింది.

నన్ను చూడగానే "మేడమ్ బేటీ, చూశావా ముసలోడు పైకి పోయినా బుద్ధి పోనిచ్చుకొన్నాడు కాదు." అంది. అదెలా అని అడిగితే, "నేనలా నడుం వాల్చానా తెల్ల బట్టలు కట్టుకొని కల్లోకి వచ్చాడు. అంతా బాగుంది. బేషుగ్గా చేశావ్. కాసింత ఆలుగడ్డల వేపుడు చేస్తే నీ సొమ్మేమ్ పోయింది అన్నాడు. నేను ఉలకలేదని, అదుగో ఆ చెట్టు మీదెక్కి రాయేశాడు. ఇదిగో చూడు!" అని చిన్న గులకరాయి చూపించింది.

"ఏ కాకో పడేసినట్టున్నది లే" అని కొట్టి పడేశాను.

"ఊర్కోవమ్మా ఒక్క పిట్టకూడా లేదిక్కడ. ముసలోడి నైజం నాకు తెల్వదా ఏంది?" అని కొప్పడింది.

"రేపు పావుకిలో ఆలుగడ్డలు తెప్పించిపెడతావా? పైసలున్నాయ్..... ముసలాయనకి ప్రాణం కొట్టుకుంటుందేమో ఆలుగడ్డలకోసం." కొంగు చివర ముడేసిన పైసల కోసం విప్పబోతుంటే వారించడానికి చెయ్యిపట్టుకొని, నాదగ్గరున్నయిలే ఆలుగడ్డలు తెస్తాను". అంటుంటే నా కళ్ళలో కప్పేసిన నీటితెరలోంచి లాఠీ బుడియా రూపం మసక మసగ్గా కనిపించింది.

– – –

ఒక రోజు హటాత్తుగా నన్ను రమ్మని కబురుపెట్టింది.

“నేను జేలర్ తోని మాటాడతా! ఒకసారి పిలిపిస్తవా?” అంది. “ఆఫీసుకి తీసుకుపోనా?” అన్నా! ఆమె తల అడ్డంగా ఊపింది. “ఈడకే పిలిపించాలి. అందుకేగా నీకు చెప్పిన. నువ్వు పిలిస్తే వస్తాడు.”

“నేను పిలిస్తే కాదు. మనం పిలిస్తే....మనం అందరం పిలిస్తే వస్తాడు. రాక తప్పదు.” అన్నా.అప్పటికప్పుడు అన్నీ వార్డుల వాళ్ళని సమావేశ పరిచి మరుసటిరోజు జైలర్ వచ్చేవరకూ అన్న పానాదులు బంద్ పెట్టాలని నిర్ణయించుకొన్నం. హెడ్ వార్డర్ ని పిలిచి విషయం చెప్పాం. ఉదయం ఛాయ్ నుంచీ ఏదీ ముట్టం అని స్పష్టం చేశాం. వాతావరణం లోని వేడిని గమనించి అతను సరే అని వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఉదయం చాయ్ తో పాటుగా హెడ్ వార్డర్ కూడా వచ్చి, “మీరు చాయ్ నాస్తాలు తీసుకొంటేనే తాను 8.30 కీ వచ్చి కలుస్తానన్నాడు జైలర్ సాబ్” అని కబురు తెచ్చాడు. ఓటమిలో కూడా తనదే పైచేయి ఉండాలనే అతని నైజం అర్థం అయినా అది మా అందరి విజయం గనక చాయ్, నాస్తా తీస్కున్నం. మాట ప్రకారం చెప్పిన టైంకే మందీ మార్బలం తో జైలర్ వచ్చాడు.

కఱ్ఱ పోటేసుకొంటూ, కాళ్ళు వణుకుతుంటే తిరగేసిన లంబకోణంలా ముసలామె మెల్లగా నడుచుకొంటూ జైలర్ ఎదుటికి వచ్చింది. కఱ్ఱ మీద భారం వేసి మెల్లగా నడుం ఎత్తి నడుం మీద చెయ్యి పెట్టుకొని నిటారుగా నిలబడింది. జైలర్ కేసి సూటిగా చూసింది. కొద్ది క్షణాలు అక్కడంతా మౌనం. ఏం అడుగుతుందో అని అందరూ ఉత్సుకతతో చూస్తున్నారు. “ఏం కావాల్నో అడుగు! సార్ ఇస్తాడులే” అన్నది వెనుక నించి సీత. జైలర్ మొహంలో ఈ మాట తో కొద్దిగా రిలీఫ్ కనిపించింది. ఆయన ఏదో అనబోయేంతలోనే ....

“నిన్నింకా జైల్ల ఎందుకు పెట్టలేదు?” ఆ ప్రశ్న ముసలామె నోటినుండి తూటాలా దూసుకొచ్చింది. ఖంగుమనే కంఠ స్వరంతో, మొహం అంతా జేవురించిపోగా, ఎఱ్రబడ్డ కళ్ళతో ముసలామే ఆ ప్రశ్న తననే వేసిందనే విషయం అర్థం కావడానికి జైలర్కే కాదు, మా అందరికీ కొంచెం టైమ్ పట్టింది. అర్థం అయ్యాక బిత్తరపోవడం జైలర్ వంతయ్యింది.

“నా ముసలాయన సచ్చిపోతే నన్ను ఇంకా ఎందుకు అరెస్టు చెయ్యలే అని అడుగుతున్నా.” అని రెట్టించింది ముసలమ్మ. “ఇది బాగుంది. నేను చంపిన్నా ఏంది?” వెటకారంగా నవ్వుతూ అన్నాడు జైలర్.

“మరి నన్నెందుకు జైల్ల బెట్టింరు? నేను జంపిన్నా కొడల్నీ ? నా ఇంట్ల కోడలు సచ్చిపోతే నన్ను, నా ముసలాయన్ని, నా కొడుకుని తెచ్చి జైల్ల పెట్టింరే? మరి నా ముసలాయన సచ్చిపోతే నిన్నూ నీ డాక్టర్ ని జైల్ల పెట్టాల కదా? ఎందుకు పంపలేదూ అంట. అసలు నా ముసలాయన్ని నువ్వు చెప్తే ఆ డాక్టర్ సూది ఇచ్చి చంపేశాడు అని నేను అంట. నిన్ను జైల్లో పెట్టాల కదా మరి. ఒక్క మాట నా కోడలి పుట్టినింటోల్లు అంటే మా అందరినీ జైల్లో నూకేసారే. నెత్తి నోరూ కొట్టుకొని చెప్పిన ఎవ్వరూ ఇనలేదే? ఇయ్యాల నేను అంటే నిన్నెందుకు జైల్ల బెట్టరాని?” కోపంతో ఆమెకు పిచ్చి శక్తి వచ్చేసింది. నిలబడి ఇక కఱ్ఱ కూడా భూమ్మీద ఆనించకుండా దాన్ని లేపి చేతిలో లాఠీ లా పట్టుకొని, ఖడ్గం పట్టుకొన్న తీరులో నిలబడ్డది.

ఏమనాలో అర్థంకాక ..."సరేలే నేను మాత్రం జైల్లో లేనా ఏంటి?"నవ్వుతూ ఎగరకొట్టబోయాడు.

“నువ్వెక్కడ జైల్ల ఉన్నావ్? కుర్చీలో ఉన్నావ్. జైల్లో కూచోవాల. మేం తినే కూడు తినాల. మా లెక్క పరేశాన్ గావల అప్పుడు కదా. ఇది మీరు చెప్పిన న్యాలమే కదా? కానీ తీయ్ అదే సరైందనుకొందాం. అట్లే చేద్దాం. మరి నాకో న్యాలమూ నీకో న్యాలమూ ఎందుకూ? లేకుంటే నా ముసలాయన్ని నాకు తెచ్చియ్. తేనీకి నీకు “పవర్” లేదంటావా? అయితే నన్ను ఇంటికి పంపెయ్యి.”

“ఆమెని వార్డులోకి తీసుకు పొండి.” అని ఒక ఆదేశం పారేసి జైలర్ జారుకోబోయాడు.

“అవును ఆమె అన్నదాన్లో తప్పేంటి? పైసలున్నోళ్ళకో న్యాయం, లేనోల్లకో న్యాయమా?”

“ఆమె విడుదలకోసం మీరు చేస్తానన్న సిఫారసులేమయ్యాయ్?” నేను కూడా కోపంగా అన్నాను. “ఆమె అనారోగ్యం, వయసు అన్నీ విషయాలు రాస్తూ మీరు కూడా ఐ.జీకి రాయాల్సిన బాధ్యతలేదా? ఆమెకి సుప్రీంకోర్టు కి పోడానికి న్యాయ సహాయం అందించే బాధ్యత మీకు లేదా?” నేనామాత్రం అనగానే అందరూ తలో మాటతో జైలర్ ని నిలదీశారు.

ముసలామె జైలర్ ముఖం ముందు లాఠీ చూపిస్తూ “పోవయ్యా పెద్ద మనిషీ, పొయ్యి ఆ పని చూడు ముందు అంది.”

– – –

ఈ ఘటన తరవాత ఆమె కొడుకు ఎవరో లాయర్ ని పట్టుకొని సుప్రీంకోర్టుకి అప్పీల్ తయారుచేయించుకొని తెచ్చి ఇచ్చాడు. నాకొక చిన్న ఉత్తరంతో పాటు ఆ ఫైల్ తెచ్చి ముసలామె నా చేతిలో పెట్టింది. తను చేయగలిగినంత చేశానని ఇక దానిని ఎలాగైనా సుప్రీంకోర్టుకి పంపే బాధ్యత నాదేనని అందులో రాయించాడు. జైల్ అప్పీల్ గా దానిని పంపాలని జైలర్ తో మాట్లాడి పంపించాము. ఇక ఆరోజు నుండి ఢిల్లీ నుండి కాయితం వచ్చిందా మేడమ్ బేటీ అని అడగడం మొదలుపెట్టింది. ఈలోపు నేను బెయిల్ పై విడుదలయ్యాను. నేను విడుదలయ్యిన రోజు ప్రతి ఒక్కరూ ఏడ్చారు. ముసలామె దగ్గరికి పోయి చెప్పడానికి భయమేసింది నాకు. కానీ ఆమె హాయిగా నవ్వుతూ “ఖుష్ రహో మేడం బేటీ, దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు.” అని నా తల మీద చెయ్యేసి ఆశీర్వదించి పంపింది.

నా సహచరుడు ఇంకా జైల్లో ఉండడం వల్ల నెల తరవాత నేనుజైలు కి వెళ్తూ “అమ్మ గుర్తుగా ఉంచుకో” అని అక్క ఇచ్చిన చీర కూడా లాఠీ బుడియా కోసం సర్దుకొన్నాను. నేను జైల్లో పడిన కొద్ది నెలలకే మా అమ్మ గుండెపోటుతో చనిపోయింది. మధ్యాహ్నానికి హజారిబాగ్ చేరుకొన్న. నన్ను చూడగానే గేట్ దగ్గరే సిపాయిలు.... “అరె ఉదయం వచ్చి ఉంటే లాఠీ బుడియా ని కలిసి పోయేవారు కదా. ఈ ఉదయమే విడుదలయ్యింది. మొత్తానికి బుడియా అసాధ్యురాలు విడుదల్లయ్యేవరకు యముడిని కూడా అల్లంత దూరాన నిలబెట్టింది” అన్నాడొక సిపాయి.

నేను బుడియా కోసం తెచ్చిన చీర ...అమ్మ జ్ఞాపకంగా అక్క ఇచ్చిన చీర ...నా దగ్గరే వున్నది, ..నాలో నిండిపోయిన బుడియాలాగా.

– – –

కథ

వేయి కరముల, ఇనుప తొడుగుల మట్టికాళ్ళ మహా రాక్షసి

- పల్లేటి అప్పారావు

వినగా, వినగా వేయి కరముల, ఇనుప తొడుగుల మట్టి కాళ్ళ మహా రాక్షసి జన సమ్మర్ధము, అయినా అది ఒక కీకారణ్యం. చుట్టూ చిమ్మ చీకటి. కళ్ళు పొడుచుకున్నా కనిపించని కారు చీకటి.

ఆ చీకటి మహా రాక్షసికి పండు వెన్నెల, కాంతిని భరించలేదు. ఆ చీకటి తనకు వెన్నెలై పరుస్తుంది.

ఆ వెన్నెలలో, తన వేయి చేతుల విన్యాసాలతో వికటాట్టహాసం చేస్తుంది.

మానవ మాంసం బహు పసందు, రక్తం కడుతీపి దానికి. చేతికి దొరికిన వాళ్ళను ఉన్న ఫళంగా నోట్లోకి విసిరివేసుకుంటున్నది. దోసిళ్ళతో రక్తాన్ని జుర్రుకుంటున్నది.

తాను తిరిగిన చోట పచ్చని పైరులు మాడి మసైపోతున్నాయి. అడవులు నేల మట్టం అవుతున్నాయి. కొండలు, కోనలు గుండా పిండవుతున్నాయి. నదీనదాములు ఆవిర్లయి, ఎడారులవుతున్నాయి. భూమ్యాకాశాలు ఏకమై బద్దలవుతున్నాయి. ప్రళయ మూర్తిగా, భయంకర మృత్యు కేళిలో, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ముందుకు, ముందుకు వస్తున్నది.

చిత్రం! విచిత్రం! ఆ కారు చీకటిలో, ఆ ప్రళయ క్రీడలో పడుతూ లేస్తూ వేనకు వేలు జనము ఇనుప తొడుగుల మట్టి కాళ్ళ మహా రాక్షసితో పోరాడుతున్నారు. చేతికి దొరికిన రాయో, రప్పో, ఆకో, అలమో రాక్షసి వైపు విసురుతూనే ఉన్నారు. దానికి తగిలినా, తగలకపోయినా కసితో విసురుతూనే ఉన్నారు.

ఆ పోరాటంలో కాళ్ళు విరగ్గొట్టుకుంటున్నారు. చేతులు పోగొట్టుకుంటున్నారు, మహా రాక్షసి ఇనుప తొడుగుల కాళ్ళ కింద పడి నలిగిపోతున్నారు.

అయినా జనం వెనుదిరగడం లేదు. అప్పుడప్పుడు వెనక్కి తగ్గినా, జంకినా తప్పదు. బతకడానికి ముందుకు, ఇంకా ముందుకు ఉరుకుతూనే ఉన్నారు.

కాని, దాని కళ్ళల్లో ఏదో భయం, దాని మనసులో ఏదో ఆందోళన. వేయి కళ్ళు చేసుకొని, ఒక అల్ప జీవిని పట్టుకొని, నలిపి మింగేయాలని చూస్తున్నది.వాడొక బాలుడు. చేతికి దొరకడం లేదు. ముప్పుతిప్పలు పెడుతున్నాడు.

మాయల ఫకీరు ప్రాణం ఒక చిలుకలో ఉన్నట్లు దాని ప్రాణం ఈ పిల్లవాడి చేతిలో ఉందని తెలుసు. అందుకే వాడంటే భయం. లక్షలు లక్షలు జనం తన మీద పడుతున్నా ఖతరు చేయడం లేదు.

జనం తన చేతులు విరుస్తున్నా, గుండెల మీద బాదుతున్నా, కాళ్ళపై సమ్మెట పోట్లు పొడుస్తున్నా, భుజాల పైకి ఎక్కి ముఖం మీద పిడిగుద్దులు గుద్దుతున్నా దానికి ఏమీ అనిపించడం లేదు.దాని దృష్టి అంతా ఆ పిల్ల వాడిపైనే.

ఆ పిల్లవాడి శరీరమంతా రక్తసిక్తమై ఉంది, మట్టి కాళ్ళ మహా రాక్షసి పదివేల గోళ్ళ రక్కులకు. అయినా ఆ పిల్లవాడు మెరుపులా అటు,ఇటు ముందుకు వెనక్కు దూకుతూ ఉన్నాడు.వేయి చేతుల మహా రాక్షసి పిడికిళ్ళకు దొరక్కుండా తప్పించుకుంటూన్నాడు. అక్కడక్కడ అప్పుడప్పుడు తప్పటడుగులు వేస్తున్నా, పడుతూ లేస్తూ తిరుగుతున్నాడు.

పడిపోతున్న వారిని ఎత్తి పట్టుకొని నిలబెడుతున్నాడు. దెబ్బలు తిన్నివారికి శుశ్రూష చేస్తున్నాడు. నీరసించి పోతున్న వారికి ఊపిరి ఊది ఉత్తేజ పరుస్తున్నాడు.

తాను స్పృశించిన ప్రతి మనిషి ఒక వీరుడై, ధృఢ చిత్తముతో ముందుకు ఉరుకుతున్నాడు. మట్టి కాళ్ళ మహా రాక్షసిని కొట్ట వలసిన చోట కొడుతున్నాడు. దానికి తగలరాని చోట తగులుతున్నాయి.

మనుషులను స్పృశించే కొలది ఆ పిల్లవాడు అంతకంతకూ పెరిగిపోతున్నాడు.మహా బలాఢ్యుడయి ఎదురు లేని శక్తిగా ఎదిగిపోతున్నాడు.

అందుకే ఈ పిల్లవాడంటే, వేయి కరముల మహా రాక్షసికి మహా భయం. భరించలేని భయం. వాడిని ఎలాగైనా ఎవరినీ తాకకుండా చూడాలనీ శత విధాలా ప్రయత్నిస్తున్నది.

కాని మనుషులను స్పృశించనిదే తాను బతకలేడు. అందుకే తన మేను ఛిద్రమైనా, రక్తసిక్తమయినా వాళ్ళను స్పృశిస్తూనే ఉన్నాడు. వారిని లేపుతునే ఉన్నాడు. ఉత్తేజితులను చేస్తున్నాడు.తాను ఉద్దీపము చెందుతున్నాడు.

ఈ బంధం తెగగొట్టాలి. పిల్లవాడి ప్రాణం హరించుకు పోవాలి. తన ప్రాణానికి ముప్పు తొలగి పోవాలి.

ఈ సంగతి ఎరిగిన మహా రాక్షసి పిల్లవాడిని ఎలాగైనా పట్టుకోవాలి. వాడి పీక పిసికి చంపాలి. వాడిని నమిలి మింగేయాలి. అందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నది.

ఈ భయంకర ప్రళయ కారిణి - ఇనుప తొడుగుల మట్టి కాళ్ళ వేయి చేతుల మహా రాక్షసి కరాళ నృత్యంలో దాని వైపు రాళ్ళు రప్పలూ విసురుతూ తమ శక్తి కొద్దీ పోరాడుతున్న జనానికి అండగా మేధావి, మానవతావాది ఒకరు గొంతెత్తి తనివి తీరా కేరింతలు కొడుతున్నారు.

తప్పటడుగులు వేస్తూ, నెత్తురోడుతున్నా, జనాన్ని స్పృశిస్తూ ఉరకలు వేస్తూ, చీకటిని చీల్చుకుంటూ క్రాంతులు విరజిమ్ముతున్న బాలుడిని వాని ఒంటి నుండి తన మేనుపై ప్రతిఫలించే రక్తాన్ని సైతము విస్మరించి వీక్షిస్తున్న మరో వ్యక్తి స్వేచ్ఛావాది. అదే పనిగా అటువైపే చూస్తున్నాడు.

నివేదిక

(24వ మహాసభల సందర్భంగా కార్యదర్శి నివేదిక)

యుద్ధంలో పదునెక్కుతున్న కలం

- పి. వరలక్ష్మి

కర్నూలు మహాసభల సందర్భంగా విరసం రాబోవు మహాసభల వరకు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా, ప్రజాప్రత్యమ్నాయం జనతన సర్కార్‌కు మద్దతుగా ప్రచారం చేయడమే తన కేంద్ర కర్తవ్యంగా ఉంటుందని ప్రకటించింది. 2011 మార్చి కర్నూలు మహాసభల నాటికే ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశలోకి ప్రవేశించింది. అప్పటికే ప్రభుత్వం విప్లవోద్యమ నాయకులు కా.ఆజాద్, కా.కిషన్‌జీలను దారుణంగా హత్య చేసింది. కాళోజీ శతజయంతి సందర్భంతో జత కలిసిన విరసం 24 మహాసభల నాటికి అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ గంటి ప్రసాదం హత్యకు గురైతే, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు కా.ఆకుల భూమయ్య అనుమాస్పదంగా మృతి చెందాడు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా వివిధ ప్రజాసంఘాలను సమన్వయపరుస్తూ దేశమంతా తిరుగుతూ విరసం ఆవిర్భావ దినం రోజున రాజ్యహంతక ముఠా దాడికి గురై "నన్ను చంపగలరు కాని నా స్ఫూర్తిని చంపలేరు" అని ప్రకటించి అమరుడైన కా.గంటి ప్రసాదం, ఇదే వరంగల్‌లో ప్రజాస్వామిక తెలంగాణ లక్ష్య ప్రకటన చేసి అహర్నిశలూ దాని కోసం కృషిచేసిన కా.భూమయ్యల స్మరణలో ఈ మహాసభలు జరుగుతున్నాయి. విప్లవ సాహిత్యోద్యమంలో ఎనలేని కృషి చేసి, చివరిదాకా విప్లవ దీక్షతో కొనసాగిన విరసం సభ్యుడు కా.ఆలూరి భూజంగరావు, విరసం వ్యవస్థాపక సభ్యుడు కా.పి.నాగభూషణం, శ్రీకాకుళ పోరాటయోధులు, విప్లవోద్యమ సహచరులు కా. గోరుమాధవరావు, కా.జవ్వాజి వెంకటసుబ్బయ్య, కార్మికోద్యమ నాయకుడిగా, ప్రజాన్యాయవాదిగా సుదీర్ఘ విప్లవాచరణలో భాగమైన కా.బిఎస్‌ఎ సత్యనారాయణల స్ఫూర్తిని తనలో భాగం చేసుకుంటూ వారిని విరసం ఈ సందర్భంగా స్మరించుకుంటున్నది.

విరసం నిషేధం నుంచి బయటికి వచ్చాక హైదరాబాదులో జరిగిన మహా సభల నుంచే అప్పటికి విప్లవోద్యమం మీద తీవ్రంగా దాడి చేస్తున్న సాల్వాజుడుం వ్యతిరేక ఆందోళనను స్వీకరించింది. అప్పటి నుంచి దండకారణ్య విప్లవోద్యమ ప్రచారాన్ని స్థిరంగా కొనసాగిస్తున్నది. ఈ క్రమంలో గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా రచనా, ప్రచార కార్యక్రమం ముమ్మరం చేసింది. ఆ క్రమంలోనే గత మహాసభల్లో గ్రీన్‌హంట్ వ్యతిరేక ఆందోళనను కేంద్ర కర్తవ్యంగా స్వీకరించింది. ఈ రెండేళ్లపాటు గ్రీన్‌హంట్ యుద్ధ దురాగతాలను శక్తివంచన లేకుండా వెలుగులోకి తెచ్చింది. విశ్లేషించింది.

మార్క్సిజం-లెనినిజం వెలుగులో సాహిత్యరంగంలో పని చేస్తున్న సంస్థగా విరసం గ్రీన్‌హంట్‌ను అమెరికా కనుసన్నల్లో భారత దళారీ పాలకవర్గం చేస్తున్న రాజకీయార్థిక, సైనిక, సాంస్కృతిక భావజాల యుద్ధంగా గుర్తిస్తోంది. ఈ యుద్ధం కేవలం సైనిక సంబంధమైది మాత్రమే కాదని, ఈ వ్యవస్థను సుస్థిరం చేస్తూ ప్రత్యామ్నాయ ప్రయత్నాలను తుడిచేయడానికి రాజకీయార్థిక, సాంస్కృతిక భావజాల యుద్ధం కూడా ఇందులో ఉందనే అర్థంలోనే గ్రీన్‌హంట్ మొదలు కాగానే ఇది ప్రజలపై యుద్ధం అని విరసం చెప్పింది. ఈ యుద్ధాన్ని ఎప్పటికప్పుడు అనేక పొరలుగా విశ్లేషిస్తూ దండకారణ్యంలో ఆదివాసులు ఈ యుద్ధానికి వ్యతిరేకంగా ప్రతియుద్ధం చేస్తూనే, ప్రతిఘటిస్తూనే జనతన సర్కార్ నిర్మాణం చేస్తున్నారని చెప్పింది. ముఖ్యంగా బాసగూడా మారణహోమం తర్వాత గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిద్దాం. జనతన సర్కార్‌కు సంఘీభావం కూడగడదాం.. అనే ఈ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది.

దండకారణ్యంలోని పరివర్తనా క్రమంలో నూతన వ్యవస్థ నిర్మాణంలో భాగంగా నూతన మానవ ఆవిష్కారం కూడా జరుగుతున్నదని విరసం ప్రతిపాదించింది. మార్క్స్ కాలం నుంచి చారుమజుందార్ దాకా ఇవ్వాల్టి విప్లవకారుల దాకా వర్గపోరాటంలో నూతన మానవుడు, మానవి ఆవిర్భావం గురించి కంటున్న కల మన నేల మీద, మన కాలంలో దండకారణ్యంలో నిజమవుతున్నదని విరసం చెప్పింది. ఈ నూతన మానవుడి కోసం తెలుగు సాహిత్యం ఎట్లా వెతుకులాడిందో వివరించడానికి గత ఏడాది జనవరిలో ఆధునిక తెలుగు సాహిత్యంలో నూతన మానవ ఆవిష్కారం అనే ఇతివృత్తంగా పాఠశాల నిర్వహించింది.

గ్రీన్‌హంట్‌ను, దండకారణ్య ఉద్యమాన్ని అర్థం చేసుకోవడంలో.. ముఖ్యంగా సాహిత్య సంస్థగా విరసం చేసిన ఈ ప్రయత్నం ఒక కొనసాగింపుగా గుర్తించవచ్చు. దండకారణ్య ఉద్యమాన్ని వివరించడంలో కనీసం రెండు మూడు దశలను విరసం దాటుకుంటూ వచ్చింది. ఇదంతా సాహిత్య సంస్థగా విరసం సృజనాత్మక ఆచరణలో చాలా పరిణతిని తీసుకొని వచ్చింది. దండకారణ్యం చుట్టూ విరసం సభ్యులు చేసిన సామాజిక విశ్లేషణతో పాటు, కవిత్వం, పాట, తాజాగా నాటక ప్రకియల్లో కూడా ఈ శక్తి కనిపిస్తుంది. కథ ప్రక్రియలో కూడా ఈ ప్రయత్నం మొదలైనా ఇంకా పుంజుకోలేదనే చెప్పాలి. అయితే ఈ లోటును శక్తివంతంగా దండకారణ్య కథకులు తీర్చగలుగుతున్నారు. వాళ్లు రాస్తున్న కథల విశిష్టత గురించి విరసం అదొక ముఖ్య కర్తవ్యంగా ప్రచారం చేయగలిగింది. మొత్తంగా దండకారణ్య సాహిత్యంపై ఈ రెండేళ్లలో అనేక సందర్భాల్లో ప్రసంగాలు, అంచనాలు, విశ్లేషణలు ఇవ్వగలిగింది. ఈ మహా సభల్లో దండకారణ్య కథల పుస్తకాన్ని ఆవిష్కరించుకోబోతున్నాం. బాసగూడ మారణకాండ మీద పౌరహక్కుల సంస్థలతోపాటు నిజనిర్ధారణకు వెళ్లి వచ్చి ఒక విశ్లేషణాత్మక నివేదిక అందివ్వగా అదే అంశం మీద విరసం సభ్యులు ఒక నాటకం రాసి దాని ప్రదర్శన కోసం కనీసం మూడు నెలలుగా పట్టుదలగా శిక్షణ తీసుకున్నారు. కథ, కవిత్వం, విమర్శ ప్రక్రియలపై

జరిపినట్లు విరసం నాటక ప్రక్రియ మీద వర్క్‌షాపులు నిర్వహించడంగాని మొత్తంగా ఆ రంగంలో కృషిగాని చేయలేకపోతోందనే స్వీయవిమర్శ ఉండేది. అయితే బాసగూడా మారణహోమం తర్వాత ఈ నాటక రచన, పట్టుదలగా వరుస శిక్షణ తరగతులు జరిగాయి. దండకారణ్య సాహిత్య సమయాన్ని విరసం గుర్తించిందనడానికి, దానికి తగిన ప్రక్రియలను గుర్తించడంలో విరసం చేస్తున్న కృషికి ఇది ఉదాహరణ.

ఈ రెండేళ్లలో దండకారణ్య ఉద్యమానికి సంబంధించే విరసం ఇరవైదాకా పుస్తకాలు ప్రచురించింది. ఇటు ఒడిషాలోని నారాయణపట్నా ఉద్యమం దగ్గరి నుంచి, గ్రీన్‌హంట్‌లో భాగంగా జరిగిన ఎన్‌కౌంటర్లలో అమరులైన విప్లవకారుల మీద వచ్చిన పుస్తకాలు, షంషేర్, కిషన్‌జీ వంటి వాళ్ల రచనలతో వచ్చిన పుస్తకాలను కూడా ఇందులో కలిపితే ఈ సంఖ్య ఇంకొంచెం ఎక్కువగా ఉంటుంది.

ఈ సాహిత్య రచనా, ప్రచురణరంగాల్లో చేసిన కృషితోపాటు ఇతర కార్యక్రమాలు కూడా ఈ రెండేళ్లలో అనేక సందర్భాల్లో జరిగాయి. కొన్ని ముఖ్యమైనవి చెప్పాలంటే బాసగూడా మారణహోమం తర్వాత విరసం ప్రజలపై యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం.. జనతన సర్కార్‌కు సంఘీభావం కూడగడదాం... అనే అంశంపై పౌర సమాజ స్పందన కూడగట్టడానికి ఒక విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. అట్లాగే మాడ్‌పై ఆపరేషన్ హాకా, విజయ్ అనే పేర్లతో దాడి ప్రారంభించినప్పుడు వెంటనే ఆ దాడిపై నివేదికలను ప్రచురిస్తూ సభ నిర్వహించింది. హైదరాబాదులోనే కాక గుంటూరు, విజయవాడ, నెల్లూరు, కర్నూలు నగరాల్లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా విరసం సభలు జరిగాయి. వరంగల్‌లో విరసం సభ్యులు ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఊరేగింపు తీశారు. గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఉపా చట్టం కింద అరెస్టులు చేసినప్పుడు ఆ చట్టాన్నే రద్దుచేయాలనే డిమాండ్‌తో సభలు నిర్వహించాం. అట్లాగే ఆర్.డి.ఎఫ్. కూడా గ్రీన్‌హంట్ వ్యతిరేకంగా విరసం వలె దేశవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమం ప్రారంభించగానే ఆ సంస్థను ప్రభుత్వం నిషేధించింది. ఈ నిషేధానికి వ్యతిరేకంగా సభలు సమావేశాలు, సంతకాల సేకరణ వంటివి విరసం చేపట్టింది. సరిగ్గా మనదేశంలో లాగానే జరుగుతున్న ఫిలిప్పినో ఉద్యమానికి సంఘీభావంగా అక్కడి పాలకవర్గం ఆ ప్రజలపై సరిగ్గా గ్రీన్‌హంట్ లాంటి యుద్ధం చేస్తున్న తరుణంలో దాన్ని ఖండిస్తూ ఆ దేశ విప్లవానికి సంఘీభావం ప్రకటిస్తూ విరసం ఓ పుస్తకాన్ని ప్రచురించి సభ నిర్వహించింది. గత రెండేళ్ళ ఆచరణను మరింత ముందుకు తీసుకుపోతూ రాబోవు మహాసభల వరకు ఈ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా యుద్ధం మధ్యనే నిర్మాణమవుతున్న క్రాంతికారీ జనతన సర్కార్ ప్రయోగాన్ని సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రచారం చేస్తూ విశాల ప్రజానీకం నుండి సంఘీభావం కూడగట్టాలని విరసం తీర్మానించింది.

ఈ రెండేళ్లలో పాలకవర్గ సంస్కృతి పొట్ట విప్పిచెప్పగల సందర్భంగా ప్రపంచ తెలుగు మహాసభల సందర్భం వచ్చింది. ప్రగతిశీల ప్రజా ఉద్యమ శిబిరమంతా ఈ సభలను బహిష్కరించింది. విరసం ఇందులో క్రియాశీలంగా పాల్గొన్నది. వివిధ జిల్లాల్లో విరసం సభ్యులు ఇతర ప్రజాసంఘాలతో కలిసి పాలకవర్గ ప్రపంచ తెలుగుమహాసభలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంది. హైదరాబాదు, పాలమూరు, నల్గొండ ప్రాంతాల్లో విరసం సభ్యులు రచయితలు, కళాకారులతో కలిసి నిరసన ర్యాలీలలో పాల్గొన్నారు. సభల బహిష్కరణకు తిరుపతి వెళ్తూ దారిలో కొందరు సభ్యులు, తిరుపతిలో ఆందోళన చేస్తూ మరి కొంత మంది సభ్యులు అరెస్టయ్యారు. గ్రీన్‌హంట్‌లో భాగమే ఈ సభలు అని ప్రపంచ తెలుగు మహాసభలను మంద్రస్థాయి యుద్ధంలోని సాంస్కృతిక కోణం వైపు నుంచి విశ్లేషించింది.

గడిచిన రెండేళ్లలో అనేక మంది విలువైన కామ్రేడ్స్ విప్లవోద్యమంలో బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులయ్యారు. అయితే ఒకప్పటి విరసం సభ్యుడు, మార్గదర్శిగా, మిత్రుడిగా సుమారు ఏడెనిమిదేళ్లపాటు అండదండలు అందించిన కామ్రేడ్ గంటి ప్రసాదం నెల్లూరులో విరసం సభలో ప్రసంగించిన కొద్ది సేపటికే రాజ్యం కరకు కత్తులకు, తూటాలకు బలైపోయారు. ఆయన హత్య ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా జరిగిందే. గ్రీన్‌హంట్ వ్యతిరేక వేదిక తరపున ఆందోళనలకు మార్గదర్శకత్వం వహిస్తున్న ప్రసాదంగారి హత్య గ్రీన్‌హంట్‌లో భాగమే. ఆయన అమరత్వ సందర్భంలో జరిగిన కార్యక్రమాలను గ్రీన్‌హంట్ వ్యతిరేకంగా విరసం నిర్వహించింది. దండకారణ్య ఉద్యమాన్ని అధ్యయనం చేసి వచ్చిన కా. యాన్‌మిర్డాల్‌తో హైదారాబాదులో సమావేశం, విప్లవోద్యమం మీద తీసిన రెడ్ యాంట్స్ డ్రీమ్ అనే సినిమా ప్రదర్శన..వంటి కార్యక్రమాలు జరిగాయి. అరుణతారలో యుద్ధవ్యతిరేక స్వరాలనే శీర్షిక నడపాలనే ప్రయత్నం చేసినా అది నడవలేదు. దాని కోసం ఇప్పటి నుంచైనా ప్రయత్నించాల్సి ఉంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సుదీర్ఘకాలంలో అనేక దశలను దాటి కీలకదశను చేరింది. వాయిదాలు వేయలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేయవలసి వచ్చింది. అయితే కేంద్ర మంత్రి వర్గం రూపొందించిన తెలంగాణ బిల్లు తెలంగాణను ఇచ్చినట్లే ఇచ్చి అందులో ఆంధ్రా పెత్తందార్ల దోపిడి కొనసాగేలా తెలంగాణకు అనేక ఆంక్షలు పెట్టింది. పోలవరానికి జాతీయ హోదా ఇవ్వడం, హైదరాబాదును పదేళ్ళు ఉమ్మడి రాజధాని చేసి గవర్నర్ అజమాయిషీలో పెట్టడం, ఉన్నత విద్యలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని కొనసాగేలా చేయడం వంటి అంశాలను బిల్లులో చేర్చింది. ఇన్నాళ్ళూ ముందుండి తెలంగాణ డిమాండును వినిపించిన బూర్జువా పార్టీలు వీటిపై క్రియారహితంగా ఉండిపోతే ఆంక్షలు లేని సంపూర్ణ తెలంగాణ కోసం విద్యార్థులు, ప్రజాసంఘాలు చేసిన ఆందోళనలో విరసం పాలుపంచుకుంది. అట్లాగే ప్రజాస్వామిక తెలంగాణ సాధించడమే అంతిమ లక్ష్యమని చాటింది. ఈ అవగానతోనే విరసం సభ్యులు కవిత్వం, వ్యాసాలు రాశారు.

మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రకటన వెలువడగానే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో విభజన వ్యతరేక ఆందోళనలు ప్రారంభమయ్యాయి. హైదరాబాదుతో ముడిపడిన తమ ప్రయోజనాలు కాపాడుకోడానికి ఆ ప్రాంతాల బూర్జువా రాజకీయనాయకులు ఈ ఆందోళనలను నడిపించినా ఇందులో ప్రజలు లేరనడానికి లేదు. 2009 డిసెంబరు 9న కేంద్ర హోంమంత్రి తెలంగాణ ప్రకటన చేసిన నాటి నుండి తెలంగాణేతర ప్రాంతాల ప్రజల్లో తలెత్తిన తెలిసీ

తెలీని భయాందోళనలను ఆంధ్ర, రాయలసీమ పాలకవర్గాలు ఈ కాలమంతా పెంచుతూపోయాయి. ప్రభుత్వం, అధికారులు ముందుండి విద్యార్థులను, ఉద్యోగులను, పట్టణ ప్రజానీకాన్ని కనీవినీ ఎరగని రీతిలో భారీగా రోడ్ల మీదికి తెచ్చారు. భౌగోళిక విభజన కన్నా ముందు ప్రజల్ని మానసికంగా విడదీశారు. మరోవైపు ప్రత్యేక రాయలసీమ, కళింగాంధ్ర వంటి ప్రాంతీయ ఆకాంక్షలు ఆయా ప్రాంతాల నుండి బలంగా వ్యక్తం కాకుండా చేశారు. ప్రాంతానికో వేషం వేసి ప్రజల్ని ప్రాంతాలుగా విడదీసి ఉమ్మడిగా దోచుకుంటున్న పాలకవర్గాల కుటిల రాజకీయాలను విరసం ఎండగట్టింది. పాలకులను ఏకాకులను చేసి అన్ని ప్రాంతాల ప్రజల్ని ఏకం చేయడమే విప్లవ ప్రజాస్వామికవాదుల కర్తవ్యం అని చాటింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమంలో విరసం భాగం అయినట్టుగానే తెలంగాణేతర ప్రాంతాల్లో వివిధ ప్రజాసంఘాలతో కలిసి తెలంగాణ ప్రజల న్యాయపోరాటం గురించి తన శక్తి మేరకు ప్రచారం చేసే ప్రయత్నం చేసింది. బూర్జువా నాయకుల వాగాడంబరం, మీడియా విపరీత ధోరణిలో ప్రజాస్వామిక గొంతులు చాలా చిన్నవైపోయాయి. ఈ వాతావరణంలోనే విరసం ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రచయితలు, ప్రజాస్వామికవాదులతో కలిసి సమావేశాలు, చర్చలు నిర్వహించింది. విరసం సభ్యులు విశ్లేషణాత్మక వ్యాసాలు, కవిత్వం రాశారు. రాష్ట్రవిభజన నేపథ్యంలో వివిధ అంశాలపై కర్నూలులో విరసం సభ్యుల చొరవతో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ, తెలంగాణ ప్రజాస్వామికవాదుల మధ్య అర్థవంతమైన చర్చ జరిగి ఇటువంటి ప్రయత్నాలు మరెన్నో జరగాల్సిన ఆవశ్యకతను అది గుర్తుచేసింది.

బాబ్రీమసీదు కూల్చివేత, గుజరాత్ మారణహోమం తర్వాత హిందుత్వశక్తులు దేశంలో వేగంగా బలం పుంజుకుంటున్నాయి.. వేలాది మంది ముస్లింలను ఊచకోతకోసిన మోడీ గుజరాత్ ఇటు హిందుత్వ ఫాసిస్టు శక్తులకు, అటు సామ్రాజ్యవాద మార్కెట్టుకు ఒక నమూనా అయిపోయింది. నరేంద్రమోడీని భవిష్యత్ ప్రధానిగా దేశం ముందు నిలబెట్టాయి. మన రాష్ట్రంలోనూ తెలంగాణ ఉద్యమాన్ని వాడుకొని సంఘ్‌పరివార్ బలమైన పునాదులు వేసుకుంది. బిజేపీ హైదరాబాదులో మోడీ రాక సందర్భంగా భారీ సభను నిర్వహించింది. నరహంతక మోడీ హైదరాబాదు పర్యటనను నిరసిస్తూ విరసం చొరవతో లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక (ఎస్‌డిఎల్‌సిఎఫ్) ఆధ్వర్యంలో కవిగాయక సభ జరిగింది. 2002 గుజరాత్ మారణకాండ నేపథ్యంలో ఏర్పడిన ఈ వేదికను ఈ సందర్భంగా పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను విరసం గుర్తించింది. ఆ దిశగా ఎస్‌డిఎల్‌సిఎఫ్‌లో గతంలో పనిచేసిన సాహిత్య సాంస్కృతిక మిత్రులను మళ్ళీ ఒక వేదికపైకి తెచ్చేందుకు విరసం చొరవ తీసుకొని ప్రయత్నాలు ప్రారంభించింది. అట్లా మిత్రులందరూ కలిసి మోడీ పర్యటనను నిరసిస్తూ కవిగాయక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం సిటీ యూనిట్ "ఖబడ్దార్" పేరుతో కవిత్వ ఫోల్డర్‌ను వెలువరించింది. ఇది కవుల పేర్లు లేకుండా వెలువడడం ఒక అరుదైన ప్రత్యేకత. కర్నూలు మహాసభల సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశం విరసం సభ్యులు వ్యక్తిగత గుర్తింపును రద్దు చేసుకొని సాహిత్యం వెలువరించాలనే సంఘ స్పిరిట్‌ను విరసం సిటీ యూనిట్ అందుకుంది. ఇది లౌకిక ప్రజాస్వామిక శక్తుల ఏకీకరణ కోసం జరిగుతున్న ప్రయత్నం సందర్భంగా వెలువడటం కూడా ఎంతో సందర్భోచితం అయింది. ఇట్లాగే సిటీ యూనిట్ విరసం సభ్యులు ఒకరు గంటి ప్రసాదం, ఆలూరి భుజంగరావు సంస్మరణ సభగా జరిగిన విరసం ఆవిర్భావ సభలో తన పేరు లేకుండా సంస్థ పేరుతోనే కవిత్వం ఫోల్డర్‌ను వెలువరించారు.

మత వివాదాలు రేపి మంట పెట్టడంలో సిద్ధహస్తులైన సంఘ్‌పరివార్ శక్తులు శతాబ్దాల చరిత్ర ఉన్న చార్మినార్‌ను వివాదాస్పదం చేస్తున్నాయి. చార్మినార్‌ను ఆనుకుని అక్రమంగా కట్టిన భాగ్యలక్ష్మి ఆలయాన్ని క్రమబద్ధీకరించి చార్మినార్‌ను మరో బాబ్రీ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నాయి. దీనిపై సిటీయూనిట్ సభ్యురాలు చేసిన నిజనిర్ధారణ వివరాలను సిటీ విరసం హైదరాబాదులో పత్రికా సమావేశంలో వెల్లడించింది. డిసెంబరు ఆరును నిరసన దినంగా పాటించింది. మహారాష్ట్రలో సంఘపరివార్ చేతిలో హత్యకు గురైన హేతువాది దభోల్కర్ హత్యకు నిరసనగా జనసాహితి ఏర్పాటు చేసిన సభలో విరసం పాల్గొన్నది. గత మూడు నెలలుగా తిరుపతిలో హిందుత్వశక్తులు పాగా వేసి తిరుపతి పట్టణానికి సమీపంలో నిర్మాణమవుతున్న హీరా ఇస్లామిక్ పాఠశాలను వివాదాస్పదం చేసి మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. తిరుపతి పవిత్రతకు భంగం వాటిల్లబోతోందని, ఇస్లామిక్ యూనివర్సిటీ వెనక టెర్రరిస్టులు ఉన్నారని ప్రచారం చేస్తూ బయటి ప్రాంతాల నుండి వేలాది మందిని తరలించి హిందూ గర్జన సభను నిర్వహించింది. దీనిపై కడప, చిత్తూరు జిల్లాల విరసం సభ్యులు దళిత, పౌరహక్కుల సంఘాలతో కలిసి నిజనిర్ధారణ చేసి అక్కడి ముస్లింలకు తమ మద్దతు ప్రకటించించారు.

కసబ్, అఫ్జల్‌గురు ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ కసబ్‌ను కాని, మరొకరిని కాని వారు చేసిన నేరంతో, నేరస్వభావంతో సంబంధం లేకుండా చట్టాలపేరుతో చంపివేయడం మునుష్యులకి జీవించే హక్కుకు వ్యతిరేకమేనని విరసం ప్రకటించింది. శాంతి, అహింసల సిద్ధాంతాన్ని గొప్పగా వల్లె వేస్తూ, ఎట్టితే దాన్ని ప్రవచించిన గాంధీ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఉరిశిక్షలకు మౌనాంగీకారం తెలిపారో అట్లాగే భారతరాజ్యం సారంశంలో ఏ విధానాలను అవలంబిస్తోందో ఆచరణలో చూపెడుతూనే ఉంది. ప్రపంచంలో ఎన్నో దేశాలు మరణశిక్షలను రద్దుచేసినా తను మాత్రం అమలు చేస్తూ పోతోంది. కసబ్ ఉరితీతకు ముందురోజే మరణశిక్షలకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానానికి 110 దేశాలు ఓటువేయగా భారతదేశం దానికి వ్యతిరేకంగా ఓటువేసింది. యుపిఏ ప్రభుత్వం హిందుత్వ శక్తులతో పోటీ పడుతూ ఈ రెండు ఉరిశిక్షలను విధించింది. సరిగ్గా అఫ్జల్ గురు ఉరి సందర్భంలోనే సంఘపరివార్ హిందూ సాధువులతో కుంభమేళా రాజకీయాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమిళులను ఊచకోత కోసిన శ్రీలంక అధ్యక్షుడు ఫాసిస్టు రాజపక్షేకు ప్రజల నిరసన మధ్యే దేశంలోకి ఎర్రతివాచీ పరిచి ఆహ్వానించింది. కాంగ్రెస్ దొంగ సెక్యులర్ నీతిని ఎండగడుతూ అఫ్జల్‌గురును ఎట్లా అన్యాయంగా కేసులో ఇరికించి, చిత్రహింసలు పెట్టి భారత పార్లమెంటు ప్రతిష్టకు బలిపెట్టారో చెప్తూ, కశ్మీరీ ప్రజల జాతి పోరాటాన్ని సమర్థిస్తూ విరసం సభ్యులు వ్యాసాలు రాశారు.

కవిత్వమై స్పందించారు. హైదరాబాదులో ఆరెస్సెస్ గూండాలను ఎదుర్కుంటూనే ఇతర ప్రజాసంఘాలతో కలిసి నిరసన తెలిపి అరెస్టయ్యారు. గుజరాత్ హింసపై తెలుగు సమాజంలో వచ్చిన ప్రతిస్పందనలో పదోవంతయినా ముజఫర్‌నగర్ ముస్లింలపై గత కొన్ని నెలలుగా వరుసగా నిరంతరాయంగా జరుగుతున్న దాడులపైన రాలేదు. దీనిపై స్పందించి కార్యాచరణ రూపొందించలేకపోవడంపై విరసం ఆత్మవిమర్శ చేసుకుంటున్నది.

2013 జూన్ 12న శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేటలో దళితులపై జరిగిన హత్యాకాండ ఈ దేశ ప్రజాస్వామ్యంలోని డొల్లతనాన్ని మరోసారి రుజువు చేసింది. 65ఏళ్ళ స్వతంత్ర్య భారతదేశమని, ఆధునిక ప్రజాస్వామ్యని గొప్పగా చెప్పుకుంటున్న దేశంలో కారంచేడు, చుండూరు, పదరికుప్పం, వేంపెంట వంటి సంఘటనలు పదేపదే పునరావృతమవుతున్నా దళితుల రక్షణ కొరకు ఇప్పటికీ ఒక సరైన వ్యవస్థ లేదు. పాలకవర్గానికున్న ఆధిపత్య కులస్వభావమే ఇందుకు కారణం. లక్ష్మింపేట సమస్య దళితుల ఆత్మగౌరవ సమస్యతో పాటు ఈ దేశంలో అపరిష్కృతంగా మిగిలిపోయిన భూమి సమస్యను గుర్తుచేసింది. ఈ సంఘటన మీద విరసం సభ్యులు నిజనిర్ధారణ చేసి నివేదికలు అందించారు. సంస్థ అవగాహన నుండి విశ్లేషణాత్మక కరపత్రం, కవితా సంకలనం వెలువడిరది. అట్లాగే విరసం లక్ష్మింపేట బాధితుల పోరాట సంఘీభావ కమిటీలో భాగమైంది.

నిర్భయ సంఘటనపై దేశవ్యాప్తంగా ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి పెద్ద ఎత్తున స్పందించారు. మహిళలపై అత్యాచారాల నిరోధానికి కఠినమైన చట్టాలు రూపొందించాలనే డిమాండ్ పెద్ద ఎత్తున వినపడిరది. నిర్భయ చట్టం కూడా తయారైంది. అయితే మహిళలై దాడులకు మూలాలు సాంఘిక, సాంస్కృతిక పునాదిలో ఉన్నాయని, వ్యవస్థీకృతమైన వాటిపై పోరాటాన్ని నిర్మించకుండా చట్టాలు రూపొందించడం వల్ల పరిష్కారం లభించదని విరసం సభ్యులు తమ వ్యాసాలలో విశ్లేషించారు. వర్గపోరాట ఆచరణలో విప్లవ మహిళ ఎట్లా విముక్తి దిశగా పురోగమిస్తున్నదో ఉదాహరణ చూపిస్తూ, స్త్రీ విముక్తి పోరాటాలకు వర్గపోరాటం ఒక ప్రాతిపదిక ఏర్పరుస్తుందని విరసం మాట్లాడుతోంది. రచనలు చేస్తోంది.

పీకలలోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నా మనదేశ పాలకవర్గాలు సామ్రాజ్యవాద మార్కెట్ అడుగులకు మడుగులొత్తుతున్నారు. కేవలం సామ్రాజ్యవాద మార్కెట్ ప్రయోజనాల కోసమే విధ్వంసక అభివృద్ధిని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న భారత పాలకవర్గం వాటిని వ్యతిరేకిస్తూ పెల్లుబుకుతున్న ప్రజాఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నాయి. థర్మల్, అణువిద్యుత్ ప్లాంట్ల స్థాపనతో పచ్చని పల్లెలు బూడిదైపోతాయని వాటికి వ్యతిరేకంగా ప్రజలు వివిధ రూపాల్లో పోరాడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసంపై, విధ్వంసక అభివృద్ధి విధానాలపై చర్చ జరుగుతోంది. విరసం ఇటీవలి కాలంలో మార్క్సిస్టు దృష్టికోణంలో పెట్టుబడి సృష్టిస్తున్న పర్యావరణ విధ్వంసాన్ని విశ్లేషించింది. ప్రజాఉద్యమాల వెలుగులో ప్రత్యామ్నాయ అభివృద్ధి గురించి చర్చిస్తున్నది. కడపలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా విరసం ఇతర ప్రజాసంఘాలతో కలిసి ప్రచారం చేసి ప్రజా ఆందోళనలో పాల్గొన్నది. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అక్కడ ప్రారంభించిన యురేనియం ప్లాంటు వల్ల ప్రజలు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) తవ్వకాలను విస్తరించే పనికి పునుకుంది. దీనితో పాటు అనంతపురం జిల్లాలోనూ యురేనియం ప్లాంటు ప్రతిపాదన తీసుకొచ్చింది. వీటికి వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమాల్లో ఇతర ప్రజాసంఘాలతో పాటు విరసం పాల్గొన్నది.

తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా రెండు దశాబ్దాలకు పైగా అక్కడి ప్రజలు ఆందోళన చేస్తూ అడ్డుకుంటున్నారు. తాజాగా రష్యాతో ఒప్పందం చేసుకున్న భారత ప్రభుత్వం ఆ దేశానికి చెందిన రియాక్టర్లను దిగుమతి చేసుకొని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించి నడిపే క్రమంలో అక్కడి ప్రజలపై తీవ్ర అణచివేతను ప్రయోగిస్తున్నది. దేశవ్యాప్తంగా పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దీనిపై స్పందించారు. ఈ నేపథ్యంలో విరసం కార్యదర్శితో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాసంఘాల ప్రతినిధులు కలిసి అఖిల భారత బృందంగా నిజనిర్ధారణకు వెళ్ళే క్రమంలో దారి మధ్యనే వారిని అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టి నిర్బంధించింది తమిళనాడు ప్రభుత్వం. బెయిల్ ఇవ్వకుండా కొన్ని రోజులు, ఇచ్చినా రెండుపూటలా పోలీస్‌స్టేషన్‌లో సంతకాలు పెట్టే షరతు విధించి మరికొన్నాళ్ళు, ఇట్లా దాదాపు నెలరోజుల పాటు రకరకాల పద్ధతుల్లో వేధించింది. ఈ అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా, అట్లాగే అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమాల్లో రచయితలతో పాటు పర్యావరణవేత్తలతో కూడా కలిసి విరసం పనిచేసింది. అణు రాజకీయాలను విశ్లేషించి చెప్పింది. కూడంకుళం నిజనిర్ధారణ అనుభవాలపై రాజకీయ విశ్లేషణతో కూడిన పుస్తకాన్ని వెలువరించింది.

ప్రజాఉద్యమాలను, ప్రజాప్రత్యామ్నాయ రాజకీయాలను సాహిత్య సాంస్కృతిక రంగంలో ప్రతిఫలిస్తూనే విరసం సైద్ధాంతిక రంగంలో కృషి చేస్తూ వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనాలను చేపట్టింది. మూడేళ్ళుగా కులసమస్యను మార్క్సిస్టు సంవిధానంలో విశ్లేషిస్తూ అవగాహన పత్రాన్ని రూపొందించే దిశలో కృషి చేస్తోంది. ఇది ఇంకా పూర్తి కావలసి ఉన్నది. గ్రామీణ సమాజంలో వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలపై విరసం సభ్యులు అధ్యయనం చేసి నివేదికలు ప్రచురించారు. అట్లాగే విప్లవోద్యమం నుండి సామాజిక పరిశోధన కోర్ గ్రూప్ "ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల"పై చేసిన అధ్యయనాన్ని విరసం ప్రచురించింది. విజయవాడలో లెఫ్టిస్టు స్టడీ సర్కిల్ గ్రామీణ సమాజంలో ఉత్పత్తి సంబంధాలపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో విరసం పాల్గొని మన సమాజంలోని అర్ధభూస్వామ్య అర్ధవలస ఉత్పత్తి సంబంధాలను విశ్లేషిస్తూ పత్రం ప్రవేశపెట్టింది. "సాహిత్యంలో సామాజ చలనపు ప్రతిఫలనం" అంశం కేంద్రంగా బి1 కలెక్టివ్, ఆర్.ఎస్.రావు మిత్రులు ఏర్పాటు చేసిన ఆర్.ఎస్.రావు స్మారకోపన్యాసం, సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆలోచనాపరులతో పాటు విరసం సభ్యులు ఏడుగురు పత్రాలు ప్రవేశపెట్టారు.

గత కొన్నేళ్ళుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న విరసం కథా వర్క్‌షాపుల్లో వర్తమాన సమాజాన్ని కథల్లో ఎట్లా

క్రాంతికారీ జనతన సర్కార్ ప్రయోగాన్ని సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రచారం చేద్దాం!

- విరసం

సర్కార్‌కు అన్నివైపుల నుంచి సంఘీభావాన్ని కూడగడదాం!!
విప్లవమే ఏకైక ప్రజా ప్రత్యామ్నాయమని నినదిద్దాం!!!

విప్లవ మాగాణ వరంగల్‌లో 'క్రాంతికారీ జనతన సర్కార్ ప్రయోగాన్ని సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రచారం చేద్దాం' అని పిలుపునిస్తూ, 'ఏకైక ప్రత్యామ్నాయం విప్లవమే' అని నినదిస్తూ విప్లవరచయితల సంఘం తన 24వ రాష్ట్ర మహాసభలను 'ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ' పేరిట జనవరి 11, 12 తేదీల్లో వరంగల్ జిల్లా హన్మకొండ పట్టణం అంబేద్కర్ భవన్‌లో విజయవంతంగా జరుపుకుంది. పి.కె.ఎం. కళాకారులు 'ఓ అరుణ పతాకమా..' గీతాలాపన చేస్తుండగా, కాళోజీనగర్‌లో ఎర్రజెండాను కౌకొండ అమరుడు నరేశ్ తల్లిదండ్రులు ఆవిష్కరించారు. 'అమరులు ఆదర్శప్రాయులు మీరు'.. అనే విప్లవ గానం సాగుతుండగా అమరుల స్థూపాన్ని పువ్వర్తి అమరుడు సుధాకర్ తల్లిదండ్రులు, ఆయన కుమారుడు ఆవిష్కరించగా, విరసం పతాకాన్ని కామ్రేడ్ ఆలూరు భుజంగరావు సహచరి కామ్రేడ్ లలిత ఎగరేశారు. ఆ వెంటనే విరసం సాంస్కృతిక బృందం సంస్థ పతాక గీతిక 'ఎత్తినాం విరసం జెండా'ను ఆలపించింది. అమరుల కుటుంబాల దు:ఖంతో, దిక్కులు పిక్కటిల్లేలా వినిపించిన విప్లవ నినాదాలతో, ఉద్యమ, సాహిత్య యోధులకు ప్రజల నివాళులతో మహాసభలు జరుగుతున్న ప్రాంతంలో ఉద్వేగ వాతావరణం నెలకొంది. అక్కడే అమరురాలు కామ్రేడ్ గడ్డం లక్ష్మి, అమరుడు ఎం.ఎస్.ఆర్.ల స్మృతిలో ఏర్పాటుచేసిన పీస్ బుక్ సెంటర్, ఎం.ఎస్.ఆర్. విరసం బుక్ స్టాల్‌లను దాటుకొని వందలాది మంది విప్లవ, విరసం మిత్రులు.. మహాసభల హాలు అయిన కామ్రేడ్ గంటి ప్రసాదం ప్రాంగణం చేరుకొని..కామ్రేడ్ జ్ఞానేశ్వర్ కీర్తి కమ్యూన్‌లో కామ్రేడ్ అమృతా జనార్దన్ వేదికపై మహాసభలను ప్రారంభించుకున్నారు. కామ్రేడ్ తనూజ, కామ్రేడ్ రామ్మోహన రావులను ఒక్కసారి మదిన తలచి.. విప్లవ కవిత్వ చరణాలతో హాలు మొత్తం ఏర్పాటుచేసిన పోస్టర్లలోని ప్రతి అక్షరాన్ని గుండెల్లో ఇంకించుకుంటూ వరంగల్‌తో సహా అన్ని ప్రాంతాల, అమరవీరుల త్యాగాన్ని తలపునకు తెచ్చుకుంటూ.. రెండు రోజుల మహాసభలు ఉద్వేగ, సమరోత్సాహ వాతావరణంలో కొనసాగాయి.

ఆహ్వానసంఘం అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి పలుకులతో తొలిరోజు కార్యక్రమాలు మొదలయ్యాయి. కాళోజీ జీవన, ఉద్యమ వ్యక్తిత్వాన్ని ఆయన ఆవిష్కరించారు. దౌర్జన్యానికి, దోపిడీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని, ప్రభుత్వం చెప్పే జన జీనవ స్రవంతి భావనని కాళోజీ తీవ్రంగా తప్పుబట్టారని తెలిపారు. కవి ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండాలని, ప్రశ్నించేవాడై ఉండాలని పదేపదే చెప్పేవారని గుర్తుచేసుకొన్నారు. అనంతరం విరసం వ్యవస్థాపక సభ్యుడు కామ్రేడ్ ఎం.టి.ఖాన్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా వరంగల్‌తోనూ, కాళోజీతోనూ తనకున్న అనుబంధాన్ని క్లుప్తంగా పంచుకున్నారు. కామ్రేడ్ వి.వి. రచన 'ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తరువాత 2011-13 సంవత్సరాలకు గాను సంస్థ చేసిన, చేయలేక పోయిన కార్యక్రమాల వివరాలతో గల రెండేళ్ల నివేదికను కార్యదర్శి కామ్రేడ్ పి. వరలక్ష్మి సమర్పించారు. డెలిగేషన్ కార్డుపై సభ్యుడు/ప్రతినిధి అని ఉండటాన్ని ఓ మహిళా కామ్రేడ్ సభ దృష్టికి తీసుకురాగా, సంస్థ స్వీయ విమర్శ చేసుకుంది.

అనంతరం సౌహార్ద ప్రతినిధులు తమ సందేశాలను అందించారు. కాళోజీ ప్రభావంతో తాను సాహిత్యోద్యమంలోకి వచ్చినట్టు **తెలంగాణ రచయితల వేదిక ప్రతినిధి పొట్లపల్లి శ్రీనివాసరావు** పేర్కొన్నారు. పోస్టుమాడర్నిజం, అస్తిత్వ వాదాలు అంతిమంగా ప్రపంచీకరణకే దోహదం చేస్తున్నాయని **జనసాహితి ప్రతినిధి దివికుమార్** అన్నారు. 1905 బెంగాల్ విభజన మొదలు

ప్రతిఫలింపజేయాలో, సామాజిక చలనాలను ఎట్లా అర్థం చేసుకోవాలో లోతుగా చర్చ జరుగుతున్నది. విరసం కథా వర్క్‌షాపుల్లో తయారైన కథలతో కథల పంట రెండో సంకలనాన్ని 2013 సాహిత్య పాఠశాల సందర్భంగా ఆవిష్కరించుకున్నాం. అదే సందర్భంలో సాహిత్య విమర్శ ప్రక్రియలో విరసం ప్రాతినిధ్య వ్యాససంకలనాన్ని ఆవిష్కరించుకున్నాం. ఇటీవల కవిత్వంపైనా విరసం రెండు వర్క్‌షాపులను నిర్వహించింది. గత సాహిత్యపాఠశాల నుండి విరసం సభ్యులు ప్రజాకళారూపాలైన నాటిక, పాటపై కృషి చేస్తూ సాంస్కృతిక బృందంగా ముందుకు వస్తున్నారు. ఇక కథ, కవిత్వం, సాహిత్య విమర్శ, వివిధ అంశాలపై సైద్ధాంతిక, రాజకీయార్థిక విశ్లేషణా వ్యాసాల పుస్తకాలు గత రెండేళ్ళలో విరసం సభ్యుల నుండి 20 దాకా వెలువడ్డాయి. ఈ మొత్తం కార్యచరణలో విరసం యువ సభ్యుల చొరవ ఆశావహంగా ఉంటున్నది. మెరుగైన అధ్యయనం, సైద్ధాంతిక కృషి దీనిని మరింత ముందుకు తీసుకుపోగలదు. సాహిత్య విమర్శ రంగంలో విరసం కొత్త తరం ఉండవలసినంతగా లేదు. ఈ లోటును పూరించుకోవాల్సిన అవసరాన్ని విరసం గుర్తిస్తోంది.

విప్లవ సాంస్కృతికోద్యమ కర్తవ్యాలను నెరవేర్చే దిశలో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ సాహిత్య సాంస్కృతిక రంగాలలో మోడిత్వ రాజకీయాలను, ఆధిపత్య సంస్కృతిని ఎదిరిస్తూ విప్లవోద్యమ స్ఫూర్తితో విరసం తన కార్యాచరణను కొనసాగిస్తుంది.

విప్లవాభివందనాలతో

2013 ముజఫర్‌నగర్ అల్లర్ల దాకా.. పాలకవర్గాలు మతాన్ని వాడుకొని లాభపడుతున్నాయని చెప్పారు. విద్యా బోధనలో, పాలనలో తెలుగుని తప్పనిసరి చేయాలని, తెలుగువారు ఉన్న ప్రతిచోటా కాళోజీ సభలు నిర్వహించాలని దివికుమార్ అభిలషించారు. అస్తిత్వ వాదాల్లో పట్టించుకోవాల్సిన అంశాలు ఉన్నాయని గుర్తించి, ఆ వాదాలు వేసిన ప్రశ్నలను స్వీకరించిన ఏకైక సాహిత్య సంస్థ విరసం అని **'మరసం' ప్రతినిధి నందిని సిధారెడ్డి** అన్నారు. వరంగల్ విప్లవోద్యమంలో విరసం పాత్ర గణనీయంగా ఉన్నదని, విరసం లేకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే లేదని చెప్పారు. ప్రాంతంతో సంబంధం లేకుండా తెలంగాణను గట్టిగా బలపరుస్తున్న ఘనత తెలుగు సమాజంలో ఒక్క విరసానికే దక్కుతుందన్నారు. అడవి నుంచి ఉద్యమాన్ని, ఉద్యమం నుంచి మనిషిని ఎవరూ విడదీయలేరని పేర్కొన్నారు. పెడదారి పట్టిన యువతని సంస్కరించే విషయంలో విరసం ప్రత్యేక దృష్టి పెట్టాలని సిధారెడ్డి సూచించారు. అమరుల పోరాట ఫలాలు అందరికీ అందే రోజు రావాలని **కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధి జితేందర్ రావు** ఆకాంక్షించగా, సకల రంగాల్లో విరసం భావజాలం వ్యాప్తి చెందాలని **'ప్రరసం' ప్రతినిధి సిరాజుద్దీన్** కోరారు. ప్రాచీన సాహిత్యంలోని ప్రజానుకూల అంశాలను విప్లవ సాహిత్యం స్వీకరించాలని **వరంగల్ రచయితల ఐక్య వేదిక ప్రతినిధి వీరాచారి** సూచించారు. వి.వి. పాఠాలు చెప్పిన కళాశాల విప్లవోద్యమ వేదికగా నిలిచిందని, పైకి కనపించకపోయినా నివురుగప్పిన ఆ నిప్పు జ్వలించక మానదని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ విరసం వైపు చూస్తున్నదని **ప్రజాకళా మండలి ప్రతినిధి జాన్** అన్నారు. విరసం తన మహాసభలను వరంగల్‌లో జరుపుకోవడం ద్వారా తెలంగాణ ప్రజలకు స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని సూచించిందని చెప్పారు. తెలంగాణ వస్తున్న తరుణంలో పువ్వర్తి ఎన్‌కౌంటర్ జరిగిందని, ఏ రాజకీయ పార్టీ ఈ ఘటనను ఖండించకపోవడం చూస్తే.. అవి తెచ్చే రాష్ట్రం ఎలాంటిదో తెలుస్తున్నదన్నారు. పర్యావరణ విధ్వంసం తెలంగాణ అంతటా భారీఎత్తున కొనసాగుతున్నదని **సృజనలోకం ప్రతినిధి రామా చంద్రమౌళి** అన్నారు. ఉద్యమం మొదలయిన 2009 నుంచి చూసినా.. ఇప్పటిదాకా కరీంనగర్‌లో 530 గుట్టలు మాయమయ్యాయని, వరంగల్‌లో ఇసుక మాఫియా నడుస్తున్నదని చెప్పారు. నేటి విద్యా వ్యవస్థ యువత చైతన్యాన్ని, ఆలోచనా శక్తిని తొలిచేసేలా ఉన్నదని విమర్శించారు. మిత్రమండలికి స్ఫూర్తి విరసమేనని ఆ సంస్థ ప్రతినిధి **వి.ఆర్. విద్యార్థి** అన్నారు. సాహిత్య సంస్థలన్నీ చుట్టాల్లా మెలగాలని ఆకాంక్షించారు. ఒకటి రెండు అంశాల్లో మినహా.. అరసం, విరసం సంస్థలు కలిసి పనిచేయడానికి మరే అడ్డంకీ లేదని **అరసం ప్రధాన కార్యదర్శి వేల్పుల నారాయణ** అన్నారు. విరసం సాహిత్యాన్ని చదవడం ద్వారానే తాను రచన చేయగలుగుతున్నట్టు **'చెలిమె' ప్రతినిధి గుండెబోయిన శ్రీనివాస్** అన్నారు.

లడాయి కోసమే చదువు!

బాసిత్ అధ్యక్షతన జరిగిన తొలి సెషన్‌లో **'ఆదివాసీ ఉద్యమాలు- స్వపరిపాలన'** అన్న అంశంపై **పాణి** ప్రసంగించారు. ఆదివాసీ పోరాటాలంటే వర్గపోరాటాలేనని, స్వపరిపాలన అంటే జనతన సర్కార్‌లని నిర్వచించారు. భూంకాల్ ఉద్యమనేత గుండాదర్ నూరేళ్ల క్రితం పెట్టిన సాలులో బస్తర్ ఆదివాసీలు స్వయం పాలన ఆకాంక్షని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పోరాడే ప్రజలకు ఒకే ఒక ప్రత్యామ్నాయంగా క్రాంతికారీ జనతన సర్కార్ పనిచేస్తున్నదని వివరించారు. ఈ సర్కార్‌లు ఏర్పడిన నేపథ్యాన్ని, పనిచేస్తున్న క్రమాన్ని అర్థం చేసుకోవడం..అలా గ్రహింపులోకి వచ్చిన అంశాలను మార్క్సిస్టు సిద్ధాంత చట్రం నుంచి, సామాజిక విశ్లేషణ పరికరాల ద్వారా పరిశీలించడం ద్వారా.. అది మిగతా అన్ని ప్రత్యామ్నాయాల కన్నా ఎలా మెరుగయినదో, శాస్త్రీయమైనదో అర్థం చేసుకోవచ్చునన్నారు. మావోయిస్టు పార్టీ 2008లో జనతన సర్కారుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకొని, ఒక విధాన కార్యక్రమాన్ని ప్రకటించిందన్నారు. ఈనాడు మన్మోహన్ సింగ్ నుంచి మోదీ, కిరణ్‌కుమార్ రెడ్డి దాకా అంతా తమవి ప్రజా ప్రభుత్వాలని చెప్పుకుంటున్న దరిమిలా.. ఈ సర్కారులు తమను తాము క్రాంతికారీ జనతన సర్కారులుగా పిలుచు కుంటున్నాయని చెప్పారు. 1980ల్లో దండకారణ్యంలోకి విప్లవోద్యమం అడుగుపెట్టిందని, అంచెలంచెలుగా ఎదిగి ఈనాడు ప్రభుత్వాల ఏర్పాటు స్థాయికి చేరుకుందన్నారు. అయితే, 1990ల కాలం అన్నివిధాలా ముఖ్యమైనదని, అప్పుడే కేంద్రంలో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టగా, మన రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచబ్యాంకు విధానాల ఎదుట సాగిలపడ్డాడని పేర్కొన్నారు. ఈ పరిస్థితినంతా విప్లవోద్యమం సమీక్షించిందని, ప్రభుత్వాల అభివృద్ధి నమూనాను నిరసించడంతో సరిపెట్టకుండా ప్రజల అభివృద్ధి నమూనాను కూడా ముందుపెట్టాలని నిర్ణయించిందని వివరించారు. ఈ నమూనాకు నిర్మాణ రూపాన్ని అందిస్తూ.. 'గ్రామ రాజ్య కమిటీలకే అన్ని అధికారాలన్న నినాదాన్ని 1996లో ఇచ్చిందన్నారు. ఈ నిర్మాణానికి ప్రభుత్వ రూపం ఇస్తూ 2008లో జనతన సర్కార్‌లను ఏర్పాటు చేసిందని చెప్పారు.

ఆదివాసీ, ఆదివాసీయేతరులకు సర్కార్‌లో భాగస్వామ్యం కల్పించారని, ఆదివాసీ సమాజంలోని నాలుగు వర్గాల సమ్మేళనంగా సర్కారుల పాలకవర్గం నిర్మాణమైందని తెలిపారు. విద్య-సంస్కృతి, వైద్యం, వ్యవసాయం సహా తొమ్మిది ముఖ్యమైన అంశాలను గుర్తించి సర్కార్ పనిచేయడం మొదలుపెట్టిందన్నారు. సంస్కృతిని విద్యలో భాగంగా బోధించడం సర్కార్ స్కూళ్లలో కనిపించే ప్రత్యేకత కాగా, నాలుగో తరగతి వరకు పూర్తిగా మాతృభాషలోనే విద్యా బోధన సాగుతున్నదని వివరించారు. వర్గ పోరాట వేదికగా ఈనాడు ఆ స్కూళ్లు మారుతున్నాయని, 'మేము లడాయి కోసమే చదువుతున్నాం' అని పిల్లలు చెబుతున్నారన్నారు. వైద్య విధానం కింద, ప్రధానంగా శరీర ధర్మశాస్త్రం, ఔషధ వాడకంపై ఆదివాసీలకు అవగాహన పెంచుతున్నారని చెప్పారు. బస్తర్‌లో **చేతనా నాట్యమంచ్** వంటి విప్లవ సాంస్కృతిక సంస్థలు ప్రత్యేక దృష్టితో ఆరోగ్య ప్రచార కార్యక్రమాలను రూపొందిస్తున్నాయన్నారు. మన సమాజాల్లో కనిపించే తీవ్ర రుగ్మతలేవీ కనిపించవని, ఆదివాసీల ఆహారంలో మాంసం, చేపలు, స్వయంగా పండించుకున్న తాజా కూరగాయాలు ఉండటమే దీనికి కారణమన్నారు. ఆరోగ్య పరిరక్షణని..ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో భాగంగా సర్కార్లు చూస్తున్నాయన్నారు. మూఢ నమ్మకాలు, అంధ

విశ్వాసాలతో నిండి, మూలికా వైద్య జ్ఞానం మాత్రమే గల ఆదివాసీల్లో శాస్త్ర దృష్టిని పెంచుతున్నాయని చెప్పారు. వ్యవసాయరంగంలో సమిష్టికి, స్థానిక అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. 1980ల్లో విప్లవోద్యమం దండకారణ్యంలో అడుగుపెట్టే నాటికి ఆదివాసీల పరిస్థితి దారుణంగా ఉండేదని, ఆకలితో అల్లాడుతూ, తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో ఉండేవారని. ఆ విషయాలు ఆ కాలంలో వచ్చిన **సరిహద్దు, వసంతగీతం** వంటి నవలల్లో గమనించొచ్చునని చెప్పారు. పోడు వ్యవసాయం నుంచి స్థిర సాగులోకి వారిని జనతన సర్కార్‌లు మళ్లించాయని వివరించారు. సేంద్రీయ పద్ధతులను సాగులో ప్రోత్సహిస్తూ, స్థానిక వంగడాలను వాడి దిగుబడిని పెంచుతూ.. కరువు, ఆకలి సమస్యలను అధిగమించడం జరిగిందన్నారు. స్థానిక అవసరాలను తీర్చేవిధంగా వ్యవసాయ రంగంపై సర్కార్‌లు శ్రద్ధపెట్టాయని, అందులోభాగంగా భూమి చదును, మట్టి డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల నిర్మాణం వంటి పనుల్లో సర్కార్ నాయకత్వంలో ఆదివాసీలు పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు. తిండి అవసరాలు తీర్చి వచ్చే పంట కాలానికి గింజలను నిల్వ చేసే విధంగా దండకారణ్యంలో వ్యవసాయరంగాన్ని ఇప్పటిదాకా అభివృద్ధి పరిచారన్నారు. ఇంకో ముఖ్యమైన విషయం - సాగు రంగంలో మహిళా భాగస్వామ్యమని చెప్పారు. సాధారణంగా వ్యవసాయానికి సంబంధించిన ముఖ్యమైన పనులేవీ ఆదివాసీ పురుషులు తమ మహిళలను చేయనీయరని, పురుషాధిపత్యం దారుణస్థాయిలో అమల్లో ఉండేదని గుర్తుచేశారు.. పురుషుల్లో అవగాహన ఒకవైపు పెంచుతూనే, ఉత్పత్తిలో మహిళల పాత్రని జనతన సర్కార్ పెంచుతున్నదని ఈనాడు మహిళల స్వేచ్ఛను ఆమోదించే స్థాయికి, వారి నాయకత్వాన పనిచేసేందుకు ముందుకొచ్చే స్థితికి పురుషులు చేరుకున్నారన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఉత్పత్తి-యుద్ధం అనేవాటిని ఆదివాసీలు వేర్వేరుగా చూడటం లేదని, ఈ దృక్పథంతోనే సర్కార్‌లు పనిచేస్తున్నాయని వివరించారు. ఆదివాసీ సమాజాల్లో అసలు వర్గాలు ఎక్కడున్నాయని బాలగోపాల్ వంటి వారు ప్రశ్నించారని, సర్కార్‌లు ఏర్పడి (నాలుగు వర్గాల సమ్మేళనం) పనిచేస్తున్న క్రమమే అటువంటి మేధావులకు సమాధానమన్నారు. 'బస్తర్‌లో వర్గాలు- విశ్లేషణ-మన అవగాహన' అనే పుస్తకం స్థానిక లిపిలో 2003లో వెలువడి దండకారణ్యం అంతటా పంచబడి, విస్తృతంగా చర్చించ బడిందన్నారు. క్రాంతికారీ జనతన సర్కారుల నిర్మాణం గ్రామసభతో మొదలవుతుందని, స్థానిక వ్యవహారాల్లో ఈ సభకు నిర్ణయాత్మక శక్తి ఉంటుందన్నారు. అయితే, ఈ సర్కార్‌ల భవిష్యత్తు ఏమిటని, శ్రీలంకలో వలె భారత ప్రభుత్వం పూర్తిస్థాయిలో యుద్ధం మొదలుపెడితే తట్టుకోగలవా అనే ప్రశ్నలు, సందేహాలను చాలామంది మేధావులు, సామాజికవేత్తలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే, మార్క్సిజం వెలుగులో వర్గ పోరాటంలో భాగంగా దండకారణ్యంలో జరుగుతున్న కృషి ఆటుపోట్లకు గురవుతుందేగానీ, అంతం కాబోదన్నారు. తాను నిర్మించాల్సిన సమాజం పట్ల, తాను కూల్చాల్సిన వర్గాల పట్ల దండకారణ్య ఆదివాసీకి పూర్తి స్పష్టత ఉన్నదన్నారు. దండకారణ్య విముక్తినే కాదు.. మొత్తం భారత సమాజ విముక్తి దిశగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని కాగడాగా పట్టుకొని సాగుతున్న ఆదివాసీల పోరాటానికి, వారి స్వపరిపాలనకు అందరం మద్దతు తెలపాలని, అందులోభాగంగానే రానున్న మహాసభల వరకు విరసం.. క్రాంతికారీ జనతన సర్కార్‌ల ప్రచారాన్ని కేంద్ర కర్తవ్యంగా నిర్ణయించుకున్నదని పాణి వెల్లడించారు.

అనంతరం **విరసం సాంస్కృతిక బృందం బాసగూడ నాటకాన్ని** ప్రదర్శించింది. లైటింగ్స్, కాస్ట్యూమ్స్, మేకప్ లేకుండా చాలా సహజంగా ప్రదర్శన సాగింది. మరో జలియన్‌వాలాబాగ్‌ని తలపిస్తూ బాసగూడలో విత్తనాల పండుగ జరుపుకుంటున్న ఆదివాసీలపై సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు కాల్పులు జరిపి పెద్దఎత్తున హత్యాకాండకి పాల్పడిన దారుణాన్ని విరసం కళాకారులు.. కళ్లు చెమ్మగిల్లేలా కళ్లకు కట్టారు. ఈ ప్రదర్శనని విరసం సభ్యుడు ఉదయమిత్ర రచించగా, మరో విరసం సభ్యుడు ఉదయ్‌భాను దర్శకత్వం వహించారు. విరసం సభ్యులతోపాటు విరసం మిత్రులు ఔత్సాహికంగా ఇందులో పాలుపంచుకున్నారు. అనంతరం వేలాదిమంది ప్రజలు, రచయితలు, కళాకారులు ర్యాలీగా బహిరంగ సభ వేదిక అయిన సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌కి చేరుకున్నారు. ప్రజాకళామండలి కళాకారులు సాంస్కృతిక నృత్యాలు, గానాలతో ముందు నడవగా, కాగడాల వెలుగులో, ఎర్రజెండాల రెపరెపలతో ప్రదర్శన ఆసాంతం సమరోత్సాహ వాతావరణంలో సాగింది. 'ఏకీ రాస్తా ఏకీ రాస్తా జనతన సర్కార్ ఏకీ రాస్తా' అంటూ రోడ్డు పొడవుతా ప్రజలు నినదించారు. కామ్రేడ్ అకుల భూమయ్య వేదికపై జరిగిన బహిరంగసభలో.. **కొత్త కార్యదర్శిగా పి. వరలక్ష్మి,** కార్యవర్గ సభ్యులుగా **పాణి, కాశీం, రాంకి, రివేరా, ఉజ్వల్, బాసిత్, అరసవెల్లి కృష్ణ, రవికుమార్, చిన్నయ్య, నల్లూరి రుక్మిణిల** పేర్లను ప్రకటించారు. విరసం తీర్మానాలను కొత్త కార్యదర్శి చదివి వినిపించారు. బహిరంగ సభలో మిత్రమండలి ప్రతినిధి **వి.ఆర్.** విద్యార్థి, విరసం నాయకులు జి. కల్యాణరావు, నల్లూరి రుక్మిణి, వరవరరావు ప్రసంగించారు.

రెండో రోజు (12-01-2014న) ఉదయం అరసవెల్లి కృష్ణ, సుదర్శన్, వడ్డెబోయిన శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కామ్రేడ్ కౌముది వేదికపై కవిగాయక సభ జరిగింది. దండకారణ్యం కవి సమయంగా కవులు, గాయకులు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా గొంతెత్తారు. కౌముది రాసిన పాట పాడి సుదర్శన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. **శాఖమూరి రవి, విష్ణు, దేవరాజు, బాలసాని రాజయ్య, ఆంజనేయులు, ఎస్ఎస్ఆర్, పచ్చల కిరణ్‌కుమార్, గిన్నెరాజు, రాజయ్య, సుధాకర్ శర్మ, అబ్దుల్ నబీ, బిల్ల మహేందర్, అబ్బాస్, జి. కళ్యాణరావులు** కవితలు వినిపించగా, **టేకుమల్ విజయలక్ష్మి, పీ శ్రీనివాస్, కోటన్న, షేక్‌బాబా, ఆచంట ప్రసాద్‌లు** విప్లవ గీతాలాపన చేశారు. సమయభావం వల్ల అనేక మంది కవులు తమ కవితలు చదవడం సాధ్యం కాలేదు.

కదలికే కాళోజీ

అనంతరం సి.ఎస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెషన్‌లో **'కాళోజీ సాహిత్యం-తాత్వికత'** అనే అంశంపై ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య ప్రసంగించారు. ప్రజల్లో ఉన్న భావానికి కాళోజీ తన కవిత్వం ద్వారా నినాద రూపం ఇచ్చారని చెప్పారు. తాత్వికంగా గాంధీకి సన్నిహితుడైనా ప్రతిచర్యను, ప్రతిహింసను పూర్తిగా సమర్థించారని పేర్కొన్నారు. మనిషి గొడవే కాళోజీ గొడవ అని అభివర్ణించారు.

మానవుడిగా ఆలోచిస్తున్నామా అనేదే ఆయన తాత్విక సారమన్నారు. మనిషి తోటి మనిషిని మనిషిగా చూడాలని కాళోజీ కోరుకున్నారని, దానికోసమే తన సాహిత్యాన్నంతా అంకితం చేశారని చెప్పారు. ఉత్పత్తిలో పాల్గొనే వారే మనుషులన్న భావనని స్వీయానుభవం నుంచి కాళోజీ స్వీకరించారంటూ కొన్ని ఉదాహరణలు అందించారు. వ్యవసాయ దేశంలో రైతాంగ ప్రాధాన్యాన్ని చెబుతూ ' కర్షాక! నీ కర్రు కదిలినంత వరకే..' అనే గేయం రచించారని వివరించారు. 'నేను' అనే భావనను మనుగడలో భాగంగా చూస్తే అభ్యంతరం లేదని, అదే దాన్నొక ఆధిపత్య ధోరణిలో వ్యక్తీకరిస్తే మాత్రం కాళోజీ ఆగ్రహించేవారని గుర్తుచేశారు. 'మన భావన- సమ భావన' అని కాళోజీ నమ్మి ఆచరించారన్నారు. కదలిక లేని కాళోజీని చూడలేమని, దు:ఖాన్ని, ధిక్కారాన్ని ఒకేస్థాయిలో వ్యక్తీకరించారని చెప్పారు. అక్కడో కవిత, ఇక్కడో వ్యాసం చదివితేనో, బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన కొన్ని కవితలను పరిశీలిస్తేనో, కాళోజీ అర్థం కారని, సర్వసమగ్రంగా చదివితేనే కాళోజీ విరాట్ స్వరూపం అర్థమవుతుందన్నారు. బతుకు, సామాన్యుడు అనే పదాలను కాళోజీ విరివిగా ఉపయోగించారని, జీవన సత్యాలను చిన్న చిన్న పదాల్లో చెప్పేవారంటూ 'సాగిపోవడమే బతుకు- ఆగిపోవడమే చావు'; 'పుట్టుక నీది, చావు నీది- బతుకు దేశానిది' అన్న కాళోజీ కవిత్వ పంక్తులను వినిపించారు.

సందర్భం ఏదైనా, సమయం ఎలాంటిదైనా.. భిన్నాభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టినట్టు చెప్పడం, దిలాసాగా బతకడం కాళోజీ ప్రత్యేకతలుగా విశ్లేషించారు. సాహిత్యం విషయంలో ఆయనకు చాలా పట్టింపులున్నాయన్నారు. రచన చేసినా, గీత గీచినా, పాట పాడినా.. అది అర్థం కానప్పుడు వ్యర్థమేనని మిత్రమండలి సమావేశాల్లో గట్టిగా చెప్పేవారన్నారు. కవిత్వంలో ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారని వివరించారు. సామాజిక, విముక్తి ఉద్యమాలను బేషరతుగా సమర్థించారంటూ..'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు ఆనందం' అన్న చరణాన్ని గుర్తు చేశారు. దోపిడీ, దౌర్జన్యాలపై తిరగబడేప్పుడు సత్యాహింసల మీమాంస కూడదన్నారని, అటువంటి పరిస్థితుల్లో ' తిరగబడిన ప్రజల శక్తి ముందు ప్రభుత్వం మిగలలేదు' అని పాలకవర్గాలను కాళోజీ హెచ్చరించారని చెప్పారు. తెలుగు భాషని మాండలికంగానూ, మాండలికాలను భాషలుగానూ కాళోజీ పరిగణించారని, అలా తెలంగాణ యాసను తెలంగాణ భాషగా అభివర్ణించారన్నారు. వివేకాన్ని ఆవేశ స్థాయికి తీసుకెళ్లాలని కాళోజీ కోరుకున్నారని, ఖలీల్ జిబ్రాన్ 'ప్రాఫెట్' ప్రభావం ఆయన జీవితం, రచనపై బలీయంగా ఉన్నదన్నారు. ఏది తోస్తే అది మాట్లాడే, ఎటు తోస్తే అటు కదిలే కాళోజీ ఏ నిర్మాణంలోనూ ఇమిడే మనిషి కాదని, అది ఆయన పరిమితిగానే పరిగణించాలని అభిప్రాయపడ్డారు. మనిషికి మనిషి గౌరవం మిగిలి, సామాన్యుడికి జయం కలిగినప్పుడే కాళోజీకి నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందని దర్భశయనం వ్యాఖ్యానించారు.

కాగా, మధ్యాహ్నం భోజనంలో బీఫ్‌ని వడ్డించడం జరిగింది. శ్రామిక, అట్టడుగు సమూహాల ఆహార సంప్రదాయాలను ఒక సాంస్కృతిక విలువగా విరసం గుర్తిస్తుంది. అందులోభాగంగా మిగతా ఆహార పదార్థాలతో పాటు గొడ్డు మాంసాన్ని అందించింది.

అంకెల్లో మనిషి మాయం

అనంతరం వి. చెంచయ్య అధ్యక్షతన జరిగిన సెషన్‌లో **'అభివృద్ధి భావజాలం - విచ్ఛిన్నమవుతున్న మనిషి'** అనే అంశంపై వీక్షణం సంపాదకుడు **ఎన్. వేణుగోపాల్** ప్రసంగించారు. పాలక వర్గాలు ఒక పద్ధతి ప్రకారం సమాజాన్ని అభివృద్ధి భావజాలంలో ముంచెత్తుతున్నాయన్నారు. ఈ భావజాలంలో అంకెలే గానీ, మనుషులు కనిపించరని చెప్పారు. సమాజ క్రమంగా కాక, ఘటనాత్మకంగా అభివృద్ధిని చూడటం ఇందులో ప్రధాన అంశమని, పెట్టుబడిదారీ విధానమే సిసలైన అభివృద్ధి అని చాటుకోవడమే మూల లక్ష్యమన్నారు. సరుకుల అభివృద్ధిని తప్ప మనిషి అభివృద్ధిని ఈ భావజాలం పట్టించుకోబోదని చెప్పారు. ఈ స్థితిలో ప్రతి ఒక్కరూ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నదంటూ దక్షిణాఫ్రికా నేత మండేలాకు ఉద్యమ స్నేహితుడొకరు చెప్పిన మాటలను గుర్తు చేశారు. 'అర్థశాస్త్రాన్ని నిపుణుల వ్యవహారంగా భావించి చాలా పెద్ద పొరపాటు చేశాం' అని ఆయన చింతించారని, ఆ పరిస్థితిని మనం తెచ్చుకోరాదని సూచించారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ పెట్టుబడి, అమెరికా సామ్రాజ్యవాదం కనుసన్నల్లో చెలామణి అయిన అభివృద్ధి నమూనాకు 1980ల్లో గట్టి ప్రశ్నలు ఎదురయ్యాయని చెప్పారు. అభివృద్ధి రాహిత్యాన్నే అభివృద్ధిగా ప్రచారం చేస్తున్నారని అండర్ ఫ్రాంక్ అనే ఆర్థిక వేత్త.. ఈ భావజాలం పొట్ట విప్పి చూపారని, అప్పటినుంచీ ఈ అభివృద్ధి నమూనా..సారంలో కాక, రూపంలో అనేక మార్పులకు గురయిందని చెప్పారు.

అభివృద్ధి నమూనాలో అంకెలు తప్ప మనుషులు, వాళ్ల సమస్యలు కనిపించడం లేదని, పర్యావరణానికి తీరని చేటు వాటిల్లుతున్నదని 1987లో ఐరాస నిపుణులు వాపోయారని, అందులోభాగంగా 'సుస్థిర అభివృద్ధి' అనే భావన వ్యాప్తిలోకి వచ్చిందని వివరించారు. నిరుద్యోగం, దారిద్ర్యం, పర్యావరణం వంటి అంశాలను పట్టించుకోవాలనేది దాని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పదేళ్ళ గడిచేప్పటికీ 'సుస్థిర అభివృద్ధి'కి కాలం చెల్లి.. దానిస్థానంలో 'మానవాభివృద్ధి' అనే ప్రతిపాదన 1996లో ముందుకొచ్చిందని చెప్పారు. అమర్త్యసేన్, మహ్మద్ హక్ వంటి ఆర్థిక నిపుణులతో కూడిన యూఎన్‌డీఎఫ్ టీమ్..ఈ సిద్ధాంతాన్ని తయారుచేసిందన్నారు. తలసరి ఆదాయం, జి.డి.పి. ఆధారంగా కాక.. వైద్యం, విద్య, పారిశుద్ధ్యం తదితర 18 రకాల సూచీల ఆధారంగా మానవాభివృద్ధిని అంచనా వేయాలని వీరు ప్రతిపాదించారని, వీటి అమలుకు ప్రపంచబ్యాంకు నిధులు ఇస్తున్నదని చెప్పారు. అయితే, 2006 నాటికి ఆ ప్రయోగమూ డొల్లగానే తేలి.. 'సమ్మిళిత అభివృద్ధి' భావన ముందుకొచ్చిందని చెప్పారు. ఇప్పటిదాకా అభివృద్ధి క్రమంలో భాగం కానివారికి చోటు కల్పించడమే ఈ తరహా అభివృద్ధి లక్ష్యమన్నారు. నిజానికి, ఇలాంటి భావనలు, నమూనాలు ఎన్ని తయారయినా వర్గ దోపిడీ ఉన్నన్నాళ్లు అవేవీ ఫలితాలు ఇవ్వలేవన్నారు. వృద్ధి వేరూ, అభివృద్ధి వేరని.. వృద్ధిలో అంకెలుంటే అభివృద్ధిలో మానవుడు ఉంటాడని, అలాగే వృద్ధి పెరగడం వల్ల ఒక్క ఉద్యోగం కూడా కొత్తగా సృష్టి కాబోదన్నారు. నిజమైన అభివృద్ధి సమాజ అభివృద్ధి క్రమంలోనే సాధ్యమని, ఉత్పత్తి శక్తులను పెంచకుండా అసలు అభివృద్ధే కుదరని పని అని తేల్చిచెప్పారు. ఉత్పత్తి సాధనాలను మెరుగుపరిచిందా లేక ఉన్నవాటిని ధ్వంసం చేసిందా అనే దాన్ని బట్టి, అది ప్రజల అభివృద్ధా లేక

మహాసభల్లో ఆవిష్కరించిన పుస్తకాల వివరాలు..

క్ర.స	పుస్తకం	రచయిత/ప్రచురణ	పరిచయం
1)	విప్లవ మేధావి మహిత (నివాళి)	విరసం	వరవరరావు
2)	ఆదర్శజీవులు అమరులు (నివాళి)	విరసం	ఎం. శ్రీనివాసరావు
3)	పువ్వర్తి అమరులు (నివాళి)	దిక్సూచి	పద్మ
4)	పిల్లనగ్రోవి తుఫాను (కవిత్వం)	ఉదయ్‌భాను	వడ్డెబోయిన శ్రీనివాస్
5)	కరువుకాటకాల కన్నీటి కోన నేటి రాయలసీమ (వ్యాసాలు)	విరసం ప్రచురణలు	జగన్
6)	ఇక్కడి చెట్లగాలి (కవిత్వం)	నందిని సిధారెడ్డి	వి.చెంచయ్య
7)	కళింగసీమ ప్రజా సమస్యలు మూడు, నాలుగు బులెటిన్లు (నివేదికలు)	వంశధార ప్రచురణ	పి.వరలక్ష్మి
8)	సాహిత్య సమాలోచన (వ్యాసాలు)	కృష్ణాబాయి	నల్లూరి రుక్మిణి
9)	ప్రజాస్వామ్య తెలంగాణ (చారిత్రక పత్రాలు) (వ్యాసాలు)	నడుస్తున్న తెలంగాణ ప్రచురణలు	మెట్టు రవీందర్
10)	వసంతగీతం (నవల)*	అల్లం రాజయ్య	నందిని సిధారెడ్డి
11)	భూమయ్య స్మరణలో (చివరి ప్రసంగం)	ఆకుల భూమయ్య	ఉదయ్‌భాను
12)	చైనా నవల కార్మికవర్గ పుత్రుడు	ప్రగతి (అనువాదం)	ఎన్.వేణుగోపాల్
13)	నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్నా (వ్యాసాలు)	కాశీం	ఎన్.వేణుగోపాల్
14)	మంద్రస్థాయి యుద్ధం	రివేరా (అనువాదం)	కె.వి.కూర్మనాథ్
15)	కా. ఆర్కే పోరాట జలపాతం (జ్ఞాపకాలు)*	రికన్నాయిటర్స్ ప్రచురణలు	హుస్సేన్
16)	రెండు పోరాట గాథలు*	భారతి	బాసిత్
17)	సామాజికం (వ్యాసాలు)	వి.చెంచయ్య	జి. కల్యాణరావు
18)	రేపు (కథ)	వెర్నన్ గొంజాల్విస్	బి.అనూరాధ
19)	కాంత పున్నం వెన్నెల (కథ)	పద్మకుమారి	బి.అనూరాధ
20)	నిత్యజీవితంలో సోషలిజం (వ్యాసాలు)	భూసారం శివన్న	రాంకి
21)	అరుణతార (డి.వి.డి.)	విరసం	కాకరాల
22)	సృజన (డి.వి.డి.)	సాహితీమిత్రులు	కాకరాల
23)	అరుణతార సాహిత్య విమర్శ ప్రత్యేక సంచిక	301వ సంచిక	కాకరాల
24)	ఒంద్రుమట్టి (నవల)	నల్లూరి రుక్మిణి	అల్లం రాజయ్య
25)	అరణ్యపర్వం (కథలు)	ఆలూరి భుజంగరావు	సిఎస్ఆర్ ప్రసాద్
26)	ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ (వ్యాసాలు)	వరవరరావు	ఎం.టి. ఖాన్
27)	మిగిలేటోళ్లు (కథలు)	బాసిత్	రాంరెడ్డి
28)	దండకారణ్యం కథలు*	విరసం ప్రచురణ	పాణి
29)	బీఫ్ రాజకీయాలు (వ్యాసాలు)	తెలంగాణ విద్యార్థి వేదిక	పాణి
30)	ఆకుల భూమయ్య వ్యాసాలు (వ్యాసాలు)	తెలంగాణ విద్యార్థి గళం	ఎ. నర్సింహారెడ్డి

ఆవిష్కరించినవారు :

* వసంతగీతం (నవల) - గజ్జెల గంగారం తల్లి, సంతోష్‌రెడ్డి అన్న సుధాకర్‌రెడ్డి
* ఆర్కే పోరాట జలపాతం (జ్ఞాపకాలు) - పులి అంజన్న తల్లి, అత్త, అన్న మట్టయ్య, హుస్సేన్
* రెండు పోరాట గాథలు - కౌకొండ అమరుల కుటుంబ సభ్యులు, నరేశ్ కుటుంబం;
* దండకారణ్యం కథలు (కథలు) - అమరురాలు కా. జిలానీబేగం సహచరుడు

దోపిడీ పాలకుల అభివృద్ధా అనేది తేలుతుందని చెప్పారు. ఇలాంటి అభివృద్ధి భావజాలం మనిషిని ఎలా విచ్ఛిన్నం చేస్తున్నదనేది పరిశీలించే ముందుగా..విచ్ఛిన్నమవుతున్న మనిషిని గురించి చర్చించాల్సి ఉన్నదన్నారు. ఈ శీర్షిక విచ్ఛిన్నమవుతున్న వ్యక్తి..అని ఉంటే బాగుండేదని సూచించారు. మనిషి అనడంలో (క్రియలో 'దు' ధ్వనించి) సమాజంలోని సగం జనాభా భాగం కాకుండా పోతారని చెప్పారు. అలాగే, విచ్ఛిన్నమవుతున్నదెవరనేది అర్థం చేసుకోవడమూ అవసరమేనని, సగటు మనిషి విచ్ఛిన్నం చేయబడుతున్నాడేగానీ, తనకు తాను విచ్ఛిన్నం కావడం లేదని చెప్పారు. 'మాయమయి పోతున్నడమ్మా మనిషన్నవాడు' (అందెశ్రీ) అంటున్న వారు మనిషి మాయమవుతున్నాడా లేక మాయం చేయబడుతున్నాడా అనేది ఆలోచించుకోవాలన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ దృష్టిలో మనిషి అంటే ఉన్నత మధ్యతరగతి అని, నిజానికి ఈ వర్గమే విచ్ఛిన్నమవు తున్నదన్నారు.

కాళోజీ నిర్వచనం ప్రకారం శ్రమజీవే మనిషి అని, ఏదైనా పనిని పురమాయించేందుకు 'మనిషిని పిలవండి' అని పిలవడాన్ని కాళోజీ బాగా పట్టుకున్నారని గుర్తుచేశారు. అయితే, మార్క్స్ మనిషిని మానవ సంబంధాల సమాహారంగా పరిగణించారని, అరిస్టాటిల్ నిర్వహించిన సంఘ జీవిగా మనిషి కనిపించకపోవడం ఆయనను ఆలోచనలో పడేసిందన్నారు. మనిషిని మనిషి చేతుల్లో పెట్టడమే సోషలిజం అని మార్క్స్ భావించారన్నారు. విచ్ఛిన్నం అంటే సమిష్టికి దూరం కావడం తప్ప మరేమీ కాదని, ఇలాంటి ఎడబాటును అభివృద్ధి భావజాలం ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. ఒక వర్గం నుంచి బృందాన్ని, బృందం నుంచి కుటుంబాన్ని, కుటుంబం నుంచి వ్యక్తిని వేరుచేసేందుకు అభివృద్ధి భావజాలం ప్రయత్నిస్తుందని తెలిపారు. బాల్‌గోపాల్ వంటివారు సైతం మానవ ప్రవృత్తి స్వార్థం అని నిర్వచించేదాకా వెళ్లారని, ఆధునికతలో భాగంగా అభివృద్ధిని చూడటం పాక్షిక దృష్టే అవుతుందని వివరించారు. ఉత్పత్తి క్రమానికి మనిషిని దూరం చేయడమే పరాయీకరణకు కారణమని, తాము చేస్తున్న పనిపై సమగ్ర జ్ఞానాన్ని గానీ, సంపూర్ణ అవగాహన గానీ లేకుండా చేయడం ఇందులో భాగమని విశదీకరించారు. ఈ భావజాలం మనిషిలో అస్తిత్వ ప్రాధాన్యాన్ని పెంచి, భోగలాలసను, సరుకు కొనుగోళ్లలో వేలంవెర్రిని పెంచుతుందన్నారు. అయితే, మనిషి తత్వం సంఘ జీవనమని, దాన్నే మార్క్సిజం ఎత్తిపడుతున్నదని వివరించారు. ప్రతి వ్యక్తి అభివృద్ధికి అందరి అభివృద్ధిలో భాగంగా భరోసా పడే సహకార వ్యవస్థ కమ్యూనిజం అని నిర్వచించారు. మానవీయ అభివృద్ధిని మార్క్స్ కాంక్షించారని, మనిషి ఆలోచనా శక్తిని పెంచేవిధంగా అభివృద్ధి క్రమం కొనసాగాలని ప్రతిపాదించారన్నారు. వర్గపోరాటం ద్వారానే అటువంటి క్రమాన్ని సాధించగలమని చెప్పారు. కాబట్టే ఈనాడు దండకారణ్యంలో అన్ని పోరాటాలతో పాటు అభివృద్ధి భావజాలంపైనా ఆదివాసీలు పోరాడుతున్నారని ఎన్. వేణుగోపాల్ అన్నారు.

ఉజ్వల్ అధ్యక్షతన జరిగిన మరో సెషన్‌లో '**కాళోజీ-ప్రజాస్వామిక తెలంగాణ**' అనే అంశంపై **కాశీం** మాట్లాడారు. కాళోజీ తొలినుంచీ ప్రజాస్వామిక ఉద్యమాలను బలపరిచారని చెప్పారు. తెలంగాణ జనసభ కళాకారిణి బెల్లి లలిత హత్యను ముందువరసలో నిలబడి కాళోజీ ఖండించారని గుర్తు చేశారు. గుజరాత్‌లో 2002లో ముస్లింల దారుణ ఊచకోత సాగినప్పుడు.. ప్రజాస్వామిక వాదులతో కలిసి ఆ నరమేధాన్ని గట్టిగా వ్యతిరేకించారని చెప్పారు. ప్రజల పక్షం, ప్రజాస్వామిక ఉద్యమాల పక్షం తీసుకొని.. కాళోజీ జనం మనిషిగా గౌరవించబడ్డారన్నారు..

మహాసభ ఆమోదించిన తీర్మానాలు

● ఎన్నో సమస్యలకోర్చి అతి కష్టం మీద పై చదువులకు వచ్చే దళిత, వెనుకబడిన, షెడ్యూల్డ్ తెగల, మైనారిటీ విద్యార్థులను బ్రాహ్మణీయ అగ్రహారాలుగా మారిన విశ్వవిద్యాలయాలు వేధిస్తున్నాయి. కులం పేరుతో సూటిపోటి మాటలనడం, చదువులకు అవసరమయ్యే అవకాశాల్ని రద్దు చేయడం, పై తరగతులకు పాస్ చేయకపోవడం మొదలైన పనులన్నీ చేసి మానసిక వేదనకు గురి చేస్తున్నాయి.

గత ఎనిమిది సంవత్సరాల్లో హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 16 మంది దళిత విద్యార్థులు, ఇటీవలే పుల్యాల రాజు, మాదారి వెంకటేష్‌లు ఆత్మహత్య చేసుకోవడం, ఇఫ్లూలో కూడా ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం మనకు తెలిసినవే. వీటిని విరసం ఆత్మహత్యలుగా కాక, హత్యలుగా భావిస్తూ బ్రాహ్మణీయ ఆధిపత్య దాడులు ఆపాలని డిమాండ్ చేస్తున్నది. దీనికి సంఘటిత పోరాటం చేయాలని విద్యార్థులకు పిలుపునిస్తున్నది.

● 1996 మలిదశ తెలంగాణ ఉద్యమం నుంచీ విరసం ప్రజాస్వామిక తెలంగాణను ప్రచారం చేస్తోంది. ప్రత్యక్షంగా ఉద్యమంలో ఉంటూ అనేక ఇతర విద్యార్థి, ప్రజాసంఘాలను, ప్రజలను కలుపుకొని పోతుంది విరసం. తెలంగాణ రాష్ట్ర సాధన ద్వారానే సకల సమస్యలకు పరిష్కారం దొరకుతుందని ప్రచారం చేస్తున్న బూర్జువా రాజకీయ పార్టీలను ఎప్పటికప్పుడూ ఎండగడుతూ ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రజల్లో నెలకొన్న అనేక భ్రమలను తొలగిస్తూ ముందుకు నడుస్తోంది.

2009 తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉంటూనే, బౌద్ధిక రంగంలో తన కృషిని కొనసాగిస్తోంది. తెలంగాణ ప్రజల అరవైయేళ్ళ కల సాకారమవుతున్న తరుణంలో సీమాంధ్ర పాలకవర్గాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ, తెలుగు ప్రజల మధ్య కృత్రిమ ఘర్షణను ప్రోదిచేస్తూ తమ రాజకీయ పబ్బం గడుపు కుంటున్నాయి. వివిధ రూపాల్లో అటు పార్లమెంట్‌లోనూ, ఇటు అసెంబ్లీలోనూ తెలంగాణను అడ్డుకుంటున్నాయి. తెలంగాణలో అంతర్భాగమైన హైదరాబాద్‌పై తమ హక్కు ఆధిక్యాన్ని నిలుపుకోవడం కోసం మాత్రమే. ఇంకా చెప్పాలంటే హైదరాబాద్‌లో అక్రమంగా ఆర్జించిన తమ ఆస్తులను కాపాడుకోవటం కోసమే సమైక్యాంధ్ర నినాదాన్ని ప్రచారం చేస్తున్నాయి తప్ప సీమాంధ్ర సాధారణ ప్రజలపై ఎట్లాంటి ప్రేమా వారికి లేదు. అదే విధంగా కొన్ని వేల మంది ఆదివాసులను నిర్వాసితులను చేసే పోలవరం ప్రాజెక్ట్‌కు దగ్గరుండి జాతీయ హోదాను కేంద్రం చేత ప్రకటించుకున్నాయి సీమాంధ్ర పాలకవర్గాలు. విద్యా, ఉద్యోగ సంబంధమైన విషయాల్లో కూడా తమ ఆధిక్యాన్ని యథాతథంగా నిలుపుకోవటానికి కుట్రలు పన్నుతాయి

సీమాంధ్ర పాలక వర్గాలు. పదేళ్ళ హైదరాబాద్ ఉమ్మడి రాజధాని ప్రతిపాదనను సీమాంధ్ర పాలక వర్గాలు సాధించుకున్నాయి.

ఇవన్నీ విరసం ఆశిస్తున్న ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణకు పూర్తి వ్యతిరేకమైనవి కనుక వీటిని విరసం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఎలాంటి ఆంక్షలు లేని ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ కోసం విరసం చివరి వరకు ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పోరాడుతుంది.

● నలభై వేల సైన్యం మోహరింపుతో దండకారణ్యంపై ప్రత్యక్ష యుద్ధాన్ని మంద్రస్థాయి నుంచి తీవ్ర స్థాయికి తీసుకుపోతున్న సామ్రాజ్యవాద దళారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దమనకాండను ఖండించండి. ప్రజాయుద్ధంతో ప్రతిఘటిస్తూ క్రాంతీకారీ జనతన సర్కార్ నేతృత్వంలో ప్రజల ప్రజాస్వామ్యాన్ని అమలు చేస్తున్న ఆదివాసీ ప్రజలకు అండగా నిలవండి. ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు, విప్లవాభిమానులకు విరసం పిలుపునిస్తోంది.

సర్వసత్తాక లౌకిక గణతంత్ర భారతదేశానికి ఎనిమిది సంవత్సరాల పాటు ప్రధానిగా ఉన్న మన్‌మోహన్‌సింగ్ తన పదవీకాలంలో అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందం, ఎఫ్‌డిఐ వంటి ఒప్పందాలు తనకు అన్నిటికన్నా ఎక్కువ సంతృప్తినిచ్చాయని ఆఖరి మీడియా కాన్ఫరెన్స్‌లో నిస్సిగ్గుగా చెప్పుకున్నాడు.

చావల్ సిఎంగా మీడియా ఎత్తిపడుతున్న రమణసింగ్ గ్రామాలపై దాడులు చేస్తూ, గూడాలు కాలబెడుతూ, మహిళలపై అత్యాచారాలు చేస్తూ ప్రజల్ని చంపుతూ బాసగూడ, గంగులూరు వంటి ఆదివాసీల మారణకాండల తర్వాత మృతుల, బాధితుల కుటుంబాలకు బియ్యం, రేషన్ పంపుతున్నాడు. వనర్ల దాహాన్ని రణరక్తంతో తీర్చుకునే ఈ కంపెనీ దళారుల మానవ మోహాలు దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో అమలవుతున్న ప్రజా ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్యమైన క్రాంతికారీ జనతన సర్కార్ పై మంద్రస్థాయి యుద్ధాన్ని తీవ్రస్థాయికి తీసుకపోవడానికా అన్నట్లు రాష్ట్రంలో ఎన్నికలు ముగియగానే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను దిగ్బంధం చేయడానికి నలభై వేల అర్ధ సైనిక బలగాలను దించినవి. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో ఆఫ్ఘన్ గెరిల్లాలపై డ్రోహులు విసురుతున్నట్లు నిర్విచక్షణా మానవ రహిత బాంబులు ఆకాశంలోంచి కురిపిస్తున్నారు.

ప్రజలపై ఈ ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రజాయుద్ధంతో ఒక వంక ప్రతిఘటిస్తూనే, దండకారణ్య విశాల ప్రజారాశులు క్రాంతికారీజనతన సర్కార్‌తో ప్రజల ప్రజాస్వామ్యాన్ని సమాన మహిళా ప్రాతినిధ్యంతో నిర్వహిస్తున్నారు.

ప్రపంచంలోనే ఆశాజ్యోతిగ మిగిలిన ఈ ప్రజాస్వామ్య ప్రయోగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విప్లవాభిమానులు సైనిక మోహరింపును, ప్రజలపై యుద్ధాన్ని ఖండించవలసిందిగా విరసం విజ్ఞప్తి చేస్తున్నది. ప్రజలపై ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రతిఘటిద్దాం. క్రాంతికారీ జనతన సర్కార్‌ను కాపాడుకుందాం.

● 1969 నుంచి అనేక ప్రజా ఉద్యమాలలో, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల భూమయ్య డిసెంబర్ 24వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదం ముసుగులో జరిగిన హత్యను విరసం ఖండిస్తోంది. విప్లవోద్యమ అవగాహనతో వెలువడన "ప్రజాస్వామిక తెలంగాణ – చారిత్రక పత్రాలు" పుస్తకాన్ని ఆవిష్కరించి తిరిగి తన ఇంటికి వెళ్తున్న క్రమంలో హైదరాబాద్‌లోని జిహెచ్‌ఎంసి చెత్త టిప్పర్ వెనుక నుంచి ఢీ కొట్టడంతో మృతి చెందాడు. భూమయ్య మృతి చెందిన తీరును పరిశీలిస్తే పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటి వరకు మృతికి కారణమైన డ్రైవరును అరెస్టు చేయకపోవడం వెనుక రాజ్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. భూమయ్య హత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, వారిని శిక్షించాలి. భూమయ్య మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరిపించాలని విరసం డిమాండ్ చేస్తోంది.

● ఆమ్ ఆద్మీ పార్టీ అనగా ఎఎపి, కలిపి పలికితే హిందీలో "ఆప్" అవుతుంది. అంటే 'మీరు' లేక 'తమరు' అని అర్థం. అలా ఆమ్ ఆద్మీ పార్టీ మీ పార్టీయే అని ప్రజలను నమ్మించగల్గుతోంది. దానికి తోడు చీపురుకట్టను తన ఎన్నికల గుర్తుగా పెట్టుకుని... తను అట్టడుగు జనాభాకు విముక్తి ప్రదాతనని, అవినీతి ప్రక్షాళనకు నడుం కట్టానని, నీతివంతమైన, స్వచ్ఛమైన పరిపాలనను అందిస్తానని మధ్యతరగతి వర్గాలను ఆకట్టుకుంటోంది. చీపురుకట్టతో ఆకాశంలో బూజును, నేల మీది మురికిని తుడిచిపెట్టేస్తానంటోంది... శభాష్! కాదనలేం! మంచిదే!

(1) భూమి అమ్మకం సరుకుగానే ఉంచి, రియల్ ఎస్టేట్ దందాను దానిలో పెనవేసుకుని ఉన్న మాఫియా ముఠాల అవినీతిని ఎలా తుడిచిపెట్టగలదో...

(2) పెట్టుబడిని సమాజీకరణ చెయ్యకుండా, కార్పొరేషన్లను, మల్టీనేషనల్ కంపెనీలను, దేశీయ పెట్టుబడిదారీ దోపిడీ ముఠాల అవినీతిని ఎలా అంతం చేయగలరు. పెట్టుబడి వ్యక్తిగతమైనప్పుడు, అదనపు శ్రమ లాభాల్లోకి మారి పెట్టుబడి కేంద్రీకృతమౌతూ, దోపిడీ కూడా వివిధ రూపాల్లో పెరిగి అవినీతి కూడా వివిధ రూపాల్లో వికసిస్తుంది. ఇది పెట్టుబడి చరిత్ర. దీనిని కాదని ఆమ్ ఆద్మీ పార్టీలు చేసేది సాము గారడీయే తప్ప ఏమీ కాదు.

(3) సాఫ్ట్‌వేర్, ఎన్.జి.ఒ. ఫైనాన్స్, మీడియా రంగాల్లో నిష్ణాతులు ఈ రోజు సరికొత్త నయా ఉదారవాద ఉద్దండులుగా, కొత్త తరహా ధనస్వామ్య వర్గంగా ఎదిగి రాజకీయ అధికారంలోనికి రావడానికి జరుగుతున్న పోరాట క్రమం ఇది. ఇది అర్థం చేసుకోవాలి. ఇప్పటి వరకు ఎఎపి తెర వెనుక ఉండి మేధో, ధన సహాయమందిస్తున్న ఎందరో ఢిల్లీలో ఆప్ విజయం తరువాత తెరముందుకు వచ్చి లైన్ కడుతున్నారు.

అంటే ఏమైనట్లు? స్వర్ణాభరణాలు కార్పొరేట్ కంపెనీలకు, గిల్టు నగలు ఆమ్ ఆద్మీలకు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, కార్పొరేట్లకు గాంధీ టోపీ, సగటు మనిషికొ కుచ్చుటోపీ. ఇదే ఆమ్ ఆద్మీ పార్టీ. దీనిని బట్టబయలు చేయాల్సిందే.

తనకు తాను ప్రత్యామ్నాయంగా చెప్పుకుంటున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నిజానికి ఉన్నత మధ్యతరగతి ఆలోచనలకు ప్రతీక. అంతర్జాతీయ పెట్టుబడిని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించకుండా అవినీతిని నిర్మూలించడం ఆ పార్టీకే కాదు, ఎవరికీ సాధ్యం కాదు.

'ఆప్' భ్రమల్లో పడకుండా ఏకైక ప్రత్యామ్నాయంగా విప్లవాన్ని గుర్తించి.. మద్దతునివ్వాలని మధ్యతరగతి యువతని కోరుతున్నాం.

- నల్గొండ ప్రజలకు కావలసింది తాగు, సాగు నీరు కానీ క్షిపణి ప్రయోగ కేంద్రం కాదు. నల్గొండ జిల్లా, సంస్థాన నారాయణపురం మండలం రాచకొండ గుట్టల్లో ప్రభుత్వం తలపెట్టిన క్షిపణి ప్రయోగ కేంద్రం (ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్) ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలి.

నల్లగొండ జిల్లా ఆసియాలోనే అత్యధిక ఫ్లోరిన్ నిల్వలు ఉన్న జిల్లాగా, అత్యధిక ఫ్లోరోసిస్ బాధితులు ఉన్న ప్రాంతంగా ప్రపంచంలోనే పేరు పొందింది. భూగర్భ జలాలు అడుగంటిపోయి, అడువులన్నీ నాశనం చేయబడి తాగు,సాగు నీరు లేక ప్రతనిత్యమూ రైతు ఆత్మహత్యలు సాధారణమైన జిల్లాగా కూడా దేశంలోనే పేరు పొందింది. అలాంటి జిల్లా ప్రజలకు కనీసం ఫ్లోరైడ్ రహిత మంచినీరు ఇప్పటి వరకూ ఇవ్వలేదు. కరువుతో అప్పులపాలై జీవితంపై ఆశలు కోల్పోతున్న రైతులకు కనీసం ఒక పంటకైనా సాగు నీరు గ్యారెంటీ చేయలేదు మన ప్రభుత్వాలు. కానీ పాలకులు తమ అవసరాల కోసం ప్రజలకున్న కొద్దిపాటి భూములను గుంజుకొని కార్పొరేట్లకు సేవ చేయడానికి 'క్షిపణి ప్రయోగ కేంద్రం' ప్రతిపాదనతో ముందుకు వచ్చాయి. మాకు కావలసింది తాగు, సాగు నీరు కానీ క్షిపణులు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు కాదు, మా ప్రాణాలు పోయినా మా భూములు మాత్రం ఇవ్వం అంటూ తిరగబడుతున్న పేదప్రజానీకాన్ని పోలీసులను మోహరించి భయభ్రాంతులను చేస్తూ భూములను లాక్కొనే తమ పథకాన్ని కొనసాగించాలని చూస్తున్నారు.

ఈ దుర్మార్గాన్ని విరసం ఖండిస్తున్నది. భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతులందరికీ భూమిపై హక్కు కల్పించాలి కానీ, ఉన్న భూములు గుంజుకోవడం కాదు. ప్రజలను తమ వనరులకు దూరం చేసే ఈ ప్రాజెక్టును తక్షణం ఉపసంహరించుకోవాలని విరసం డిమాండ్ చేస్తున్నది. నల్లగొండ జిల్లా ప్రజలకు తాగు, సాగు నీటి పథకాలపై దృష్టి పెట్టాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

- శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి తంపరలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ నిర్మాణం ప్రారంభించింది. అక్కడ తంపరలోని నీటి ద్వారా వ్యవసాయం చేసే రైతులు, చేపల వేట ద్వారా జీవనం సాగించే మత్స్యకారులు ఈ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుండి ఉపాధి కోల్పోయారు. పర్యావరణం విధ్వంసం అవుతూ ఉంది. ఐదు సంవత్సరాలుగా ఈ కంపెనీకి వ్యతిరేకంగా రైతులు, మత్స్యకారులు ఉద్యమిస్తున్నారు. ఉద్యమిస్తున్న వారిపై ప్రభుత్వం నిర్బంధం, అణిచివేత కొనసాగిస్తూ పోలీసు కాల్పులు జరిపి ముగ్గురిని హత్య చేసింది. కొనసాగింపుగా గత 15, 20 రోజులుగా ఆయా గ్రామాల్లో ఐదు వేల మంది పోలీసులు మోహరించి దాడులు చేస్తూ యువకులను అరెస్టు చేస్తున్నారు.ఇళ్ళ వద్ద ఉన్న మహిళలపై అత్యాచారాలు, దాడులు చేస్తున్నారు.దీనిని విరసం తీవ్రంగా ఖండిస్తున్నది. పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని ఈస్ట్‌కోస్ట్ కంపెనీ కిచ్చిన అన్ని రకాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేస్తున్నది.

కాకరాపల్లిలో అణువిద్యుత్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ఉద్యమ ప్రజలకు మద్దతు తెలుపుతున్నాం. ఉద్యమంపై మరింత అణచివేతను ప్రయోగించేందుకుగాను అక్కడ ఏర్పాటుచేసిన పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

- తిరుపతిలో ఇస్లామిక్ పాఠశాలపై హిందూత్వ శక్తుల దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం. లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం. తిరుపతి పట్టణానికి 14 కిమీ దూరంలో చంద్రగిరి మండలం తొండవాడలో నిర్మించిన ఇస్లామిక్ పాఠశాలను కూల్చాలని బి.జె.పి, విశ్వహిందు, ఆర్.ఎస్.ఎస్ వంటి హిందూ మతోన్మాద శక్తులు చేస్తున్న విష ప్రచారం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర విఘాతం. ముఖ్యంగా మైనారిటీ ముస్లింలను అభద్రతా భావంలోకి నెట్టింది. భారత రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛలో భాగంగా వేద పాఠశాలలు నిర్వహించుకున్నట్లే ఇస్లామిక్ పాఠశాలల్లో మదర్సాలు మత బోధనలు నేర్పుతున్నాయి. వేద పాఠశాలలో ఎలాగయితే హిందూ ధర్మం బోధిస్తారో మదర్సాల్లో ఇస్లామిక్ ధర్మం భోదిస్తున్నారు. ముఖ్యంగా తొండవాడలో నిర్మించిన మదర్సా గత 15 సంవత్సరాలుగా తిరుపతి పట్టణంలోనే అద్దె గదుల్లో నిర్వహిస్తూ వచ్చారు. మూడేళ్ళ క్రితం తొండవాడలో ఏడు అంతస్తులతో ఇస్లామిక్ పాఠశాలను ఆధునిక వసతులతో ఏర్పాటు చేసారు. దీనిపై హిందూ మతోన్మాద శక్తులు ఆ పాఠశాలకు విదేశీ నిధులు వచ్చాయని, అక్కడ ఉగ్రవాదులను తయారు చేస్తున్నారని అసత్య ఆరోపణలతో చేసిన ప్రమాదపూరిత వ్యాఖ్యలు ప్రశాంతంగా ఉన్న తిరుపతి పట్టణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ కూడా హిందూత్వ శక్తుల ఒత్తిడికి తలొగ్గి భవనం కూల్చమని ఆదేశాలివ్వడం దారుణం. అనుమతులు లేకుండా నిర్మించారని చెబుతున్న కారణం సరైనది కాదు. ఎందుకంటే అట్లా కూల్చాల్సివస్తే తిరుపతి పట్టణంలో టిటిడి నిర్మించిన శ్రీనివాసం, విష్ణు నివాసం లాంటి భారీ భవంతులకు కూడా టౌన్ ప్లానింగ్ అనుమతులు లేవు. మరి వాటి జోలికి పోకుండా ఎక్కడో 14 కి.మీ. దూరంలో ఉన్న భవనాన్ని కూల్చాలని ప్రభుత్వం నిర్ణయించటం సరైనది కాదు. ఇందువల్ల మైనార్టీ ప్రజల మనోభావాలు దెబ్బతిని హిందూ ముస్లింలు కలిసి జీవిస్తున్న తిరుపతి పట్టణంలో మత చిచ్చును రేపినట్లవుతుంది. ప్రభుత్వం ఈ చర్యను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. హిందూత్వ శక్తులు అదే పనిగా పనిగట్టుకొని హిందూ ధర్మ పరిరక్షణ, తిరుపతి పవిత్రత పేర లౌకిక ప్రజాస్వామ్యాన్ని భంగపరిచే రీతిలో వ్యవహరించడాన్ని ఇస్లామిక్ పాఠశాలను కూల్చుతామని బహిరంగ ప్రకటనలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు ప్రజాస్వామికవాదులందరినీ ఏకం చేసి పోరాడాల్సిన కర్తవ్యాన్ని విరసం ముందుకు తీసుకుపోతుందని తెలుపుతున్నాం.

- దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష వ్యతిరేక పోరాటయోధుడుగా, నల్ల సూరీడుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన వలసానంతర దక్షిణాఫ్రికా

అధ్యక్షుడు నెల్సన్ మండేలా డిసెంబర్ 6, 2013న మరణించాడు. సుదీర్ఘ జైలు జీవితాన్ని గడిపిన మండేలా పీడనకు, వివక్షతకు, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు జరుపుతున్న పోరాటానికి దిక్సూచిగా నిలిచాడు.

ఏ ఉద్యమమైనా, ఏ నాయకుడైనా తమ తమ సమాజాల నిర్దిష్ట రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయార్థిక దృక్కోణం నుండి అవగాహన చేసుకోకుండా జరిపే ఉద్యమాలు ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగినవైనా కొద్ది కాలంలోనే అవి తమ ప్రజానుకూలతను పోగొట్టుకుని, తమ పోరాట చైతన్యాన్ని కోల్పోయి తాము ధిక్కరించిన వ్యవస్థనే కొనసాగించడంలో భాగంగా పాలక వర్గాలకు ఉపయోగ పడతాయి. నెల్సన్ మండేలా ఆయన నడిపిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌ను వ్యవస్థను రాజకీయార్థిక దృక్కోణం నుండి అర్థం చేసుకోవడంలో విఫలమైన కారణంగానే అది వ్యవస్థతో రాజీ పడడం జరిగింది.

దక్షిణాఫ్రికానేత నెల్సన్ మండేలా ఉద్యమ ప్రస్థానం శ్లాఘనీయం. అయితే, ఆయన నేతృత్వాన ఏర్పడిన తొలి ప్రభుత్వం మాత్రం సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు లొంగిపోయిందని ప్రకటిస్తున్నాం. ఉద్యమ దశ వరకు మండేలాను గౌరవిస్తూ, తన ప్రజల విముక్తి కోసం అత్యంత నిజాయితీతో ఉద్యమించిన ఆయనకు నివాళి అర్పిస్తున్నాం.

● రైతుల్ని తరిమేసి వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చెయ్యడాన్ని ఖండిద్దాం. వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నది. గిట్టుబాటు ధరలు దొరకక, ఉత్పత్తి వ్యయం అప్పుడు విపరీతంగా పెరిగిపోయి వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో గత సంవత్సరం రెండువేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులకు ఎలాంటి రక్షణా మద్దతూ లేక తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారు. భూమికి అనువు కాని పంటల్ని ప్రోత్సహిస్తూ, వాతావరణాన్ని విషతుల్యం చేసే జన్యు పంటల వైపు కార్పొరేట్ ప్రపంచం రైతుల్ని ఆకర్షించి అప్పుల ఊబిలోకి నెడుతున్నారు.

వ్యవసాయంలో కార్పొరేట్ సాగు పద్ధతులను, రైతును భూమి, ఉత్పత్తి నుంచి బేదఖలు చేసే ప్రభుత్వ విధానాలను నిరసిస్తున్నాం.

ఒకవైపు సారవంతమైన భూముల్ని సెజ్‌లకు, పరిశ్రమలకు ధారాదత్తం చేస్తూ, లక్ష్మింపేట లాంటి గ్రామాల్లో దళితుల్ని ఊచకోత కోసి భూముల్ని గుంజుకుంటున్నారు. రైతుల్ని వ్యవసాయం నుంచి తరిమివేసి కార్పొరేట్ వ్యవసాయానికి మార్గాన్ని సుగమం చేసే ప్రయత్నాలను విరసం ఖండిస్తోంది.

● హిందుత్వ అనంతర దశగా ముందుకొచ్చిన మోడీత్వ పట్ల లౌకిక, ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా ఉండాలి. కార్పొరేట్ అనుకూల, పాలక అభివృద్ధి నమూనా సమర్థక మోదీ విధానాల వల్ల బీసీలకే కాదు, సమాజంలోని ఏ శ్రామిక, అట్టడుగు వర్గాలకూ మేలు జరిగే పరిస్థితి లేదని గ్రహించాలి.

క్రాంతికారీ జనతన సర్కార్ ప్రయోగాన్ని సాహిత్య సాంస్కృతిక రంగాల్లో ప్రచారం చేద్దాం

మధ్య భారతదేశంలోని సువిశాల దండకారణ్యంలో మావోయిస్టుల నాయకత్వంలో ప్రజారాజ్యాధికారం బీజ రూపంలో విప్లవ జనతన సర్కార్‌గా నిర్మాణమై పని చేస్తున్నది. 1991లో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ బాహాటంగా మొదలయ్యాక, నిర్దిష్టంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచబ్యాంకు విధ్వంసకర అభివృద్ధి నమూనా శరవేగంగా అమలులోకి వచ్చాక 1996లో విప్లవోద్యమం ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను రూపొందించుకొని దండకారణ్యంలో ఆచరించడం ప్రారంభించింది. సర్వాధికారాలు గ్రామరాజ్య కమిటీలకే అనే నినాదం వెలుగులో ప్రజల విప్లవకర భాగస్వామ్యంతో నిర్మాణాలను ఏర్పాటు చేసింది. 2008లో జనతన సర్కార్ విధాన ప్రకటనతో దండకారణ్యమంతా గ్రామరాజ్య కమిటీల కంటే విస్తృతమైన, నిర్మాణాత్మకమైన క్రాంతికారీ జనతన సర్కార్ మొదలైంది.

ఆదివాసీ, గైరాదివాసీల కలయికగా, దండకారణ్యంలోని నాలుగు విప్లవానుకూల వర్గాల ఐక్య సంఘటన రాజ్యాధికార రూపంగా జనతన సర్కార్ కొనసాగుతున్నది. ఆదివాసులకు సంబంధించినంత వరకు సర్కార్ అంటే క్రాంతికారీ జనతన సర్కారే. గ్రామ సభ స్థాయి నుంచి పంచాయితీ, ఏరియా, డివిజన్-దండకారణ్య స్పెషల్ గెరిల్లాజోన్ అంతా వేర్వేరు స్థాయిలో సర్కార్లు నడుస్తున్నాయి.

విధాన ప్రకటనే విప్లవకర రాజ్యాంగ మార్గదర్శకంగా జనతన సర్కార్ ప్రజాజీవితంలోని, యుద్ధంలోని తొమ్మిది కీలక శాఖలతో పని చేస్తున్నది. వ్యవసాయం, విద్య-సాంస్కృతికం, వైద్యం, కుటీర పరిశ్రమలు, అటవీ రక్షణ తదితర అంశాలతో వర్గపోరాటం ఇరుసుగా కొనసాగుతున్నది.

ప్రజాస్వామ్యంలోని నిజమైన ప్రజారాజ్యాధికార రూపమైన జనతన సర్కార్ భారత విప్లవోద్యమంలోని అభివృద్ధికర దశను సూచిస్తోంది. బూర్జువా వ్యవస్థలో ప్రజాస్వామ్యం అన్ని రకాలుగా, అన్ని స్థాయిల్లో ఎంతగా భ్రష్టు పట్టిపోయిందో జనరంజకంగా వ్యక్తమవుతున్నది. బూర్జువా విప్లవాల వల్ల చరిత్రలో ఉనికిలోకి వచ్చిన అన్ని ప్రజా వ్యవస్థలను బూర్జువా వర్గం లోపలి నుంచి ధ్వంసం చేసి, వాటిని ప్రజలను అణిచివేయడానికి వాడుకుంటున్నది. దోపిడీ దౌర్జన్యాలకు, వంచనకు, పీడనకు, తాయిలాలకు, అన్ని రకాల వాటాలకు ఇవ్వాల్టి లూటీ సర్కార్ ప్రతిరూపం. ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం చలాయిస్తున్న దోపిడీ వర్గాల వర్గ ఆధిపత్యానికి బూర్జువా ప్రజాస్వామ్యం ఏకకాలంలో అందమైన, వికృతమైన ప్రతినిధిగా చెలామణి అవుతోంది. బూర్జువా వ్యవస్థలో ఇదేమీ అవాంఛనీయ పోకడ కాదు. వర్గ సమాజంలో ప్రజాస్వామ్యమంటే తప్పనిసరిగా మెజారిటీ ప్రజలపై మైనారిటీ దోపిడీ వర్గ ఆధిపత్యమే అనే మార్క్సిస్టు విశ్లేషణను ఇవన్నీ రుజువు చేస్తున్నాయి.

ఈ దశలో ఆదివాసీలు మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం వెలుగులో నిర్మిస్తున్న విప్లవ జనతన సర్కార్ నూతన ప్రజాస్వామిక రాజ్యాధికార

నిర్మాణం, ప్రజారాజ్యాధికారం కోసం సాగే విప్లవోద్యమంలో సాంస్కృతిక రంగంలో పని చేస్తున్న విప్లవ రచయితల సంఘం క్రాంతికారి జనతన సర్కార్ల పట్ల విప్లవకర ఆశావాదాన్ని ప్రకటిస్తున్నది. అంచెలంచెలుగా ప్రజలు అధికారం స్థాపించుకోడానికి ఇది బీజరూపం కాబట్టి విప్లవ రచయితలు సంఘం జనతన సర్కార్ ప్రచారం చేసే కర్తవ్యాన్ని స్వీకరిస్తోంది.

సౌహార్ద సందేశాలు

ఉద్యమాల పురిటిగడ్డ, వీరులగన్న పోరుగడ్డ వరంగల్ నగరంలో విరసం 24వ రాష్ట్ర మహాసభలు జరుపుకుంటున్న సందర్భాన్ని ఆహ్వానిస్తూ...మహాసభలు చారిత్రాత్మకం కావాలని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) కోరుకుంటున్నది.

నూరేళ్ళ కాళోజీని వీక్షిస్తూ, సమీక్షిస్తూ, మననం చేసుకుంటున్న ఈ సమయాన కాళోజీ కవితా తాత్వికతనూ, ప్రజాస్వామిక తెలంగాణ దేశం కోసం తపించిన కాళోజీని మరోసారి అధ్యయనం చేసుకుంటూ.. తన జీవన పర్యంతం కుటిల పాలక వర్గాలను నిరసిస్తూ, ధిక్కరిస్తూ, నిలదీసిన కాళోజీ... ఏలికల హింసకు ప్రజల ప్రతిహింస తప్పుకాదని స్పష్టం చేసిన కాళోజీ కదలాడిన నేలమీద విరసం 24వ రాష్ట్ర మహాసభలు ప్రజా తంత్రవాదులందరికీ ఆహ్వానీయం.

నైజాం నవాబుల కాలం నుండీ కొనసాగుతున్న ప్రజావ్యతిరేక పాలక ప్రభువుల దమన కాండను దనుమాడిన సాంప్రదాయం ఈ నేలది. తొవ్వ పువ్వులై మోహరించిన అమరుల ఆత్మక్షేత్రం ఇది. వీరులగన్న విప్లవ నేల తల్లికి నిత్యం పాటల నీరాజనాలు పలికే కవిగాయక కళాకారులైన జన సమూహాల ఉద్యమ రంగస్థలమిది.

అహర్నిశం, అడుగడుగునా అణిచివేతకు గురౌతున్న దీన హీన ప్రజలూ, వారి సమస్యల పట్ల రాజీలేని మార్గంలో నిలబడి సంఘర్షిస్తున్న విప్లవ సాహిత్య సాంస్కృతిక పోరు బావుటా 'విరసం' పాత్రను 'ప్రరవే' అభినందిస్తూ ప్రజా సాంస్కృతిక కాగడాలా వెలుగుతున్న విరసం ఇక ముందూ ఇదే పంథాను కొనసాగిస్తూ ప్రజా చైతన్యీకరణలో కడదాకా బాధిత పీడిత ప్రజాపక్షం వహిస్తూ పురోగమిస్తుందని ఆశిస్తూ 'ప్రరవే' సౌహార్దతను తెలియజేస్తున్నది.

- *అనిశెట్టి రజిత*

ప్రరవే

విరసం మిత్రులకు అభినందనలు....

విరసం రాష్ట్ర మహాసభల సందర్భంగా నా భావాలను పంచుకోవడానికి అవకాశమిస్తూ పిలిచినందుకు ధన్యవాదాలు. సాహితీ రంగంలో తెలుగు సమాజాన్ని విప్లవాత్మక పంథాలో నడిపించడానికి నాటి శ్రీశ్రీ నుంచి నేటి వరకు రచయితలు, రచయితల సంఘాలు సాగిస్తున్న నిరంతర సాహితీ మధనంలో విరసం పాత్ర ప్రముఖంగా లిఖించదగినది. ప్రజల భాషను మరింత శక్తిమంతంగా పెంపొందించేది సాహిత్యం. భాషను ఒక బలమైన సాధనంగా చేసుకోగలిగితేనే రచయితలు తమ భావాల్ని పాఠకులకు స్పష్టంగా చెప్పగలరు. ఇందుకు మాతృభాషకు మించిన సాధనం మరొకటి లేదు. మన సమాజానికి కొన్నివేల సంవత్సరాలుగా తెలుగే ఆధారంగా ఉంది. పండితులు అనుకునేవారి బిగికౌగిళ్లలో ఇరుక్కుపోయి, సంస్కృత పదాలతో నిండిపోయి ప్రజలకు దూరమైన తెలుగు సాహిత్యాన్ని తిరిగి ప్రజల వద్దకు తెచ్చిన తొలి భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి చూపిన దారిలోనే అభ్యుదయ, విప్లవ సాహితీ పరిణామం సాగింది. గిడుగు చూపిన దారిలో తాపీ ధర్మారావు వంటివారు పత్రికా రంగంలో, సినిమా రంగంలో మార్పులు తెచ్చారు. శ్రీశ్రీ మొదలు వర్తమాన కవులు, రచయితలు ఇంతటి శక్తిమంతులు కావడానికి నాటి భాషోద్యమం ఎంతో ప్రోది చేసింది.

కానీ స్వాతంత్ర్యానంతరం భాషా రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఏ ప్రాతిపదికపై మన రాష్ట్రం ఏర్పడిందో ఆ మూలాల్ని మన పాలకులు విస్మరించారు. సామ్రాజ్యవాద శక్తుల ప్రపంచీకరణ ప్రభావంలో పడి కొట్టుకుపోతున్న ఈ ప్రభుత్వాలు ప్రజల భాషను పరిపాలన, విద్య తదితర జనజీవన రంగాల్లో నానాటికీ ఉపయోగం లేకుండా చేస్తున్నాయి. క్రమక్రమంగా రాత, చదువుకు దూరమైన తెలుగు కేవలం నోటి భాషగా మిగిలిపోయే ప్రమాదం పెరుగుతోంది. ఆంగ్ల పదాల ధాటికి ఎదుగుబొదుగు లేని తెలుగు తట్టుకోలేక చివరకు మౌఖిక భాషగా కూడా తన ఉనికిని కోల్పోయే పరిస్థితి వస్తున్నది.

ఈ పరిస్థితుల్లో విరసం లాంటి సంస్థలు కేవలం ప్రజల భాష పట్ల తమ నిబద్ధతను కలిగి ఉండడమే కాకుండా నేరుగా మీ అంతట మీరు భాషోద్యమ నిర్మాణానికి పూనుకోవలసిన అవసరం ఉంది. భాషోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చి దిద్దగల శక్తి రచయితలు, వామపక్షవాదులకు ఉంది. ఈ బాధ్యతను మీరు చేపట్టాలని ఈ సందర్భంగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటికే భాషాపరంగా చాలా కోల్పోయాము. ఆర్థిక, రాజకీయ పురోగతికి ప్రజల భాష వినియోగానికి ఉన్న భాషోద్యమ నిర్మాణానికి అందరం పూనుకోవాలని ఒక భాషోద్యమ కార్యకర్తగా మీకు మనవి చేస్తున్నాను.

- డాక్టర్ సామల రమేష్ బాబు

అధ్యక్షులు తెలుగు భాషోద్యమ సమాఖ్య

విప్లవ రచయితల సంఘం 24వ మహాసభలకు 'సౌహార్ద సందేశం ఇవ్వడానికి ఆహ్వానించిన విరసం కమిటీకి మొట్టమొదట అరసం పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసి ప్రత్యేకతను సంతరించుకున్న విరసం, విప్లవ సాహిత్యోద్యమం ముమ్ముందుకు సాగాలని విప్లవాభినందలు తెలుపుతున్నాను.

వరంగల్ జిల్లా మొదటినుండీ ఉద్యమాల ఖిల్లాగా ప్రసిద్ధికెక్కింది. అందులో ప్రజాకవులు, రచయితల పాత్ర మరువలేనిది. ప్రజాస్వామికవిలువలకోసం పాలకవర్గాల అకృత్యాలపై రాజ్యహింస, హక్కుల అణచివేతపై ధిక్కారస్వరం వినిపించి జీవితమంతా బడుగు,

బలహీనుల పక్షాన నిలిచిన ప్రజాకవి కాళోజీ. గత సంవత్సరం డిసెంబర్‌లో హైదరాబాద్‌లో తుమ్మల వెంకటరామయ్య, వట్టికోట ఆళ్వార్ స్వామితో పాటు కాళోజి శతజయంతిని కూడా అరసం నిర్వహించింది. ఇప్పుడు కాళోజీ సంస్మరణలో వ్యవస్థతో పోరాడుతూ, దాని మార్పుకోసం, ప్రత్యామ్నాయ నిర్మాణాల కోసం ఆలోచనలు పంచుకుంటూ, విరసం తన 24వ మహాసభలు జరుపుకోవడం సంతోషించదగ్గ విషయం. అందులో కాళోజి లాంటి సాహితీ మూర్తులు కలలు కన్న తెలంగాణ రాష్ట్రం సాకారమౌతున్న సంతోష సందర్భంలో ఈ సభలు భవిష్యత్తు ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం జరిగే ఉద్యమాలకి ఊతమివ్వడానికి వేదిక కావడం మరింత సంతోషించదగ్గ విషయం.

ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యం సరుకుగా మారి వినిమయం చేయబడుతున్న సామాజిక సందర్భం ఇది. ఫాసిస్టు మతవాదులు తిరిగి లౌకిక వ్యవస్థను భగ్నం చేసే ప్రమాదకర రాజకీయ పరిణామాల్లో ఉన్నాము. సుసంపన్నమైన మన సంకీర్ణ సంస్కృతిని ఒకే ఒక మత సంస్కృతిగా తయారుచేయాలనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సామ్రాజ్యవాద మార్కెట్ శక్తులు దోపిడితో సామాజిక వనరులను వారి హస్తగతం చేసుకోవడానికి పాలకవర్గాలను వారికి అనుకూలంగా మార్చుకుంటున్నాయి. మార్కెట్ బహుముఖంగా విస్తరిస్తోంది. కొత్తకొత్త దోపిడీ మార్గాలు వినియోగతత్వాన్ని ప్రోత్సహించి, సామాన్యుణ్ణి విలాసవంతమైన జీవితవేటకు తరుముతున్నాయి. ఈ వేటలో కళలు, సాహిత్యం, వినోదాత్మక కోరికల తృప్తికి అనుకూలంగా తయారవుతున్నాయి. సాహిత్య పరాయీకరణ పెరిగిపోతోంది. కళ్ళకు కనిపించకుండా మన ఆలోచనలను, భావాలను నియంత్రిస్తోంది. దీనికి వెన్నుదన్నుగా ప్రసార మాధ్యమాలు, ప్రైవేటు టీవీ చానళ్ళు నిరంతరాయంగా కార్యక్రమాలతో విషసంస్కృతిని పెంచుతున్నాయి. పాలకవర్గాలు ఏవైనా, వాటి దోపిడీ నైజం ఒకటే. పార్టీలు మారినా, పాలకులు మారినా, సామ్రాజ్యవాద శక్తుల కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయి. ఈ దోపిడీ దురాగతాలకు వ్యతిరేకంగా వనరులపై అధికారం కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం, పోరాటాలు నడుస్తున్నాయి. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభ కల్లోలంలో విధ్వంసం అవుతున్న జీవితాల్లో ప్రతిఘటనలు వెల్లువెత్తుతున్నాయి. నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు, వర్గపోరాట రూపాలుగా ప్రజల చేతి ఆయుధాలుగా విముక్తి కోసం, సమున్నత సామాజిక మార్పుకోసం ఉవ్వెత్తున లేస్తున్నాయి. రైతులు, కార్మికులు, ఆదివాసీలు, బడుగు, బలహీనవర్గాల పోరాటాలు ప్రబలుతున్నాయి.

ఈ సంక్లిష్ట సామాజిక నేపథ్యంలో విధ్వంసమౌతున్న జీవితాలను, సమస్యలను, ఉద్యమాలను సాహితీ వస్తువులుగా నేడు రచయితలు అనివార్యంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యమ సాహితీ సృజన విరివిగా జరగాల్సి ఉంది. సాహిత్య కార్యచరణతో పాటు ఉద్యమ కార్యాచరణను విస్తృత పరచుకోవాల్సిన అవసరం ఉంది.

అరసం, విరసంల మధ్య ఒకటి రెండు అంశాలు మినహా పెద్దగా విభేదాలు లేవు. ఉద్యమ స్వరూపాలు ఏవైనా లక్ష్యాల కోసం కలిసి పనిచేయడానికి అడ్డంకులేమీ లేవని భావిస్తున్నాం.

మార్క్సిస్టు ఆర్థిక, రాజకీయ సిద్ధాంత పునాదిగా విభిన్న మార్గాలలో నడుస్తున్న సామాజిక ఉద్యమాల నేపథ్యంలో అరసం, విరసం రెండు మాత్రమే సాహిత్యోద్యమ సంస్థలుగా సజీవంగా కొనసాగడం గర్వకారణం. కాలక్రమంలో ఎన్ని ఉద్యమాలు, ధోరణులు తలెత్తినా, అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు సజీవ స్రవంతిగా కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయంగా ప్రపంచీకరణ పెనుముప్పుతో పాటు, జాతీయంగా మోడీ రూపంలో మరోసారి తలెత్తే మతవాద ప్రమాదాల నేపథ్యంలో ఉమ్మడి అంశాలపై రెండు సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అరసం భావిస్తోంది. అందులో భాగంగానే అరసం 70 సంవత్సరాలుగా కలిసివచ్చే వామపక్ష ప్రజాస్వామిక భావజాల సాహితీ సంస్థలతో కలిసి పనిచేస్తూనే ఉంది. కాళోజీ శతజయంతి సందర్భంగా జరుగుతున్న ఈ విరసం మహాసభల్లో ప్రజాసంస్కృతి, ప్రజా ఉద్యమాలను పతాకగా చేసుకొని విశాల ప్రజాస్వామిక, లౌకిక ఐక్య సంఘటన దిశగా నిర్ణయాలు జరగబోతున్నందుకు విప్లవ రచయితల సంఘాన్ని అభినందిస్తూ, వారి కార్యాచరణను మనసారా ఆహ్వానిస్తున్నాం.

అభినందనలతో...

- వేల్పుల నారాయణ

అరసం - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రియమైన సాహితీ మిత్రులారా! కామ్రేడ్స్!

43 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో మరొక మైలురాయిగా 24వ రాష్ట్ర మహాసభను జరుపుకుంటున్న విప్లవ రచయితల సంఘానికి సందేశం, సంఘీభావం ప్రకటించటానికి జనసాహితి సంస్థను ఆహ్వానించినందుకు విప్లవాభివందనాలు తెలుపుతున్నాను.

తెలుగు సాహిత్య రంగంలో 1960వ దశకంలో పాతుకుపోయిన సంస్కరణవాద ధోరణులపై ఆగ్రహ గళమెత్తి 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడినపుడు నేటి జనసాహితి బాధ్యులలో కొందరం నాటి విరసం పతాకం ఎత్తి నడిచామని నేటి తరాలకు గుర్తుచేస్తున్నాము. మనం లక్షించిన నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విప్లవం, ఆనాడు మనం ఊహించిన ఆశించిన దానికంటే మరెన్నో మలుపులూ, మెలికలూ తిరుగుతూండటం మనందరి ఉమ్మడి అనుభవంగా ఉంది.

నేడు మనమెదుర్కొంటున్న సాహిత్య, సాంస్కృతికోద్యమ కర్తవ్యాలకొస్తే... ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు అమెరికా నాయకత్వాన 'ప్రపంచీకరణ' పేరుతో ఒక వైపున సమస్త అభివృద్ధి నిరోధక శక్తులనూ పెంచిపోషిస్తూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలనూ ఒక్కమాటలో సమస్త జీవన రంగాలను ప్రపంచ పీడిత ప్రజావ్యతిరేకంగా క్షీణ, పతన విలువల పోషకులుగా ఉన్నాయి. దేశీయ దళారీలు, ప్రాంతీయ భూస్వామ్య రాజకీయ శక్తులు

తమలో తాము కలహించుకుంటూ సామ్రాజ్యవాద ప్రపంచీకరణానికి ఊడిగం చెయ్యటంలో పోటీపడుతున్నాయి. ఈ ప్రజావ్యతిరేక దోపిడీ, పీడనల కూటమి తమకు వ్యతిరేకంగా పీడిత శ్రామిక ప్రజలు సంఘటితంగా ఒక్క తాటిపై ఉద్యమించనీయకుండా వర్గ ఉద్యమాలను పక్కదారి పట్టించే వ్యూహాలూ, కుట్రలూ, కుహకాలతో వ్యవహరిస్తున్తోంది. సామ్రాజ్యవాద బహుళజాతుల ప్రయోజనాల కోసం పీడిత జాతులను భౌతికంగా అణచి ఉంచటం, రాజకీయంగా విభజించటం, సాంస్కృతికంగా దాసోహం చేసుకోవటం కుల, మత, ప్రాంతాల పేరిట చీలికలు పీలికలు చేయటం వీరి గత, వర్తమాన చరిత్ర చెబుతున్న సత్యం. వీటికి అనుకూలంగా వ్యతిరేకంగా సాహిత్య రూపాలలో కూడా భావ సంఘర్షణ సాగుతున్న సంగతి మనకు తెలుసు. పోస్టు మోడర్నిజం పేరుతో ప్రవేశపెట్టిన సామాజిక, సాహిత్య సిద్ధాంతాలన్నీ ప్రపంచీకరణానికి ఊతమిచ్చేవి మాత్రమే. ప్రజలు తమ జీవన స్థితిగతులు మరింత దిగజారకుండేందుకు సాగించే 'అస్తిత్వ' పోరాటాల్ని విముక్తి పోరాట చైతన్యం వైపు ఎదగనివ్వకుండా పరిమితం చేయటానికి 'అస్తిత్వవాద' సిద్ధాంతం ముందుకు వచ్చింది. అలాగే దళితులు, మహిళలు, మైనారిటీలనే కాక ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలను 'దళితవాదం', 'మహిళావాదం', 'మైనారిటీవాదం', 'ప్రాంతీయవాదం'....అనే వైపుకి మళ్ళించి వివిధ పీడిత ప్రజా ఉద్యమాల నడుమ పెంపొందాల్సిన ఉమ్మడితనాన్నుండి వాటిని దూరం చేస్తున్నారు. ఒకే భాషలో తప్పనిసరిగా ఉండే విభిన్న మాండలిక పద ప్రయోగాలనూ, యాసలనూ చూపి తెలుగుభాషే ఒకటి కానట్టు ప్రచారం చేస్తున్నారు. 'భాష' విషయంలో కామ్రేడ్ స్టాలిన్ అందించిన శాస్త్రీయ మార్గదర్శకత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఆర్థిక - రాజకీయ - సాంస్కృతిక ఆధిపత్యాలను, భాషాధిపత్యంగా భ్రమలకు గురి చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రూపాన్ని సారంగా చలామణీలోకి తేవటం 'పోస్టుమోడర్నిజం' ఆచరణగా మనం చూడొచ్చు.

కొన్ని చారిత్రక సంఘటనలను కేవలం గుర్తు చేస్తాను. 1905 లో బెంగాలు రాష్ట్రాన్ని మతం ప్రాతిపదికగా సంఖ్య రీత్యా హిందూ - ముస్లింల మెజారిటీ, మైనారిటీ ప్రాంతాల ప్రాతిపదికగా బ్రిటిషు వలసవాదులు చీల్చారు. 1906లో ముస్లింలీగు ఏర్పడింది. 1909 లో హిందూ మహాసభ ఏర్పడింది. 1947లో దేశ విభజన జరిగింది. 1992లో బాబ్రీ మసీదు కూలింది. 2002లో గుజరాతు ఘోరాలు జరిగాయి. నేటికీ ముజఫర్‌నగర్ సంఘటనలు పేట్రేగుతున్నాయి. పీడిత ప్రజలను అణచి ఉంచటం, చీల్చటం కోసం సామ్రాజ్యవాదం - మతతత్వాన్ని పెంచిపోషిస్తున్న దాని పర్యవసానాలుగానే ఇవన్నీ జరిగాయి. జరుగుతున్నాయి. ఈ మహాసభ కరపత్రంలో పేర్కొన్నట్టు "సామ్రాజ్యవాద ఆర్థిక నమూనాకు 'అభివృద్ధి' పేరు తగిలించి, మతాన్ని ఆయుధంగా ధరించి మోడీత్వ రూపంలో" మతతత్వ శక్తులు వస్తున్నాయి. నేటి అర్ధవలస - అర్ధఫ్యూడల్ వ్యవస్థ దుష్ఫలితాలైన అవినీతి, అధికధరలు, మహిళలపై అత్యాచారాలు, ప్రాంతీయ అసమానతలు, నిరుద్యోగాలకు వ్యతిరేకంగా పాలకవర్గాలూ, ముఠాలే పోరాడుతున్నట్టు భ్రమలు కల్పించటంలో పోటీలు పడుతున్నాయి.

ఇవే కాక లక్ష్మింపేట లాంటి ఘటనలూ, నరేంద్ర దభోల్కర్ హత్యలూ, రోజూ అనేకమంది 'నిర్భయ'లపై హత్యాచారాలు... ఇలాంటివన్నీ మన సాంస్కృతిక కర్తవ్యాల విస్మృతినీ, లోతునూ తెలుపుతున్నాయి.

ప్రస్తుత మన రాష్ట్ర పరిస్థితిని పరికిస్తే...ప్రాంతాల విభజన పేరుతో పాలకముఠాలు తెలుగుజాతి ప్రజల నడుమ విద్వేషాలు కొనసాగించాలని ఎంతో తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. బ్రిటిషు - నిజాం పాలకులు వదిలిన చెప్పుల్లో కాళ్ళు పెట్టినందువల్ల అధికారాల్ని చలాయిస్తున్న పాలకముఠాలేవీ ప్రజలకు తమ తల్లిభాషలో "విద్య - పరిపాలన"ను అమలు చేయటం లేదు. ప్రజాస్వామిక సంస్కృతికి "ప్రజల భాషలో విద్య - పరిపాలన" మూలాధారమన్న సంగతి మనమెరిగినదే. రాష్ట్రం కలిసి ఉన్నా, విడిపోయినా "ప్రజల భాషలో విద్య-పరిపాలన" కోసం మనమందరం ఉద్యమించక తప్పదు. సాంస్కృతిక సంఘర్షణలో మనదైన ప్రజా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రాంతీయ హద్దులకు అతీతంగా స్వీకరించక తప్పదు. ప్రజాధిక్కార స్వరమైన కాళోజీ శతజయంతిని తెలుగువారున్న చోటల్లా నిర్వహిద్దాం. ఇంకా వీర తెలంగాణ రైతాంగ పోరాటంపై, 'ప్రజల మనిషి', 'గంగు' లాంటి గొప్ప నవలలు రాసిన వట్టికోట ఆళ్వారుస్వామి, 'మా భూమి', 'పోతుగడ్డ' ల నాటక రచయిత వాసిరెడ్డి భాస్కరరావు తెలుగులో ఎర్రజెండాపై తొలిపాట రాసిన తుమ్మల వెంకట్రామయ్యల శతజయంతులు కూడా ఇదే సంవత్సరమని గుర్తు చేసుకుందాం. అలాగే ప్రస్తుత మన రాష్ట్ర పరిణామాల నేపథ్యంలో గతంలో మనం నినదించిన "జాతుల విముక్తి" భావనకున్న నేటి ప్రాసంగికతపై ఈ సభలో చర్చిస్తారని ఆశిస్తాను.

అనేక శాఖోపశాఖలుగా చీలివున్న లౌకిక, ప్రజాస్వామ్య సాహితీ సాంస్కృతిక శక్తుల నడుమ ఐక్యతా వాతావరణం పెంపొందటానికీ, సంఘటిత కృషి సల్పడానికీ సంకల్పిద్దాం. అనేక రూపాలలో వ్యక్తమవుతున్న భూస్వామ్య - సామ్రాజ్యవాద క్షీణ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలను భావ విప్లవం వైపు నడిపించటంలో, చైతన్య పరచటంలో సాహిత్య సంస్థలు నిర్వహించాల్సిన పాత్రను మరింత బాధ్యతాయుతంగా నెరవేరుద్దాం. నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికి దోహదపడే సమస్త పీడిత ప్రజా ఉద్యమాలకు, సంస్కృతికి అండదండలనందిద్దాం.

24వ విరసం మహాసభ విజయవంతం కావాలని మనసారా ఆకాంక్షస్తూ.........

ప్రజా సాహిత్యం వర్ధిల్లాలి

ప్రజా సంస్కృతి వర్ధిల్లాలి

భూస్వామ్య - సామ్రాజ్యవాద సంస్కృతులు - నశించాలి

నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విప్లవం వర్ధిల్లాలి.

- దివి కుమార్

ప్రధాన కార్యదర్శి - జనసాహితి

వ్యాసం

విప్లవ సాహిత్యంలో వస్తురూప వైవిధ్యం

- సి. కాశీం

జనవరి 11, 12 తేదీలలో విరసం 24వ మహాసభలు ఓరుగల్లులో విజయవంతంగా జరిగాయి. జరుగుతాయో లేదోననే సందేహాలను తుత్తునియలు చేస్తూ ఉత్తేజకరంగా జరిగాయి. 1979 తర్వాత ఓరుగల్లులో విరసం మహాసభలు జరగటం ఇదే మొదలు. వెయ్యేళ్ల తిరుగుబాటు చరిత్ర ఉన్న ప్రాంతంలో మళ్లొకసారి ప్రజలు, రచయితలు ఆ చైతన్యాన్ని ప్రదర్శించారు. ఢిల్లీ సుల్తానులను ఎదురించిన కాకతీయ రాజులు, కాకతీయ సామ్రాజ్యాన్ని ఎదురించిన సమ్మక్క సారక్కలు, విసునూరు రామచంద్రారెడ్డి గడీలను కూల్చిన దొడ్డి కొమురయ్య, పంట కంకిపై వాలిన దొరగాన్ని వడిసేల రాళ్లు నింపికొట్టిన చాకలి ఐలమ్మ, భూమి కోసం కొన్నెత్తురు ధారపోసిన బందగి, విప్లవోద్యమాన్ని కౌగిలించుకున్న 'సంతోష' క్షణాలు ఓరుగల్లు మట్టి పొరల నుంచి మొలకెత్తిన తిరుగుబాటు విత్తనాలే. ఇటీవలి చరిత్రలోనే తిరుగుబాటే జీవితంగా కాళోజీ ఓరుగల్లు రోడ్ల మీద సంచరించాడు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి (కిరణ్‌కుమార్ రెడ్డి)ని మూడు చెరువుల నీళ్లు తాగించిన రాయినిగూడెం మహిళలు, విద్యార్థినులు ఈ నేల మీదే పుట్టారు. ఒక కవి అన్నట్లు "పోరన్నలకు పేరుగన్నది ఓరుగల్లు జిల్లా".

నూరేళ్ల కాళోజీ యాదిలో విరసం సభలు జరిగాయి. జీవితం, కవిత్వం, రాజకీయాలలో ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శించిన కాళోజీ ప్రతీ మూలమలుపులో ప్రజలవైపు, పోరాటాల వైపు నిలబడ్డాడు. "ఆర్యసమాజం నుంచి ఆంధ్ర మహాసభ దాకా, నిజాం వ్యతిరేక పోరాటాల నుంచి భూస్వామ్య వ్యతిరేక ప్రజాసంఘటన దాకా, ప్రతిపక్ష కవి పాత్ర నుంచి మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమాల వరకూ కాకతీయ తెలుగు వీరుల స్ఫూర్తిలో నుంచి ప్రజాస్వామ్య తెలంగాణ ఉద్యమం దాకా.."(ఎబికె ప్రసాద్-ప్రజాకవి కాళోజీ-పుట.26) కాళోజీ విస్తరించి, ఉద్యమించిన తీరును విమర్శకులు అనేక రకాలుగా విశ్లేషించారు. వ్యక్తి స్వేచ్ఛను కోరుకునే కాళోజీ సైద్ధాంతికంగా పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్యవాది. నిరంకుశత్వాన్ని ధిక్కరిస్తాడు. మానవీయతను కోరుకుంటాడు. అతనిలో ఇట్లాంటి ప్రజాస్వామ్య దృక్పథం రూపొందటానికి అతని కుటుంబం, తెలంగాణ సమాజం దోహదపడింది.

మనిషి స్వేచ్ఛను కోరుకున్న కాళోజీ నడయాడిన ఓరుగల్లులో రాజ్యం అనేకసార్లు వికృతరూపం చూపింది. నిర్బంధం నీడలు కమ్ముకున్నాయి. రెండో ఆలోచనకు తావులేని కాలం నడిచింది. విప్లవాన్ని గానం చేసిన కవులను రాజ్యం ఓరుగల్లులో నిషేధించింది. పసిపిల్లల డాక్టర్ రామనాథం గుండెల్లో తూటాలు దించింది. ప్రజావైద్యుడు ఆమెడ నారాయణను దుండగులు చంపేసారు. పగిడికంటె పాటగాడు ఐలన్నను ఎన్‌కౌంటర్ చేసారు. తరగతిగది నాలుగు గోడల మధ్య దేశ భవిష్యత్‌ను నిర్మాణం చేసే పంతుళ్లను నిఘా కళ్లు వెంటాడాయి. ప్రతీ ఆదివారం రాజ్యం హాజరుపట్టీలో సంతకం చేయించుకున్నది. పౌరహక్కులను అడిగిన గొంతులపై ఆయుధం ఎక్కుపెట్టి తరిమేసింది. ఒకరకంగా ఎమర్జెన్సీ రోజులను తలపించారు. ఈ దుర్మార్గాన్ని ఎండగడుతూనే కాళోజీ కన్నుమూసారు. ఆట, పాట, మాట అనధికారికంగా బంద్ అయిన ఓరుగల్లు నగరంలో విరసం 24వ మహాసభలు దిగ్విజయంగా జరుపుకున్నది. అంబేద్కర్ భవన్‌లో రెండు రోజులు కిక్కిరిసిన విరసం, విప్లవ అభిమానులతో సభలు జరిగాయి. మొదటి రోజు వెయ్యిమందితో ప్రారంభమైన సభ సాయంత్రం వరకు జరిగింది. ప్రజల ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను విధ్వంసం చేయడానికి పాలకులు బాసగూడలో ఆదివాసులపై జరిపిన దాడిని ప్రతిబింబిస్తూ విరసం కళాకారులు 'బాసగూడ' నాటకాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులు ఉద్వేగభరిత నాటకాన్ని చూసి కన్నీళ్ల పర్యంతమయ్యారు. సాయంత్రం ఆరున్నరకు మొదలైన ర్యాలీ ఓరుగల్లు నగరాన్ని ఉత్తేజపర్చింది. కిలోమీటర్ల మేర కాగడాలతో ప్రదర్శన జరిగింది. ప్రజాకళా మండలి కళాకారుల ప్రదర్శనలు పాత జెఎన్‌ఎంను తలపించాయి. రోడ్లన్నీ పాటలతో పల్లవించాయి. రాత్రి పదకొండు గంటల వరకు బహిరంగసభ జరిగింది. ఈ దేశానికి దండకార్య అభివృద్ధి నమూనానే ఆదర్శమని వక్తలు చెప్పారు. రెండోరోజు ఉదయం పదిగంటలకు జరిగిన విరసం కవిగాయక సభలో కొత్త కలాలు, గళాలు విన్పించాయి. నూతనోత్తేజాన్ని ఇచ్చాయి. ఇది స్థూలంగా రాజకీయ కోణంలో సభలు విజయవంతమైన తీరు.

ఇక సాహిత్యం కోణంలో చూసినప్పుడు విప్లవ సాహిత్యం ఎన్ని రూపాలలో వికసించిందో ఈ సభలు అద్దం పట్టాయి. కళ్లుండి చూడలేని కొందరు సాహిత్య విమర్శకులకు ఈ సభలలో వచ్చిన విప్లవ సాహిత్యమే సమాధానం చెబుతుంది. చెవులుండి వినలేని పండితులు పుస్తకావిష్కరణల సందర్భంగా విశ్లేషకులు చెప్పిన అభిప్రాయాలైనా వినాల్సింది. విప్లవ సాహిత్యం ఎనభయో దశకంలోనే ఆగిపోయిందని శాపనార్థాలు పెట్టే విరసం వ్యతిరేకులు ఉన్నారు. సంవత్సరాంతంలో దినపత్రికల కళ్లద్దాల్లోంచి సాహిత్యాన్ని పరిశీలించి కనీసం విప్లవ సాహిత్యాన్ని మాటమాత్రంగానైనా ప్రస్తావించని సోకాల్డ్ 'సాహితీ దిగ్గజాలూ' ఉన్నారు. అయినా విప్లవ సాహిత్యంలో, విరసంలో మూడుతరాల కవులు, రచయితలు ఉన్నారు. విరసం ఏర్పడినప్పటి నుంచి సంస్థలో కొనసాగుతున్నవారు, తెలుగు సాహిత్యాన్ని ఊగించి, శాసించిన విప్లవ సాహిత్యం ఉజ్జ్వలంగా వెలుగొందిన దెబ్బయో, ఎనభయో దశకంలో విరసంలోకి ప్రవేశించి రాస్తున్నవాళ్లు ఉన్నారు. తొంభై, రెండువేల దశకాలలో విరసంలోకి వచ్చి సాధికారికంగా రాస్తున్నవాళ్లు ఉన్నారు. ప్రతీ పది సంవత్సరాలకు సంస్థలోకి కొత్త నీరు వచ్చి చేరుతూనే ఉంది. కథ, కవిత్వం, నవల, నాటకం లాంటి ప్రక్రియలను చేపట్టి సాధికారికంగా నిర్వహిస్తున్న వాళ్లు విరసంలో ఉన్నారు. కాకపోతే విస్తృత అధ్యయనం లోపించిన

విమర్శకుల మాటే సాహిత్యంలో చలామణి అవుతున్న ఈ రోజుల్లో విరసం రచయితల సాహిత్యం కొన్ని సందర్భాలలో మెయిన్‌స్ట్రీంలోకి రావటం లేదు. ఒక రచయితల సంఘం ప్రతీ సంవత్సరం 30 పుస్తకాలను ఆవిష్కరించుకో గలుగుతుందంటే, అవి వాసిలో, రాశిలో తీసిపోని పుస్తకాలుగా మిగులుతున్నాయంటే ఆ ఘనత విరసంకే దక్కింది. ఈసారి మహాసభలలో కూడా విరసం సభ్యులు రాసిన 13 పుస్తకాలు వచ్చాయి. అందులో కవిత్వం 1, కథలు 3, నవలలు 2, సాహిత్య విమర్శ 3, ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యాసాలు 4 ఉన్నాయి. అనువాదాలు, విరసం తన సామాజిక బాధ్యతగా ప్రజలకు అందించాలని భావించిన సాహిత్యాన్ని కూడా ప్రచురించి ప్రచారం చేస్తుంది. అట్లా విరసం ప్రచురణలుగా వచ్చిన పుస్తకాలు 17 ఉన్నాయి. (ఈ పుస్తకాల రచయితలు సాంకేతికంగా విరసం సభ్యులు కాకపోవచ్చు, కాని విప్లవ రచయితలు) విరసం రచయితలు ఎన్నడూ సాహిత్య విలువల విషయంలో రాజీపడలేదు. సాహిత్య వస్తువుకు ఇచ్చిన ప్రాధాన్యతను, సాహిత్య రూపంలో నిర్లక్ష్యం చేయలేదు. వస్తువును ఆశ్రయించిన రూపం సాహిత్య రచనలో ఉండాలని త్రిపురనేని మధుసూదనరావు చెప్పిన మాటను విరసం రచయితల ఎరుకలో ఉందని ఈ మహాసభల సందర్భంగా వెలువడిన 30 పుస్తకాలను చూస్తే అర్థమవుతుంది.

విరసం వైపు నుంచి మొదట్లో వచ్చినంత బలంగా కవిత్వం రావటం లేదని పరిశీలించకుండానే (విరసం అధికార పత్రిక అరుణతారను కూడా) జడ్జిమెంట్ ఇచ్చే సాహిత్య వాతావరణం ఈనాడు ఉంది. శ్రీశ్రీ, శివసాగర్, చెరబండరాజు, వరవరరావు వంటి లబ్దప్రతిష్ఠులైన వారి కవిత్వం దగ్గరే కొందరు విమర్శకులు ఆగిపోయారు. తర్వాత వచ్చిన కొత్త నీళ్ల తాగటానికి తెలుగు సాహిత్య వాతావరణం అలవాటుపడలేదు. సముద్రుడు, ఎమ్మెస్సార్, కౌముది రచనలు విప్లవ కవిత్వంలో తెచ్చిన వస్తు, శిల్ప నైపుణ్యాన్ని చూడలేకపోయారు. కనుకనే పసలేని వాదనను ముందుకు తెచ్చారు. ఈ తరంలో కూడా కవిత్వానికి విరసంలో లోటులేదు. బలమైన గొంతుకలు ముందుకొచ్చాయి. కొత్త ప్రతీకలతో విప్లవాన్ని, గ్రీన్‌హంట్‌ను ఎంత హృద్యంగా చెప్పవచ్చో వీళ్లను చూస్తే తెలుస్తుంది. విరసం 22వ మహాసభల సందర్భంగా గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా సాహిత్య, సాంస్కృతిక రంగాలలో పనిచేయాలని కేంద్ర కర్తవ్యంగా స్వీకరించింది. ఈ రెండేళ్లలో కథ, కవిత్వం, నాటకం, రాజకీయ విశ్లేషణలు మొదలైన ప్రక్రియలలో విరసం సాహిత్య సృష్టి చేసింది. ముప్పై ఏళ్ల లోపు వయసున్న కవులు విరసంలో బలమైన కవిత్వం రాస్తున్నవాళ్లు అరడజనుకు పైగా ఉన్నారు. వీళ్లు కూడా సంస్థ తీసుకున్న గ్రీన్‌హంట్ వ్యతిరేకతను తమ రచనలలో ప్రదర్శిస్తున్నారు. ఈ తరంలోని వాడే ఉదయ్‌భాను. ఈ రెండేళ్లలో గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా రాసిన కవిత్వాన్ని **"పిల్లనగ్రోవి తుఫాన్"** పేరుతో సంకలనం చేసి 24వ మహాసభలలో ఆవిష్కరించాడు. పుస్తకానికి పెట్టిన పేరులోనే గొప్ప సౌందర్యాత్మకత కనిపిస్తుంది. పుటలు తిప్పేస్తే రక్తం ప్రవిస్తున్న పిల్లనగ్రోవి పెదవులు మనల్ని కన్నీళ్లు పెట్టిస్తాయి. "మూరెడు వెదురుముక్క/గాయాలైన దేహంతో/ఈ దేశ భవిష్యత్ కోసం/పిల్లనగ్రోవి తుఫాను సంగీతం ఆలపిస్తుంది."(పుట.24) సంక్షోభ దేశంలో చిగురిస్తున్న జనతన సర్కార్లు వెయ్యిన్నొక్క ప్రశ్నలకు సమాధానం చెబుతున్నాయి. ఎగిరే పావురాలను, పాలపిట్టలను కాల్చేస్తే నెత్తురు చిమ్మేది ఈ నేల మీదనేనని గతితార్కిక సంబంధాన్ని చెబుతూ ముసుగుతన్నుకొని పడుకొన్న మధ్యతరగతి జీవులకు, ఈ యువ కవి చురక అంటించాడు. 'ఆకంచుపై స్వప్నాల్నిమోస్తూ పండాకు కాకముందే రాలిపోతున్న నీటిబిందువు' విషాద గీతిక పిల్లనగ్రోవి తుపాన్‌గా మారుతున్న కవిసమయం ఇవాల్టి దృశ్యం. ఈ విషాద, గంభీర దృశ్యాన్ని కలంలో ఒంపుకున్నవాడే కవి అనే బాధ్యతను ఉదయ్ గుర్తుచేసాడు. తొలిపొద్దును మింగేసే పాలకులున్న చోట సూర్యాస్తమయం గురించి బాధపడటంలో అర్థం లేదనే కొత్త కవి సమయాలను గ్రీన్‌హంట్ వ్యతిరేక కవిత్వం మన ముందు ఉంచింది.

'కాంత పున్నం వెన్నెల' ఈ మూడు పదాలు ఒకేలా ఉన్నాయి కదా! 'వెలుగు' అని అర్థాన్ని స్ఫురిస్తున్నాయి. మూడు పదాలను కలిపితే మంచి కవితా పాదం వలె ఉన్నాయి. కాని ఇది ఒక కథ పేరు. ఇట్లాంటి శీర్షిక పెట్టింది చేయి తిరిగిన కథా రచయిత కాదు. "చనిపోయిన నిజమైన మనుషుల కోసం-భయవిహ్వల దిగ్భ్రాంతిలో ఉన్న వారి బంధుమిత్రుల కోసం... చావంటే, శవమంటే అందరిలాగే ఆమడదూరం పరిగెత్తే పద్మకుమారి విచిత్రంగా, అనివార్యంగా అనేక అసహజ మరణాల్లో బంధు మిత్రుల సంఘం సభ్యులతో కలిసి రాష్ట్రమంతా తిరుగుతోంది. ఇన్ని చావులను అనుభవించడం కడుపుదేవే సాహసం. కన్నీళ్లు జలజలాకారే చిత్రమైన బాధ్యత. మానసికంగా, శారీరకంగా కల్లోలపరిచే బయటి కల్లోలం. అదిగో అలాంటి స్థితిలో ఇలాంటి కథలు రాయడం వల్ల కానిదే... ప్రతీవాక్యం మృత్యుశీతల స్పర్శ నుంచి రూపుదిద్దుకున్నదే..." (పుట.2) అని అల్లం రాజయ్య ఎన్ని వాక్యాలు పేర్చుకుంటూ పోయినా కాంత పున్నం వెన్నెల కథ గురించి సరిగా చెప్పలేనని మొరాయించాడు. తెలంగాణలో విప్లవ కథా రచనలో లబ్దప్రతిష్ఠుడిగా పేరున్న అల్లం రాజయ్య విరసం ఈ తరం సభ్యురాలు పద్మకుమారి రాసిన కథ గురించి ఈ వాక్యాలు రాయటానికి కారణం ఆ కథలో ఉండేబలం. బలమంటే భౌతిక బలం కాదు. కథా వస్తువు, కథా శిల్పానికి ఉన్నబలం. కథలో ఇంతటి బలం ఉండటానికి మూలం రచయితకు ఉన్న జీవితం. రచయితకు ఉండే విశాల జీవితమే గొప్ప సాహిత్యాన్ని సృష్టిస్తుందని కొడవటిగంటి కుటుంబరావు చెప్పిన మాట పద్మకుమారి విషయంలో నిజమైంది. కథా రచనలో మెళకువల్ని విరసం వర్క్‌షాప్ నేర్పిస్తే, కార్యరంగంలో ఉండే జీవితం ఆమెకు కథా వస్తువును ఇచ్చింది. వెరసి ఈ తరం మంచి కథా రచయితగా విరసం సభ్యురాలు ఎదిగింది. కాంత (దళిత యువతి), పున్నం(ఆదివాసి యువకుడు) విప్లవోద్యమంలో జీవిత సహచరులు. పున్నంకు వెసక్టమీ ఆపరేషన్ ఫెయిల్ అయి కాంత గర్భవతైంది. కథ ఇక్కడ సాంద్రత స్థాయి చేరుకుంది. పాత్రల మధ్య సంభాషణ, సన్నివేశ కల్పన అద్భుతంగా ఉండటం వలన కథా కథనశైలి పండింది. యుద్ధంలో వెన్నెల జన్మించటంతో కాంత మానసిక ఘర్షణ కథలో ఉచ్చ స్థాయికి చేరింది. తర్వాత ఏం జరిగిందనేది తెలుసుకోవాలంటే పాఠకులు కథను చదవాల్సిందే. 'తన నీడ తనలోనే కలిసిపోతున్నది', కడుపులో ఉండే బాధ ఆకలో, దుఃఖమో తెలియడం లేదు, చెంపల్లోకి రక్తం ఎగజిమ్మింది లాంటి వాక్యనిర్మాణం పఠితను కట్టిపడేస్తుంది. ఇట్లాంటి కథలేవీ కథా వార్షికల దృష్టికి రాకపోవటం కథా సాహిత్యంలో ఉన్న విషాద వాతావరణానికి నిదర్శనం. విప్లవకథ 'ఇంత బలంగా' వస్తున్నా

విమర్శకులు ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవటం లేదని ఎవరైనా అంటే ఆ తప్పు అన్నవాళ్లది కాదు.

తెలంగాణ సమాజంలో ముస్లింలకు, ఉత్పత్తి కులాలకు మధ్య ఉండే సజీవ మానవ సంబంధాల గురించిన 'అబ్బా', ముస్లిం రైతు రోజు జీవితాన్ని వ్యక్తంచేసే 'ఈద్‌నమాజ్', ముస్లిం మహిళల జీవితాలలో వచ్చిన మార్పును చెప్పే 'సైదాబీ తాయమ్మ' సంప్రదాయ కుటుంబాల్లో నుంచి బయటికి వచ్చి జీవించాలంటే స్త్రీకి కలిగే ఇబ్బందులను చిత్రించిన 'మబ్బులు కమ్మిన ఆకాశం' తరగతి గది నాలుగు గోడల మధ్య ఎంత వ్యథ ఉందో చెప్పిన 'బడిలో చీకటి', ప్రజల కోసం **'మిగిలేటోళ్లు'** కథలను కలిపి విరసం సభ్యుడు బాసిత్ కథా సంపుటి వేసాడు. ఈ కథలన్ని ప్రత్యామ్నాయ ఆలోచనా ధారను ప్రతిబింబించేవి.

సాహిత్యంలో నవలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. మనుషుల జీవితాలను మనుషుల మధ్య సంబంధాలను, సంబంధాలలో వస్తున్న మార్పు, వైరుధ్యాల, మానవ సంబంధాలపై ఉత్పత్తి సంబంధాల ప్రభావాన్ని చిత్రించే విశాల కాన్వాస్ ఉన్న సాహిత్య ప్రక్రియ నవల. ఈ ప్రక్రియను చేపట్టి సాధికారికంగా నడిపినవారు విరసంలో గత నలభై ఏళ్లుగా ఉన్నారు. ఈ వరుసలోనే విరసం సీనియర్ సభ్యురాలు నల్లూరి రుక్మిణి రాసిన **'ఒంద్రుమట్టి'** నవలను ఈ సభల్లోనే ఆవిష్కరించారు. "ఇది రాజకీయార్థిక నవల అన్నప్పుడు ఆ రెండు మాటలకూ స్పష్టమైన, నిర్దిష్టమైన అర్థం ఉంది. రాజకీయార్థిక అనే మొదటి మాట ఈ నవల వస్తువును, దాని విశాల పరిధిని, వాస్తవికతను, విశ్వసనీయతను సూచిస్తుంది. నవల అనే రెండో మాట దాని రూపశిల్పాలను, దాని కాల్పనికతను కళాత్మకతను సూచిస్తుంది. ఈ రెండు అంశాలు ఒక రసాయనిక సమ్మేళనంలో మేలు కలయిక సాధించడమే 'ఒంద్రుమట్టి' సాధించిన విజయం.(పుట.ని) అని ఎన్.వేణుగోపాల్ ముందుమాటలో ఈ నవల వస్తు శిల్ప వైశిష్ట్యాన్ని వివరించారు. 'నర్రెంక సెట్టుకింద' తన మొదటి నవలతో రుక్మిణి ఇప్పటికే తెలుగు సమాజానికి నవలా రచయిత్రిగా సుపరిచితమే. ఒంద్రుమట్టి ఆమె రెండో నవల. భూమి-కులము-విప్లవం తెలుగు సమాజంలో ఎట్లా మారుతూ వచ్చాయో ఈ నవల చిత్రికపట్టింది.

ఒంద్రుమట్టి నవలతో పాటు **'వసంతగీతం'** నవలను కూడా ఇదే సభలలో ఆవిష్కరించారు. ఈ నవలా రచయిత అల్లం రాజయ్య. కొలిమంటుకున్నది, కొమురంభీం వంటి పూర్తి నిడివి ఉన్న నవలలు, అతడు లాంటి పాక్షిక నవలతో తెలుగు సమాజంపై విశేష ప్రభావాన్ని వేసిన అల్లం రాజయ్య చేతి నుంచి 'వసంతగీతం' జాలువారింది. అడవి వెన్నెల లాంటి పదునైన, అందమైన, ఉద్విగ్నమైన కథా కథనశైలితో మలచిన నవల వసంతగీతం. ఈ శైలి రాజయ్య సొంతం. "వసంతగీతం నవల నిర్దిష్టమైన సమకాలీన చారిత్రక నవల. 1985-86 మధ్యకాలంలో నవలా వస్తువు. అట్లే ఆదిలాబాద్ జిల్లా పార్టీ నాయకత్వంలో ఒక దళం దైనందిన జీవితం, పోరాట ఆచరణ, త్యాగాలు చిత్రించిన రాజకీయార్థిక చారిత్రక నవల ఇది"(పుట.7) అని వరవరరావు చెప్పారు. ఇట్లాంటి అద్భుత నవలలు విరసం అల్లం రాజయ్య నుంచి రావటం వర్తమాన చరిత్రకొక నమ్మకం.

విరసం 24వ మహాసభలు ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ గుర్తులో జరిగాయి. కనుక కాళోజీతో సుదీర్ఘకాలం కలిసి నడిచిన వరవరరావు రాసిన **'నూరేళ్ల కాళోజీ'** పుస్తకం ఈ సభల్లోనే వచ్చింది. 1971 నుంచి వివిధ సందర్భాలలో వివి కాళోజీపై రాసిన వ్యాసాలను కలిపి ఈ రచనను తెచ్చారు. యుద్ధకాలంలో పుట్టి యుద్ధం గురించి గానం చేసిన యుద్ధ కవి కాళోజీ అనే సత్యాన్ని మనం ఈ వ్యాసాల్లో చూడవచ్చు. తెలంగాణ సమాజం ఎట్లా నిలబడితే ఆ చైతన్యంతోనే నిటారుగా నిలబడి యుద్ధాన్ని, ఫాసిజాన్ని ప్రతిఘటించిన ధిక్కారస్వరం కాళోజీది. పుట్టుక, చావు వైయుక్తికాంశాలైన బతుకు మాత్రం దేశానిదిగా జీవించిన కాళోజీ ప్రత్యామ్నాయ ఆలోచనలు తెలియాలంటే వివి రచన చదవాల్సిందే.

ఒక చేత తర్కం, మరోచేత గతితర్కం పట్టుకొని తెలుగు సాహిత్యాన్ని వ్యాఖ్యానించే విప్లవ సాహిత్య విమర్శకుడు చెంచయ్య ప్రతి విరసం సభలకు ఒక పుస్తకంతో వస్తాడు. యువ రచయితలతో పోటీ పడుతాడు. ఈ సభల్లో **'సామాజికం'** వ్యాససంపుటిని తెచ్చాడు. వివిధ సందర్భాలతో సాహిత్యం-సమాజం కలపోతగా రాసిన వ్యాసాలివి.

"మాటలు మాట్లాడాక నిశ్శబ్దంలోకి జారుకొంటాయని టి.ఎస్.ఇలియట్ తన కవితలో అంటాడు గాని ఈ పేజీల్లోని మాటలు మాత్రం నిశ్శబ్దంలోకి జారుకోవు. అలజడుల అంచుల్లో గొంతులు విప్పుతాయి." (పుట.25) అని జి.కళ్యాణరావు చెప్పిన ఈ మాటలు విరసం సీనియర్ సభ్యురాలు కృష్ణాబాయి రాసిన **'సాహిత్య సమాలోచన'** గురించి. ఒక రచనను మనం చదువుతుంటే ఆ రచయితే మన ముందు కూర్చొని మాట్లాడుతున్నట్టు అన్పించడమంటేనే పదాలు మాట్లాడటం. ఈ శక్తి కొందరు రచయితలకే ఉంటుంది. ఇందులో కృష్ణాబాయి ఉంది. బహుశ, ఆమె నలభై ఏళ్లలో రాసిన రచనల సర్వస్వం ఈ సాహిత్య సమాలోచన. ఈ మహాసభలలో ఆవిష్కరించడం ఒక సందర్భం.

విరసం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును సైద్ధాంతికంగానే గత నలభై ఏళ్లుగా సమర్థిస్తోంది. అంతేకాదు రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగే పోరాటాలలో భాగమవుతోంది. 90వ దశకంలో ప్రారంభమైన మలిదశ తెలంగాణ ఉద్యమానికి విరసం కలాన్ని, గళాన్ని తోడుచేసింది. 1997లో వచ్చిన వరంగల్ డిక్లరేషన్‌లో ప్రధాన భూమికను పోషిస్తూ ప్రజాస్వామ్య తెలంగాణ నినాదాన్ని ఇచ్చింది. ఈ అవగాహనతోనే విరసం సభ్యులు కవిత్వం, కథలు, వ్యాసాలు ప్రచురించారు. సంస్థ సభ్యుడు కాశీం రాసిన **'నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్న'** (వ్యాసాలు) పుస్తకాన్ని ఈ సభల్లోనే ఆవిష్కరించారు. "1995 నుంచి మొదలైన ఉద్యమ పరిణామ క్రమమంతా కాశీం తన రచనలో నిక్షిప్తం చేసే ప్రయత్నం చేసాడు. ప్రతి కీలక సందర్భాన్నీ ఆయన రాసాడు. ఇది తెలంగాణ రాష్ట్ర సాధనలో ఒక కార్యకర్తగా పాల్గొని కళ్ల ముందు జరుగుతున్న ఉద్యమ దృశ్యాలను తన రచనల ద్వారా మొత్తం ప్రపంచానికి చూపించే ప్రయత్నం చేసాడని"(నమస్తే తెలంగాణ-24.12.2013) జూలూరు గౌరీశంకర్ ఈ రచన అవసరాన్ని చెప్పాడు. ప్రజాస్వామ్య తెలంగాణ ఎట్లా ఉండాలో ఈ రచన ద్వారా తెలంగాణ సమాజానికి కావల్సిన సమాచారం అందుతుంది. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో విరసం ప్రజాస్వామిక దృక్పథాన్ని తెలియచేసే సాధికారిక రచనలలో ఇదొకటి. ఇవి విరసం సభ్యులు రాసిన రచనలు.

ఇక విరసం ప్రచురించి ఈ సభలో ఆవిష్కరించిన సాహిత్యంలో

దండకారణ్య కథలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రజల ప్రత్యామ్నాయం ఎట్లా పుష్పించి వికసిస్తుందో ఈ కథల్లో చూడవచ్చు. ఒక రకంగా విరసం, విప్లవోద్యమం ఆవల ఉన్న రచయితలెవరికి తెలియని ఒక కొత్త జీవితాన్ని, సాహిత్య వస్తువును, ఘర్షణను, యుద్ధాన్ని ఈ కథల్లో దర్శిస్తాం. యుద్ధ రంగ కథకులతో ఆత్మీయ కరచాలనం చేసే అవకాశం తెలుగు సమాజానికి ఈ కథలు కల్పించాయి. "అమ్మ పొలం దున్నుతున్నది/నాన్న ఊయల ఊపుతాడు/ చందు అన్నం వండుతాడు/ పెదనాన్న బియ్యం చెరుగుతాడు"(పుట.13) అనే వాక్యాలను మనమెప్పుడైనా మన పుస్తకాలలో చదివామా? లేదే?! కాని ఇవ్వాళ దండకారణ్యంలో జనతన సర్కార్ నడుపుతున్న పాఠశాలలో ఈ వాక్యాలను పిల్లలు చదువుతుంటారు. ఈ శాస్త్రీయమైన విద్య మనకు పరిచయం కావాలంటే ఈ కథలు చదివి తీరాలి.

జనతన సర్కార్ ఇవాల్టి ప్రపంచ ప్రత్యామ్నాయం. నూతన ప్రజాస్వామ్యానికి బీజరూపం. బూర్జువా చట్టం ప్రజల పట్ల ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో ఈ అరవై ఏళ్ల అధికార మార్పిడిలో చూస్తూనే ఉన్నాం. కాని జనతన సర్కార్‌లో ఉండే న్యాయవ్యవస్థ మనిషిని మార్చి 'రేపటి' వెలుగులోకి నడిపిస్తుంది. 'కామ్రేడ్ ఆజాద్, కామ్రేడ్ కిషన్‌జీతో సహా వేలాదిగా శత్రు క్రూర యాతనలకు గురైన అమరులు, మన ప్రభుత్వం కూడా వాళ్ల ప్రభుత్వంలాగానో, మన న్యాయవ్యవస్థ కూడా వాళ్ల న్యాయవ్యవస్థలాగా కావడానికి తమ విలువైన ప్రాణాలు అర్పించలేదు. చీకటి యుగాలకు చెందిన వాళ్ల కోర్టులున్న స్థానానికే మనలను తీసుకెళ్లడానికి కాదు. వాళ్ల త్యాగం మనమొక నూతన 'రేపటిని' వీక్షించాలని..."(పుట.25) వెర్నాన్ గొంజాల్విస్ రాసిన **రేపు** కథను ఎన్.రవి తెలుగులోకి అనువదించాడు. నేరభావం లేకుండా ఎవరైన తప్పుచేస్తే స్వవిమర్శ చేసుకొని అట్లాంటి తప్పు మళ్లీ జరగకుండా ఉండేటట్లు చర్యలు చేపట్టటమనే ప్రజాస్వామిక సూత్రబద్ధ వైఖరిని జనతనసర్కార్ తప్ప బూర్జువా సర్కార్లు చేపట్టవని ఈ కథ తేటతెల్లం చేసింది.

ఆజాద్ ఎన్‌కౌంటర్ విషయంలో హోంశాఖ మంత్రినే శిక్షించాల్సి వస్తుందనే నిర్ధారణను దాటవేయడానికి కావల్సిన ప్రాతిపదికను జస్టిస్ శివశంకర్ తన ఉదారవాదంతోనో, అవకాశవాదంతోనో కడిగేనుకోలేని మరకల్ని అంటించుకొని అంతర్జాతీయ న్యాయస్థానానికి ఎంపికయ్యాడు. కాని జనతన సర్కార్ మాత్రం తమ వద్ద బందీగా ఉన్న జిల్లా కలెక్టర్(జిల్లా న్యాయాధికారి) తరపున చైతూ అనే న్యాయవాదిని నియమించింది. ప్రజాకోర్టులో కలెక్టర్ మీద వాదనలు జరిగాయి. "మన చట్టం ఒక ఉన్నతస్థాయి తర్కం, సత్యాలతో పనిచేస్తుంది. ఇప్పటికి జరగని నేరానికి ఎవ్వరికీ శిక్షపడకూడదు. ప్రజలకు వ్యతిరేకంగా నేరాలు చేయకుండా ఉండే చిత్తశుద్ధిని తమ చర్యల ద్వారా చూపగలిగే అవకాశాన్ని ఎవ్వరికి నిరాకరించకూడదని" కలెక్టర్ తరపున వాదించిన చైతూ, అతన్ని నిరపరాధిగా తేల్చాడు. ప్రజాకోర్టు చైతూ వాదనతో ఏకీభవించింది. కాని బూర్జువా ప్రభుత్వాలు నిరాయుధులైన నక్సలైట్ నాయకుల్ని మాత్రం పట్టుకొని కాల్చి చంపుతోంది. ఇదే మౌలికంగా బూర్జువా కోర్టులకు, జనతన కోర్టులకు తేడా. ఈ తేడాను రేపు కథ అద్భుతంగా చిత్రించింది.

కథలో(అనువాదంలో) ఉండే వస్తువురీత్యా శిల్పానికి పరిమితి ఏర్పడింది. కథ అసాంతం ఒక రాజకీయ వ్యాసంలా సాగింది. కథాకథనం ప్రౌఢ శైలిని సంతరించుకున్నాయి. మనం చెప్పదలుచుకున్న విషయం సాధారణ పాఠకుడికి కూడా సరళంగా అర్థమయ్యే భాషను, శైలిని ఎంపిక చేసుకోవాలి. ఈ సమస్యను అధిగమించి వుంటే మరో 'మధ్యవర్తులు'(అల్లం రాజయ్య) కథను మించిపోయి ఉండేది. ఏమైనా ఇట్లాంటి ఇతివృత్తంతో విప్లవ శిబిరం నుంచి కథ రావటం సామాజిక సందర్భం.

రక్తం బొట్టు చిందకపోవచ్చు, చిందినా కనిపించకపోవచ్చు, అవయవాలు తెగిపడకపోవచ్చు, తెగిపడినా మాయం కావచ్చు. కత్తి దూసుకుపోతుంది. పిడిపట్టిన చేయి మాత్రం దొరకదు. తూటా పేలక పోవచ్చు. కాని మనుషులు నేల రాలుతారు. శత్రువు పడకగదిలో కూర్చొని ఉంటాడు. కాని పోల్చుకోలేము. దీనినే ఎల్ఐసి అంటాం. మంద్రస్థాయి యుద్ధం అని నైఘంటికార్థం. ప్రపంచ పోలీస్ అమెరికా నుంచి మొదలు ప్రతీ దేశంలో ప్రజా వ్యతిరేక పాలకులందరు పాటిస్తూ అమలుచేస్తున్న ప్రతిఘాతక యుద్ధ నీతిని తెలుగు పాఠకులకు పరిచయం చేయటానికి విరసం సభ్యుడు రివేరా అనువదించిన **'మంద్రస్థాయి యుద్ధం'** పుస్తకాన్ని ఈ సభల్లో ఆవిష్కరించారు.

ఇదే వేదికపై విప్లవోద్యమం, ప్రజాసంఘాలు ప్రజాస్వామిక తెలంగాణ కోసం 1973 నుంచి రూపొందించుకున్న చారిత్రక పత్రాలను 'ప్రజాస్వామ్య తెలంగాణ' పేరుతో ఆవిష్కరించారు. భౌగోళిక హద్దులు మారే తెలంగాణ వలన ఇక్కడి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావనే గతితార్కిక విశ్లేషణ ఈ పత్రాలలో ఉంది. ఇట్లాంటి ప్రజాప్రత్యామ్నాయ పత్రాలను విరసం లాంటి సంస్థలు మాత్రమే ప్రచారం చేయగలవనే చారిత్రక సత్యం మళ్లీ రుజువయింది.

1969లో విద్యార్థి ఉద్యమం నాయకుడిగా, 1998 నుంచి జనసభ కన్వీనర్, ప్రజాఫ్రంట్ అధ్యక్షుడిగా ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పోరాడిన ఆకుల భూమయ్య డిసెంబర్ 24, 2013న హత్యకు గురయ్యాడు. ఆయన వివిధ సందర్భాలలో ప్రజాస్వామ్య తెలంగాణ కోసం రాసిన వ్యాసాలను **'ఆకుల భూమయ్య రచనలు'** పేరుతో ఈ సభల్లో ఆవిష్కరించారు. అట్లే ఆయన ఇచ్చిన ఆఖరి ఉపన్యాసాన్ని కూడా బుక్‌లెట్ రూపంలో తెచ్చారు. తెలంగాణ ప్రాంతం వలెనే తన అస్తిత్వం కోసం 1936 నుంచి పెనుగులాడుతున్న ప్రాంతం రాయలసీమ. రతనాలు రాసులుగా పోసి అమ్మిన గతం ఒక తీపి గుర్తుకావచ్చు! కాని ఇవ్వాళ రాళ్లు మాత్రమే దక్కాయనేది వర్తమాన విషాద చిత్రం. నలుగురు ముఖ్యమంత్రులు వచ్చిన ప్రాంతంలో శ్రీబాగ్ ఒడంబడిక నుంచి కోస్తాంధ్ర పాలకులు ఉల్లంఘనలకే పాల్పడ్డారని చరిత్ర చెబుతున్న సత్యం. దీని నుంచి ప్రజల పెనుగులాట ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షగా ఉద్యమ రూపం తీసుకోవాలని విరసం కోరుకోవటమే కాదు దానికి కావల్సిన సైద్ధాంతిక భావజాలాన్ని ఇవ్వటం కోసం **'నేటి రాయలసీమ'** పుస్తకాన్ని ప్రచురించి ఆవిష్కరించింది.

వరంగల్ విప్లవోద్యమంలో ఆర్కేది చెరగని సంతకం. ప్రజా సమస్యలపై ప్రజలను కదిలించి పోరాటాలు నిర్మించటంలో అతనికి అతడే సాటి. పత్తి రైతులు అప్పులపాలై చెట్లకు వేలాడుతుంటే వాళ్లలో గుండె ధైర్యం నింపటానికి ప్రయత్నం చేసి సఫలీకృతమయ్యాడు.

పత్రికా ప్రకటన

ఇది పూర్తి విజయం కాదు

పోలవరం, ఉమ్మడి రాజధాని, గవర్నర్ అజమాయిషీ చాలా అన్యాయం

అరవై ఏళ్ళ తెలంగాణ కల సాకారం కావడం విజయోత్సవమే. అయితే ఇది తెలంగాణ ప్రజలు కోరుకున్న తెలంగాణ ఎంత మాత్రం కాదు. ఆంధ్రకు నష్టపరిహారంగానో, ప్యాకేజీగానో నిర్మించపూనుకున్న పోలవరం మూడు లక్షల మంది ఆదివాసులను, రెండు వందల గ్రామాలను, మూడు లక్షల ఎకరాల భూమిని ముంచి వేస్తున్నది. ముంపుకు గురవుతున్న ఆదివాసులు తప్ప ఎవరూ దీనికి వ్యతిరేకంగా ఉద్యమించడంలేదు. వ్యతిరేకించే పక్షాలు మెక్కుబడి ప్రకటనలకు పరిమితమవుతున్నారు. తెలంగాణ కోసం మనతో పాటు పోరాటం చేసిన ఆదివాసులను విషాదంలో ముంచి మనం సంబరాలు చేసుకోవడం అన్యాయం. పోలవరం ముంపు ప్రాంత ఆదివాసుల ప్రతిఘటన లేకుండా చేయడం కోసం, ఆ ప్రాంత ఆదివాసుల ప్రతిఘటన లేకుండా చేయడం కోసం ఆ ప్రాంతాలను తెలంగాణ నుండి విడగొట్టి ఆంధ్రలో కలపడం అత్యంత దుర్మార్గం. తెలంగాణ ప్రజలు హైదరాబాదుతో కూడిన పది జిల్లాల తెలంగాణ కోసం సుదీర్ఘ పోరాటం చేశారు. చివరికి ఇచ్చిన తెలంగాణలో హైదరాబాదును, దాని పరిధి, విస్తృతితో సహా ఉమ్మడి రాజధాని చేశారు. అంటే మరోపదేళ్ళ పాటు యథాతథ దోపిడి కొనసాగగలదు. లేదా అంతకన్నా దారుణంగా ప్రజాస్వామిక హక్కులకు భంగకరమైన గవర్నర్ అజమాయిషీ ఉంటుదన్నమాట. హైకోర్టు కూడా పదేళ్ళు ఉమ్మడిగా ఉంటుందని నిర్ణయించారు. అందులో న్యాయం జరుగుతుందా?

ఇన్ని ఆంక్షలకు నిశ్శబ్దంగా తలొగ్గిన బూర్జువా పార్టీలన్నీ కేంద్రంతో అనుకూలంగా కలిసిపోయాయి. రేపు తెలంగాణకు కేంద్రం నియమించే విధేయుడైన ముఖ్యమంత్రి, గవర్నర్ కలిసి ప్రజల్ని నియంత్రించబోతున్నారు. అందువల్ల పైకి తెలంగాణ వచ్చినట్లు కనపడుతున్నా ప్రజలు పూర్తిగా విజయం సాధించలేదు. వీటన్నిటి మీద పోరాడవలసే ఉంది. ముఖ్యంగా తక్షణం పోలవరాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత నుండి తెలంగాణ రాజకీయ పార్టీలన్నీ తప్పుకున్నాయి. ఈ వైఖరిని విరసం గర్హిస్తోంది. తెలంగాణ ప్రజలు పోలవరం ముంపు ప్రాంతాల ప్రజలకు బాసటగా నిలబడాల్సిన అవసరం ఉంది. ఆ ప్రాంతాలను ఆంధ్రలో కలపడాన్ని అడ్డుకోవాలి. ఇందుకు తెలంగాణ కోసం పోరాడిన అన్ని పక్షాలు ముందుకు రావాలి.

కేంద్రం పోలవరం ప్రాజెక్టును రద్దుచేయాలని, ఆంక్షలు లేని తెలంగాణ ప్రకటించాలని విప్లవ రచయితల సంఘం డిమాండ్ చేస్తోంది.

– పి.వరలక్ష్మి, (విరసం కార్యదర్శి)

21-02-2014

పాణి, కాశీం, రాంకి, రివేరా (విరసం కార్యవర్గ సభ్యులు)

అతని జ్ఞాపకాలలో వరంగల్ మిత్రులు తెచ్చిన పుస్తకం **'ఆర్కే పోరాట జలపాతాన్ని'** ఇక్కడే ఆవిష్కరించారు. అతని సహచరి భారతి **'రెండు పోరాట గాథలు'** పేరుతో రాసిన కథల్ని విరసం ప్రచురించింది. ఈ కథలు వీరోచిత, విషాద దృశ్యాలను మన కళ్ల ముందు స్క్రోల్ చేస్తాయి. పరకాల పల్లెలు కథలు చదువుతున్నప్పుడు కదిలి పోతుంటాయి. ప్రజలు తమ చరిత్రను తామే నిర్మించుకుంటార నటానికి ఈ గాథలు నిదర్శనం. కొకొండ ఎన్‌కౌంటర్ మొదటి కథలో, ఒక అరెస్టు రెండో కథలో భారతి దృశ్యమానం చేసింది.

మనం తప్పక తెలుసుకోవాల్సిన మనుషులు కొందరుంటారు. వాళ్లు చచ్చిబతికిన ధన్యులు. అరవై ఏళ్లు పైబడి జీవించి అందులో నలభై ఏళ్లు నమ్మిన విశ్వాసాల కోసం నిలబడటం మామూలు విషయం కాదు. 'తరమెల్లి పోతున్నదో పోరాటాల స్వరమెల్లి పోతున్నదో' అని గోరటి ఎంకన్న రాసినట్లు, వెళ్లిపోతున్న తరం తాలూకు జ్ఞాపకాలను ఈ తరానికి అందించాలని విరసం భావించి **'ఆదర్శజీవులు అమరులు'** పేరుతో పుస్తకాన్ని తెచ్చి ఆవిష్కరించింది.

ప్రజల సంస్కృతి, కళలు వర్ధిల్లాలనేది విరసం నినాదం. సంస్కృతిలో భాగమైన ఉత్పత్తి కులాల ఆహారం కూడా వర్ధిల్లాలి. అగ్రకుల సమాజం చేత నిరాకరించబడిన దళితుల, ఆదివాసుల ప్రధాన ఆహారమైన బీఫ్‌ను విప్లవోద్యమం, విరసం తన ఆచరణలో భాగం చేసుకున్నది. దానిని అందరికి అలవాటు చేయాలని రెండో రోజు సభలలో బీఫ్ కూరను వడ్డించింది. ఈ ఆహారం ప్రజలందరి తిండిగా మారాలనే అవగాహనను పెంపొందించటానికి **'బీఫ్ రాజకీయాలు'** పుస్తకాన్ని సభల్లో ఆవిష్కరించింది.

ఇంకా ఈ సభలలో వు-యన్-టు స్వీయచరిత్ర **'కార్మికవర్గ పుత్రుడు'** చైనా నవలను విరసం ప్రచురించి ఆవిష్కరించింది. విప్లవ కాలపు చైనా సామాజిక నేపథ్యంగా ఈ నవలను చెప్పవచ్చు. అవమానపూరిత గతం, ఉద్రిక్తపూరితమైన వర్తమానం, అనిశ్చితమైన భవిష్యత్తు ఏ విధంగా పుష్పించిందో ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు. ఇక నందిని సిధారెడ్డి తెలంగాణ నెనరున్న కవి మిత్రుడు. విరసానికి మిత్రుడు, విప్లవానికి ప్రేమికుడు. మంజీర మీద రాసిన, మట్టి మీద రాసిన మనిషితనం తప్పిపోని ఆర్ద్రత అతని కవిత్వం నిండా పారుతుంది. **"ఇక్కడి చెట్లగాలి"** (కవిత్వం)ని మోసుకొని విరసం సభలకు వచ్చి వేదికపై ఆవిష్కరించాడు. శతాబ్దాల భూమి శరీరం మీద సంతకం చేస్తున్న అదే నది గురించి ఎన్నిసార్లు చెప్పినా కొత్తగా ఎట్లా అల్లుతాడో ఈ కవిత్వం చూస్తే తెలుస్తుంది. **నిత్యజీవితంలో సోషలిజం** (భూసారం శివన్న), విప్లవ **మేధావి మహిత, అరణ్యపర్వం** (ఆలూరి భుజంగరావు కథలు), **పువ్వర్తి అమరులు, అరుణతార సాహిత్య విమర్శ** పుస్తకాలను, **అరుణతార, సృజన డివిడీలను** కూడా ఈ సభల్లో ఆవిష్కరించారు.

నలభై రెండు సంవత్సరాలుగా విరసం విప్లవ రాజకీయాలను ప్రచారం చేయడానికి పనిచేస్తూనే ఉంది. నిషేధాలకు, నిర్బంధాలకు గురైనా తన సాహిత్య సృజనను కొనసాగిస్తూనే ఉంది. మూడు తరాల రచయితలతో విరసం నవ నవోన్మేషంగా నడుస్తున్నదనే వాస్తవాన్ని ఈ మహాసభలు నిరూపించాయి.

(బహుజన సెక్యులర్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో జరిగిన మీటింగ్ సందర్భంగా...)

మోడిత్వ ప్రమాదాన్ని ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాల ద్వారా ఎదుర్కొందాం

- విప్లవ రచయితల సంఘం

ఈ రోజు దేశానికి అతి ప్రమాదకరంగా పరిణమించిన హిందూ ఫాసిస్టు ప్రతినిధి మోడీని వ్యతిరేకిస్తు ముందుకొచ్చిన సాహితీ మిత్రులకు, ప్రజాసంఘాల ప్రతినిధులకు విరసం ఉద్యమాభి వందనాలు తెలియజేస్తున్నది. ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా భిన్న స్వరాలను కలిపే వేదికలోకి మమ్మల్ని ఆహ్వానించిన మిత్రులకు కృతజ్ఞతలు. మతోన్మాదిని బీసీ ప్రతినిధిగా చూపెడుతూ, హంతక చరిత్రపై అభివృద్ధి ముసుగు కప్పుతూ, మోడీ ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతున్న సందర్భంలో బహుజన సెక్యులర్ మూవ్‌మెంట్ పేరుతో ఈ కార్యక్రమం జరగడం, అది విధ్వంసక అభివృద్ధిని వ్యతిరేకిస్తూ కరపత్రంలో మాట్లాడటం సహజంగానే విరసంకు ఆసక్తికరమైన విషయాలు. అయితే విప్లవ శక్తులు బిజెపితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాయని, వారికి కాషాయ రంగు ప్రీతిపాత్రమైపోయిందని చేసిన వ్యాఖ్యల పట్ల మాకు తీవ్ర అభ్యంతరం ఉన్నది. విప్లవ శక్తులు మొదటి నుండి హిందుత్వను రాజకీయార్థిక పునాదిలో భాగంగా చూడటమే కాదు, దానితో తలపడుతున్నాయి. ఎందుకంటే రాజ్యాన్ని ఎదుర్కొనకుండా హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కొనడం నీడతో యుద్ధమే. అందుకే మా వ్యవస్థాపక కార్యదర్శి కా. కెవిఆర్ ఎప్పుడో దాన్ని మతవర్గతత్వంగా విశ్లేషించాడు. అట్లాగే హిందుత్వ రాజకీయాలకు, సామ్రాజ్యవాద పెట్టుబడికి ఎట్లా అవినాభావ సంబంధం ఉన్నదో సిక్కుల ఊచకోత, భోపాల్ గ్యాస్ ట్రాజిడీల రాజకీయార్థిక క్రమాన్ని విప్లవోద్యమం విశ్లేషించింది. ఈ రోజు గుజరాత్ జాతిహననం తర్వాత అది అభివృద్ధికి నమూనా కావడం చూస్తున్నాం. నందిగ్రాం వంటి చోట్ల ప్రజలు సామ్రాజ్యవాద విధ్వంసక అభివృద్ధిని మిలిటెంట్‌గా అడ్డుకుంటుంటే, మోడీ "గుజరాత్‌కు రండి, మీకు అని విధాలా రక్షణనిస్తాం" అని ప్రకటిస్తున్నాడు. సామ్రాజ్యవాద పెట్టుబడికి నమ్మకమైన సేవకుడు, సమర్థవంతమైన నాయకుడు దొరికాడు. అందుకే కార్పొరేట్ శక్తులు వాటి చేతుల్లో ఉన్న మీడియా మోడీని ఆకాశానికెత్తుతున్నాయి.

మనదేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా హిందుత్వ రాజకీయాలు వివిధ రూపాల్లో అమలవుతూనే ఉన్నాయి. అందువల్ల కాంగ్రెస్ లౌకికతలోని మోసం పచ్చిగా బయటపడిన సందర్భాలెన్నో ఉన్నాయి. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు ఒక కశ్మీరీ ముస్లిం అఫ్జల్ గురును భారత పార్లమెంటు ప్రతిష్టకు బలిపెట్టి "దేశభక్తి" రేస్‌లో బిజేపితో ఏ మాత్రం వెనకబడి లేనని చాటుకుంది కాంగ్రెస్. కేవలం ముస్లిం అయినందుకు ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద "వార్ ఆన్ టెర్రర్"కు బలవుతున్న వారు ఎంతో మంది ఉన్నారు. అఫ్జల్ గురు ముస్లిం కావడమే కాదు, కశ్మీరీ కూడా అయినందుకు ఆయనపై మోపబడిన నేరానికి ఏ ఒక్క ఆధారం లేకపోయినా ఉరికంబానికి వేలాడటమే కాదు, దేశంలో ప్రజాస్వామికవాదుల సానుభూతినీ పొందలేక పోయాడు. ఆయన భార్యాబిడ్డలు, కశ్మీరీ ప్రజలు ఇప్పటికీ ఆయన మృతదేహం కోసం పోరాడుతున్నారు. విప్లవ ప్రజాసంఘాలు ప్రజాభిప్రాయాన్ని కాదు కదా ప్రజాస్వామిక వాదులనూ ప్రభావితం చేయలేకపోతున్నాయేమో! ఇవ్వాళ ఢిల్లీలో అఫ్జల్‌గురుపై జరిగే మీటింగ్‌కు వెళ్ళనివ్వకుండా ప్రొ.గిలానీని గృహనిర్బంధం చేశారు. కశ్మీర్ జాతి ఆకాంక్షను నెత్తుటిలో ముంచి, అక్కడి ముస్లింలపై తీవ్రవాద ముద్రవేసి అలవోకగా చంపివేయడం గురించి మాట్లాడని స్థితి నుంచి గుజరాత్‌లను, ముజఫర్‌నగర్‌లను మేం చూస్తున్నాం. అందుకే అఫ్జల్‌గురును ఉరితీసిన రోజు దాని గురించి తెలంగాణ విద్యావంతుల వేదికపై విరసం మాట్లాడింది. తెలంగాణ ఉద్యమం మరో జాతి పోరాటాన్ని ఎందుకు చూడలేక పోతోంది అన్న మాటకు అక్కడ విపరీతమైన అసహనం పెల్లుబికింది. అదేరోజు సాయంత్రం మా నిరసన ప్రదర్శన హిందుత్వ గూండాల దాడిని, అరెస్టును ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక్కడ కూడా ఈ విషయాలు మాట్లాడటం కొంతమందికి నచ్చకపోవచ్చు. అయితే ఇదంతా విప్లవ రాజకీయ అవగాహనను స్పష్టం చేయడం కోసమే.

ఇక్కడ కలిసిన మనందరి రాజకీయ విశ్వాసాలేమైనప్పటికీ స్థూలంగా మెజారిటీ మతభావజాలానికి ప్రత్యమ్నాయంగా లౌకిక భావనను, ప్రజాస్వామిక సంస్కృతిని ప్రచారం చేసే కర్తవ్యాన్ని మనం తీసుకోవాలనుకుంటున్నాం. ఇదొక చారిత్రక అవసరం. పది పన్నెండేళ్ళ క్రితం ఇట్లాగే ఐక్య వేదికల మీద హిందుత్వ గురించి మాట్లాడుకున్న మనం ఈ రోజు దానిని మోడిత్వ అంటున్నాం. హిందుత్వ శక్తులు నేడు రామజపం కన్నా ఎక్కువగా "నమో" జపం చేయడమే కాదు మీడియా చేత చేయించగలుగుతున్నాయి. మృత్యుబేహారీ కాస్తా వికాస్ పురుష్ అయిపోయిన క్రమం కేవలం ఒక వ్యక్తి బలపడటంగానో, ఒక పార్టీ బలపడటంగానో చూడలేం. గుజరాత్ నుండి ముజఫర్ నగర్ దాకా నడిచొచ్చిన క్రమంలో వేగంగా అల్లుకుపోతున్న ఒక ప్రమాదకర భావజాలాన్ని, దానికి శక్తినిస్తున్న సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను, వాటి మధ్య పనిచేస్తున్న అంతసూత్రాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. ఈ పన్నెండేళ్ళలో బలపడిన శక్తులు మాత్రమే కాదు బలహీనపడిన గొంతులు కూడా ఒక విచ్ఛిన్న క్రమాన్ని మన ముందు పెడుతున్నాయి. గుజరాత్ దారుణాలకు ఎంతమందిమి ఎంతగా చలించిపోయామో,

ముజఫర్‌నగర్ వచ్చేసరికి అంతగా ఇమ్యూన్ అయిపోయామా? అప్పటికీ ఇప్పటికీ మనం గుర్తించవలసిన మార్పు ఏమంటే 2002లో బిజేపీ అధికారంలో ఉండి హింసాకాండను నడిపిస్తే, 2013కల్లా వివిధ రంగాల్లో, వివిధ శాఖల్లో, వివిధ సమూహాల్లో అల్లుకుపోయిన కాషాయవేళ్ళు నిశ్శబ్దంగా పనిచేసుకుపోతున్నాయి. వరుసగా అధిక సంఖ్యలో ముస్లింలపై దాడులు జరుగుతున్న యుపి, మహరాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఏ ఒక్కటీ బిజెపి పాలిత రాష్ట్రం కాకపోవడం మనం గమనించాల్సిన విషయం. నిజానికి గుజరాత్ సంఘటనలనాటికే కాషాయీకరణ క్రమం ఒకటున్నది. ఆ విషయాలు మనం ఎన్నో సార్లు మాట్లాడుకున్నాం. అయితే అక్కడి (2002) నుండి ఒక విధ్వంసక శక్తి ఈనాటి అభివృద్ధికి నమూనాగా, ఒక భావజాలంగా బలపడిన క్రమం ఉంది. అంటే హిందుత్వ రాజకీయార్థిక పునాది బలపడటం, సాంస్కృతిక, భావజాల రంగాల్లో విస్తరించడం జరిగింది. దానికి దోహదం చేసే అంశాలు మన వ్యవస్థలో ఉన్నాయి.

ఈ వ్యవస్థ పనితీరులో (ఫంక్షనింగ్) సెక్యులరిజం నిజమైన సారంలో భాగం కాలేదు. ఒక చారిత్రక క్రమంలో వ్యవస్థ నడవడానికి ఆటంకంగా ఉన్న మతాన్ని దూరం జరిపి రాజ్యం మతాతీతంగా ఉండే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఒక అవసరంగానే పెట్టుబడిదారీ సమాజం ఏర్పరుచుకుంది. శాస్త్రీయత మతంపై పైచేయి సాధించింది. అదిక్కడ జరగలేదు. భారతదేశ సమాజంలో ఒక ప్రత్యామ్నాయ ఏర్పాటుగా సెక్యులరిజం రాకపోగా వక్రీకరించిన అర్థాలతో అది స్థిరపడింది. అది ఆదర్శంగా మిగిలిపోయింది. అవసరంగా కాదు. ఈ దేశంలో సంఖ్యను బట్టి ప్రజాస్వామ్యం అమలవుతున్నట్టుగానే సెక్యులరిజం కూడా.

బూర్జువా ప్రజాస్వామిక ఆదర్శాలు పెట్టుబడి గుత్తపెట్టుబడిగా మారిపోయి సామ్రాజ్యవాదంగా విస్తరించాక చెల్లిపోయాయి. మార్కెట్లను సాధించే క్రమంలో సెక్యులరిజాన్ని వదిలి అది మతాన్ని వాడుకుంది. సామ్రాజ్యవాదానికి మతం నమ్మకమైన సేవకురాలు అయింది. అమెరికా తన గుత్తాధిపత్యం కోసం ఇస్లామిక్ టెర్రరిజాన్ని కనుగొన్నది. బ్రిటీష్ వలసలో ఉండిన మనదేశంలో సెక్యులరిజం పాత రాజ్యంపై యుద్ధం చేసి మతంపై పైచేయి సాధించి రాలేదు. అందువల్ల రాజ్యయంత్రానికి మతస్వభావం ఉంటుంది. ప్రజలు దైనందిన జీవితంలో మతం ఉంటుంది. పరమత సహనమూ ఉంటుంది. అయితే వివిధ సమస్యల వల్ల జనంలో గూడుకట్టుకున్న అసంతృప్తిని మళ్లించగలిగే రాజకీయాలు, మతం పాలకవర్గాలకు అవసరం. రాజ్యానికి స్వభావసిద్ధంగా ఉండే మతస్వభావం హిందుత్వను నిశ్శబ్దంగా అమలుచేస్తూ కొన్ని సార్లు హింసాత్మక రూపం తీసుకుంటుంది. పంజాబ్, అయోధ్య, గుజరాత్... అటువంటి మరెన్నో. ప్రజల మౌలిక సమస్యలను, అసంతృప్తిని, పోరాటపటిమను ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాలు సరైన దిశలో నడిపించగలిగితే ఆ మొత్తం సమాజం ప్రజాస్వామిక విలువల్ని, చైతన్యాన్ని ప్రోది చేసుకుంటుంది. తెలుగు సమాజంలో విప్లవోద్యమం అటువంటి విలువల్ని తీసుకొచ్చింది. విప్లవోద్యమం వెనకడుగు వేయాల్సిన పరిస్థితిలో బూర్జువా రాజకీయ పక్షాల నాయకత్వంలో నడుస్తున్న తెలంగాణ ఉద్యమం ప్రజల్ని ఆత్మహత్యల వైపు మళ్లించింది. కాషాయ శక్తులకు స్థానం కల్పించింది. ఇది అర్థం చేసుకోలేని ప్రజాస్వామిక వాదులు, మేధావులు మావోయిస్టు రాజకీయాలు మాట్లాడే వాళ్ళను దూరం పెడితే రాజ్యనిర్బంధాన్ని తప్పించుకోవచ్చు అనుకున్నారు. మొత్తం మీద మౌలికమైన దోపిడి ఆర్థిక విధానాలపై పోరాడకుండా కేవలం పైపై విషయాలను, సాంస్కృతిక అంశాలనే చూస్తే దెబ్బతినగలం అని తెలంగాణ ఉద్యమమే మనకు చెబుతుంది. అటు పోలవరం కింద, ఒపన్ క్యాస్ట్ గనుల కింద, ఇంకా ఎన్నో 'అభివృద్ధి' పథకాల కింద అన్యాయమవుతున్న వారికి గాని, తీవ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటూ రాజ్యానికి బలవుతున్న ముస్లింలకు గాని, అట్లాగే ఏ ఒక్క పీడిత ప్రజాసమూహానికీ ఏ ఊరటా ఇవ్వలేని తెలంగాణ రాబోతోంది. ఇప్పటికే హైదరాబాదులో చార్మినార్‌పై వివాదం రేపి సంఘపరివార్ శక్తులు ఒక టైంబాంబ్‌ను పెట్టి ఉంచాయి. రేపు గవర్నర్ అజమాయిషీలో హైదరాబాదులో ఇంకెన్ని చూడాల్సి వస్తుందో!

మరోవైపు సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ సంక్షోభాల్లో కూరుకుపోతూ, వివిధ దేశాల్లో సంక్షోభం తీవ్రతరమవుతున్న ప్రస్తుత స్థితిలో ఫాసిజం జడలు విప్పడానికి అవకాశం ఉంటుంది. చరిత్రలో ఇటువంటి ఉదాహరణలున్నాయి. మన దేశంలోనూ దానికి తగిన వాతావరణం ఉంది. ఇది ప్రత్యామ్నాయ ప్రజాఉద్యమాలవైపు దారి తీయకపోతే ఫాసిజం బద్దలవుతుంది. ప్రత్యామ్నాయంగా చెప్పుకుంటున్న అన్ని బూర్జువా రాజకీయ పార్టీలకూ అంతర్గతంగా ఫాసిస్టు లక్షణాలున్నాయి. సెక్యులరిజం ప్రజాపునాది నుండి నిర్మాణం కావాలిగాని ప్రభుత్వం నుండి నిర్మాణం కాదు. అది ఉద్యమాల వల్లే సాధ్యం. ఈ దేశంలో రాజ్యానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న అన్ని రకాల ఉద్యమాల పక్షాన నిలబడుతూ సాంస్కృతిక రంగంలో కృషి చేద్దాం.

చివరగా మతహింస నిరోధక బిల్లును డిమాండు చేయడం పట్ల కూడా మాకు అభ్యంతరం ఉన్నది. చట్టాలు రాజ్యానికి మరిన్ని కోరలు తగిలించడానికే ఉపయోగపడతాయి. మతహింస నిరోధక చట్టం మెజారిటీ మతహింసను నిరోధిస్తుందా, మైనారిటీ మతస్థులపైనే ప్రయోగించబడదా? ఎవరూ గ్యారెంటీ ఇవ్వలేరు. నరహంతక మోడీని ప్రాసిక్యూట్ చెయ్యమని అడుగుదాం. అసిమానంద బైటపెట్టిన ఆరెస్సెస్ తీవ్రవాదులను విచారించి శిక్షించమని అడుగుదాం. అఫ్జల్‌గురు కుటుంబానికి న్యాయం చేయమని అడుగుదాం. కశ్మీర్‌లో సైన్యాన్ని ఉపసంహరించమని అడుగుదాం. అన్యాయంగా జైళ్ళలో నిర్బంధించబడిన ముస్లిం యువకులకు న్యాయం చేయమని డిమాండ్ చేద్దాం. కేవలం సాంస్కృతిక విషయాలకే పరిమితం కావద్దు. సంస్కరణలు కోరుకోవడంతో సరిపెట్టుకోక రాజ్య హంతక స్వభావాన్నీ ప్రశ్నిద్దాం. రాజ్యాన్ని ప్రశ్నించడానికి వెనకాడితే మోడీనెలా అడ్డుకుంటాం?

కరపత్రం

ప్రజాస్వామిక ఉద్యమాలకు వొరవడి దిద్దిన ప్రజల గురువు కామ్రేడ్ ఆకుల భూమయ్య

ఒడ్డున ఉన్న ఓ నేస్తమా!
సముద్రస్నానానికి అలవాటుండాలి
కడలిలో తుది శ్వాస విడిచే అలవాటు
- కె. సచ్చిదానందన్

అవును.. జన కెరటాలకు కత్తులు కడుతూనే తుది శ్వాస విడిచినవాడు కామ్రేడ్ ఆకుల భూమయ్య. అనుమానస్పద రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించి నెల దాటిపోయింది. 'దొరగారి కుక్క'ని వెతకడానికి ఉరుకులుపరుగులు పెట్టే పోలీసు యంత్రాంగం, భూమయ్య హంతకులను పట్టుకోవడానికి మాత్రం చేసిందేమీ కనిపించడం లేదు. తూతూమంత్రంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నది. ప్రజా ఉద్యమ జీవనంలో 40 ఏళ్లకు పైగా ఉన్న నేత మరణంపై అనుమానాలు వస్తున్నప్పుడు,వాటిని నివృత్తి చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. కానీ, భూమయ్య మరణించిన తీరుపై గానీ, కేసు పురోగతిపై గానీ ఇప్పటిదాకా కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం స్పందించ లేదు. రాజ్య నేర స్వభావాన్నే కాక పారదర్శకత లోపించిన పాలనా తీరుకూ ఇది సజీవసాక్ష్యంగా నిలుస్తున్నది. కాబట్టే, ఆకుల భూమయ్య మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

ఊపిరి వదిలే చివరి నిమిషం వరకు కామ్రేడ్ ఆకుల భూమయ్య ప్రజాస్వామ్య తెలంగాణ రాజకీయాలను బలంగా వినిపించారు. ఇప్పుడు మనం సంస్మరణ సభ జరుపుకుంటున్న ఈ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోనే, నడుస్తున్న తెలంగాణ పత్రిక నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో ఆయన తన చివరి ప్రసంగం చేశారు. తెలంగాణ చారిత్రక పత్రాలను విడుదల చేస్తూ..తెలంగాణ జనసభ అమరులను పేరు పేరున గాఢంగా స్మరించుకున్నారు.జనసభతో ముడిపడిన భూమయ్య, ఆ ఉద్యమ క్రమంలో అమరులైన తన సహచరులకు ఇచ్చిన మాటను ఎన్నడూ మరిచిపోలేదు. అంతేకాదు, 'నక్సల్బరీ' గురువుల బోధనలనూ విస్మరించలేదు. వ్యవస్థని ఈడ్చే గానుగెద్దులను తయారుచేసి ఇవ్వండని ఉపాధ్యాయులను పాలకులు పురమాయించగా, ఆ వ్యవస్థనే ఊడ్చేసే శక్తులను తయారుచేసి ప్రజలకు ఇచ్చినవారు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం. ఆ శ్రీకాకుళ ఉద్యమ సాళ్లు పెట్టిన సాలులో ఉత్తర తెలంగాణ అంతటా ఎందరో టీచర్లు పోరు గురువులయ్యారు. అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన ఆకుల భూమయ్య, తాను ఏ ఉద్యమంలో పనిచేసినా మార్క్సిస్టు తాత్విక అవగాహనతోనే సమస్య మూలాలను చర్చించారు. ప్రజల పక్షాన అస్తవ్యస్థ విద్యా వ్యవస్థని, రాజ్య వ్యవస్థని నిలదీశారు. కట్టుకునే బట్ట నుంచి పలికే మాట దాకా.. ప్రతి విషయంలో ప్రజా దృక్పథాన్ని ఎత్తిపట్టారు. ఒక దశలో రాజీ ఎరుగని మొండి సారుగానూ తోటి టీచర్లలో పేరుపడ్డారు. కేవలం చదువులు చెప్పడమే కాదు.. సమాజ గొంతుకలనూ ఆలకించాల్సిన బాధ్యత విద్యావంతులుగా, బుద్ధిజీవులుగా టీచర్లపై ఉన్నదన్న వాదన ముందుకొచ్చినప్పుడు, తెలంగాణ ప్రాంతీయ ఆకాంక్షను సమర్థించాలన్నప్పుడు.. ఆ ప్రతిపాదనలకు ఉపాధ్యాయ ఉద్యమంలో భూమయ్య ప్రాతినిథ్యం వహించారు.

1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుంచి గుణపాఠాలను తీసుకొని, ప్రజా పునాదిపైనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నిర్మాణం జరగాలన్న లక్ష్యంతో 1998లో తెలంగాణ జనసభ ఆవిర్భవించింది. సకల వనరులు, అన్ని అధికారాలూ ప్రజల చేతుల్లో ఉండే తెలంగాణ కోసం పోరాడాలని పిలుపునిచ్చింది. ఆ పిలుపును జనసభ ఉద్యమ నేతగా భూమయ్య బలంగా ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో జనసభ ఎంతో రాజ్యహింసను చవిచూసింది. బెల్లి లలిత, ఐలయ్య, సుదర్శన్, నల్లా వసంత్, కనకాచారి, వెంకటేశ్వర్లు వంటి ఎందరో విలువైన కార్యకర్తలను కోల్పోయింది. మరోవైపు జనసభ ముందుకుతెచ్చిన ప్రత్యామ్నాయ ఆలోచనలను నీరుగార్చడానికి ప్రభుత్వ మేధావుల నుంచి తెలంగాణ కోసం పనిచేస్తున్నామంటున్న పార్టీల దాకా..చేయని ప్రయత్నం లేదు. ఆ తరువాతి కాలంలో జనసభ పనిచేయలేని పరిస్థితి వచ్చింది. భూమయ్య ప్రాణాలు తీయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. అన్ని ఒడిదొడుకులను తట్టుకొని, అప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక సజీవ ధారలా.. ప్రవాహశీల పాయలా ప్రజాస్వామిక తెలంగాణ రాజకీయాలను నిలబెట్టింది మాత్రం భూమయ్యేనని చెప్పక తప్పదు. అనంతర కాలంలో తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీలో కొంతకాలం ఉండి, ఆ తరువాత తెలంగాణ ప్రజాఫ్రంట్ నిర్మాణంలోనూ, నాయకత్వంలోనూ భాగమయ్యారు.

ఒక నిర్ణయాన్ని నినాదంగా మలచాలంటే ఎంతో సృజనాత్మక శక్తి కావాలి. అలాగే, రాజకీయ భావజాలాన్ని సర్వమానవ భావనగా మార్చాలంటే ఎంతో లోతైన సైద్ధాంతిక అవగాహన ఉండాలి. ఈ రెండు విషయాల్లోనూ భూమయ్య ఒక నమూనాగా నిలుస్తారు. ప్రజల గురువుగా మన జ్ఞాపకాల్లో జీవించి ఉంటారు. షరతులు లేని ప్రజాస్వామిక తెలంగాణని సాకారం చేయడమే భూమయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుంది. ఈ నెల 27న తేదీన హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 5.30 గంటలకు జరిగే కామ్రేడ్ ఆకుల భూమయ్య సంస్మరణ సభను విజయవంతం చేయాలని కవులు, కళాకారులు, ప్రజాస్వామిక మేధావులు, బుద్ధిజీవులను కోరుతున్నాం.

- ఆకుల భూమయ్య మరణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.
- భూమయ్య సహా జనసభ అమరుల స్ఫూర్తితో ప్రజాస్వామిక

కరపత్రం

మళ్ళీ సలుపుతున్న 'గుజరాత్ గాయం'

హిందూ ఫాసిజం నిరసన సభ :
తేది : 28-02-2014, శుక్రవారం, సమయం : సా. 5.30 గంటలకు, స్థలం : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్.
పీకేఎం, విరసం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

జనారణ్యంలో / పెంచి, పోషించబడే / పులి-మతం
దానాకలి తీర్చాల్సినప్పుడల్లా / నువ్వో నేనో-ఖతం
– అలిశెట్టి ప్రభాకర్

'మతం' పులిని కట్టేశానని జవహర్‌లాల్ నెహ్రూ అనుకున్నాడు. గడ్డి పెట్టి ఆకలి తీర్చాననుకున్నాడు. కానీ, దాని ఆకలి కేవలం పులి ఆకలి కాదు.. పెట్టుబడి ఆకలి. తాను కలవరపడినప్పుడల్లా సమాజాన్నంతా కలత పెట్టి కలహాలు రేపే ఆకలి. ఈ పులి మీద స్వారీ చేస్తూనే సామ్రాజ్యవాదం భారతదేశమంతా విస్తరించింది. 'విగ్రహ'పురుష్‌గా మారిన వల్లభ్‌భాయ్ పటేల్ అనే ఏముంది... గాంధీ, నెహ్రూ సైతం ఆ పులి పళ్లు తోమినవాళ్లే. 'రాజకీయార్థిక విధానంలో తక్క' అంటూ దానితో 'లౌకిక' ఏర్పాటు ఒకటి రాజ్యాంగంలో చేసుకున్నారు. అయితే, అప్పటికే అది సమాజ మూలాల్లోకి తన వాడైన కోరలను దించేసింది. కానీ, నాటి నెహ్రూ నుంచి నేటి మన్మోహన్ సింగ్ దాకా, ఆ పులికి శాంతి చేస్తూనే ఉన్నారు. ఫలితంగానే ఇప్పుడది మరింత మదించి మోడీ రూపమెత్తింది. ముజఫర్‌నగర్ రూపంలో మళ్లీ మళ్లీ 'గుజరాత్ గాయా'న్ని కెలుకుతూనే ఉంది. కార్పొరేట్ పెట్టుబడి దానిపై ఊరేగుతున్నది. ఉర్దూ కథకుడు మంటో దృశ్యం కట్టిన దేశ విభజన రోజుల్లోకి సమాజాన్ని ఈడ్చుకుపోతున్నది.

ఈ క్రమం 2002 గుజరాత్ నరమేధంతో మొదలయినా, 1990ల్లో ఆర్థిక సంస్కరణలతో దానికి ప్రాతిపదిక ఏర్పాటైంది. తొలి దశలో సామ్రాజ్యవాద పెట్టుబడికి దేశీయ మార్కెట్లను పి.వి. నరసింహారావు ప్రభుత్వం బార్లా తెరిచింది. ఆ తర్వాత వచ్చిన 'దేశభక్త' బి.జె.పి. ప్రభుత్వం రెండో దశ ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మేందుకు ఒక శాఖనే ఏర్పాటు చేసింది. నవరత్నాలుగా పిలిచే తొమ్మిది ప్రభుత్వ రంగ పరిశ్రమలను కనుమరుగు చేసి 'జాతీయవాదాని'కి సిసలైన అర్థం చెప్పింది. అయితే, రాజకీయార్థికంలో జరిగిన ఈ సర్దుబాట్లతో గుజరాత్ కేంద్రంగా విస్తరించిన సంప్రదాయ బనియా వ్యాపార సామ్రాజ్యంలో కుదుపు వచ్చింది. ఇనుము, బట్టలు, కంప్యూటర్ పరికరాలు అమ్ముకునే వారంతా అదే గుజరాత్ వేదికగా ఎదిగి వచ్చారు. ఈ క్రమంలో గుజరాత్ స్థానిక మార్కెట్లలో ఎదురయిన చిన్న అడ్డంకిని సైతం హింసాత్మకంగా అణచివేశారు. కార్పొరేట్ దోపిడీ, ఆధిపత్య శక్తుల ఈ దాడికి నరేంద్ర మోడీ రాజకీయ నాయకత్వాన్ని అందించాడు. గోధ్రా రైలు దుర్ఘటన ముసుగులో మైనారిటీ ముస్లింలపై మతోన్మాద రాజ్యహింసకు పాల్పడ్డాడు. అప్పుడాయన ప్రజలు ఎన్నుకోని ముఖ్యమంత్రి. ఇప్పుడు ఆయన అనధికార ప్రధానమంత్రి.

గుజరాత్‌లో వలె దేశమంతటా 'రాజసూయ యాగం' జరగాలని అంబానీలు, మిట్టల్‌లు కోరుకుంటున్నారు. తమ వ్యాపారాలు ఉన్న దగ్గర కూడా 'గుజరాత్' ప్రయోగం జరిగితే బాగుండునని నారాయణమూర్తులు, బజాజ్‌లు, వేదాంతలు భావిస్తున్నారు. పౌర హక్కులు లేని, సమాజ గొంతుకలు అస్సలే వినిపించని, కార్మిక చట్టాల ఉనికే లేని, కనీసం లోకాయుక్త వంటి అవినీతి వ్యతిరేక వ్యవస్థలూ లేని గుజరాత్ 'అభివృద్ధి' నమూనా వీరికి ప్రీతిపాత్రం కావడంలో ఆశ్చర్యం లేదు. ముఖ్యంగా, అంతర్జాతీయ పెట్టుబడి సంక్షోభంతో దెబ్బతిన్న వ్యాపారాలను స్థానిక మార్కెట్లను బలి తీసుకొని నిలబెట్టుకోవాలంటే అలాంటి ఏర్పాటు వాటికి అవసరం. ఇంకా చెప్పాలంటే ఆదివాసీలు, మావోయిస్టుల పోరాటాలతో చిక్కుబడిపోయిన లక్షలాది కోట్ల విలువైన ఎంఓయూలను విడిపించుకునే దారి కావాలి. దానికోసం దేశమే ఒక గుజరాత్ కావాలి. ఆ పనిని దూకుడుగా చేసేందుకు మోడీ ప్రధానమంత్రి కావాలి. భూస్వామ్య విషపు భావజాలానికి వ్యవస్థీకృత రూపమైన ఆర్‌ఎస్‌ఎస్‌కూ కావాల్సింది ఇదే. చరిత్రలో వలస దోపిడీ మొదలు కార్పొరేట్ దోపిడీ దాకా, ప్రతి సంక్షోభ కాలంలోనూ సామ్రాజ్య వాదానికి చురుగ్గా దాస్యం చేస్తున్న సంస్థ ఇది. కుల సంబంధాల్లోని చలనాలను ఎప్పటికప్పుడు గ్రహిస్తూ సామాజిక సంబంధాల్లో

తెలంగాణ ఆకాంక్షను బలంగా వ్యక్తీకరిద్దాం
- షరతులు లేని తెలంగాణ కోసం పోరాడదాం.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా భద్రాచలాన్ని ఆంధ్రాలో కలిపే కుట్రలను ఎండగడదాం.
- నూతన ప్రజాస్వామిక సంస్కృతిని, విలువలను ఎత్తిపడదాం.
- ఏకైక ప్రజా ప్రత్యామ్నాయం విప్లవమేనని నినదిద్దాం.

కార్యక్రమం :
తేదీ : జనవరి 27, సోమవారం సాయంత్రం 5.30 గంటలకు
వేదిక : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్

అధ్యక్షత : బాసిత్, విరసం
వక్తలు :
ప్రొ.హరగోపాల్, పౌర హక్కుల సంఘం, ఎ. నరసింహారెడ్డి, ఉపాధ్యాయ ఉద్యమం, సి. కాశీం, విరసం, నలమాస కృష్ణ, తెలంగాణ ప్రజాఫ్రంట్, ప్రజా కళామండలి, విరసం సాంస్కృతిక బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

– విప్లవ రచయితల సంఘం
తేది : 20/01/14, స్థలం : హైదరాబాద్

బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని చెక్కుచెదరకుండా కాపాడుకుంటున్నది. రాజకీయంగా, ఆర్థికంగా నిలదొక్కుకుంటూ, సామాజిక సంబంధాల్లో ఆధిపత్య శక్తిగా ఎదుగుతున్న బి.సి.ల్లోని బలమైన సమూహానికి మోడీని ప్రతినిధిని చేయాలని చూస్తున్నది. కాబట్టి, మోడీ ఉత్థానం రాజకీయార్థిక అర్థంలో కార్పొరేట్ పెట్టుబడి ఆకాంక్ష అయితే, భావజాలపరంగా అది శిథిల భూస్వామ్యం కోరిక. మోడీని కాబోయే బి.సి. ప్రధానిగా, చెమట కష్టం తెలిసిన చాయ్‌వాలాగా జాతీయ మీడియా (నమో) మంత్రం పఠిస్తోంది. ఈ మూడింటి ఊతంతోనే హిందుత్వం.. ప్రస్తుత మోడీత్వ దశకు చేరుకున్నది.

యు.పి.ఎ. అవినీతి, అస్తవ్యస్థ పాలన, అరాచక విధానాలతో సమాజంలో పెరిగిన అలజడిని, దానినుంచి యువతలో పేరుకు పోతున్న అశాంతి వాతావరణాన్ని వాడుకొని ఆర్ఎస్ఎస్ తన విచ్ఛిన్నకర అజెండాను అమలు చేస్తున్నది. మన రాష్ట్రంలో ఒక ప్రాంతీయ ఆకాంక్ష బలపడి సృష్టించిన సహజ విభజన వాతావరణాన్ని వాడుకొని ఇటు తెలంగాణాలోనూ, అటు ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాల్లోనూ మత చిచ్చుపెట్టాలని చూస్తున్నది. అందులోభాగంగా, రంగారెడ్డి జిల్లాలో పాస్టర్ సంజీవులుని హత్యచేసింది. హైదరాబాద్ పాతబస్తీలో లేని భాగ్యలక్ష్మి ఆలయాన్ని కల్పించి, లేని వివాదాన్ని రాజేసింది. తిరుపతిలో హీరా ఇస్లామిక్ యూనివర్సిటీ ఏర్పాటును వివాదంగా మార్చి మత ఉద్రిక్తతలను పెంచుతున్నది. మరోవైపు తనని ప్రశ్నిస్తున్నందుకు దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక, లౌకిక మేధావులపై దాడులు చేస్తున్నది. మహారాష్ట్రలో ప్రముఖ హేతువాది నరేంద్ర ధబోల్కర్‌ని హత్య చేసింది. కశ్మీర్ రాజకీయ నేత గిలానీపై ఢిల్లీలో భౌతికదాడికి పాల్పడింది. అఫ్జల్‌గురు ఉరిని వ్యతిరేకించి నందుకు ప్రముఖ సంపాదకుడు గౌతమ్ నవ్లాఖా ముఖానికి బొగ్గు రాసింది. కసబ్ తరఫున వాదించిన న్యాయవాదిని బొంబైలో పట్టపగలే కాల్చి చంపింది. ఇంతజరుగుతున్నా ఎక్కడా ప్రభుత్వాల వైపు నుంచి చర్యలు కనిపించవు.

సర్వమత సమానత్వమే లౌకికతత్వంగా రాజ్యాంగంలో ప్రకటించుకొన్న ప్రభుత్వాలు, వాస్తవంలో మతాలను ఆదరించడం కాదు, హిందూత్వ మతోన్మాదాన్ని ప్రోది చేస్తున్నాయనేది సుస్పష్టం. పాస్టర్ హత్య జరిగి నెల రోజులు గడిచిపోతున్నా, చంపింది ఎవరో, దాని వెనక కుట్ర ఏమిటో తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదు. మతాన్ని ఆచరించే హక్కు, మత విశ్వాసాలను వివిధ మాధ్యమాలు, వేదికల నుంచి ప్రకటించుకునే హక్కుని రాజ్యాంగమే ఈ దేశ ప్రజలకు ఇచ్చింది. అలాంటి చట్టబద్ధ హక్కుకే హీరా యూనివర్సిటీ ఉదంతంలో దిక్కు లేకుండా పోయింది. అలాంటప్పుడు కొత్తగా మత హింస వ్యతిరేక బిల్లు తెచ్చి, రాష్ట్రాలపై పెత్తనాన్ని పెంచుకోవడం తప్ప సాధించేదేమిటి? నిజానికి, దీన్ని ఒక పార్టీయో, సంస్థో మాత్రమే పాల్పడుతున్న హింసాకాండగా చూడలేం. 1984లో సిక్కుల ఊచకోతకు కాంగ్రెస్ నాయకత్వం వహించిన విషయం, ఇటీవలి ముజఫర్‌నగర్ మారణహోమానికి సమాజ్‌వాదీ పార్టీ సారథ్యం అందించిన విషయాన్ని మరవరాదు. కాబట్టి, పెట్టుబడి సంక్షోభం నుంచి బద్దలయ్యే మతోన్మాద ఘటనలను వ్యవస్థీకృత రాజ్యహింసలో భాగంగానే చూడాల్సి ఉంటుందని 'ఎస్‌డిఎల్‌సిఎఫ్'గా (లౌకిక ప్రజాస్వామిక సాహిత్య, సాంస్కృతిక వేదిక) మేం భావిస్తున్నాం. రాజ్యంతో పోరాడకుండా, దాని దోపిడీ ఆర్థిక విధానాలను ప్రశ్నించకుండా,మోడీత్వ ప్రమాదాన్ని ఎదుర్కొనలేమని స్పష్టం చేస్తున్నాం.

ఎస్.డి.ఎల్.సి.ఎఫ్. గురించి ఒక్క మాట.. 2002 గుజరాత్ నరమేధంపై లౌకిక, ప్రజాస్వామిక, సృజనాత్మక శక్తుల ప్రతిస్పందన లోంచి ఆకృతి దాల్చిందే లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక (Secular Democratic Literary and Cultural Forum - SDLCF). ఆ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ మధ్యాహ్నం నుంచి గుజరాత్‌లో ముస్లింలపై ఊచకోతలు మొదలయి, దాదాపు రెండు నెలల పాటు కొనసాగాయి. రెండు వేల మంది హిందూత్వ మూకల చేతుల్లో హత్య చేయబడగా, అంతకు కొన్ని వేల మంది సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. ప్రత్యేక ప్రజాస్వామిక, లౌకిక చరిత్ర కలిగిన తెలుగు నేల ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. ఆ సంస్పందనలు, సహానుభూతుల్లోంచి యాకూబ్ (కవి), దివికుమార్ (జనసాహితి), ఎస్.వి. సత్యనారాయణ (అరసం), షరీఫ్ (విరసం), కన్వీనర్లుగా 'వేదిక' ఏర్పాటయింది. వేదిక తరఫున గుజరాత్‌లోని బాధిత ప్రాంతాల్లో ఒక బృందం పర్యటించి, నిజ నిర్ధారణ జరిపి పుస్తకం తీసుకొచ్చింది.

ఈ క్రమంలో ఆ ఏడాది జూన్ 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు వందలమందికి పైగా కవిత్వం చదవగా.. 'గుజరాత్ గాయం' పేరిట తెలుగు, ఉర్దూలో కవితా సంకలనాలను 'వేదిక' ప్రచురించింది. తెలుగు సంకలనానికి యాకూబ్, కొండేపూడి నిర్మల, నాళేశ్వరం శంకరం, షరీఫ్, శిలాలోలిత, సీతారాం సంపాదకత్వం వహించగా; మజహర్ మెహదీ, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌ల పూనికతో ఉర్దూ సంకలనం వెలువడింది. ఈ రెండు పుస్తకాలకు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఆవిష్కరణలు జరిగాయి. అయితే, ఆ తరువాత 'వేదిక' కార్యక్రమాలేవీ లేకుండా పోయాయి. ఈ క్రమంలో గత ఏడాది ఆగస్టు 10న మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా మరోసారి 'వేదిక' కింద ప్రజాస్వామిక, లౌకిక శక్తులు, కవులు, కళాకారులు తమ నిరసన స్వరాన్ని వినిపించారు. కవిగాయక సభలో పాల్గొని, 2002 గాయాన్ని తడుముకొని, ముజఫర్‌నగర్ దారుణానికి దుఃఖపడి తిరిగి 'వేదిక' కింద పనిచేయాలన్న ఆకాంక్షని వారంతా వ్యక్తం చేశారు. అప్పటినుంచీ ఎస్.డి.ఎల్.సి.ఎఫ్.ని పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.ఆ సన్నాహాల్లో భాగంగా ఈ నెల 28వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మళ్లీ సలుపుతున్న గుజరాత్ గాయం' పేరిట సభని నిర్వహిస్తున్నాం. మతాచరణలో లౌకికత్వాన్ని, మతం సహా అన్ని సామాజిక సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని కోరుకునేవారందరిని సభకూ, ఎల్‌డిఎల్‌సిఎఫ్‌లోకి ఆహ్వానిస్తున్నాం.

అధ్యక్షత : యాకూబ్, కన్వీనర్, ఎల్‌డిఎల్‌సిఎఫ్,

వక్తలు : గోరటి వెంకన్న, ఉషా యజ్దానీ, దేవిప్రియ, ప్రొ. హరగోపాల్, రాపోలు సుదర్శన్, జాహెద్ అలీఖాన్, ఎస్. వేణుగోపాల్, పి. వరలక్ష్మి.

- లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక (ఎస్‌డిఎల్‌సిఎఫ్)

పత్రికా ప్రకటన

దేశద్రోహి లగడపాటిని దేశభక్తులతో పోల్చవద్దు

- విప్లవ రచయితల సంఘం

తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టే సందర్భంలో దోపిడీవర్గ ప్రతినిధి లగడపాటి రాజగోపాల్ బృందం పార్లమెంటులో చేసిన కుట్రపూరిత అవకాశవాద చేష్టని విప్లవ రచయితల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నది. అలాగే, ఆ ఘటనపై స్పందించే క్రమంలో షహీద్ భగత్ సింగ్, కశ్మీరీ దేశభక్తుడు అఫ్జల్ గురు వంటి సాంస్కృతిక ప్రతీకలను వక్రీకరించడాన్ని తప్పుబడుతున్నది. అదే సమయంలో హంతకులు, ఆర్థిక నేరగాళ్లు, దేశ ద్రోహులు కొలువు తీరే పందిలదొడ్డి రాజకీయాలకు ప్రతీక అయిన పార్లమెంటుకు లేని ప్రతిష్టని, గౌరవాన్ని, గుర్తింపును ఆపాదిస్తూ మీడియాలో జరుగుతున్న అన్నిరకాల ప్రచారాన్ని సైతం గర్హిస్తున్నది.

బిల్లును ప్రవేశపెడుతున్న సందర్భంలో లగడపాటి రాజగోపాల్ పెప్పర్ స్ప్రే ప్రయోగించిన ఘటనని, పార్లమెంటులో బాంబు విసిరిన షహీద్ భగత్‌సింగ్ బృందం సాహసంతో సమైక్యవాద ధోరణిలో కొట్టుకుపోతున్నవారిలో కొందరు పోల్చి మాట్లాడుతున్నారు. పార్లమెంటుపై దాడి చేసినట్టు ఆధారాలేవీ లేకపోయినా కశ్మీరీ అయినందుకే ఉరికంబానికి బలయిన అఫ్జల్‌గురుతో లగడపాటిని పోల్చేందుకు తెలంగాణ ఉద్యమకారులు ప్రయత్నిస్తున్నారు. నిజానికి, విముక్తి పోరాటాల్లో నిత్య స్ఫూర్తి భగత్ సింగ్. రాజ్యాంగ వ్యవస్థల పాశవికతని బయటపెట్టిన ఉదంతం అఫ్జల్‌గురు ఉరి. ఆ ఇద్దరితో ఆర్థిక నేరగాడు లగడపాటిని పోల్చడం అసంబద్ధమైన విషయం. దోపిడీ లేని సమాజంలోనే ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుందని ప్రబోధించిన షహీద్ భగత్ సింగ్‌కూ, సామ్రాజ్యవాదుల తాబేదారు లగడపాటికీ పోలికా? కార్మిక వ్యతిరేక చట్టాలను ఆమోదిస్తున్న సమయంలో భగత్‌సింగ్, భటుకేశ్వర్ దత్తా బాంబు విసిరి నిరసన తెలిపారు. మరి లగడపాటి చేసిందేమిటి? తాను నడిపే ప్రైవేట్ విద్యుత్ ప్లాంట్‌లో ఉత్పత్తయ్యే కరెంటులో ఒక్క యూనిట్‌ని కూడా రాష్ట్రానికి అమ్మని 'ఆంధ్రా దేశభక్తుడు' ఆయన. హైదరాబాద్‌లో వక్ఫ్ భూములు సహా కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులెన్నింటినో దురాక్రమించి, వాటిని కాపాడుకునేందుకు ఉద్యమిస్తున్న 'సమైక్య ఉద్యమవీరుడు'. విభజన ప్రక్రియను అడ్డుకోవడానికి అన్ని అడ్డదారుల్లో ప్రయత్నించి, చివరకు బిల్లును ప్రవేశపెట్టకుండా చేసేందుకు జుగుప్సాకర చేష్టలకు లగడపాటి తెగించాడు. అలాంటివాడితో భగత్ సింగ్, అఫ్జల్ గురులను పోల్చే ప్రయత్నం ఎవరు చేసినా, అది కేవలం చరిత్ర వక్రీకరణ మాత్రమే కాదు, సాంస్కృతిక వక్రీకరణ కూడా అవుతుంది.

ప్రతి పోరాటానికి సాంస్కృతిక చరిత్ర ఉన్నట్టే, సాంస్కృతిక ప్రతీకలు ఉంటాయి. అవి ఒకరు ఏర్పాటుచేసేవి కావు. ఒక కాలంలో, ఒక సందర్భంలో నడిచిన పోరాట సారాన్ని, ఆ ప్రతీకల రూపంలో ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. అలా గిరిజన ఉద్యమానికి ఒక కొమురం భీమ్, సమ్మక్క సారలమ్మ, బిర్సాముండా, గుండాధర్‌లు, వ్యవహార భాషా ఉద్యమానికి గిడుగు, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి పొట్టి శ్రీరాములు, తెలంగాణ ఉద్యమానికి వెయ్యిమందికి పైగా అమరవీరులు, కాళోజీ, కశ్మీర్ స్వేచ్ఛా ఆకాంక్షకు మక్బూల్ భట్, అఫ్జల్‌గురులు ప్రతీకలు. స్థల, కాల ప్రత్యేకతలతో ముడిపడిన ఈ ప్రతీకలను పూర్తి విరుద్ధ సమయ, సందర్భాలకు అన్వయించాలనుకోవడం సాంస్కృతిక వక్రీకరణే అవుతుంది. అత్యంత నేరపూరిత చరిత్రతో ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారు.. సమాజంలో మౌలిక మార్పుల కోసం పోరాడిన వారికి ఎలా ప్రతీకలు అవుతున్నారన్నది సమైక్యవాద ధోరణిలో కొనసాగుతున్న బుద్ధిజీవులు, ప్రజలు ఆలోచించాలని కోరుతున్నాం. అలాగే, న్యాయమైన ఆకాంక్షను వ్యక్తీకరించే సందర్భం ఎంత భావోద్వేగపూరితమైనదైనా, సాంస్కృతిక ప్రతీకల పట్ల అప్రమత్తతని పాటించాలని తెలంగాణ ఉద్యమకారులను విరసం కోరుతున్నది.

రివేరా (కన్వీనర్), వరవరరావు, రాంకి, కాశీం,
ఉదయ్ భాను, మంజుల, విప్లవ రచయితల సంఘం,
తేదీ : 17-02-14 హైదరాబాద్ యూనిట్

మార్క్సిజం లెనినిజం మావోయిజం
స్టడీ నోట్స్
వెల : రు. 100/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

చదవండి!
చదివించండి!

మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
వెల : రు. 80/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు : మైత్రి బుక్ హౌజ్ విజయవాడ, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, నవోదయ పబ్లిషింగ్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్, సహచర బుక్‌మార్క్, హైదరాబాద్.

-: స్వీకారం :-



కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
రెండో భాగం
ప్రచురణ :
కెవిఆర్, శారదాంబ
స్మారక కమిటీ
వెల : రు. 250/-
పేజీలు : 688

కె.వి.ఆర్.
సాహిత్య వ్యాసాలు
మూడో భాగం
ప్రచురణ :
కెవిఆర్, శారదాంబ
స్మారక కమిటీ
వెల : రు. 250/-
పేజీలు : 598



వెలుగు రవ్వలజడి
ఆలూరి భుజంగరావు
ప్రచురణ :
రాహుల్ సాహిత్య సదనం
వెల : రు. 70/-
పేజీలు : 104



కొడవటిగంటి కుటుంబరావు
రచనా ప్రపంచం
12 - రాజకీయ వ్యాసాలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 400/-
పేజీలు : 738



కొడవటిగంటి కుటుంబరావు
రచనా ప్రపంచం
13 - సంస్కృతి వ్యాసాలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 300/-
పేజీలు : 493



ముజఫర్‌నగర్
మరో మానని గాయం
డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ రిపోర్ట్
తెలుగు :
ఆర్. శశికళ
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 32



దేవిప్రియ
రన్నింగ్ కామెంటరీ
మొదటి సంపుటి - ఆంధ్రప్రభ
ప్రచురణ :
కావ్య పబ్లిషింగ్ హౌస్
మూడు పుస్తకాల వెల :
రు. 999/-
పేజీలు : 270

ముజఫర్‌నగర్ మారణకాండ
నిషిద్ధ మేఘాల్లోకి మా యాత్ర
రచన & సేకరణ :
అనిశెట్టి రజిత, భండారు విజయ
ప్రచురణ :
ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక
వెల : రు. 50/-
పేజీలు : 64

Paro's Kids
and other prison stories
CRPP Imprint
Price : Rs. 50/-
Pages : 95



పాతాళానికి
ప్రపంచీకరణ
దామరపల్లి నర్సింహారెడ్డి
ప్రచురణ :
జెన్నీ పబ్లికేషన్
వెల : రు. 130/-
పేజీలు : 204



గాంధీ నిజస్వరూపం
హిందీ మూలం :
హంసరాజ్ రహబర్
అనువాదం :
సమతారావు
ప్రచురణ :
జనసాహితి ప్రచురణ
వెల : రు. 120/-
పేజీలు : 311

మా బాల్యం 24 క్యారెట్లు
అట్లూరి పద్మజ
ప్రచురణ :
సాహితీ ప్రచురణలు
వెల : రు. 60/-
పేజీలు : 76



అక్షర సమరం
కవితల సంపుటి
తుంపాల శ్రీరామమూర్తి
ప్రచురణ :
సమతా ప్రచురణలు
వెల : రు. 60/-
పేజీలు : 68



మోట బొక్కెన
తెలంగాణ పునర్నిర్మాణ ఆకాంక్షలు
సంపాదకులు :
నల్లెల్ల రాజయ్య
ప్రచురణ :
వరంగల్లు రచయితల సంఘం
వెల : రు. 100/-
పేజీలు : 72



ప్రజాఉద్యమ కార్యకర్తలకు కరదీపిక
వినయపిటకం
బొర్రా గోవర్ధన్
ప్రచురణ :
పాయసి ప్రచురణ
వెల : రు. 30/-
పేజీలు : 72

KLVA101M 169

ARUNATARA A Literary Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)

● RNI Regn.No.21152/72 ● Published on 06/08/2014 305 - June-July, 2014



Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M169
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	77
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Sushmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	Afsar
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good